
ఈనాడు

విజయవాడ 28-7-2025 సోమవారం సిటీ సంపుటి 51 . సంచిక 349
THE LARGEST CIRCULATED TELUGU DAILY
రూ. 6-50 పేజీలు 14
www.eenadu.net
Vijayawada, Visakhapatnam, Hyderabad, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru

రాష్ట్ర ప్రతిష్ఠ పునరుద్ధరణే లక్ష్యం



అందుకే సింగపూర్ వచ్చా

వైకాపా వల్ల ఇక్కడి ప్రభుత్వంతో సంబంధాలు దెబ్బతిన్నాయి

మీరు వచ్చి పెట్టుబడులు పెట్టండి.. జన్మభూమి రుణం తీర్చుకోండి

నన్ను ట్రాక్‌లో పెట్టే బాధ్యత మీదే

తెలుగు డయాస్పోరాలో సీఎం చంద్రబాబు



డయాస్పోరాలో చంద్రబాబు ప్రసంగాన్ని ఆసక్తిగా వింటున్న ప్రవాసాంధ్రులు

ఈనాడు, అమరావతి: 'ఒక వ్యక్తి తప్పు చేస్తే.. తెలుగు వాళ్లు చేశారనే అంటారు. దాని వల్ల రాష్ట్ర ప్రతిష్ఠ దెబ్బతిని, బ్రాండ్ పోతుంది. రాష్ట్రం శాశ్వతంగా నష్టపోతుంది. 2019లో రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన వైకాపా.. సింగపూర్ ప్రభుత్వాన్నీ తప్పుబట్టింది. మీకు జరిగిన అసౌకర్యానికి నేను బాధపడుతున్నానని వారికి చెప్పాల్సిన బాధ్యత నాపై ఉంది. సింగపూర్‌తో సంబంధాలు పునరుద్ధరించాలన్నదే ఈ పర్యటన ప్రధాన ఉద్దేశం' అని సీఎం చంద్రబాబు తెలిపారు. ఐదు రోజుల సింగపూర్ పర్యటనలో భాగంగా ఆదివారం తెలుగు డయాస్పోరా నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఈ సమావేశంలో మంత్రులు లోకేశ్, నారాయణ, టీజీ భరత్, ఏపీ ఎన్నార్టీఎస్ ఛైర్మన్ వేమూరి రవి, సింగపూర్‌లో భారత హైకమిషనర్ శిల్పక్ అంబులే పాల్గొన్నారు. 'మా తెలుగు తల్లికి' గీతాలాపనతో కార్యక్రమం ప్రారంభమైంది. అమరావతి రాజధానిపై రచించిన గీతాన్ని ఆలపించారు.

అప్పట్లో అడగ్గానే అంగీకరించారు: 2014 ఎన్నికల సమయంలో రాష్ట్రాన్ని సింగపూర్‌లా మారుస్తానని ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు.. ఫలితాలు వచ్చాక సింగపూర్ వచ్చానని సీఎం పేర్కొన్నారు. 'ఏపీకి రాజధాని లేదు. మాస్టర్ ప్లాన్ కోసం టెండర్లు పిలిచి పనులు ప్రారంభించడానికి సమయం పడుతుంది. నాకు ఉచితంగా మాస్టర్‌ప్లాన్ ఇవ్వాలని సింగపూర్ ప్రభుత్వాన్ని కోరా. అందుకు అప్పటి ప్రధాని లీ అంగీకరించారు. వారి భాగస్వామ్యంతో సీడ్ క్యాపిటల్ నిర్మిస్తే.. ప్రపంచంలోని ఇతర సంస్థలూ వస్తాయని సింగపూర్‌తో ఒప్పందం కుదుర్చుకున్నాం. తర్వాత వచ్చిన ప్రభుత్వం వారిని ఇబ్బంది పెట్టింది' అన్నారు. (మిగతా 11లో)

ఏపీకి ఎవర్సెండై

అధునాతన ఫ్యాబ్రికేషన్ ఫ్యాక్టరీ

గృహ నిర్మాణరంగంలో పెట్టుబడులపై జురాంగ్ ఆసక్తి

11లో



నువ్వా.. నేనా

పట్టు వదలని హంపి, దివ్య

చెస్ ప్రపంచకప్ ఫైనల్ రెండో గేమూ డ్రా

ఫలితం కోసం నేడు టైబ్రేక్

ప్రతిష్ఠాత్మక మహిళల చెస్ ప్రపంచకప్ కోసం భారత క్రీడాకారిణులిద్దరూ హోరాహోరీగా తలపడుతున్నారు. తెలుగమ్మాయి కోనేరు హంపి, మహారాష్ట్ర ప్లేయర్ దివ్య దేశ్‌ముఖ్‌ల మధ్య రెండో గేమ్ కూడా డ్రా అయింది. ఆదివారం తెల్లపావులతో ఆడిన హంపి.. దివ్యపై కొంచెం పైచేయి సాధించినా, చివరికి గేమ్‌లో పాయింట్లు పంచుకోక తప్పలేదు. ఫలితం తేల్చడానికి సోమవారం టైబ్రేక్‌ను నిర్వహించనున్నారు. అనుభవం దృష్ట్యా హంపినే టైబ్రేక్‌లో ఫేవరెట్‌గా బరిలోకి దిగనుంది. అయితే ఇద్దరిలో ఎవరు గెలిచినా కప్పు మాత్రం భారత్‌కే సొంతం కానుంది.

ఔరా టీమ్‌ఇండియా

మాంచెస్టర్‌లో అద్భుత పోరాటం

ఇంగ్లాండ్‌తో నాలుగో టెస్టు డ్రా



ప్రత్యర్థి తొలి ఇన్నింగ్స్‌లో 311 పరుగుల ఆధిక్యం సాధించింది. మ్యాచ్‌లో ఇంకా 150కి పైగా ఓవర్లు మిగిలున్నాయి. రెండో ఇన్నింగ్స్‌లో తొలి ఓవర్లోనే 2 వికెట్లు పడిపోయాయి. ఈ స్థితిలో ఆ జట్టు మ్యాచ్‌ను డ్రాగా ముగిస్తుందని ఎవరైనా అనుకుంటారా? కానీ మాంచెస్టర్‌లో టీమ్‌ఇండియా అద్భుతమే చేసింది. ఓటమి ఖాయమనుకున్న మ్యాచ్‌లో అసాధారణంగా పోరాడి.. డ్రా చేసుకుంది. నాలుగో రోజే ఆలౌటవుతుందనుకున్న జట్టు.. ఐదో రోజు కూడా పూర్తిగా బ్యాటింగ్ చేసింది. శనివారం కేఎల్ రాహుల్, శుభ్‌మన్ గిల్ గొప్పగా పోరాడితే.. ఆదివారం రవీంద్ర జడేజా, వాషింగ్టన్ సుందర్ ఆ స్ఫూర్తిని కొనసాగిస్తూ అజేయ శతకాలతో జట్టును గట్టెక్కించారు.

వివరాలు ఛాంపియన్స్‌లో..

మానసా దేవి ఆలయంలో తొక్కిసలాట

హరిద్వార్‌లో ఘటన

ఎనిమిది మంది మృతి

30 మందికి గాయాలు



ఆలయం వద్ద తొక్కిసలాట జరిగిన ప్రదేశం వద్ద గుమిగూడిన ప్రజలు

హరిద్వార్: ఉత్తరాఖండ్‌లోని హరిద్వార్‌లో మానసా దేవి ఆలయంలో విషాదం చోటుచేసుకుంది. శివాలిక్ కొండల్లో 500 అడుగుల ఎత్తులో ఉన్న ఈ ఆలయానికి ఆదివారం ఉదయం వందల మంది భక్తులు మెట్లదారిలో వెళుతున్న సమయంలో తొక్కిసలాట జరిగింది. ఈ దుర్ఘటనలో ఎనిమిది మంది భక్తులు మృతి చెందారు. 30 మంది గాయపడ్డారు. మృతుల్లో 12 ఏళ్ల బాలుడు కూడా ఉన్నాడు. ఆలయం మెట్లు ప్రారంభమయ్యే చోట విద్యుదాఘాతం జరిగిందనే వదంతులు రావడంతో భక్తులు భయభ్రాంతులకు గురయ్యారని.. దీంతో తొక్కిసలాట జరిగిందని అధికారులు తెలిపారు. మృతుల కుటుంబాలకు రూ.2 లక్షలు, క్షతగాత్రులకు రూ.50 వేల చొప్పున ఆర్థిక సహాయాన్ని ఉత్తరాఖండ్ ముఖ్యమంత్రి పుష్కర్ సింగ్ ధామీ ప్రకటించారు. మెజిస్టీరియల్ దర్యాప్తునకు ఆదేశించారు. ఈ ఘటనపై రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము, ప్రధాని నరేంద్ర మోదీ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తంచేశారు. మృతుల కుటుంబాలకు సంతాపం తెలిపారు.

ముడుపులిస్తేనే సరఫరా ఆర్డర్లు

సీఎంవో పేరుతో మద్యం డిస్టిలరీలకు బెదిరింపులు

- మిథున్‌రెడ్డి, సాయిరెడ్డిలకు అత్యంత సన్నిహితులమని వ్యాఖ్యలు
- ఎస్ఎన్‌జే యాజమాన్యానికి రాజ్ కెసిరెడ్డి, బూనేటి చాణక్య ఫోన్లు
- సిట్ దర్యాప్తులో వెలుగులోకి



ఈనాడు, అమరావతి: మద్యం కుంభకోణంలో రూ.వేల కోట్లు కొల్లగొట్టిన వైకాపా ముఠా.. నాటి ముఖ్యమంత్రి కార్యాలయం (సీఎంవో) పేరిట డిస్టిలరీల యాజమాన్యాలను బెదిరించినట్లు సిట్ దర్యాప్తులో తేలింది. జగన్ పాలనలో అత్యధికంగా మద్యం సరఫరా ఆర్డర్లు దక్కించుకున్న ఎస్ఎన్‌జే షుగర్స్ అండ్ ప్రొడక్ట్స్ సంస్థ యాజమాన్యాన్ని ఇలాగే లొంగదీసుకున్నట్లు వెల్లడైంది. వైకాపా ముఠా తరఫున ముడుపుల వసూళ్ల నెట్‌వర్క్‌లో కీలకంగా వ్యవహరించిన బూనేటి చాణక్య (ఏ-8).. 2020 అక్టోబరులో ఎస్ఎన్‌జే షుగర్స్ అండ్ ప్రొడక్ట్స్ సంస్థ సీఎఫ్‌వో నల్లనన్ మతప్పన్‌కు పలుమార్లు కాల్‌చేసి 'నేను ఏపీ సీఎంవో నుంచి మాట్లాడుతున్నా. మీ బ్రాండ్లకు ఆర్డర్లు కావాలన్నా, పెండింగ్ బిల్లులు చెల్లించాలన్నా మేం అడిగినంత ఇవ్వాల్సిందే' అని హెచ్చరించినట్లు సిట్ దర్యాప్తులో నిర్ధారణైంది. ఈ మేరకు కొద్దిరోజుల కిందట మతప్పన్.. న్యాయాధికారి ఎదుట వాంగ్మూలమిచ్చారు. ఎవరో కావాలనే బెదిరిస్తున్నారని ఎస్ఎన్‌జే యాజమాన్యం తొలుత వాటిని తేలిగ్గా తీసుకుంది. తర్వాత నుంచి (మిగతా 2లో)

సరోగసీ ముసుగులో శిశు విక్రయాలు

- పిల్లల్లేని దంపతుల నుంచి రూ.లక్షల్లో వసూళ్లు
- యూనివర్సల్ సృష్టి ఫెర్టిలిటీ కేంద్రం నిర్వాహకురాలు నమ్రత సహా 8 మంది అరెస్టు

ఈనాడు, హైదరాబాద్: సంతానం లేని దంపతులకు ఐవీఎఫ్, సరోగసీతో.. పిల్లల్లేని కొరత తీరుస్తామంటూ శిశు విక్రయాలు సాగిస్తున్న సికింద్రాబాద్ యూనివర్సల్ సృష్టి ఫెర్టిలిటీ కేంద్రం గుట్టును పోలీసులు రట్టు చేశారు. కేంద్రం నిర్వాహకురాలు డాక్టర్ నమ్రత(64), ఆమె కుమారుడు పి.జయంత్‌కృష్ణ (25), విశాఖ కేంద్రంలో మేనేజర్ కల్యాణి అచ్చాయమ్మ (40), రెజిమెంటల్‌బజార్‌లోని కేంద్రంలో ల్యాబ్ టెక్నీషియన్ జి.చెన్నారావు (37), ఎనస్థీషియా నిపుణుడు, గాంధీ ఆసుపత్రిలో విధులు నిర్వహిస్తున్న అసిస్టెంట్ ప్రొఫెసర్ ఎన్.సదానందం (41), ఏజెంట్ డి.సంతోషి (38), శిశువును విక్రయించిన దంపతులు మహ్మద్ అలీ అదిక్ (38), నస్రీన్‌బేగం (25)లను అరెస్టు చేశారు. ఆదివారం సికింద్రాబాద్ ఉత్తర మండలం డీసీపీ కార్యాలయంలో డీఎంహెచ్‌వో డా.వెంకటి, గోపాలపురం ఏసీపీ సుబ్బయ్య, ఇన్‌స్పెక్టర్లు కౌశిక్, రాఘవేందర్, సర్దార్ నాయక్, వెంకటేశ్‌తో కలిసి డీసీపీ సాధన రష్మి పెరుమాళ్ కేసు వివరాలు వెల్లడించారు.

పిల్లాడి రూపురేఖలపై అనుమానంతో..

రాజస్థాన్‌కు చెందిన దంపతులు పిల్లలు లేకపోవడంతో ఆన్‌లైన్‌లో వెతికి.. గతేడాది ఆగస్టులో నగరానికి వచ్చి రెజిమెంటల్‌బజార్‌లోని యూనివర్సల్ సృష్టి ఫెర్టిలిటీ సెంటర్ నిర్వాహకురాలు డాక్టర్ నమ్రతను (మిగతా 3లో)

లులు మాల్స్ ఏర్పాటులో ముందడుగు

విశాఖ, విజయవాడల్లో భూమి కేటాయింపు

ఈనాడు, అమరావతి: విశాఖ, విజయవాడ నగరాల్లో లులు మాల్స్ ఏర్పాటుకు కీలక ముందడుగు పడింది. ఆ సంస్థకు భూములు కేటాయిస్తూ ప్రభుత్వం ఆదివారం ఉత్తర్వులు జారీ చేసింది. విశాఖ బీచ్ రహదారిలోని హార్బర్ పార్క్‌లో 'లులు ఇంటర్నేషనల్ షాపింగ్ మాల్స్ ప్రైవేటు లిమిటెడ్'కు 99 ఏళ్ల లీజు ప్రాతిపదికన 13.74 ఎకరాలను ఏపీఐఐసీ ద్వారా కేటాయించింది. ఇక్కడ 13.5 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో మెగా షాపింగ్ మాల్ ఏర్పాటు చేయనున్నారు. ఇందులో లులు సూపర్‌మార్కెట్, లులు ఫ్యాషన్, లులు కనెక్ట్, ఫ్యామిలీ ఎంటర్‌టైన్‌మెంట్ సెంటర్ తదితరాలు కొలువుదీరనున్నాయి. ఈ ప్రాజెక్టును ప్రత్యేక కేటగిరీగా పరిగణిస్తూ మూడేళ్ల లీజు మాఫీని వర్తింపజేయాలని (మిగతా 2లో)



ఖాళీ స్థలాల భద్రత ఎంత?

అస్తవ్యస్తంగా వీఎల్‌టీ చెల్లింపులు, రికార్డుల నిర్వహణ

ప్లాట్‌ల అమ్మకాల్లో అక్రమాలకు అవకాశం

ఈనాడు, అమరావతి: ఖాళీ స్థలాల పన్ను (వేకెంట్ ల్యాండ్ ట్యాక్స్ - వీఎల్‌టీ) చెల్లింపు విధానం, భూ దస్త్రాల నిర్వహణ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉండటంతో రియల్ ఎస్టేట్ మోసాలకు ఆస్కారం ఏర్పడుతోంది. ముఖ్యంగా అనధికారిక లేఅవుట్లలోని ప్లాట్ల కొనుగోలులో ఈ సమస్య తీవ్రంగా ఉంది. రియల్ ఎస్టేట్ వ్యాపారులు ఒకే ప్లాట్‌ను (ఖాళీ స్థలం) ఒకరి కంటే ఎక్కువ మందికి విక్రయిస్తున్నారు. వీటి కొనుగోలుకు ముందు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజల్లో అవగాహన ఉండటం లేదు. వ్యవసాయ భూములకు ఉండే వెబ్‌ల్యాండ్ మాదిరిగా ఖాళీ స్థలాల వివరాలు నిర్ధారించుకునేందుకు వ్యవస్థ లేదు. ఖాళీ (మిగతా 2లో)

ఓర్వకల్లులో సోలార్ ప్యానళ్ల తయారీ యూనిట్

రూ.6,933 కోట్ల పెట్టుబడి పెట్టనున్న అగస్త్య ఎనర్జీ ఇండస్ట్రీస్

ఈనాడు, అమరావతి: కర్నూలు జిల్లా ఓర్వకల్లు మెగా ఇండస్ట్రియల్ హబ్‌లో సోలార్ ప్యానళ్ల తయారీ యూనిట్ ఏర్పాటుకానుంది. అగస్త్య ఎనర్జీ ఇండస్ట్రీస్ ప్రైవేటు లిమిటెడ్ కంపెనీ రూ.6,933 కోట్ల పెట్టుబడితో 5 గిగావాట్ల సోలార్ సెల్, 5 గిగావాట్ల సోలార్ మాడ్యూళ్ల తయారీ యూనిట్‌ను ఏర్పాటు చేయనుంది. మొత్తం 2,138 మందికి ఉపాధి కల్పించే ఈ ప్రాజెక్టుకు ప్రత్యేక ప్రోత్సాహకాలను అనుమతిస్తూ పరిశ్రమలు, వాణిజ్యశాఖ కార్యదర్శి యువరాజ్ ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. హరిత ఇంధనానికి ప్రోత్సాహం ఇవ్వాలన్న ప్రభుత్వ విధానంలో భాగంగా సౌర విద్యుత్తుకు పెద్దపీట వేస్తున్న విషయం తెలిసిందే.

షార్‌లో అందుబాటులోకి మరిన్ని ప్రాజెక్టులు

నేడు ప్రారంభించనున్న ఇస్రో ఛైర్మన్

శ్రీహరికోట, న్యూస్‌టుడే: తిరుపతి జిల్లాలోని సతీశ్ ధవన్ స్పేస్ సెంటర్ షార్‌లో రూ.వందల కోట్లతో నిర్మించిన వివిధ ప్రాజెక్టులను ఇస్రో ఛైర్మన్ నారాయణన్ సోమవారం ప్రారంభించనున్నారు. ఈ నెల 30న నైసార్ ఉపగ్రహ ప్రయోగం చేపట్టనుండటంతో ఆయన షార్ రానున్నారు. ఈ క్రమంలో భవిష్యత్తు అవసరాల దృష్ట్యా షార్‌లో ఏర్పాటు చేసిన 11 ప్రాజెక్టులను నారాయణన్ ప్రారంభిస్తారు. షార్‌లో సాలిడ్ ప్రొపెల్లెంట్ ప్లాంట్ అగ్మెంటేషన్ (ఎస్‌పీఏజీ) ప్రాజెక్టుకు రూ.486.22 కోట్లు కేటాయించారు. దీని ద్వారా సాలిడ్ ప్రొపెల్లెంట్ ప్లాంట్(ఎస్‌పీపీ), ఎస్‌పీఏజీ ప్రాజెక్టు ప్రస్తుత సామర్థ్యం రెండింతలు పెరుగుతుంది. ఎనిమిది ఎస్200 మోటార్ల తయారీకి వీలు కలుగుతుంది. ఇవి పూర్తిస్థాయిలో అందుబాటులోకి వస్తే ఏటా నాలుగు ఎల్‌వీఎం-3(జీఎస్ఎల్‌వీ మార్క్-3) ప్రయోగాలు చేపట్టవచ్చు. పది టన్నుల వర్టికల్ మిక్సర్ ప్లాంట్, కెమికల్ అండ్ ఫిజికల్ టెస్టింగ్ ల్యాబ్(సీపీటీఎల్-2), విద్యుత్తు ఉపకేంద్రం-5, విక్రమ్ మార్గం, షార్ మొదటి గేటు దాటాక ఆధునికీకరించిన పరిపాలన భవన సముదాయం తదితరాలను నారాయణన్ ప్రారంభిస్తారు.

త్వరలో రూ.560 కోట్ల బిల్లులు చెల్లిస్తాం

పీఆర్ చీఫ్ ఇంజినీర్ అశోక్

పి.గన్నవరం, న్యూస్‌టుడే: రాష్ట్రంలో పంచాయతీరాజ్ శాఖ పరిధిలో రూ.560 కోట్ల పెండింగ్ బిల్లులు చెల్లించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందని ఆ శాఖ చీఫ్ ఇంజినీర్, రాష్ట్ర గ్రామీణ రహదారుల ప్రాజెక్టు డైరెక్టర్ పి.అశోక్ వెల్లడించారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా పి.గన్నవరం మండలం జి.పెదపూడిలంక సమీపంలో వశిష్ఠ గోదావరి నదీపాయపై రూ.71.43 కోట్లతో చేపట్టిన వంతెన నిర్మాణ పనులను ఆదివారం ఆయన పరిశీలించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ.. ఏషియన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకు రూ.475 కోట్లు మంజూరు చేసిందని, దీనికి రాష్ట్ర ప్రభుత్వం మ్యాచింగ్ గ్రాంటుగా రూ.200 కోట్లు కేటాయించిందని తెలిపారు. మొత్తం రూ.675 కోట్లకుగానూ ముందుగా గుత్తేదారులకు చెల్లించేందుకు రూ.560 కోట్ల మేర బిల్లులు సీఎఫ్ఎంఎస్‌లో అప్‌లోడ్ అయ్యాయన్నారు.



పెనుకొండలో నిర్మించిన ట్రామాకేర్ భవనం

రూ.కోట్లు పెట్టారు సరే.. ప్రాణాలు నిలపరేం?



భవనంలో నిల్వ చేసిన మందులు

రోడ్డు ప్రమాదాల్లో క్షతగాత్రులకు సత్వరం చికిత్స అందించి వారి ప్రాణాలు కాపాడేది 'ట్రామాకేర్ వ్యవస్థ'. ఉమ్మడి అనంతపురం జిల్లా మీదుగా ఎన్‌హెచ్ 44, 42, 544డి రహదారులు వెళ్తున్నాయి. ఏటా జరుగుతున్న రోడ్డు ప్రమాదాల్లో 300 మందికిపైగా ప్రాణాలు కోల్పోతున్నారు. దీంతో 2011లో కేంద్ర ప్రభుత్వం ట్రామా కేర్ యూనిట్ మంజూరు చేసింది. 2013 నాటికి భవనం పూర్తి చేసినా.. వైద్యులు, సిబ్బంది పోస్టులు కేటాయించలేదు. 2020 అక్టోబరులో నాడు-నేడు పథకం కింద రూ.3.95 కోట్లతో ఈ భవనాన్ని ఆధునికీకరించి.. మరో అంతస్తు నిర్మించారు. ప్రస్తుతం ఇందులో స్థానిక సీహెచ్‌సీకి అవసరమైన మందులు నిల్వ చేస్తున్నారు. దాంతోపాటు ఆరోగ్య సిబ్బంది, డిప్యూటీ డీఎంహెచ్‌వో కార్యాలయాలు నిర్వహిస్తున్నారు. ఇక్కడ అత్యవసర వైద్యం అందక.. క్షతగాత్రులను కర్నూలు, బెంగళూరులోని ఆసుపత్రులకు తరలించాల్సి వస్తోంది. ప్రభుత్వ యంత్రాంగంలోని అలసత్వానికి ఇదొక నిదర్శనంగా నిలుస్తోంది.

– ఈనాడు–పుట్టపర్తి, న్యూస్‌టుడే, పెనుకొండ

బంగారు కుటుంబాలకు.. ఇదీ మీ మార్గదర్శనం



24 శాఖలకు ప్రభుత్వం బాధ్యతలు

పేదరిక నిర్మూలనలో భాగంగా పీ-4 కార్యక్రమం కింద బంగారు కుటుంబాల దత్తతకు సంబంధించి ప్రభుత్వం శాఖల వారీగా బాధ్యతలు అప్పగించింది. ఎంపికైన వివిధ వర్గాలకు చెందిన బంగారు కుటుంబాలకు అవసరమైన సాయం అందించేలా మొత్తం 24 శాఖలు బాధ్యత తీసుకోవాలని పేర్కొంది.

ఏ శాఖ ఏం చేయాలి..

- **వ్యవసాయ శాఖ:** బంగారు కుటుంబాలుగా గుర్తించిన తక్కువ ఆదాయం కలిగిన రైతు, పాడి రైతుల కుటుంబాలకు అభ్యుదయ రైతుల ద్వారా ఉత్తమ వ్యవసాయ యాజమాన్య విధానాలు, అధిక దిగుబడులపై అవగాహన కల్పించడం ద్వారా ఉత్పాదకత పెంచుకుని అధిక ఆదాయం సాధించేలా చూడాలి.
- **విత్తన, ఎరువులు, పురుగుమందుల డీలర్లు:** నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, పురుగుమందులను అందుబాటు ధరకు ఇవ్వడంతోపాటు వాటిని వాడే విధానం తెలియజేయాలి.
- **ఆహార శుద్ధి, కోళ్లు, మత్స్య రంగంలోని పారిశ్రామికవేత్తలు:** పేద కుటుంబాలు, కార్మికులు తమ ఆదాయం పెంచుకునేలా శిక్షణ, సహాయం అందించాలి.
- **పాఠశాల, ఇంటర్మీడియట్, ఉన్నత కళాశాల, సాంకేతిక విద్యా శాఖలు:** ఉపాధ్యాయులు, ఫ్యాకల్టీ, ప్రైవేటు పాఠశాలలు, విద్యాసంస్థల ద్వారా ఆర్థికంగా వెనకబడిన విద్యార్థి కుటుంబాలను దత్తత తీసుకుని విద్యాపరమైన మద్దతు, మార్గదర్శనం చేయాలి.
- **మైన్స్ అండ్ జియాలజీ:** కార్మికులు, వారి కుటుంబాలకు వృత్తిపరమైన భద్రత పెంపు, ఆదాయం పెరిగేలా వ్యాపారవేత్తలు బాధ్యత తీసుకునేలా చేయడం.
- **పౌరసరఫరాల శాఖ:** తమ పరిధిలోని డీలర్లు, పెట్రోలు బంకులు, గ్యాస్ ఏజెన్సీలు, రైస్‌మిల్లర్లు, ధాన్యం వ్యాపారుల ద్వారా బంగారు కుటుంబాల కింద ఎంపికైన దినసరి కార్మికులు, వ్యవసాయ కూలీల జీవనోపాధి మెరుగుపడేలా చూడాలి.
- **వైద్య ఆరోగ్య శాఖ:** డాక్టర్లు, స్టాఫ్ నర్సులు, ఏఎన్ఎం, ప్రైవేటు ఆసుపత్రుల ద్వారా పేద రోగులు, కుటుంబాలకు ఆరోగ్య సంరక్షణ, ముందస్తు జాగ్రత్తలు తెలియజెప్పడం.
- **గ్రామీణ నీటిసరఫరా, పంచాయతీరాజ్, రోడ్లు, భవనాలు, ప్రజారోగ్య, పురపాలక ఇంజినీరింగ్ శాఖలు:** కాంట్రాక్టర్ల ద్వారా కార్మికుల కుటుంబాల్లోని వారికి నిరంతర ఆదాయం వచ్చేలా నైపుణ్యం పెంపొందించాలి.
- **జిల్లా పంచాయతీ కార్యాలయం, పురపాలక సంఘాలు, జడ్పీ సీఈవో:** సర్పంచులు, ఎంపీటీసీ, జడ్పీటీసీ సభ్యులు, కౌన్సిలర్లు తమ పరిధిలోని దినసరి కార్మికులుగా ఉన్న బంగారు కుటుంబాల్లోని వారి జీవనోపాధి మెరుగుపరిచి ఆదాయ భద్రత కల్పించాలి. పనిచేసే ప్రదేశాల్లో వసతులు మెరుగుపరచాలి. వారి సంక్షేమానికి అవసరమైన చర్యలు తీసుకోవాలి.
- **కార్మికశాఖ:** దుకాణాలు, మాల్స్, సంస్థలు, బంగారం, వెండి, రత్నాల వ్యాపారుల సహకారంతో సిబ్బంది, కార్మికుల జీవనోపాధి మెరుగుపడేలా చూడాలి.
- **ఫుడ్ ఇన్‌స్పెక్టర్లు:** హోటళ్లు, రెస్టారెంట్ల ద్వారా బంగారు కుటుంబాలుగా ఎంపికైన వంటశాల, సేవలు అందించే సిబ్బందిలో నైపుణ్యం పెంచి, వారి ఆదాయ సామర్థ్యాన్ని మెరుగుపరచడం.
- **వాణిజ్య పన్నుల శాఖ:** వివిధ రంగాల్లోని పారిశ్రామికవేత్తలు, వ్యాపారుల ద్వారా.. సిబ్బంది, కార్మికుల కుటుంబాల జీవనశైలిలో మార్పు తేవడం, జీవనోపాధి పెరిగేలా చూడటం.
- **సెట్రాజ్, ఎన్జీవోలు, రెడ్‌క్రాస్, రోటరీ, లయన్స్ క్లబ్, మహిళా క్లబ్బులు, సామాజిక కార్యకర్తలు:** పేద కుటుంబాలకు అవసరమైన నిత్యావసర సేవలు అందిస్తూ వారి జీవన ప్రమాణాలు పెరిగేలా చేయడం.
- **నైపుణ్యాభివృద్ధి అధికారి, ఎంప్లాయిమెంట్ అధికారి, వికాస్ పీడీలు:** నిరుద్యోగ యువతకు అవసరమైన వృత్తి శిక్షణ, కెరీర్ గైడెన్స్, ఉద్యోగావకాశాలు కల్పించడం ద్వారా ఉద్యోగాలు ఇప్పించి వారి ఆదాయాన్ని పెంచడం.
- **పరిశ్రమల శాఖ:** చిన్న, మధ్యస్థాయి వ్యాపారవేత్తల ద్వారా సూక్ష్మ, చిన్న, మధ్యస్థాయి పరిశ్రమల్లో పనిచేసే కార్మికుల కుటుంబాలను దత్తత తీసుకుని వారిలో నైపుణ్యాలను పెంచడం, పని ప్రదేశాల్లో వసతులు మెరుగుపరచడం, సమ్మిళిత వృద్ధి చర్యల ద్వారా వారికి మెరుగైన జీవన ప్రమాణాలు కల్పించాలి.

- ఈనాడు, అమరావతి

లారస్ ఫార్మా జోన్‌కు 531 ఎకరాలు

వివిధ సంస్థలకు భూములు కేటాయిస్తూ ప్రభుత్వ ఉత్తర్వులు

ఈనాడు, అమరావతి: అనకాపల్లి జిల్లాలో లారస్ ఫార్మా జోన్ అభివృద్ధికి 531.77 ఎకరాలను రాంబిల్లి ఇండస్ట్రియల్ పార్క్ ఫేజ్-2లో కేటాయిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఎకరానికి రూ.30 లక్షల చొప్పున సంస్థ చెల్లించనుంది. డీపీఆర్‌లో పేర్కొన్న విధంగా వివిధ దశల్లో ఆ సంస్థ రూ.5,600 కోట్ల పెట్టుబడులు.. 6,350 మందికి ఉపాధి కల్పించనుందని ప్రభుత్వం పేర్కొంది. ఏటా 4 వేల టన్నుల బల్క్ డ్రగ్స్‌ను సంస్థ తయారు చేస్తుంది.

అవిశా ఫుడ్స్‌కు మల్లవల్లిలో..

అవిశా ఫుడ్స్ అండ్ ఫ్యూయల్స్ ప్రైవేట్ లిమిటెడ్‌కు మల్లవల్లి మెగా ఫుడ్ పార్క్‌లో 13.85 ఎకరాలు, మోడల్ ఇండస్ట్రియల్ పార్క్‌లో 115.65 ఎకరాలను రాయితీ ధరకు కేటాయించేందుకు అనుమతిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఎకరం రూ.16.5 లక్షల చొప్పున సంస్థకు కేటాయించేందుకు అనుమతిచ్చింది. ఈ మొత్తాన్ని 30 రోజుల్లో చెల్లించే వెసులుబాటు కల్పించింది.

ఏసీఈ ఇంటర్నేషనల్‌కు చిత్తూరు జిల్లాలో

ఏసీఈ ఇంటర్నేషనల్‌కు చిత్తూరు జిల్లా లింగాపురం దిన్నె దగ్గర గ్రీన్‌ఫీల్డ్ ఇంటిగ్రేటెడ్ డెయిరీ ఉత్పత్తులు.. న్యూట్రిషన్ కాంప్లెక్స్ ఏర్పాటుకు 75.63 ఎకరాలను కేటాయిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఆ సంస్థ రూ.1,000 కోట్ల పెట్టుబడులు.. 2 వేల మందికి ఉపాధి కల్పించనున్నట్లు ప్రతిపాదించింది.

● బ్రాండిక్స్ ఇండియా అపరల్ సిటీ ప్రైవేట్ లిమిటెడ్‌కు (అధిష్ఠాన్ ప్రైవేట్ లిమిటెడ్) కేటాయించిన 695.35 ఎకరాల లీజు గడువును 25 ఏళ్లు పెంచేందుకు అనుమతిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. 2031 జులై ఒకటి నుంచి గడవు పెంపు అమల్లోకి వస్తుందని పేర్కొంది. ఆ సంస్థ దుస్తుల తయారీతో పాటు.. నిర్దేశించిన లక్ష్యాలకు అనుగుణంగా ఫుట్‌వేర్, బొమ్మలు, ఇతర ఉత్పత్తులను తయారు చేయాల్సి ఉంటుంది.

శ్రీకాకుళంలో ఏపీసీ లైట్ బ్రిక్స్ యూనిట్

22.45 ఎకరాలు కేటాయిస్తూ ఉత్తర్వులు

ఈనాడు, అమరావతి: శ్రీకాకుళం జిల్లా రణస్థలం మండలం సాంచం గ్రామంలో వీఎస్ఆర్ సర్కాన్ ఇండస్ట్రీస్ సంస్థ ఏపీసీ లైట్ బ్రిక్స్ తయారీ యూనిట్ ఏర్పాటు చేయనుంది. ఇందుకు ఎకరానికి రూ.11.62 లక్షల చొప్పున 22.45 ఎకరాల భూమిని ఆ సంస్థకు ఏపీఐఐసీ ద్వారా కేటాయిస్తూ పరిశ్రమలు, వాణిజ్యశాఖ కార్యదర్శి యువరాజ్ ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు.

'ఉద్యోగులు, పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి కృషి'



పెన్షన్ మార్చ్ కార్యక్రమ గోడప్రతులను ఆవిష్కరిస్తున్న సూర్యనారాయణ, రమేష్‌కుమార్, బాజీ పఠాన్, హరికృష్ణ తదితరులు

విజయవాడ (గవర్నర్‌పేట), న్యూస్‌టుడే: ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల సమస్యలు పరిష్కరించేందుకు ఒక చట్టబద్ధమైన వేదిక కోసం కృషి చేస్తున్నామని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ, ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్ సంఘాల ఐక్యవేదిక ఛైర్మన్ కె.ఆర్.సూర్యనారాయణ పేర్కొన్నారు. ఆదివారం విజయవాడలో ఐక్యవేదిక స్టీరింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సూర్యనారాయణ మాట్లాడుతూ.. సమస్యల పరిష్కారానికి కార్యాచరణ రూపొందిస్తున్నట్లు తెలిపారు. ఉద్యోగుల సమస్యలపై ప్రభుత్వం ఉదాసీనంగా వ్యవహరిస్తోందన్నారు. 2023 జులై 1 నాటికి వేతన సవరణ జరగాల్సి ఉందని.. దీంతో పాటు 4 డీఏ బకాయిలు ఉద్యోగులకు చెల్లించాలని చెప్పారు. సమస్యలపై గవర్నర్‌ను కలవడంతోనే గత ప్రభుత్వం తనపై కక్ష సాధింపు చర్యలకు దిగిందని, అక్రమ కేసులతో తన కుటుంబాన్ని సైతం తీవ్రంగా వేధించిందని వాపోయారు. గత ప్రభుత్వ హయాంలో ఉద్యోగుల జీపీఎఫ్ ఖాతాల నుంచి దొంగతనంగా తీసుకున్న రూ.500 కోట్ల సొమ్ముపై విచారణ నివేదికను బహిర్గతం చేయాలన్నారు. సెప్టెంబరు 1న విజయవాడలో నిర్వహించే పెన్షన్ మార్చ్ కార్యక్రమం గోడప్రతులను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ఉద్యోగుల సంఘం ప్రధాన కార్యదర్శి రమేష్‌కుమార్, ఐక్యవేదిక సెక్రటరీ జనరల్ బాజీ పఠాన్, కో ఛైర్మన్ కె.హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఎల్ఆర్ఎస్‌తో పెండింగ్ దరఖాస్తులకు పరిష్కారం

- ప్రస్తుత ధరల ప్రకారం ఫీజులు చెల్లించాలి
- రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధిశాఖ స్పష్టీకరణ

ఈనాడు–అమరావతి: అనుమతులు తీసుకోని లేఅవుట్లలో స్థలాల (ప్లాట్లు) క్రమబద్ధీకరణకు ఇదివరకే దరఖాస్తులు చేసుకుని వివిధ కారణాలతో ఫీజులు చెల్లించని, అధికారులు అడిగిన దస్త్రాలు గడువులోగా సమర్పించని వారు ప్రభుత్వం కొత్తగా ప్రవేశపెట్టిన లేఅవుట్ క్రమబద్ధీకరణ పథకం (ఎల్ఆర్ఎస్)లో ఇప్పుడు మళ్లీ క్రమబద్ధీకరించుకోవచ్చు. ఇందుకు సమీప సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ప్రస్తుత విలువల (రేట్లు) ప్రకారం ప్లాట్ విస్తీర్ణం మొత్తంపై నిర్దేశిత శాతం మేర ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధిశాఖ జారీ చేసిన ఉత్తర్వుల్లో ఈ విషయం స్పష్టం చేసింది. ఇందు కోసం ముందుకు వచ్చే వారందరి పెండింగ్ దరఖాస్తులనూ పరిష్కరించాలని పుర, నగరపాలక, పట్టణాభివృద్ధి సంస్థల అధికారులను ప్రభుత్వం ఆదేశించింది. రాష్ట్రంలో 2014-19 మధ్య తెదేపా ప్రభుత్వ హయాంలో ప్రవేశపెట్టిన ఎల్ఆర్ఎస్‌లో 5,278 లేఅవుట్లను క్రమబద్ధీకరించారు. మరో 707 అర్జీలను వివిధ కారణాలతో తిరస్కరించారు. 2,079 దరఖాస్తులకు సంబంధించి మరిన్ని వివరాలు అవసరమని సూచిస్తూ వెనక్కి పంపారు. ఇంకా దాదాపు 18 వేల దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. నోటీసులిచ్చినా క్రమబద్ధీకరణ ఫీజులు చెల్లించకపోవడం, అడిగిన పత్రాలు సమర్పించకపోవడంతో ఇవి అప్పట్లో పరిష్కారం కాలేదు. దీంతో పట్టణాభివృద్ధి సంస్థలు వాటిని పక్కన పెట్టాయి. కూటమి ప్రభుత్వం తాజాగా అమలు చేస్తున్న ఎల్ఆర్ఎస్‌లో పెండింగ్ దరఖాస్తులను పరిష్కరించుకునే అవకాశం కల్పించింది.

వీటి మాటేమిటి?

లేఅవుట్లలో ప్లాట్లు క్రమబద్ధీకరించే క్రమంలో పట్టణాభివృద్ధి సంస్థలు జారీ చేసిన నోటీసులపై పలువురు మొదట పూర్తిగా ఫీజులు చెల్లించాక కూడా రెండోసారి మళ్లీ అదనపు మొత్తాల కోసం అధికారులు తాఖీదులు పంపారు. మొదట నిర్ణయించిన ఫీజుల్లో తప్పులు దొర్లాయని, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఆస్తుల విలువల ప్రకారం అదనపు మొత్తాలు చెల్లించాలని నోటీసుల్లో పేర్కొన్నారు. ఇంకొన్నిచోట్ల లేఅవుట్‌లో ఓపెన్ స్పేస్, డెవలప్‌మెంట్ ఛార్జీలు చేర్చలేదని మరోసారి తాఖీదులిచ్చారు. అయినా విశాఖపట్నం, తిరుపతి, మచిలీపట్నం, అనంతపురం, కర్నూలు, రాజమహేంద్రవరం, నెల్లూరు, ఒంగోలు తదితర ప్రాంతాల్లో చాలామంది రెండోసారి చెల్లించలేదు. దీంతో క్రమబద్ధీకరణ ప్రక్రియను అధికారులు అప్పట్లో పక్కనపెట్టారు. వేల సంఖ్యలో ఉన్న అలాంటి వారంతా ఇప్పుడు ముందుకొస్తే ప్రస్తుత సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ధరల ప్రకారమైతే ఫీజులు తడిసి మోపెడవుతాయి. వీటికి పరిష్కారం ఎలా అనే దానిపై జీవోలోనూ స్పష్టత ఇవ్వలేదు. పురపాలక, పట్టణాభివృద్ధిశాఖ దీనిపై తగిన నిర్ణయం తీసుకోవాలని దరఖాస్తుదారులు కోరుతున్నారు.

లులు మాల్స్ ఏర్పాటులో ముందడుగు

(మొదటి పేజీ తరువాయి)

ప్రభుత్వం నిర్ణయించింది. రాష్ట్ర పర్యాటక భూముల కేటాయింపు విధానం 2024-29 ప్రకారం భూమి ధరను నిర్ధారించనున్నారు. కోర్టు కేసుల పరిష్కారానికి ఏపీఐఐసీ, రెవెన్యూ శాఖ చర్యలు తీసుకోవాలని ఆదేశించింది.

ఆర్టీసీకి ప్రత్యామ్నాయ భూమి!

విజయవాడలో 2.23 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో షాపింగ్ మాల్ ఏర్పాటుకు 4.15 ఎకరాల భూమిని లీజు పద్ధతిలో కేటాయించేందుకు సూత్రప్రాయంగా అంగీకారం తెలిపింది. ప్రస్తుతం ఈ ప్రాజెక్టు ఏర్పాటుకు సూచించిన ప్రాంతంలోని ఆర్టీసీ నిర్మాణాలను ప్రత్యామ్నాయ స్థలాలకు తరలించేందుకు ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ చర్యలు తీసుకోవాలని ఆదేశించింది. దీనికి అవసరమైన భూమిని ఆర్టీసీకి ప్రత్యామ్నాయంగా ఇచ్చి, ప్రాజెక్టు స్థలాన్ని పర్యాటకశాఖకు అప్పగించాలని స్పష్టం చేసింది. ఈ రెండు ప్రాజెక్టులు నిర్దేశిత గడువులోగా పూర్తయ్యేలా పరిశ్రమలు, వాణిజ్య శాఖ, ఏపీఐఐసీ తగు చర్యలు తీసుకోవాలని ఆదేశించింది. మాల్స్, రెస్టారెంట్లు తరహా ప్రాజెక్టులను పర్యాటక భూముల కేటాయింపు విధానం పరిధిలోకి చేర్చాలని ఉత్తర్వుల్లో పేర్కొంది.

జవాబుదారీతనమే ప్రజాస్వామ్యానికి మూలస్తంభం

- ప్రతి ఒక్కరూ రాజ్యాంగానికి కట్టుబడి పనిచేయాల్సిందే
- ప్రజాప్రతినిధుల ఫిరాయింపులను రాజ్యాంగం సమ్మతించదు
- 'భారత రాజ్యాంగంలో జవాబుదారీతనం' అనే అంశంపై సదస్సులో సుప్రీంకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ లావు నాగేశ్వరరావు





● కార్యక్రమంలో మాట్లాడుతున్న సుప్రీంకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ లావు నాగేశ్వరరావు
● జస్టిస్ లావు నాగేశ్వరరావును సన్మానించి జ్ఞాపిక అందిస్తున్న జంధ్యాల శంకర్. చిత్రంలో ఎంసీ దాసు, డీవీ సీతారామమూర్తి, నిమ్మగడ్డ రమేశ్‌కుమార్

ఈనాడు, అమరావతి: ప్రభుత్వ సంస్థలు, వ్యక్తులు, అధికారులు ప్రజలకు జవాబుదారీగా ఉండాలని సుప్రీంకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ లావు నాగేశ్వరరావు అన్నారు. ప్రభుత్వం పట్ల ప్రజల్లో విశ్వాసం పెంపొందించడానికి, దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపించేందుకు ఇది ఎంతో దోహదం చేస్తుందని ఆయన పేర్కొన్నారు. 'సిటిజన్స్ ఫర్ డెమోక్రసీ' (సీఎఫ్‌డీ) ఆధ్వర్యంలో విజయవాడలోని సిద్ధార్థ అకాడమీ ఆడిటోరియంలో 'భారత రాజ్యాంగంలో జవాబుదారీతనం' అనే అంశంపై ఆదివారం నిర్వహించిన సదస్సులో జస్టిస్ నాగేశ్వరరావు ప్రసంగించారు. 'ప్రతి ఒక్కరూ రాజ్యాంగానికి కట్టుబడి ఉండాల్సిందే. ప్రజాప్రతినిధుల ఫిరాయింపులను రాజ్యాంగం సమ్మతించదు. గత పదేళ్లలో తెలుగు రాష్ట్రాల్లో శాసన సభాపతుల వ్యవహారశైలిని పరిశీలిస్తున్నాను. సభ్యుల అనర్హతపై నిర్ణీత సమయంలో నిర్ణయం తీసుకోలేకపోతున్నారు. వ్యవస్థలో జవాబుదారీతనం పెంపొందించడంలో సమాచార హక్కు చట్టం ఎంతో దోహదం చేస్తోంది. సీజేఐ కూడా ఆర్టీఐ పరిధిలోకి వస్తారు. రాజ్యాంగంలో 326వ అధికరణ ప్రకారం ఓటు ఉన్న ప్రతి పౌరుడూ ఆ హక్కు వినియోగించుకోవాలి. ఉన్నత శ్రేణి ప్రజలు ఓటు వేయడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించడం బాధాకరం' అని జస్టిస్ నాగేశ్వరరావు అన్నారు. 'ప్రజాస్వామ్యంలో శాసన, కార్యనిర్వాహక, న్యాయ వ్యవస్థలు కీలకం. ప్రజాస్వామ్య వ్యవస్థలో అధికారం అనేది ఓ నమ్మకం. ఆ విశ్వాసాన్ని రోజూ కాపాడుకోవాలి. శాసన వ్యవస్థ ప్రజలకు జవాబుదారీగా ఉండటం ప్రజాస్వామ్యబద్ధ పరిపాలనకు పునాదిరాయి' అని మరో అతిథి, మాజీ ఏజీ, సీనియర్ న్యాయవాది డీవీ సీతారామమూర్తి అన్నారు.

రాగద్వేషాలకు అతీతంగా కార్యనిర్వాహక వ్యవస్థ పనిచేయాలి: మాజీ ఎస్ఈసీ రమేశ్‌కుమార్

వ్యవస్థలో జవాబుదారీతనం, నైతికతకు స్థానం లేకుండా పోయిందని సిటిజన్స్ ఫర్ డెమోక్రసీ కార్యదర్శి, రాష్ట్ర ఎన్నికల సంఘం మాజీ కమిషనర్ నిమ్మగడ్డ రమేశ్‌కుమార్ అన్నారు. 'కార్యనిర్వాహక వ్యవస్థ రాగద్వేషాలకు అతీతంగా పనిచేయాలి. దేశవ్యాప్తంగా ఉన్న ఉద్యోగ సంఘాలు జవాబుదారీగా వ్యవహరించాలి. కొద్దిమంది చీడపురుగుల వల్ల వ్యవస్థకే చెడ్డపేరు వస్తోంది. రాజ్యాంగబద్ధ వ్యవస్థలను బలపరచాలి. గత ప్రభుత్వం ఆర్డినెన్స్ ద్వారా ఎస్ఈసీ పదవి నుంచి నన్ను తొలగిస్తే న్యాయస్థానంలో పోరాడి విజయం సాధించా. నేను ఎస్ఈసీగా ఉన్నప్పుడు ఎన్నికల కోడ్ అమలులో ఉండగా ఒక మంత్రి నన్ను దుర్భాషలాడారు. దీంతో ఆ మంత్రిపై గ్యాగ్ ఆర్డర్ ఇచ్చా. దుర్భాషలాడిన వారిపై ప్రస్తుత ఎన్నికల కమిషనర్ ఎలాంటి చర్యలూ తీసుకోలేదు. ఆయనపై చర్య తీసుకోవాలని ప్రస్తుత డీజీపీని కోరినా చర్యల్లేవు. రాజధాని అమరావతిలో మరో 40 వేల ఎకరాల భూ సమీకరణపై భిన్నాభిప్రాయాలు ఉన్నాయి. ఈ విషయంలో సీఎఫ్‌డీ తటస్థ వైఖరితో ఉంది' అని రమేశ్‌కుమార్ అన్నారు. సదస్సులో విజయవాడ మాజీ మేయర్ జంధ్యాల శంకర్, సీఎఫ్‌డీ ప్రతినిధి దాసు, దివాకర్‌బాబు, అశ్విన్‌కుమార్ తదితరులు మాట్లాడారు. జస్టిస్ లావు నాగేశ్వరరావు, మాజీ ఏజీ సీతారామమూర్తిలను సిద్ధార్థ కళాశాల ప్రతినిధి రాజయ్య సత్కరించారు.

శంషాబాద్‌లో అబుధాబి విమానాన్ని ఢీకొన్న పక్షి

సర్వీస్ రద్దు

శంషాబాద్, న్యూస్‌టుడే: రన్‌వేపై దిగుతున్న ఓ అంతర్జాతీయ విమానాన్ని పక్షి ఢీకొట్టింది. పైలట్ చాకచక్యంగా వ్యవహరించి విమానాన్ని సురక్షితంగా ల్యాండింగ్ చేయడంతో పెను ప్రమాదం తప్పింది. ఈ ఘటన ఆదివారం తెల్లవారుజామున శంషాబాద్ విమానాశ్రయంలో జరిగింది. విశ్వసనీయ వర్గాల వివరాల ప్రకారం.. ఎతీహాద్ ఎయిర్‌లైన్స్‌కు చెందిన ఈవై-353 విమాన సర్వీస్ అబూధాబి నుంచి హైదరాబాద్‌కు బయలుదేరింది. శంషాబాద్ విమానాశ్రయంలో ల్యాండింగ్ అవుతున్న క్రమంలో పక్షిని ఢీకొట్టడంతో విమానం ముందు భాగం కొంత మేర దెబ్బతింది. దీంతో తెల్లవారుజామున 4.20 గంటలకు అబూధాబికి వెళ్లాల్సిన ఈ విమాన సర్వీస్‌ను ఏటీసీ అధికారులు రద్దు చేశారు. శంషాబాద్ విమానాశ్రయంలో అంతర్జాతీయ విమానాలు పక్షిని ఢీకొట్టడం వారం వ్యవధిలో ఇది రెండోసారి కావడం గమనార్హం.

ఖాళీ స్థలాల భద్రత ఎంత?

(మొదటి పేజీ తరువాయి)

స్థలాల పన్ను చెల్లింపును పట్టించుకోకపోవడంతో రికార్డుల్లో యజమానుల వివరాలు నమోదు కావడం లేదు. దీంతో ఒకే ప్లాట్‌ను ఒకరి కంటే ఎక్కువ మందికి విక్రయించేందుకు వీలవుతోంది. ఈ ఘటనలు అడపాదడపా రాష్ట్ర వ్యాప్తంగా వెలుగులోకి వస్తూనే ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఆగస్టు 1 నుంచి రాష్ట్రంలోని 17 మున్సిపల్ కార్పొరేషన్ల పరిధిలో రిజిస్ట్రేషన్ల అనంతరం ఆస్తిపన్ను చెల్లింపు రికార్డుల్లో యజమాని పేరు (మ్యూటేషన్) మార్చే విధానం అమల్లోకి రాబోతుంది. మిగిలినచోట్ల కూడా ఖాళీ స్థలాల క్రయవిక్రయాల పరంగా అక్రమాలను నిరోధించేందుకు ప్రభుత్వం గట్టి చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

ఉదాసీనత ఎందుకు?: వెబ్‌ల్యాండ్‌లో వ్యవసాయ భూముల యజమానుల పేర్లు, వాటి సంక్రమణ, మ్యాప్, ఇతర వివరాలు ఉంటున్నాయి. వీటి ఆధారంగా రిజిస్ట్రేషన్లు చేస్తున్నారు. పట్టణ/నగర శివారు ప్రాంతాల్లోని వ్యవసాయేతర భూముల పుట్టుపూర్వోత్తరాలు తెలుసుకునే వ్యవస్థ ప్రస్తుతం బలహీనంగా ఉంది. దీంతో వ్యవసాయ భూమి నుంచి వ్యవసాయేతర అవసరాలకు అనుమతి తీసుకోకుండానే రియల్ ఎస్టేట్ వ్యాపారులు వెంచర్లు వేసి, ఆయా స్థలాలను విక్రయిస్తున్నారు. సుమారు 20 ప్లాట్లు వేస్తే.. వాటికంటే అదనంగా ఉన్నట్లు మ్యాపుల్లో మార్పులు చేస్తున్నారు. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో వీటిని పసిగట్టే వ్యవస్థ లేదు. దీని వల్ల సదరు లేఅవుట్లలో ఎన్ని ప్లాట్లు ఉన్నాయి? ఎన్ని అమ్మారన్న వివరాలు తెలియడం లేదు. అప్రూవ్డ్ లేఅవుట్లలో ఇలా జరిగే అవకాశాలు తక్కువ. డాక్యుమెంట్ రిజిస్ట్రేషన్ల ద్వారా రిజిస్ట్రేషన్ శాఖకు వచ్చే ఆదాయంలో 20% (ట్రాన్స్‌ఫర్ డ్యూటీ) కింద స్థానిక సంస్థలకు జమవుతుంది. స్టాంపు డ్యూటీ ఛార్జీలో 1.5% స్థానిక సంస్థలకు జమ కావాలి. పంచాయతీల పరిధిలో ఖాళీ స్థలాలకు పన్ను చెల్లింపు విధానం లేకుండానే చేతులు మారుతున్నాయి. రిజిస్ట్రేషన్ జరిగే నాటికే ఆస్తి పన్ను చెల్లింపునకు తగ్గట్లు ఆయా స్థలాల యజమానుల పేర్లు నమోదైతే భవిష్యత్తులో ఇబ్బందులు తలెత్తవు.

ముడుపులిస్తేనే సరఫరా ఆర్డర్లు

(మొదటి పేజీ తరువాయి)

ఎస్ఎన్‌జే సంస్థకు మద్యం సరఫరా ఆర్డర్లు తగ్గిపోయాయి. పెండింగ్ బిల్లుల చెల్లింపులూ నిలిచిపోయాయి. దీంతో ఆ సంస్థ ప్రతినిధులు.. ఏపీఎస్‌బీసీఎల్ అప్పటి ఎండీ వాసుదేవరెడ్డిని కలవగా 'చాణక్య చెప్పినట్లు చేయండి. మిగతా కంపెనీల్లాగే మీరూ ముడుపులిస్తే ఆర్డర్లు వస్తాయి' అని చెప్పినట్లు సిట్ దర్యాప్తులో వెల్లడైంది.

ప్రభుత్వంలో పలుకుబడి ఉన్నోళ్లం: 'ఏపీఎస్‌బీసీఎల్ అప్పటి ఎండీ వాసుదేవరెడ్డితో భేటీ ముగిశాక.. ఎస్ఎన్‌జే సంస్థ సీఎండీ ఎస్ఎన్ జయమురుగన్‌కు రాజ్ కెసిరెడ్డి (ఏ-1), ఆయన అనుచరుడు బూనేటి చాణక్యలు రోజూ వాట్సప్, టెలిగ్రామ్, సిగ్నల్ సహా ఇతర యాప్స్ ద్వారా వేర్వేరు నంబర్ల నుంచి కాల్స్ చేసి ఏపీలో వ్యాపారం చేయాలంటే తాము చెప్పినట్లు ముడుపులివ్వాలని బెదిరించేవారు. 'ఏపీ ప్రభుత్వంలో మేం అత్యంత పలుకుబడి కలిగిన వ్యక్తులం. ఎంపీలు పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి, విజయసాయిరెడ్డిలకు సన్నిహితులం' అని చెప్పి ఒత్తిడి చేసేవారు. దీంతో తమ వ్యాపారం కోసం ఎస్ఎన్‌జే సంస్థ ముడుపుల చెల్లింపునకు అంగీకరించింది. తర్వాత నుంచి ఎస్ఎన్‌జేకు ఏపీఎస్‌బీసీఎల్ నుంచి భారీగా ఆర్డర్లు వచ్చాయి. ఏకంగా రూ.2,365.42 కోట్ల మేర మద్యం సరఫరా ఆర్డర్లు కట్టబెట్టి.. వారి నుంచి రూ.300 కోట్ల మేర ముడుపులు తీసుకున్నారని సిట్ గుర్తించింది. ఎస్ఎన్‌జే యాజమాన్యాన్ని బెదిరించి వారి అనుబంధ సంస్థ లీలా డిస్టిలరీస్‌ను రాజ్ కెసిరెడ్డి తన గుప్పిట్లో పెట్టుకున్నారని, దానికి ఏపీఎస్‌బీసీఎల్ నుంచి రూ.453 కోట్ల మేర ఆర్డర్లు లభించాయని, ఆ సొమ్మంతా కెసిరెడ్డికి చేరిందని సిట్ నిర్ధారించింది.

గ్రహం అనుగ్రహం

28–7–2025 సోమవారం

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం; దక్షిణాయనం; వర్ష రుతువు, శ్రావణ మాసం, శుక్లపక్షం
చవితి: రా. 11-52 తదుపరి పంచమి
పుబ్బ: రా. 7-04 తదుపరి ఉత్తర
వర్జ్యం: రా. 2-43 నుంచి 4-25 వరకు
అమృత ఘడియలు: మ. 12-23 నుంచి 2-03 వరకు
దుర్ముహూర్తం: మ. 12-31 నుంచి 1-22 వరకు తిరిగి 3-05 నుంచి 3-56 వరకు
రాహుకాలం: ఉ. 7-30 నుంచి 9-00 వరకు
సూర్యోదయం: ఉ.5.40; సూర్యాస్తమయం: సా.6.31
నాగ చతుర్థి, దూర్వా గణపతి వ్రతం

వాతావరణం

ప్రాంతం	గరిష్ఠ	కనిష్ఠ
నెల్లూరు	36.5	28.4
ఒంగోలు	35.5	27.2
రాజమహేంద్రవరం	35.5	25.0
విశాఖపట్నం	35.2	27.4
విజయవాడ	35.0	26.2
విజయనగరం	35.0	26.0
తిరుపతి	34.7	27.4
తాడేపల్లిగూడెం	34.7	26.2
శ్రీకాకుళం	34.0	28.0
గుంటూరు	34.0	27.0
కడప	34.0	26.0
కర్నూలు	33.2	24.7
ఖమ్మం	32.6	23.6
అనంతపురం	32.2	25.0
నరసాపురం	31.8	27.6
హైదరాబాద్	29.8	22.1
నిజామాబాద్	29.4	23.1
మహబూబ్‌నగర్	29.0	22.9

ఇదీ సంగతి!



ఎగుర్రా బుజ్జీ.. ఎవరొస్తారో చూస్తా!



ఎలా ఎగరాలమ్మా..!





ఏ జీవుల్లోనైనా సరే తల్లి ప్రేమకు సాటేదీ రాదు. ఈ పక్షులను చూస్తే అర్థం అవుతుంది. పిల్లలు నడక నేర్చుకునేటప్పుడు తల్లిదండ్రులు ఎన్ని జాగ్రత్తలు తీసుకుంటారో... తన బుజ్జి పిల్లపై కూడా అంతే శ్రద్ధ తీసుకుంటోంది... ఈ రెడ్ వెంటెడ్ బుల్‌బుల్ పక్షి. అప్పుడే గూడును విడిచిన చిట్టి పిచ్చుక అడుగులు వేయడం, రెక్కలు విప్పి ఎగిరేందుకు చేస్తున్న ప్రయత్నాల్ని తల్లి పక్షి దగ్గరుండి పర్యవేక్షించింది. అటుగా ఎవరైనా వస్తున్నారా.. అని చూస్తూ అనుమానం వచ్చినప్పుడు అరుస్తూ చిట్టి పక్షిని అప్రమత్తం చేసింది. మధ్య మధ్యలో చుట్టుపక్కల వెతికి పురుగులు, పండ్లు తెచ్చి కొసరికొసరి మరీ నోటికందించింది. ముచ్చట గొలిపే ఈ పక్షుల అనుబంధం విజయవాడ సమీపంలో కానూరు కల్పనానగర్‌లో కనిపించింది.

- ఈనాడు, అమరావతి



సర్వీస్ అపార్ట్‌మెంట్‌లో రేవ్ పార్టీ!

- తెలుగు రాష్ట్రాలకు చెందిన 9 మంది అరెస్టు



ఎస్టీఎఫ్ బృందం అదుపులో నిందితులు

శేరిలింగంపల్లి, న్యూస్‌టుడే: హైదరాబాద్ నగర శివార్లలో రేవ్ పార్టీని ఆబ్కారీ స్పెషల్ టాస్క్ ఫోర్స్(ఎస్టీఎఫ్) బృందం భగ్నం చేసింది. ఈ దాడిలో ఏపీ, తెలంగాణకు చెందిన 11 మందిపై కేసు నమోదు చేసి.. 9 మందిని పోలీసులు అరెస్ట్ చేశారు. పరారీలో ఉన్న మరో ఇద్దరి కోసం గాలిస్తున్నారు. శేరిలింగంపల్లి కొండాపూర్ ప్రాంతంలో కొందరు యువకులు సర్వీస్ అపార్ట్‌మెంట్‌ను అద్దెకు తీసుకున్నారు. తెలుగు రాష్ట్రాలకు చెందిన 11 మంది ఇక్కడికి చేరారు. శనివారం రాత్రి ఏర్పాటుచేసిన రేవ్‌పార్టీలో వీరంతా మత్తులో జోగుతున్నారు. సమాచారం అందుకున్న ఎస్టీఎఫ్ బృందం సర్వీస్ అపార్ట్‌మెంట్‌పై ఆకస్మిక దాడి చేసింది. అదే సమయంలో ఇద్దరు యువకులు అక్కడి నుంచి పరారయ్యారు. డ్రగ్స్ తీసుకొని మైకంలో ఉన్న 9 మందిని అదుపులోకి తీసుకొని వైద్యపరీక్షలు నిర్వహించారు. వీరంతా మాదకద్రవ్యాలు తీసుకున్నట్లు నిర్ధారణ కావడంతో కేసు నమోదు చేశారు. వీరివద్ద 2.80 కిలోల గంజాయి, 50 గ్రాముల ఓజీ కుష్ గంజా, 11.57 గ్రాముల మ్యాజిక్ మష్రూమ్, 1.91 గ్రాముల చరస్, ఎల్ఎస్డీ బ్లాట్స్, రెండుకార్లు, 2 ద్విచక్రవాహనాలు, 11 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. నిందితులు డార్క్‌నెట్ నుంచి డ్రగ్స్ కొనుగోలు చేసినట్లు గుర్తించారు. పట్టుబడిన నిందితుల్లో ప్రవీణ్‌కుమార్ డ్రగ్స్ కొనుగోలు చేస్తున్నాడని, రాహుల్, ఇమ్మాన్యుయేల్ వారాంతపు పార్టీలు ఏర్పాటు చేసి వాట్సప్ గ్రూప్ ద్వారా యువతను ఆకట్టుకుంటున్నట్టు నిర్ధారించారు. ప్రతి వారం వేర్వేరు ప్రాంతాల్లోని సర్వీస్ అపార్ట్‌మెంట్లు, ఫామ్‌హౌస్‌లను అద్దెకు తీసుకొని రేవ్ పార్టీలు ఏర్పాటు చేస్తున్నారు. శనివారం రేవ్‌పార్టీలో పాల్గొన్న వారిలో హైదరాబాద్, విజయవాడ, మంగళగిరి, కాకినాడలకు చెందిన రాహుల్, ఇమ్మాన్యుయేల్, అశోక్‌నాయుడు, సాయికృష్ణ, లీలా మణికంఠ, హిల్టన్ జోసఫ్ రోల్ఫ్, యశ్వంత్ శ్రీదత్త, కుమారస్వామి, సుమంత్ తేజలను అరెస్ట్ చేశారు. పార్టీలో పాల్గొన్న శ్రీనివాస్ చౌదరి, అఖిల్ పరారీలో ఉన్నారు.

జగన్మాత సేవలో హైకోర్టు సీజే దంపతులు



జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకుర్ దంపతులకు అమ్మవారి చిత్రపటం అందజేస్తున్న ఈవో శీనానాయక్

విజయవాడ (ఇంద్రకీలాద్రి), న్యూస్‌టుడే: విజయవాడ ఇంద్రకీలాద్రిపై కొలువైన జగన్మాత దుర్గమ్మను హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకుర్ దంపతులు ఆదివారం దర్శించుకున్నారు. అంతకుముందు వారికి ఆలయ అధికారులు, వేదపండితులు పూర్ణకుంభ స్వాగతం పలికారు. అమ్మవారికి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకుర్ దంపతులు ప్రత్యేక పూజలు చేయించారు. దర్శన అనంతరం వేదపండితులు ఆశీర్వచనం, ఆలయ ఈవో శీనానాయక్ అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలు అందజేశారు.

సరోగసీ ముసుగులో శిశు విక్రయాలు

(మొదటి పేజీ తరువాయి)

సంప్రదించారు. వైద్యపరీక్షలు నిర్వహించి ఐవీఎఫ్ వీలుపడదని, సరోగసీ ద్వారా బిడ్డను కనే అవకాశం ఉందని, రూ.30 లక్షలు ఖర్చవుతుందని ఆమె చెప్పారు. బిడ్డ పుట్టిన తర్వాత డీఎన్ఏ పరీక్ష చేయాలని ఒప్పందం కుదుర్చుకున్నారు. గతేడాది సెప్టెంబరులో ఆ దంపతులను విశాఖపట్నానికి పంపి అండాలు, వీర్యకణాలు సేకరించారు. ఈ ఏడాది జూన్‌లో సరోగసీ ద్వారా మగబిడ్డ పుట్టాడంటూ ఆ దంపతులను వైజాగ్ తీసుకెళ్లి శిశువును అప్పగించారు. పిల్లాడి రూపురేఖలు భిన్నంగా ఉండటంతో తల్లి అనుమానించి డీఎన్ఏ పరీక్ష చేయాలని డిమాండ్ చేసింది. బిడ్డను కన్న తల్లి ద్వారా మీపై కేసు పెడతామంటూ డాక్టర్ నమ్రత వారిని బెదిరించింది. వారు దిల్లీలోని ప్రైవేటు ల్యాబ్‌లో పరీక్ష చేయించగా పిల్లాడి డీఎన్ఏ.. దంపతులతో సరిపోలకపోవటంతో నమ్రతను సంప్రదించారు. ప్రతికూల స్పందన రావటంతో బాధితురాలు గోపాలపురం పోలీసులకు ఫిర్యాదు చేయగా వారు వైద్యశాఖతో కలిసి దర్యాప్తు చేపట్టి కీలక విషయాలు గుర్తించారు. అస్సాంలోని మహ్మద్ అలీ అదిక్(38), నస్రీన్‌బేగం(25) దంపతులకు పుట్టబోయే బిడ్డను తమకు విక్రయించాలని డాక్టర్ నమ్రత ముందుగానే వారితో ఒప్పందం కుదుర్చుకున్నారు. వారికి పుట్టిన మగబిడ్డను రూ.90 వేలకు కొనుగోలు చేసి రాజస్థాన్ దంపతులకు అప్పగించారు. ఇందుకోసం దంపతుల నుంచి రూ.35 లక్షలు వసూలు



డాక్టర్ నమ్రత



అరెస్టయిన ఇతర నిందితులు

చేశారు. విజయవాడ, విశాఖ, హైదరాబాద్‌ల్లోని ఫెర్టిలిటీ కేంద్రాల్లో తనిఖీలు చేపట్టిన పోలీసులు, వైద్యాధికారులు.. అనుమతి లేకుండా సేకరించిన వీర్యకణాలు, అండాలు, రికార్డులను స్వాధీనం చేసుకున్నారు. విశాఖలోని సృష్టి ఫెర్టిలిటీ సెంటర్ మేనేజర్ కల్యాణి కీలకంగా వ్యవహరిస్తున్నట్టు గుర్తించారు.

దళారుల నుంచి కొనుగోలు చేసి..

విజయవాడకు చెందిన నమ్రత 1998లో సంతాన సాఫల్య కేంద్రాలను ప్రారంభించారు. విజయవాడ, సికింద్రాబాద్, విశాఖ, కొండాపూర్, కోల్‌కతా, ఒడిశాల్లో బ్రాంచీలు ఏర్పాటు చేశారు. తమను సంప్రదించిన ఒక్కొక్కరి నుంచి రూ.30-40 లక్షలు వసూలు చేసేవారు. దళారుల నుంచి శిశువులను కొనుగోలు చేసి సరోగసీ ద్వారా పుట్టినట్టు దంపతులకు అప్పగించేవారు. తెలుగు రాష్ట్రాల్లో సృష్టి ఫెర్టిలిటీ అక్రమాలపై 10 కేసులు నమోదయ్యాయి. రెజిమెంటల్‌బజార్‌లోని కేంద్రంలో చేపట్టిన తనిఖీల్లో అక్రమంగా సరోగసీ చేపడుతున్నట్టు ఆధారాలు లభించాయని డీఎంహెచ్‌వో డాక్టర్ వెంకటి తెలిపారు. ఆసుపత్రిపై పలు కేసులు నమోదవటంతో 2021లోనే రిజిస్ట్రేషన్ రద్దయిందన్నారు. నాలుగంతస్తుల అపార్ట్‌మెంట్‌ను నివాసంగా చెబుతూ ఫెర్టిలిటీ కేంద్రం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. గతంలో తనిఖీలకు వెళ్లినప్పుడు మూసేశారన్నారు. ఇక్కడ ఆపరేషన్ థియేటర్, అనస్థీషియా ఇచ్చేందుకు ఏర్పాట్లు చేశారని వివరించారు. నష్టపోయిన బాధితులు ప్రశ్నించేందుకు వెళ్తే న్యాయవాదిగా పనిచేస్తున్న ఆమె కుమారుడు జయంత్ కృష్ణ వారిని బెదిరిస్తున్నట్టు గుర్తించారు. డాక్టర్ నమ్రతను పోలీసులు విజయవాడలో అదుపులోకి తీసుకున్న సమయంలో పక్కనే ఉన్న తన బిడ్డల్ని ఉద్దేశించి డబ్బు.. డబ్బంటూ వెంటపడితే ఫలితం ఇలానే ఉంటుందంటూ ఆవేదన వ్యక్తం చేసినట్టు సమాచారం.

◆ 'సృష్టి ఫెర్టిలిటీ సెంటర్'పై లోతుగా విచారణ చేసి బాధ్యులపై కఠినచర్యలు తీసుకోవాలని తెలంగాణ వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ అధికారులను ఆదేశించారు.

అనకాపల్లిలో సోలార్ ప్యానళ్ల తయారీ యూనిట్‌కు అనుమతి

ఈనాడు, అమరావతి: అనకాపల్లిలో జిల్లా రాంబిల్లిలో 6 గిగావాట్ల సోలార్ ప్యానళ్ల తయారీ యూనిట్ ఏర్పాటుకు ఆర్‌ఈ న్యూ సంస్థకు అనుమతిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ ప్రాజెక్టు ద్వారా రూ.3,700 కోట్ల పెట్టుబడులు.. 1,200 మందికి ఉపాధి లభిస్తుందని ఆ సంస్థ ప్రతిపాదనల్లో పేర్కొంది. ఆ సంస్థకు 135.96 ఎకరాలు కేటాయించేందుకు అనుమతించింది. ఎస్ఐపీబీలో అనుమతించిన మేరకు ప్రత్యేక ప్రోత్సాహకాల కింద స్థిర మూలధన పెట్టుబడిపై 30 శాతం (గరిష్ఠంగా రూ.840 కోట్లు) పదేళ్లలో చెల్లించనున్నట్లు పేర్కొంది.

జేఎస్‌డబ్ల్యూ ఉక్కు పరిశ్రమకు అనుమతి

వైఎస్సార్ కడప జిల్లాలో జేఎస్‌డబ్ల్యూ రాయలసీమ స్టీల్ ప్లాంట్ ఏర్పాటుకు అనుమతిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఆ సంస్థ మొదటి దశలో ఏడాదికి ఒక మిలియన్ టన్నుల స్టీల్‌ను ఉత్పత్తి చేస్తుందని పేర్కొంది. ఈ ప్రాజెక్టు ద్వారా రూ.4,500 కోట్ల పెట్టుబడులు పెట్టేందుకు, వెయ్యి మందికి ఉపాధి కల్పించేందుకు సంస్థ అంగీకరించింది. ఆ సంస్థకు 1,100 ఎకరాలను.. ఎకరానికి రూ.5 లక్షల ధరకు.. టౌన్‌షిప్ అభివృద్ధికి మరో 200 ఎకరాలను మార్కెట్ ధర ప్రకారం కేటాయించేందుకు అనుమతించింది.

◆ నాయుడుపేట ఇండస్ట్రియల్ పార్కులో గ్రీన్ లామ్ లిమిటెడ్ విస్తరణ ప్రాజెక్టుకు అనుమతిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఆ సంస్థ రూ1,147.05 కోట్ల పెట్టుబడితో 1,475 మందికి ఉపాధి కల్పించనున్నట్లు ప్రతిపాదించింది.

యాక్సెలెంట్ ఫార్మాకు ప్రోత్సాహకాలు: తిరుపతిలోని శ్రీసిటీలో యాక్సెలెంట్ ఫార్మా సైన్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ ఏర్పాటు చేయనున్న ఫార్మాస్యూటికల్స్ తయారీ ఫెసిలిటీకి రాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సాహకాలను ఖరారు చేసింది. ఈ సంస్థ 1,358 కోట్లు పెట్టుబడి పెట్టి, 1,770 మందికి ఉపాధి కల్పించనుంది. ప్రోత్సాహకాల కోసం ప్రత్యేక ప్యాకేజీని ప్రకటిస్తూ పరిశ్రమల శాఖ కార్యదర్శి ఎన్.యువరాజ్ ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు.

విశాఖ మెడ్‌టెక్ జోన్ సామర్థ్యాలు ప్రశంసనీయం

- కేంద్ర మంత్రి గడ్కరీ
- నాగ్‌పుర్‌లోని డయాగ్నోస్టిక్ కేంద్రానికి ఇక్కడి పరికరాలు



మహారాష్ట్ర సీఎం ఫడణవీస్, కేంద్ర మంత్రి గడ్కరీకి ఎంఆర్ఐ యంత్రం పనితీరు గురించి వివరిస్తున్న మెడ్‌టెక్ జోన్ సీఈవో డాక్టర్ జితేంద్రశర్మ

పరవాడ, న్యూస్‌టుడే: దేశీయంగా వ్యాధి నిర్ధారణ పరికరాలు తయారు చేస్తున్న విశాఖలోని ఏపీ మెడ్‌టెక్ జోన్ సామర్థ్యాలు ప్రశంసనీయమని కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ పేర్కొన్నారు. మహారాష్ట్రలోని నాగ్‌పుర్‌లో ఏర్పాటు చేసిన భానుతాయి గడ్కరీ స్మారక డయాగ్నోస్టిక్ సెంటర్‌ను ఆదివారం ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. విశాఖలోని ఏపీ మెడ్‌టెక్ జోన్‌లో తయారు చేసిన వ్యాధి నిర్ధారణ పరికరాలు ఈ డయాగ్నోస్టిక్ సెంటర్‌లో ఏర్పాటు చేయడం గర్వించదగ్గ విషయమన్నారు. మెడ్‌టెక్ జోన్ సహకారంతో ప్రజలకు ఆరోగ్య సేవలు అందించడంతో పాటు దేశీయ ఉత్పత్తులను ప్రోత్సహించడంలో ముందుంటామని చెప్పారు. మెడ్‌టెక్ జోన్ సీఈవో జితేంద్ర శర్మ మాట్లాడుతూ ప్రపంచస్థాయి వైద్య పరికరాల తయారీలో భారత్ ముందు వరుసలో ఉందని మెడ్‌టెక్ జోన్ నిరూపిస్తోందని తెలిపారు. దేశీయ తయారీ వైద్య పరికరాల వల్ల ప్రజలకు చౌకగా ఆరోగ్య పరిరక్షణ సేవలు అందుతున్నాయని వెల్లడించారు. ఈ సమావేశంలో పాల్గొన్న మహారాష్ట్ర సీఎం ఫడణవీస్ మెడ్‌టెక్ జోన్ సేవలను కొనియాడారు.

అడవిలో రూ.35 లక్షల నగదు

చాయిబాసా: ఝార్ఖండ్‌లోని ఓ అటవీ ప్రాంతంలో భద్రతా సిబ్బంది భారీగా నగదు గుర్తించారు. సింగ్‌భమ్ జిల్లాలోని నక్సల్ ప్రభావిత కారైకేలా ప్రాంతంలో బంకర్‌లాంటి ఓ నిర్మాణంలో రూ.35లక్షలు గుర్తించినట్లు పోలీసులు వెల్లడించారు. సీఆర్‌పీఎఫ్, ఝార్ఖండ్ జాగ్వార్, జిల్లా సాయుధ పోలీసులు సారండా అటవీ ప్రాంతంలో భారీ ఆపరేషన్ చేపట్టగా.. బంకర్‌లాంటి నిర్మాణాన్ని గుర్తించారు. అనంతరం దాన్ని తవ్వి చూడగా డబ్బాల్లో రూ.34.99 లక్షల నగదు ఉందని ఎస్పీ రాకేశ్ రంజన్ తెలిపారు.





కావడి యాత్రలో పాల్గొన్న మార్వాడీలు

విశ్వశాంతి కోసం విశాఖలో కావడి యాత్ర

విశాఖపట్నం (మాధవధార), న్యూస్‌టుడే: విశ్వశాంతి కోసం మార్వాడీ యువ మంచ్ ఆధ్వర్యంలో ఆదివారం విశాఖలో మార్వాడీలు కావడి యాత్ర ఘనంగా నిర్వహించారు. తెల్లవారుజామున 5 గంటలకు నగరంలో ఉన్న సుమారు రెండు వేల మంది మార్వాడీలు తమ కుటుంబ సభ్యులతో మాధవధారలోని శివాలయం వద్దకు చేరుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అక్కడ నిరంతరం ప్రవహించే పవిత్ర జలధారలోని నీటిని మట్టి కుండల్లో పట్టుకుని కావడి యాత్ర ప్రారంభించారు. బీచ్ రోడ్డులోని జగన్నాథ స్వామి ఆలయానికి చేరుకొని స్వామివారికి అభిషేకం నిర్వహించి, యాత్రను ముగించారు. ఏటా శ్రావణ మాసం మొదటి ఆదివారం ఈ యాత్ర చేస్తామని నిర్వాహకులు తెలిపారు.



ప్రతి విషయంలో అసాధారణంగా ఉండనక్కర్లేదు!

జీవితంలో విజయం సాధించాలంటే ప్రతి విషయంలోనూ అసాధారణంగా ఉండాల్సిన అవసరం లేదు! చాలా విషయాల్లో సాధారణంగానే ఉన్నా.. ఏదైనా ఒక అంశంలో అసాధారణంగా ఎదగాలి. అదే సమయంలో- మీరు చేసే పనుల్లో నిలకడ ఉండాలి.

- జస్టిన్ వెల్ష్, రచయిత



కాలిన కరెన్సీ.. ఇక్కడ చలా'మనీ'!

- చిరిగిన నోట్లను మార్పిడిచేసే ఆసుపత్రులు

ఈనాడు, అమరావతి: మనుషులకు, పశువులకు వైద్యం అందించే ఆసుపత్రులున్నట్లుగానే.. చిరిగిపోయిన, కాలిపోయిన కరెన్సీ నోట్లకు కూడా ఆసుపత్రులున్నాయి. అవెక్కడని అనుకుంటున్నారా? గుంటూరులోని జిన్నా టవర్ ప్రాంతంలో! 1970లో మొదలై, 50 ఏళ్లుగా 'నోట్ల ఆసుపత్రి' పేరుతో ప్రసిద్ధి చెందింది ఈ వ్యాపారం. ఇళ్లలో చిరిగిన, కొంతవరకు కాలిపోయిన కరెన్సీ నోట్లను బ్యాంకు వెళ్లి తర్జుమా చేసుకుంటాం. అలానే ఇక్కడి నోట్ల ఆసుపత్రుల్లో మనమిచ్చే కరెన్సీ నోట్లను అవి పాడైన తీరును బట్టి మదింపు వేస్తారు. ఉదాహరణకు చిరిగిన రూ.500 నోటు ఇస్తే.. అది పాడైన తీరును చూసి రూ.200-రూ.350 వరకు విలువ కట్టి మంచి నోట్లు ఇస్తారు. సేకరించిన చిరిగిన, కాలిన నోట్లను గతంలో ఆర్‌బీఐ శాఖల్లో మార్పిడి చేసి నోట్ల ఆసుపత్రుల నిర్వాహకులు కమీషన్ పొందేవారు. ప్రస్తుతం హైదరాబాద్‌లోని బ్యాంకుల చెస్ట్‌లో మార్పిడి చేస్తున్నట్లు తెలిపారు. విజయవాడ, తెనాలి, రాజమహేంద్రవరం తదితర చోట్ల వీరికి శాఖలు ఉన్నాయి. ఈ సేవలు తమకు ఉపయుక్తంగా ఉన్నాయని ఇక్కడికి వచ్చే సందర్శకులు వివరించారు. రెండేళ్లుగా పోగు చేసిన చిరిగిన నోట్లు రూ.10, రూ.50, రూ.500.. కలిపి మొత్తంగా రూ.970 విలువైన నోట్లు ఇవ్వగా, రూ.750 చెల్లుబాటు అయ్యే నోట్లు తిరిగి ఇచ్చినట్లు పల్నాడు జిల్లా గణపవరం నుంచి వచ్చిన భరత్ తెలిపారు.



జిన్నా టవర్ సమీపంలో కరెన్సీ నోట్ల ఆసుపత్రి దుకాణాలు ◆దుకాణాల ముందు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు ◆నోట్ల ఆసుపత్రిలో చిరిగిన, కాలిన కరెన్సీ నోట్ల మార్పిడి

భావితరాలకోసం 'సుప్రీం' చొరవ!

ఆత్మహత్యలకు పాల్పడుతున్న యువత సంఖ్య నానాటికీ పెరిగిపోతుండటాన్ని తీవ్ర సామాజిక సమస్యగా సుప్రీంకోర్టు నిరుడు అభివర్ణించింది. ఆ విపత్తును నివారించేందుకు జాతీయ టాస్క్‌ఫోర్స్‌ను నియమించాలని మొన్న మార్చిలో ఆదేశించింది. విద్యార్థుల మానసిక ఆరోగ్యాన్ని హరిస్తున్న అంశాలను గుర్తించి, తగిన పరిష్కారాలతో ఎనిమిది నెలల్లోగా నివేదికను అందించడం ఆ కార్యదళం ఏర్పాటు వెనక లక్ష్యం. బండ చదువుల ఒత్తిడిలో అవిసిపోతున్న నవతరాన్ని కాపాడుకునేందుకు కీలక మార్గదర్శకాలను వెలువరించిన 'సుప్రీం' తాజా చొరవ సంస్తుతిపాత్రమైనది. భావిభారత ప్రగతిరథ సారథుల్లో విపరీత నిర్ణయాలను నివారించాలంటే న్యాయపాలిక సూచించినట్లు, అన్ని విద్యాలయాల్లో నిపుణ కౌన్సిలర్లు, సైకాలజిస్టులను నియమించాలి. ప్రతిభ ఆధారంగా విద్యార్థులను విభజిస్తూ, వెనకబడిన వారిని ఛీత్కరించే పోకడలను మానుకోవాలి. పిల్లలను రోజంతా పుస్తకాలతోనే కుస్తీ పట్టించకుండా కళలూ క్రీడల్లోనూ ప్రోత్సహించాలి. బలవన్మరణాలను నిరోధించే హెల్ప్‌లైన్ నంబర్లను అన్నిచోట్లా ప్రదర్శించాలి. విద్యాప్రాంగణాలను మత్తుమందుల నుంచి విముక్తం చేయాలి. న్యాయపాలిక మార్గదర్శకాలు పక్కాగా అమలయ్యేలా చూడాల్సిన బాధ్యత రాష్ట్రాలదే!

పిల్లల్లో తార్కిక జ్ఞానాన్ని పెంచి విజ్ఞాన గనులుగా తీర్చిదిద్దడం, వారికి మేలిమి నైపుణ్యాలు మప్పి జీవిత లక్ష్యాన్ని నిర్దేశించుకునే తెలివిడిని, ఒడుదొడుకులను తట్టుకునే దృఢచిత్తాన్ని అలవర్చడం చదువుల ప్రథమోద్దేశం. దురదృష్టవశాత్తు ఇండియాలో అందుకు భిన్నమైన దృశ్యాలు కనపడుతుంటాయి. విద్యా ప్రాంగణాల్లో కుల, లింగ వివక్షలు బుసలుకొడుతున్నాయి. చాలా హాస్టళ్లలో అమానవీయ పరిస్థితులు రాజ్యమేలుతున్నాయి. వీటికి తోడు విద్యార్థుల వ్యక్తిగత సామర్థ్యాలు, ఇష్టాయిష్టాలతో నిమిత్తం లేని నేటి చదువులకు మార్కులూ ర్యాంకులే గమ్యాలవుతున్నాయి. కాలంచెల్లిన పాఠ్యప్రణాళికలు, బట్టీ చదువుల ఉన్మాద రేసులో రాణించలేక, తల్లిదండ్రుల ఆశల భారాలను మోయలేక ఎందరో పిల్లలు నిరాశానిస్పృహల్లో కూరుకుపోతున్నారు. ఆ కుంగుబాటులో ఆత్మహత్యలకు ఒడిగడుతున్నారు. అలా గడిచిన పదేళ్లలో ఆసేతుహిమాచలం లక్ష మందికి పైగా కడతేరిపోయారు. రైతులతో పోలిస్తే విద్యార్థుల బలవన్మరణాలే ఎక్కువగా ఉంటున్నా ఎవరికీ పట్టడంలేదంటూ పార్లమెంటరీ స్థాయీ సంఘమూ ఆవేదన వ్యక్తం చేసింది. నవతరం ఇలా బలైపోతుంటే- సంబంధిత కుటుంబాలకే కాదు, యావద్దేశానికీ తీవ్ర నష్టం వాటిల్లుతుంది.

ఇండియాలోని ముప్పై వర్సిటీల్లో గతంలో చేపట్టిన ఒక సర్వే దిగ్భ్రాంతికర విషయాలను వెలుగులోకి తెచ్చింది. ప్రతి పది మంది విద్యార్థుల్లో ఒకరికి అంతకు ముందు ఆత్మహత్య ఆలోచన వచ్చినట్లు అందులో వెల్లడైంది. ఐసీ3 అనే మరో స్వచ్ఛంద సంస్థ అధ్యయనం మేరకు దేశీయంగా రెండు దశాబ్దాల్లో మొత్తం ఆత్మహత్యల రేటు ఏటా రెండుశాతం పెరిగితే, విద్యార్థుల విషయంలో అది అంతకు రెండురెట్లు అధికంగా నమోదైంది. మన విద్యావ్యవస్థలో వేళ్లూనుకున్న అశాస్త్రీయ విధానాలు భావితరంలో జీవితేచ్ఛను ఎలా చంపేస్తున్నాయన్నదానికి ఈ గణాంకాలే అద్దంపడుతున్నాయి. ఏ దేశానికైనా పిల్లలే విలువైన సంపద. రాబోయే రోజుల్లో వారి నుంచే నాయకులు, వ్యాపారవేత్తలు, విభిన్న రంగాల నిపుణులు రూపుదిద్దుకొని దేశ పురోగతికి చోదక శక్తులుగా నిలుస్తారు. ఇష్టంలేని చదువులు రేపటి పౌరుల ఆత్మవిశ్వాసాన్ని హరించి, వారి బతుకులను నిస్సారంగా మారుస్తాయి. తల్లిదండ్రులు ఈ విషయాన్ని అర్థం చేసుకోవాలి. నచ్చిన రంగాలను ఎంచుకునే స్వేచ్ఛను తమ పిల్లలకివ్వాలి. కేవలం జ్ఞాపకశక్తిని కాకుండా, విద్యార్థుల నైపుణ్యాలను సమగ్రంగా మదింపు వేసేలా మూల్యాంకన విధానాల్లోనూ మార్పులు రావాలి!



మనలో చాలామందికి హద్దుల గురించి తెలియదు.
ఏ విషయాన్ని అయినా ఎంత వరకు భరించాలి,
ఎక్కడ ఎదురుతిరగాలి అన్న విషయం ఆలోచించరు.
ఓపిక పట్టడంలో తప్పులేదు కానీ,
ఆత్మగౌరవాన్ని పణంగా పెట్టకూడదు.

– సి.కె.మీనా, రచయిత్రి

ప్రకృతి దేవత

ప్రకృతి పులకింపజేస్తుంది, మైమరపింపజేస్తుంది. రుతుగీతాలతో, వసంత సోయగాలతో కనులకూ, వీనులకూ విందును కలిగించి అలరిస్తుంది. రవీంద్రనాథ్ ఠాగూర్ అన్నట్లు 'అందమైన ప్రకృతి జనజీవనానికి వరం'. మన పాంచభౌతిక శరీరం ప్రకృతిలో భాగమే. అందుకే వేదాలు, ఉపనిషత్తులు, పురాణాలు, ఆయుర్వేదం, ఇతర భారతీయ శాస్త్రాలు అన్నీ ప్రకృతికి అపార ప్రాధాన్యమిచ్చాయి. ప్రపంచవ్యాప్తంగా కూడా ప్రకృతిని ఆరాధించే సంప్రదాయం ఇప్పటికీ ఉంది.

ప్రకృతిని కేవలం వనరుల సమాహారంగా కాక దైవిక శక్తిగా భావించేవారు పూర్వీకులు. అందుకే వేదాలలో ప్రకృతిని అనేక రూపాల్లో దేవతగా అభివర్ణించారు. అగ్ని, వాయువు, సూర్యుడు, వరుణుడు, భూదేవి- వీరందరూ మానవాళికి జీవనాధారమైన ప్రకృతి మూలమైన దేవతలే. చెట్లు, నీటివనరులు, ఖనిజాలు- ఇవన్నీ భూమాత ఒడిలోని సంపదలే. ప్రకృతి ద్వారానే పరమాత్మను దర్శించగలమని శివపురాణం చెబుతుంది. మార్కండేయ పురాణం శక్తిని ప్రకృతిగా పేర్కొంది. ఆయుర్వేదం ప్రకృతి ఆధారిత వైద్యం. త్రిదోష సిద్ధాంతాలైన వాత, పిత్త, కఫ- ప్రకృతి సమతుల్యతపై ఆధారపడి ఉంటాయి. భారతీయ రుషులు ప్రకృతిని శరీరంలాగా, భూమిని తల్లిలాగా, గాలి-నీటిని ప్రాణాలతో సమానంగా భావించారు. ప్రకృతిని నిశితంగా పరిశీలించడం ద్వారానే విజ్ఞానశాస్త్ర అభివృద్ధిని సాధించగలిగాం. ప్రకృతిని కాపాడటం అంటే మన ధర్మాన్ని నిలబెట్టుకోవడమే.



అంతర్యామి

కృతయుగంలో ధర్మపుర గ్రామంలో సుమతి అనే పేద రైతు ఉండేవాడు. అతడు దైవభక్తి, ప్రకృతిపట్ల అమితమైన ప్రేమ కలవాడు. ప్రతి చెట్టును, మొక్కను తన కుటుంబ సభ్యుల్లా ప్రేమగా చూసుకునేవాడు. ఒకరోజు పొలంలో పనిచేస్తుండగా దివ్యమైన వెలుగుతో వనదేవత ప్రత్యక్షమైంది. 'నువ్వు ప్రకృతి పట్ల చూపిస్తున్న నిస్వార్థ ప్రేమ నన్ను ఎంతగానో సంతోషపరిచింది' అని రైతుతో అంది. సుమతి ఆనందంతో, 'నా తోటి రైతులు కూడా సుఖంగా ఉండాలి. భూమి తల్లికి ఎలాంటి కష్టం రాకూడదు' అని వేడుకున్నాడు. వనదేవత రైతు నిస్వార్థానికి ముగ్ధురాలైంది. 'నీ కోరిక నెరవేరుతుంది. ఈ సంవత్సరం నుంచి నీ పొలంలోనే కాదు, ఈ ప్రాంతమంతటా పంటలు సమృద్ధిగా పండుతాయి. అయితే, ఒక షరతు. ప్రతి ఒక్కరూ భూమిని, ప్రకృతిని తమ తల్లిలా భావించాలి. అప్పుడే ఈ సంపద శాశ్వతంగా ఉంటుంది' అని చెప్పింది. వనదేవత వరంతో గ్రామం సుభిక్షంగా మారింది. గ్రామదేవతల పూజలన్నీ ప్రకృతి ఒడిలోనే జరగడం కనిపించే దైవాన్ని ఆరాధించడంలో భాగమే.

వాతావరణ మార్పుల నేపథ్యంలో పర్యావరణ పరిరక్షణ గురించి ఇప్పుడు మాట్లాడుతున్నారు కానీ, మన పురాణాలు వేల సంవత్సరాల క్రితమే ఈ సత్యాన్ని బోధించాయి. ప్రకృతిని మనం ఎంత జాగ్రత్తగా చూసుకుంటే, మనకు అది అంతకు మించిన ప్రతిఫలాన్ని ఇస్తుంది.

– కె.శ్రీధర్

జాతీయ భద్రతకు పౌర సైనికులు

అంతర్జాతీయంగా ఆర్థిక పోటీ తీవ్రమవుతోంది. యుద్ధాలు ప్రత్యక్షంగా, పరోక్షంగా జరుగుతున్నాయి. సైబర్ నేరగాళ్లతో, గూఢచారులతో ప్రభుత్వ విభాగాలకే కాక పౌరులకూ ప్రమాదం వాటిల్లుతోంది. ఈ నేపథ్యంలో పౌరులు, సైనికులు కలిసి విదేశీ ముప్పులను సమైక్యంగా ఎదుర్కోవాల్సి వస్తోంది. ఆ మేరకు జాతీయ భద్రతకు సంబంధించిన అంశాల్లో నవతరానికి తగిన శిక్షణ అందించాల్సిన సమయమొచ్చింది!

జాతీయ భద్రత అనేది ఒకప్పుడు విద్యాసంస్థల పాఠ్య ప్రణాళికల్లో ప్రత్యేక బోధనాంశంగా కాకుండా రాజనీతి శాస్త్రంలో ఒక భాగంగా ఉండేది. రెండో ప్రపంచ యుద్ధం అంతర్జాతీయ భద్రతా పరిస్థితులను సమూలంగా మార్చేయడంతో దీన్ని విడిగా పాఠ్యాంశంగా చేర్చారు. భారతదేశంలో మొదటిసారి 1940లో అలహాబాద్ విశ్వవిద్యాలయంలో రక్షణ, భద్రతా వ్యవహారాల అధ్యయన విభాగాన్ని ఏర్పాటుచేశారు. బ్రిటన్‌లో యుద్ధ అధ్యయన విభాగం, అమెరికాలో భద్రతా వ్యవహారాల విభాగం ఆ రోజుల్లోనే ఏర్పడ్డాయి. ఏ పేరుతో పిలిచినా ఆ విభాగాలు యుద్ధం, భౌగోళిక-రాజకీయ వ్యవహారాలు, మానవులపై అవి చూపే ప్రభావం, వాటికి మనిషి స్పందించే తీరు గురించి అధ్యయనానికి ఉపకరిస్తాయి. జాతీయ భద్రత, ప్రజల భద్రత ఒకే నాణేనికి బొమ్మాబొరుసు లాంటివి. స్వదేశంలో, ఇతర దేశాలతో వ్యాపార, ఆర్థిక సంబంధాలు నిరాటంకంగా కొనసాగే వాతావరణం జాతీయ, పౌర భద్రతకు కీలకం.



అయిదు రంగాలకు రక్షణ ఛత్రం

ప్రస్తుతం ప్రపంచం మళ్లీ సంఘర్షణలను చవిచూస్తోంది. హమాస్-ఇజ్రాయెల్ యుద్ధం, రష్యా-ఉక్రెయిన్ సమరం ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ దాడి, ఇటీవల పాకిస్థాన్ ఉగ్రదాడికి ప్రతిగా భారత్ చేపట్టిన ఆపరేషన్ సిందూర్‌ల గురించి ఇక్కడ ప్రస్తావించాలి. ముదిరిన భౌగోళిక-రాజకీయ ఉద్రిక్తతల నడుమ జాతీయ భద్రత ఎనలేని ప్రాధాన్యం సంతరించుకుంటోంది. అందులో మొదట సరిహద్దుల భద్రత గురించి మనం చర్చించుకోవాలి. భారతదేశానికి పాకిస్థాన్, అఫ్గానిస్థాన్, చైనా, బంగ్లాదేశ్, నేపాల్, భూటాన్, మయన్మార్‌లతో 15వేల కిలోమీటర్ల పొడవైన భూసరిహద్దులు, శ్రీలంకతో జల సరిహద్దు ఉంది. సుదీర్ఘ సముద్ర తీరంలో గుజరాత్, మహారాష్ట్ర, గోవా, కర్ణాటక, కేరళ, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, ఒడిశా, పశ్చిమ్ బెంగాల్ రాష్ట్రాలు నెలకొని ఉన్నాయి. అండమాన్, నికోబార్ దీవులు, పుదుచ్చేరి, డామన్ డయ్యూ, లక్ష దీవులు కూడా మన సముద్ర తీరంలో భాగమే. ఈ సువిశాల తీర ప్రాంతాన్ని రక్షించుకోవడం జాతీయ భద్రతకు ప్రాణావసరం. దీనికి తోడు పారిశ్రామికోత్పత్తి-సేవల రంగం, సైబర్ సీమ, అంతరిక్ష రంగం, రాజకీయ-సాంస్కృతిక రంగాల్లో మన ప్రయోజనాలనూ కాపాడుకోవాలి. ఈ అయిదు సీమలను పంచభూతాలుగా వ్యవహరించవచ్చు. దేశ సుస్థిరాభివృద్ధికోసం వీటిని సంరక్షించుకోవాల్సిన అవసరాన్ని యువతకు తెలియజేయాలి.

దేశ రక్షణకు అవసరమైన నిపుణులను తీర్చిదిద్దుకోవడానికి తగిన కొత్త కోర్సులను వీలైనంత త్వరగా అందుబాటులోకి తీసుకురావాలి. అండర్ గ్రాడ్యుయేట్, పోస్ట్ గ్రాడ్యుయేట్ స్థాయుల్లో జాతీయ భద్రతను బోధనాంశంగా చేయాలి. 'స్వయం' (స్టడీ వెబ్స్ ఆఫ్ యాక్టివ్ ఫర్ యంగ్ యాస్పైరింగ్ మైండ్స్) మాసివ్ ఓపెన్ ఆన్‌లైన్ కోర్స్ (మూక్) ద్వారా జాతీయ భద్రతపై ఉచిత ఆన్‌లైన్ కోర్సు అందించడం దీనికి తొలిమెట్టు అవుతుంది. త్రివిధ సాయుధ బలగాలు, పోలీసు, సరిహద్దు భద్రతా దళం (బీఎస్ఎఫ్), తీరరక్షక దళం (కోస్ట్‌గార్డ్) సంప్రదాయ భద్రతా విభాగాల కిందకి వస్తాయి. వాతావరణ, పర్యావరణ, ఆహార, ఆరోగ్య, ఇంధన, జలవనరుల భద్రతను సంప్రదాయేతర భద్రతా రంగాలుగా పరిగణిస్తారు. జాతీయ భద్రతా కోర్సులో సంప్రదాయ, సంప్రదాయేతర భద్రతా రంగాల గురించీ పాఠ్యాంశాలు ఉండాలి. భారత చరిత్ర, తత్వ, రాజనీతి శాస్త్రాలు, అంతర్జాతీయ సంబంధాలు, భౌగోళిక- రాజకీయాలు, సైన్స్-టెక్నాలజీ, ఇంజినీరింగ్, మేనేజ్‌మెంట్, వైద్యం తదితరాల్లోని ముఖ్యాంశాలతో కూడిన బహుముఖ బోధనాంశంగా జాతీయ భద్రతను తీర్చిదిద్దాలి. వీటికి కృత్రిమ మేధ, సైబర్ భద్రత, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్, బిగ్‌డేటా, మెటావర్స్, 5జీ, 6జీ కమ్యూనికేషన్ సాంకేతికతలు, క్వాంటమ్ కంప్యూటింగ్ అంశాలనూ జోడించాలి. మన సరిహద్దు వివాదాల పూర్వాపరాలను, ప్రాచీనకాలం నుంచి ఆధునిక కాలం వరకు మన యుద్ధ వ్యూహ ధురంధరుల ఆలోచనా సరళిని బోధించాలి. భూతల, సముద్రతల, గగనతల, అంతరిక్ష, సైబర్ పోరాట రీతులను ఆకళింపు చేయాలి. జీవ, రసాయన యుద్ధాల విపరిణామాలపై అవగాహన సైతం జాతీయ భద్రతా కోర్సులో అంతర్భాగం కావాలి. ప్రజలకు ఆహార, ఆరోగ్య, పర్యావరణ, ఆర్థిక, ఉపాధి భద్రత కల్పించాల్సిన ఆవశ్యకత గురించి యువతకు బోధించాలి. ఉగ్రవాదం, నక్సలిజం, కులతత్వం, ప్రాంతీయవాదాలు దేశ భద్రతకు ఎలా ముప్పు కలిగిస్తాయో చైతన్యపరచాలి. అంతర్జాతీయంగా లైఫ్‌సైన్స్‌లను కూడా జాతీయ భద్రతా కోర్సులో అంతర్భాగం చేశారు. భారత్‌లో అది ఇంకా పూర్తిస్థాయిలో జరగాల్సి ఉంది.

ఉపాధి అవకాశాలు అనేకం

నేడు భారత్‌కు పొరుగు దేశాల నుంచి ముప్పు పెరుగుతోంది. దాన్ని దీటుగా ఎదుర్కొనే విధంగా మనం సన్నద్ధం కాకతప్పదు. అందుకోసం అధునాతన సాంకేతికతలనూ బాగా వినియోగించుకోవాల్సి ఉంటుంది. ఈ క్రమంలో జాతీయ భద్రతా రంగంలో యువతకు ఆధునిక ఉపాధి అవకాశాలు లభిస్తాయి. ఉదాహరణకు ఒక మోస్తరు విద్యార్హతలు ఉన్నవారికి సైనికులుగా అవకాశాలు అందివస్తే, ఉన్నత విద్యావంతులకు సైబర్ యోధులుగా ఉద్యోగావకాశాలు దక్కుతాయి. ప్రతిభావంతులకు స్వదేశంలో, విదేశాల్లో కూడా జాతీయ భద్రతకు సంబంధించిన కోర్సుల్లో అధ్యాపకులుగా చేరే అవకాశం లభిస్తుంది. అంతర్జాతీయ విశ్లేషణా సంస్థల్లో పరిశోధకులుగా కూడా అవకాశాలుంటాయి. ఐరోపా సమాఖ్య (ఈయూ), నాటో, ఐక్యరాజ్య సమితి అనుబంధ సంస్థల్లోనూ ఇలాంటి అవకాశాలు లభిస్తాయి. జాతీయ, అంతర్జాతీయ పత్రికలు, టీవీ ఛానళ్లు, వెబ్ సంస్థల్లో సంపాదకులుగా రాణించవచ్చు. ప్రజ్ఞావంతులకు ఫుల్ బ్రైట్-నెహ్రూ ఫెలోషిప్ (అమెరికా), షెవెనింగ్ స్కాలర్‌షిప్ (బ్రిటన్), డాడ్ ఫెలోషిప్ (జర్మనీ), రోడ్స్ ఫెలోషిప్ (ఆక్స్‌ఫర్డ్), నాటో ఫెలోషిప్ వంటివీ లభిస్తాయి. భారతదేశం చేపట్టే జాతీయ భద్రతా వ్యవహారాల అధ్యయన పాఠ్యప్రణాళిక మన విద్యార్థులను ఒకే జెండా(త్రివర్ణ పతాక) - ఒకే అజెండా(జాతీయ భద్రతకు పాటుపడటం)గా ముందుకుసాగే మేధావులుగా, కార్యశూరులుగా తీర్చిదిద్దాలి.



డాక్టర్ రమేష్ కన్నెగంటి
నేషనల్ సెక్యూరిటీ స్టడీస్‌పై యూజీసీ నిపుణుల సంఘం ఛైర్మన్



నీకోసం... నేనున్నా!

మనకేదైనా కష్టం వస్తే ఎవరితో చెప్పుకొంటాం? కుటుంబ సభ్యులతోనే కదా! ఒకవేళ కష్టానికి కారణమే వాళ్లయినప్పుడు, లేదా వాళ్లకు చెప్పుకోలేని విషయం అయినప్పుడు.. ఎవరైనా సాంత్వన కోసం చూసేది స్నేహితులవైపే. అలాంటి ఓ ఫ్రెండ్ మీరైనప్పుడు ఎలా వ్యవహరిస్తారు? మీ నేస్తానికి ధైర్యాన్నివ్వడానికి ఎలాంటి మాటలు చెబుతారు?

ఆప్తుల్ని కోల్పోయి దుఃఖంలో ఉన్న ఫ్రెండ్‌ని పలకరించడానికి వెళ్లాల్సిన సందర్భాలు అందరికీ ఎదురవుతాయి. అక్కడ ఏం మాట్లాడాలో తెలియక ఏదో ఒకటి చెప్పే బదులు మౌనంగా ఉండటమే మంచిది. సన్నిహితులైతే దగ్గరికి తీసుకోవడం, భుజం తట్టడం లాంటి వాటి ద్వారా నీకు నేనున్నానన్న భావన కలిగించవచ్చు. అక్కడి పరిస్థితిని బట్టి మనం చేయగల సాయం ఏదైనా ఉంటే చేయాలి. సొంతవాళ్లను కోల్పోయిన బాధలో ఉన్నవాళ్లకు- 'ఇలాంటప్పుడే ధైర్యంగా ఉండాలి, నువ్వు తొందరగా కోలుకోవాలని కోరుకుంటున్నాను' వంటి రొటీన్ ఊరడింపులు అనవసరం. అసలే షాక్‌లో ఉన్న వారిని- అలా ఎలా జరిగింది, ఎందుకు జరిగింది లాంటి ప్రశ్నలు అడగటం భావ్యం కాదు. ఆ బాధ వారిది మాత్రమే కాదు, మనది కూడా అన్న భావన వాళ్లలో కలిగేలా ప్రవర్తిస్తే, వారికి దుఃఖం కాస్త తగ్గుతుంది. బాధలోంచి బయటపడటానికి ఒక్కొక్కరికి ఒక్కో సమయం పట్టొచ్చు. అప్పటివరకు వారికి భరోసానిస్తూనే ఉండాలి. మర్చిపోవడానికి ప్రయత్నించమని చెప్పొద్దు. దుస్తులు మార్చినంత సులువుగా మనసులోంచి బాధను తీసిపడేయడం అసాధ్యం. బాధ పడనివ్వాలి. దానినుంచి నెమ్మదిగా తేరుకుంటున్న సమయంలో ఏదో ఒక వంకన కాసేపు బయటికి తీసుకెళ్లవచ్చు. వారిని బాధిస్తున్న ఆ దుర్ఘటన పూర్వాపరాలు తెలుసుకోవచ్చు. మన నుంచి ఎటువంటి సహాయం కావాలో తెలుసుకుని చేయాలి. సొంత వాళ్లను కోల్పోయిన వ్యక్తి జీవితం మునుపటిలా ఉండకపోవచ్చు. స్వభావంలోనూ, ప్రవర్తనలోనూ మార్పు కనిపిస్తుంది. దాన్ని గమనించి తదనుగుణంగా మసలుకోవాలి. అంతేకానీ మారిపోయావని నిష్ఠూరాలు ఆడకూడదు. విషాద సంఘటనను నెలలు గడిచినా మరచిపోలేని వాళ్లను అలాగే వదిలేయకూడదు. తరచూ కలుసుకుంటూ ధ్యాస మళ్లించడానికి ప్రయత్నించాలి. అలాగని ఉపన్యాసాలతో వారికి బ్రెయిన్‌వాష్ చేయాలని చూడకూడదు. వారి ఆరోగ్యం పట్ల మనం శ్రద్ధ చూపుతున్నామని మాత్రమే వారికి తెలియాలి. అవసరమైతే మానసిక వైద్యుల దగ్గరికి తీసుకెళ్లాలి. మద్యపానం అలవాటున్నవారు దాని ద్వారా ఉపశమనం పొందాలని చూస్తారు. పర్యవేక్షణ లేకపోతే అది వ్యసనమై తీవ్ర పరిణామాలకు దారి తీస్తుంది. కాబట్టి అటువైపు వెళ్లనివ్వకపోవడమే మంచిది.

స్నేహం మనిషి జీవితాన్ని ఎంతగానో ప్రభావితం చేస్తుంది. నేటి ఉరుకులు పరుగుల జీవనశైలిలో మంచి స్నేహితులను కలిగి ఉండటం, మంచి ఫ్రెండ్‌గా ఉండటాన్ని మించిన అదృష్టం లేదు. దాన్ని చక్కగా ఉపయోగించుకోవాలి.

– డాక్టర్ వనిత ద్యాప

ఏదీ సమానత్వం?

స్త్రీలు సైతం అన్ని రంగాల్లోకి అడుగు పెట్టినప్పుడే సమ్మిళిత ప్రగతి సాధ్యమవుతుంది. కొన్నేళ్లుగా ఉన్నత విద్య అభ్యసించే అమ్మాయిల సంఖ్య పెరిగింది. అయితే, పెళ్లి కుటుంబ కారణాల వల్ల వారు ఉద్యోగ ఉపాధుల్లోకి రావడం లేదు. ఇండియాలో అధిక శాతం మహిళలు సాగు, దాని అనుబంధ రంగాల్లోనే పనిచేస్తున్నారు. 2022-23లో ఆయా రంగాల్లో స్త్రీ, పురుష శ్రామికుల వాటా... (శాతాల్లో)

విభాగం	పురుషులు	స్త్రీలు
కంప్యూటర్ ప్రోగ్రామింగ్ కార్యకలాపాలు	73.8	26.2
ఉపకరణాలు, పరికరాల తయారీ	96.2	3.8
మోటర్ వాహనాల తయారీ	96.9	3.1
సౌరశక్తితో విద్యుదుత్పత్తి	83	17
మోటార్ల నిర్వహణ, మరమ్మతు	99.4	0.6
స్టోర్లల్లో చిల్లర ధరలకు ఆహార విక్రయాలు	78.6	21.4
వస్త్రాలు నేయడం	57.2	42.8
దుస్తులు, పాదరక్షల వంటి వాటి విక్రయాలు	84.2	15.8
తృణధాన్యాల సాగు	58.6	41.4
పశువుల పెంపకం	18	82

(ఆధారం: నేషనల్ స్కిల్ గ్యాప్ స్టడీ ఫర్ హై గ్రోత్ సెక్టార్స్ నివేదిక)

పచ్చటి సుస్థిర భవిష్యత్తుకోసం...

నేడు ప్రపంచ పర్యావరణ పరిరక్షణ దినోత్సవం.

వేగవంతమైన పారిశ్రామికీకరణ, పట్టణీకరణ, అడవుల నరికివేత వంటివాటితో ప్రస్తుతం పర్యావరణ సమతుల్యత దెబ్బతింటోంది. దానివల్ల వాతావరణ మార్పులు, జీవవైవిధ్య నష్టం, కాలుష్యం వంటి సమస్యలు ముమ్మరిస్తున్నాయి. ఈ సవాళ్లను ఎదుర్కోవడంలో సామాజిక అటవీకరణ ఒక శక్తివంతమైన సాధనంగా అక్కరకొస్తుంది.

పర్యావరణాన్ని పరిరక్షించడానికి, ప్రజల జీవనోపాధిని మెరుగుపరచడానికి ప్రభుత్వాలు, స్వచ్ఛంద సంస్థలు, స్థానిక సమాజాలు కలిసి చేపట్టే మొక్కల పెంపకం కార్యక్రమాలనే సామాజిక అటవీకరణ అంటారు. ఇందులో భాగంగా ఖాళీ ప్రదేశాలు, రోడ్ల పక్కన, కమ్యూనిటీ భూములు, వ్యక్తిగత పొలాలు, వర్షాభావ ప్రాంతాలు.. ఇలా చాలా చోట్ల మొక్కలు పెంచుతారు. అటవీ ఉత్పత్తులపై ఆధారపడే స్థానిక ప్రజల అవసరాలను తీర్చడం ద్వారా సహజ వనాలపై ఒత్తిడిని తగ్గించడమే దీని ప్రధాన లక్ష్యం.



బహుళ ప్రయోజనాలు

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో నాలుగు దశాబ్దాల క్రితం సామాజిక అడవుల కార్యక్రమం ఉద్ధృతంగా మొదలైంది. ప్రభుత్వం, ప్రజలు ఉత్సాహంగా మొక్కలు నాటారు. సరైన స్థలాలూ మొక్కల ఎంపిక కొరవడి, నాటిన వాటికి రక్షణలేక చెట్లుగా ఎదిగినవి తక్కువగా ఉండేవి. గత కొన్ని సంవత్సరాల్లో ఈ కార్యక్రమం మీద శ్రద్ధ తగ్గిందనే విమర్శలున్నాయి. మొక్కలు, వాటి రక్షణ కంటే ప్రచారానికే ఎక్కువ ప్రాధాన్యమివ్వడం చూస్తూనే ఉన్నాం. ఈ పరిస్థితుల్లో సామాజిక అడవులపై అందరూ నిశితంగా దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.

సామాజిక అటవీకరణలో భాగంగా స్థానికంగా అంతరించిపోతున్న లేదా అరుదైన జాతుల మొక్కలను పెంచాలి. దానిద్వారా జీవవైవిధ్యాన్ని పునరుద్ధరించవచ్చు. పక్షులకు, కీటకాలకు, చిన్న జంతువులకు ఆవాసాలను కల్పించవచ్చు. సామాజిక అటవీకరణ కార్యక్రమాలను పెద్దయెత్తున చేపడితే- వాతావరణంలోని కార్బన్ డయాక్సైడ్‌ను గణనీయంగా తగ్గించవచ్చు. తద్వారా పర్యావరణ మార్పుల ప్రభావాన్ని నియంత్రించవచ్చు. సామాజిక అటవీకరణ ద్వారా కొండవాలు ప్రాంతాల్లో, నదుల ఒడ్డున మొక్కలను పెంచడం వల్ల నేల కోతను అరికట్టవచ్చు. అంతేకాకుండా, చెట్ల ఆకులు రాలి నేలకు సేంద్రియ పదార్థాన్ని చేర్చి, భూమిని సారవంతం చేస్తాయి. ఇది వ్యవసాయ ఉత్పాదకతను కూడా మెరుగుపరుస్తుంది. అడవులు వర్షపు నీటిని నిల్వ ఉంచి, భూమిలోకి ఇంకడానికి సహాయపడతాయి. తద్వారా భూగర్భ జలమట్టాలు పెరిగి నీటి కొరత తగ్గుతుంది. సామాజిక అటవీకరణ కార్యక్రమాలు జలవనరుల సంరక్షణకు తోడ్పడతాయి. నదులు, చెరువులు, బావుల్లో నీటి లభ్యతను పెంచుతాయి. పారిశ్రామిక ప్రాంతాల చుట్టూ, పట్టణాల్లో గ్రీన్ బెల్టుల ఏర్పాటు ద్వారా వాయు కాలుష్యాన్ని పరిమితం చేయవచ్చు. దీనివల్ల ధ్వని కాలుష్యమూ అదుపులోకి వస్తుంది.

సామాజిక అటవీకరణ విజయవంతం కావడానికి స్థానిక ప్రజల భాగస్వామ్యం అత్యంత అవసరం. ఈ కార్యక్రమాలు ప్రజల్లో పర్యావరణం పట్ల అవగాహనను పెంచుతాయి. సామాజిక అటవీకరణ పర్యావరణ ప్రయోజనాలనే కాకుండా, ఆర్థిక లాభాలనూ అందిస్తుంది. కలప, పండ్లు, పశుగ్రాసం, ఔషధ మొక్కలు వంటి అటవీ ఉత్పత్తులను పొందవచ్చు. ఇది స్థానికుల జీవనోపాధికి మద్దతునిస్తుంది. సహజ అడవులపై ఆధారపడటాన్ని తగ్గిస్తుంది. గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలనూ సృష్టిస్తుంది.

ప్రభుత్వాల బాధ్యత ఇదీ


మొక్కల పెంపకానికి ప్రస్తుత వర్షాకాలం అత్యంత అనుకూలం. ఈ సమయంలో నాటిన మొక్కలు ఏపుగా పెరుగుతాయి. అయితే, కేవలం అలంకరణ కోసం కాకుండా, బహుళ ప్రయోజనకరమైన మొక్కలను నాటడంపై దృష్టి సారించాలి. వేప, రావి, చింత, మామిడి, సుబాబుల్, టేకు వంటివాటిని నాటాలి. ఇవి పర్యావరణానికి మేలు చేయడమే కాకుండా, స్థానిక ప్రజలకు కలప, పండ్లు, పశుగ్రాసం, ఔషధాలు తదితరాలను అందిస్తాయి. కాబట్టి ప్రభుత్వాలు సామాజిక అటవీకరణ కార్యక్రమాలను పటిష్ఠంగా అమలుచేయాలి. అందులో భాగంగా నాటేందుకు వీలైన మొక్కల వివరాలను ప్రాంతాల వారీగా, నర్సరీల వారీగా ప్రజలకు అందుబాటులో ఉంచాలి. ఉచితంగా లేదా, నామమాత్రపు ధరకు వాటిని లభ్యపరచాలి. నివాస ప్రాంతాల్లో, పొలం గట్ల మీద పెంచుకునేందుకు పనికొచ్చే మొక్కలే పెంచాలి. అడవుల్లో నాటే జాతులను ప్రజలు తీసుకోరు. ప్రభుత్వాలు, స్వచ్ఛంద సంస్థలు, విద్యాలయాలు, ప్రజలందరూ కలిసికట్టుగా కృషిచేస్తేనే భావితరాలకు సురక్షితమైన, ఆరోగ్యకరమైన పర్యావరణం అందుతుంది. సామాజిక అటవీకరణ అనేది పచ్చటి, సుస్థిరమైన భవిష్యత్తుకు మార్గం సుగమం చేస్తుంది.



డాక్టర్ దెందులూరి నళినీ మోహన్
విశ్రాంత ఐఎఫ్ఎస్ అధికారి,
ఏపీ రాష్ట్ర పూర్వ ముఖ్య వన్యప్రాణి సంరక్షణాధికారి

నక్క ఉపాయం!

ఒకరోజు మృగరాజు దిగులుగా కూర్చుని ఉంది. అది చూసిన నక్క.. ఏమైందని అడిగింది. విషయమంతా వివరించింది మృగరాజు. అప్పుడది సింహానికి ఒక సలహా ఇచ్చింది. వెంటనే సింహం కాకిని పిలిచి.. 'చిన్న మృగరాజు పుట్టినరోజు వేడుక సందర్భంగా అడవిలోని పిల్ల జంతువులకు కొన్ని ఆటల పోటీలు నిర్వహిస్తున్నాం' అని అరణ్యమంతా దండోరా వేయించింది. మరుసటిరోజు ఉదయాన్నే పోటీలు మొదలయ్యాయి. చిన్న జంతువులన్నీ పోటీల్లో పాల్గొనడానికి సిద్ధంగా ఉన్నాయి. అప్పుడు పిల్ల సింహంతో.. 'నువ్వు కూడా పోటీల్లో పాల్గొనాలి' అంది నక్క. 'నేను కాబోయే మృగరాజుని. నేనెందుకు ఆడతాను' అని గర్వంగా అందది. 'అప్పుడు చిన్న మృగరాజుకి ఏమీ రాదని అడవంతా అనుకుంటుంది.



అలా అనుకోకూడదంటే నువ్వు కచ్చితంగా ఆడాలి' అని చెప్పింది నక్క. ఇక చేసేదేమీ లేక ఆటలు ఆడాలని నిర్ణయించుకుందది. మిగతా పిల్ల జంతువులతో కలిసి ఆడటం మొదలుపెట్టింది. అలా ఆడుతుంటే దానికి చాలా ఆనందంగా అనిపించింది. ఆ సమయంలోనే బోలెడు స్నేహితులూ దొరికారు. పోటీలు పూర్తయ్యాక మృగరాజు దగ్గరికి వెళ్లి.. 'నాన్నా! నువ్వు ఇన్ని రోజులూ చెబుతుంటే నేను అస్సలు వినలేదు. కానీ, ఈరోజు తోటి జంతువులతో కలిసి ఆడుకోవడం చాలా బాగుంది. ఇక నుంచి రోజూ ఆడుకుంటాను' అంది చిన్న మృగరాజు. 'ఇప్పటికైనా తెలుసుకున్నావు. గర్వం వదిలి.. అందరితో కలిసి ఉన్నప్పుడే అన్ని విషయాలూ తెలుస్తాయి. రాజుకి ఉండాల్సిన లక్షణం కూడా అదే!' అంటూ సంతోషించింది మృగరాజు. అలాగే ఉపాయం చెప్పిన నక్కను అభినందించింది.

– మొర్రి గోపి

చెప్పుకోండి చూద్దాం!

ఇక్కడ ఆంగ్లంలో ఒకే అక్షరంతో ముగిసే అంశాల పేర్లు తెలుగులో ఉన్నాయి. కానీ అందులో కొన్ని వేరేవీ కలిసిపోయాయి. అవేంటో చెప్పుకోండి చూద్దాం.

తలుపు	గులాబీ	గడియారం
పాము	చేప	కన్ను
గద్ద	కొబ్బరికాయ	గాలిపటం




మొక్కలు పెంచు.. మురిపించు..

విజయవాడ దుర్గగుడి పైవంతెన కింద బెరంపార్కు ఎదురుగా ఉన్న పిల్లర్లకు గతంలో అందమైన పచ్చని మొక్కలు ఏర్పాటు చేశారు. అటుగా వెళ్లే వాహనదారులు, దుర్గగుడి భక్తులు, పర్యాటకులను ఈ పచ్చదనం ఎంతో ఆహ్లాదం పంచేది. కానీ ఆ తర్వాత వాటి నిర్వహణ కరవైంది. కనీసం నీళ్లు పోసే వారూ కరవయ్యారు. దీంతో మొక్కలన్నీ ఎండిపోయి పిల్లర్లు కళావిహీనంగా మారిపోయాయి. మొక్కలు పెంచి ఆహ్లాద వాతావరణాన్ని తీసుకురావాలని నగరవాసులు కోరుతున్నారు. – ఈనాడు,అమరావతి

'ప్రజా సమస్యల పరిష్కార వేదిక' నేడు

ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే : జిల్లాలో ఈ నెల 28వ తేదీ సోమవారం 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక' (పీజీఆర్ఎస్) కార్యక్రమం నిర్వహించనున్నట్లు కలెక్టర్ జి.లక్ష్మీశ తెలిపారు. అన్ని మండల కేంద్రాలు, మున్సిపల్/ నగరపాలక సంస్థ కార్యాలయాలు, రెవెన్యూ డివిజనల్ కార్యాలయాల్లో అర్జీలు స్వీకరిస్తారని పేర్కొన్నారు. విజయవాడ కలెక్టరేట్ ఆవరణలోని పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు వినతి పత్రాలు స్వీకరించనున్నట్లు వివరించారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

మీకోసం వెబ్‌సైట్‌లోనూ దాఖలు: ప్రజలు తమ సమస్యల అర్జీలను మీకోసం వెబ్‌సైట్ meekosam.ap.gov.in లోనూ దాఖలు (నమోదు) చేసుకోవచ్చని కలెక్టర్ సూచించారు. ఇందులో దాఖలైన అర్జీల స్థితి, సంబంధిత సమాచారాన్ని తెలుసుకునేందుకు 1100 నంబరుకు నేరుగా ఫోన్ చేయవచ్చని ఆయన వివరించారు.

పన్ను దస్త్రాల స్వచ్ఛీకరణ

స్వర్ణ పంచాయతీ పోర్టల్‌లో దోషాల సవరణ

ఈనాడు, అమరావతి

పంచాయతీల్లో ప్రజలు చెల్లించిన పన్నుల సొమ్మును స్వాహా చేసిన సిబ్బంది ఎందరో. రసీదులు ఇవ్వకుండా ప్రభుత్వ ఖాతాలో జమ చేయకుండా పక్కదారి పట్టించిన ఘటనలూ ఉన్నాయి. దీంతో పంచాయతీల ఖజానాకు భారీగా నష్టం కలిగింది. అన్ని సమస్యలకు కూటమి సర్కారు ఆన్‌లైన్ ద్వారా పరిష్కారం చూపించింది. పన్నుల చెల్లింపుల్లో పారదర్శకత కోసం స్వర్ణ పంచాయతీ పోర్టల్‌ను అందుబాటులోకి తెచ్చింది. అందులో వివరాలు సవ్యంగా నమోదు చేయకపోవడంతో మళ్లీ సమస్య మొదలైంది. దీంతో పంచాయతీలవారీగా కార్యదర్శులు ఆన్‌లైన్‌లో నమోదు చేసిన వివరాలను పరిశీలిస్తున్నారు. తప్పులుంటే వాటిని ఆన్‌లైన్ విధానం ద్వారా సరిచేస్తున్నారు.

నెలాఖరు కల్లా కొలిక్కి వచ్చేనా.. నెలాఖరు నాటికి పరిశీలన పూర్తి చేయాలని అధికారులు లక్ష్యం నిర్దేశించారు. ఉమ్మడి జిల్లాలో 783 పంచాయతీల్లో మొత్తం 5,72,701 అసెస్‌మెంట్లు ఉన్నాయి. అధికారులు ఇప్పటివరకు 4,18,770 పరిశీలించారు. ఇంకా 1,53,931 అసెస్‌మెంట్లు పరిశీలించాల్సి ఉంది. కృష్ణా జిల్లాలో ఇంకా 36,732 అసెస్‌మెంట్లు మాత్రమే పరిశీలించాల్సి ఉంది. ఎన్టీఆర్ జిల్లాలో ఆలస్యంగా సాగుతోంది. ఇప్పటికి 53.7 శాతం మాత్రమే పూర్తయింది. ఇంకా 1,17,199 అసెస్‌మెంట్లు పరిశీలించాల్సి ఉంది. దీంతో నెలాఖరు నాటికి ఎన్టీఆర్‌లో పూర్తి కావడం కష్టమే.



జిల్లా	పంచాయతీలు	అసెస్‌మెంట్లు	పరిశీలించినవి	పెండింగ్
ఎన్టీఆర్	286	2,53,199	1,36,000	1,17,199
కృష్ణా	497	3,19,502	2,82,770	36,732
మొత్తం	783	5,72,701	4,18,770	1,53,931

తప్పులు సరిచేస్తూ.. మొబైల్ నంబరు, ఇంటి స్వరూపం, ఇంటి పన్ను వివరాలు కొన్ని తప్పుగా నమోదు చేశారు. ఉమ్మడి జిల్లాలో దాదాపు 3 నుంచి 5శాతం వరకు వివరాలు తప్పుగా నమోదయ్యాయి. దీంతో పన్ను చెల్లింపు సమయంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ప్రస్తుతం ఈ దోషాలు సరిచేస్తున్నారు. ప్రతి ఖాతాకు ఆధార్, ఫోన్ నంబర్ అనుసంధానం చేస్తున్నారు. సరిదిద్దిన వివరాలన్నీ పోర్టల్‌లో నమోదు చేస్తున్నారు. గతంలో ఇంటి, నీటి పన్నులు చెల్లించినా కొందరు సిబ్బంది పంచాయతీ బ్యాంకు ఖాతాలో జమ చేసేవారు కాదు. ప్రస్తుతం ప్రజలు స్వర్ణ పంచాయతీ పోర్టల్, యాప్ ద్వారా ఇంటికి, స్థలానికి ఎంత పన్ను విధించారు, గత బకాయిలు ఎంత, ఎప్పటిలోగా చెల్లించాలి అనే వివరాలు చూసుకోవచ్చు. నేరుగా యాప్‌లో పన్ను చెల్లిస్తే రసీదు వచ్చేస్తుంది. పన్ను చెల్లించగానే చరవాణికి సందేశం వస్తుంది.

మనసు గెలవాలి.. అమ్మ మురవాలి!



ఈనాడు, అమరావతి

దుర్గగుడిలో పది రోజులు ఘనంగా జరిగే దసరా వేడుకలకు పక్కాగా ఏర్పాట్లు చేస్తున్నామంటూ అధికారులు చెబుతున్నా సాధారణ భక్తులకు దర్శనాలు, ప్రసాదాల విషయంలో ఏటా ఇబ్బందులు తప్పడం లేదు. వీవీఐపీ దర్శనాలపై నియంత్రణ కొరవడుతోంది. పనుల టెండర్ల విషయంలో గందరగోళం, మొక్కుబడి తీరు వల్ల ఏర్పాట్లు పక్కాగా చేయలేకపోతున్నారు. ఈసారి దసరా ఉత్సవాలు సెప్టెంబరు 22 నుంచి ప్రారంభం కానున్నాయి. మరో రెండు నెలలే ఉండడంతో ఇప్పటి నుంచే పక్కా ప్రణాళికతో సాగాలి. ఈ నెల 29న కలెక్టర్ లక్ష్మీశ అధ్యక్షతన దసరా నిర్వహణపై జరిగే మొదటి సమన్వయ సమావేశంలోనే ఏర్పాట్లపై స్పష్టమైన నిర్ణయం తీసుకోవాలి.

దసరా వేడుకలకు పక్కా ప్రణాళిక అవసరం

ఆఖరి నిమిషం వరకూ టెండర్లు: దసరా పనులకు సంబంధించిన క్యూలైన్లు, లైటింగ్, తాగునీటి సౌకర్యం సహా అన్నింటికీ టెండర్లు పిలుస్తుంటారు. పక్కాగా ఏమేం పనులు చేయాలి, టెండర్లు పిలవాలనే స్పష్టత ఉన్నప్పటికీ వీటిని ఆఖరి నిమిషం వరకూ సాగదీస్తుంటారు. సమయం మించిపోయి పనులు కొన్ని చేసి, కొన్ని చేయక వదిలేసే పరిస్థితి తలెత్తుతోంది.

ప్రసాదాలు చాలక అవస్థలు: లడ్డూ ప్రసాదం చాలక మోపిదేవి, పెదకాకాని, పెనుగంచిప్రోలు సహా చుట్టుపక్కల ఆలయాల నుంచి లడ్డూలను తెప్పించారు. దసరా వేడుకల తర్వాత రెండు రోజులు భవానీ భక్తులు ఆలయానికి పోటెత్తుతారు. కేవలం 3లక్షల మంది వస్తారు. ఆ సమయంలోనే ప్రసాదాలు చాలక ఏటా భక్తులు ఇబ్బందులకు గురవుతున్నారు. ఇతర ఆలయాల ప్రసాదం తెచ్చి ఇవ్వాల్సిన పరిస్థితి.

వీవీఐపీ దర్శనాలతోనే ఇబ్బందులు: వీవీఐపీ దర్శనాలతో సాధారణ భక్తులు అవస్థలు ఎదుర్కొంటున్నారు. మహామండపం లిఫ్ట్, మెట్ల మార్గం, ఘాట్‌రోడ్ నేరుగా కొండపైకి వేల మంది వస్తున్నారు. ఎగ్జిట్ మార్గం నుంచి ఆలయ అంతరాలయం, ప్రధాన ఆలయం వెనుక వైపు గేటు ద్వారా పక్క నుంచి లోపలికి వచ్చేస్తుంటారు. వీవీఐపీలకు ప్రత్యేక సమయాలు కేటాయించామని అధికారులు ప్రకటించడమే తప్ప నియంత్రణ ఉండట్లేదు.

ఉభయ దాతలకు నరకం: ఏటా దసరాలో ఉభయదాతలు కొండమీదకు రావాలంటే చుక్కలు కనిపిస్తుంటాయి. ప్రత్యేక లక్ష కుంకుమార్చన, చండీ హోమానికి రూ.3వేలు, మూలానక్షత్రం రోజు రూ.5వేలు పెట్టి టిక్కెట్ కొన్నవాళ్లను ఆరో అంతస్తులోకి తీసుకొచ్చే ఏర్పాటు చేయడం లేదు.

ముందస్తుగా జాగ్రత్తలుంటే..

✪ దుర్గాఘాట్‌లో భవానీల దుస్తుల ఎక్కడ పడితే అక్కడ పడేస్తుండడంతో అపరిశుభ్రంగా ఉంటోంది. ఒకే దగ్గర వేయించి వెంటనే తరలించే ఏర్పాటు చేయాలి. ✪ అన్నదానం ఈసారి ఎక్కడ ఏర్పాటు చేస్తారనేది కీలకం. గతేడాది మహామండపం ముందున్న ఖాళీ ప్రదేశంలో పెట్టారు. ఈసారి నిర్మాణాల వల్ల అక్కడ ఇబ్బంది అవుతుంది. ✪ గతేడాది సాంస్కృతిక కార్యక్రమాలు కనకదుర్గానగర్‌లో ప్రసాదాల కౌంటర్ల ఎదురుగా పెట్టడంతో ఆ ప్రాంతమంతా కిక్కిరిసిపోయి ఇబ్బంది పడ్డారు. ✪ క్యూలైన్ల పైన వాటర్ ప్రూఫ్ షామియానాలు వేశామని చెబుతుంటారు. కానీ వర్షం పడితే భక్తులు తడిసి ముద్దవుతున్నారు. ✪ టిక్కెట్ కౌంటర్లు నెట్‌వర్క్ సమస్యలొచ్చి క్యూలైన్లు నిలిచిపోకుండా ముందే ట్రయల్‌రన్ వేయాలి.

వేగబంధం..

తాడేపల్లి నుంచి వారధి మీదుగా విజయవాడ నగరంలోకి ప్రవేశించే కూడలిలో వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వారధి దిగగానే వచ్చే కూడలి సమీపంలో అధికంగా వేసిన స్పీడు బ్రేకర్ల కారణంగా భారీగా వాహనాలు నిలిచిపోతున్నాయి. దీనికి కారణం. చిన్నపాటి వాహనాలు ఏదోలా తప్పించుకుని వెళ్తున్నప్పటికీ భారీ వాహనాలు, ట్రాలర్లు వచ్చినప్పుడు ప్రయాణికులు ఇక్కట్ల పాలవుతున్నారు. వారధి పైనుంచి వచ్చేవి, ఆర్టీసీ కాంప్లెక్సు నుంచి వచ్చే బస్సులు, ఇతర వాహనాలు కూడలిలో కలుస్తుండడం, స్పీడు బ్రేకర్ల కారణంగా నెమ్మదిగా వెళ్లడం వల్ల ఇబ్బందులు ఎదురవుతున్నాయి.


వారధి వద్ద వేగనిరోధకాల కారణంగా నెమ్మదిగా వెళ్తూ..


బండి వెనక బండి ఆగిందండి..

దీని కారణంగా వెనక్కి వారధిపై తాడేపల్లి వైపు భారీగా వాహనాలు నిలిచిపోతున్నాయి. ఆదివారం సాయంత్రం 5 గంటల సమయంలో చాలా సేపు జనం ట్రాఫిక్‌లో చిక్కుకున్నారు. అన్న క్యాంటీన్ దాటాక మాత్రమే రద్దీ నుంచి బయటపడ్డారు.

–ఈనాడు, అమరావతి

కొనసాగుతున్న కృష్ణా వరద

ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే : కృష్ణా నదిలో ఆదివారం స్థానిక వరద ప్రవాహం కొనసాగుతోంది. నగరంలోని ప్రకాశం బ్యారేజీకి మధ్యాహ్నం 3 గంటలకు ఎగువ నుంచి 22,439 క్యూసెక్కులు రాగా, 20 గేట్లను ఒక అడుగు మేర ఎత్తారు. సముద్రంలోకి 14,500 క్యూసెక్కులు విడుదల చేశారు. కృష్ణా డెల్టా పరిధిలోని కాలువలకు 7,939 క్యూసెక్కులు విడుదల చేశారు. సాయంత్రం 6 గంటలకు వరద ప్రవాహం తగ్గుముఖం పట్టింది. ఎగువ నుంచి 15,670 క్యూసెక్కులు రాగా, 10 గేట్లను ఒక అడుగు మేర ఎత్తారు. సముద్రంలోకి 7,250 క్యూసెక్కులు విడుదల చేశారు.

నీటి విడుదల పెంపు

కృష్ణా డెల్టా పరిధిలోని పంట కాలువలకు నీటి విడుదలను 8,420 క్యూసెక్కులకు పెంచారు. సముద్రంలోకి విడుదల చేసే నీటి కంటే.. కాలువలకు ఇచ్చేదే ఎక్కువగా ఉంది. బందరు కాలువకు నీటి విడుదలను పునరుద్ధరించారు. కృష్ణా తూర్పు ప్రధాన కాలువకు 5,413, కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు 3,007 క్యూసెక్కులు విడుదల చేశారు. కృష్ణా తూర్పు ప్రధాన కాలువ నుంచి రైవస్ 2,005, ఏలూరు 1,404, కేఈబీ 1,300, బందరు కాల్వకు 704 క్యూసెక్కుల చొప్పున ఇస్తున్నారు.

బండిపై ఆరుగురు..
బాధ్యత మరిచారు

ఈ చిత్రం చూశారా.. స్కూటీపై ఐదుగురు చిన్నారులను కూర్చోబెట్టుకుని కోల్‌కతా-చెన్నై జాతీయ రహదారిపై ప్రసాదంపాడు వద్ద ప్రమాదకరంగా దూసుకుపోతున్నాడు ఈ యువకుడు. నిత్యం వందల వాహనాల రాకపోకలతో రద్దీగా ఉండే ఈ రహదారిపై ఏమాత్రం అదుపుతప్పినా ప్రమాదమే కదా. తల్లిదండ్రులూ ఆలోచించండి.. రహదారి భద్రతా ప్రమాణాలు పాటిస్తే మనకు, ఇతరులకూ మంచిదే కదా. ఇకనైనా ఇలాంటి సాహసాలు చేయకుండా జాగ్రత్తలు తీసుకుందామా..



– ఈనాడు అమరావతి

పలు ప్యాసింజర్ రైళ్ల రద్దు

గుంటూరు రైల్వే, న్యూస్‌టుడే: దుండూరు-తెనాలి-పెదవడ్లపూడి మధ్య 3వ లైన్ నిర్మాణ పనులు జరుగుతున్నందున ఈనెల 28, 29 తేదీల్లో ప్యాసింజర్ రైళ్లను రద్దు చేశారు. విజయవాడలో 09.40 గంటలకు ప్రారంభమై గుంటూరు 10.55కి వచ్చే రైలు(67229), గుంటూరులో 11.20 గంటలకు మొదలై రేపల్లె 13.00 గంటలకు వెళ్లే రైలు(67223), రేపల్లెలో 13.10 గంటలకు ప్రారంభమై తెనాలి 14.10 గంటలకు చేరే రైలు(67224)ను సోమ, మంగళవారాల్లో నిలిపివేశారు.

నగర పరిసరాల్లో స్వల్ప వర్షం

ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే : నగర పరిసరాల్లో స్వల్ప వర్షపాతం నమోదైంది. శనివారం సాయంత్రం నుంచి ఆదివారం ఉదయం వరకు నమోదైన వివరాలు ఇలా ఉన్నాయి. ఇబ్రహీంపట్నం 3.4 మి.మీ., విజయవాడ గ్రామీణ 1.8, గాంధీనగర్, భవానీపురం 1.2, పటమట, అజిత్‌సింగ్‌నగర్ 1.0, జిల్లాలోని గంపలగూడెంలో 0.2 మిల్లీ మీటర్ల మేర వర్షం పడింది. మిగతా మండలాల్లో వర్ష ఛాయలు లేవు.

నిఘా బాణం.. తప్పిన కోణం..



హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారిపై ఇబ్రహీంపట్నం మండలం గుంటుపల్లి వద్ద చౌరస్తాలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరా స్తంభం పూర్తిగా ఒక పక్కకు ఒరిగిపోయింది. దీంతో అక్కడ సీసీ కెమెరా ఉన్నా దాని కోణం మారిపోయింది. – ఈనాడు,అమరావతి

అభివృద్ధి పనులకు టెండర్లు

తుళ్లూరు, న్యూస్‌టుడే: అమరావతి కోర్ క్యాపిటల్‌లో రహదారులు, మురుగు కాలువలు, వరద నీటి నిర్వహణ, తాగు నీటి సరఫరా, విద్యుత్, టెలిఫోన్, ఇంటర్‌నెట్ ఏర్పాటుకు డక్ట్‌లు, నీటి శుద్ధి ప్లాంట్లు, చెట్ల పెంపకం తదితర అభివృద్ధి పనుల కోసం రూ.1052.67 కోట్ల అంచనాతో ఈ నెల 26న సీఆర్డీఏ టెండరు నోటీసు జారీ చేసింది. 2 సంవత్సరాల వ్యవధిలో పనులు పూర్తి చేయాల్సి ఉంటుంది. 7 సంవత్సరాలు నిర్వహణ, పర్యవేక్షణ బాధ్యతలు నిర్వర్తించాల్సి ఉంటుంది. ఈ నెల 28 నుంచి ఆగస్టు 12 సాయంత్రం 2 గంటల వరకు టెండర్లు సమర్పించవచ్చు. ఆగస్టు 12న సాయంత్రం 4 గంటలకు టెండర్లకు సంబంధించిన టెక్నికల్ బిడ్‌లు ఓపెన్ చేస్తారు.

ఆశల సృష్టి.. కాసుల దృష్టి!

విజయవాడ కేంద్రం వద్ద పోలీసుల తనిఖీలు ★ తాళాలు వేసి వెళ్లిపోయిన నిర్వాహకులు

ఈనాడు, అమరావతి

'కేవలం రూ.99వేలు చెల్లిస్తే చాలు అన్నీ మేమే చూసుకుంటాం. బిడ్డను మీ ఇంటికి తీసుకెళ్లిపోవచ్చంటూ' గ్రామీణ ప్రాంతాల్లో విస్తృతంగా ప్రచారం చేశారు. బిడ్డలు లేని తల్లిదండ్రులను ఆకర్షించి అడ్డంగా మోసాలకు పాల్పడుతున్న విజయవాడ రామచంద్రా నగర్‌లోని కంచుకోటవారి వీధిలో ఉన్న సృష్టి సంతాన సాఫల్య కేంద్రంపై పోలీసులు దృష్టి సారించారు. ఇక్కడ తనిఖీలు చేపట్టేందుకు సెంట్రల్ ఏసీపీ దామోదర్, సీఐ ప్రకాశ్ ఆధ్వర్యంలో పోలీసులు ఆదివారం వచ్చారు. ఈ సమాచారం అందడంతో కేంద్రానికి తాళాలు వేసేసి వైద్య సిబ్బంది వెళ్లిపోయారు. దీంతో పోలీసులు బయట నుంచే భవనాన్ని పరిశీలించి వెళ్లారు. సోమవారం పూర్తి స్థాయిలో కేంద్రంలో తనిఖీలు చేపడతామని, రికార్డులన్నీ పరిశీలించాక ఎలాంటి అక్రమాలు జరిగాయో గుర్తిస్తామని తెలిపారు.


యూనివర్సల్ సృష్టి సంతాన సాఫల్య కేంద్రం

విజయవాడలోని సృష్టి సంతాన సాఫల్య కేంద్రంపై 2015 నుంచి తీవ్రస్థాయిలో ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఉమ్మడి కృష్ణా జిల్లాలో సేవలందించే ప్రైవేటు వైద్యులు కొంత మందితో ఒప్పందం చేసుకుని వారి ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తున్నారు. పెళ్లయి ఐదారేళ్లు దాటినా పిల్లలు పుట్టని వాళ్లలో ఉండే ఆందోళననే వీళ్లు లక్ష్యంగా చేసుకుంటున్నారు. వారికి పరీక్షలు చేసి పిల్లలు పుట్టడానికి అవకాశం లేదని, తమ కేంద్రానికి వస్తే రూ.99 వేలతో పండంటి బిడ్డకు జన్మనివ్వొచ్చంటూ నమ్మించి తీసుకొస్తున్నారు. ఆ తర్వాత పరీక్షల పేరుతో అదనపు బాదుడు, వీర్యకణాలు బలహీనంగా ఉన్నాయని, మందులు వాడాలని తిప్పుతూ దోచేస్తున్నారు. ★ మందులు వాడి ఎన్నో ప్రయత్నాలు చేసినా సంతానం కలగని వారికి, 45 ఏళ్లు దాటినా, కుటుంబ నియంత్రణ శస్త్రచికిత్సలు చేసుకున్న తర్వాత, పూర్తిగా గర్భసంచి, అండాశయాలు పనిచేయని వారికి కూడా బిడ్డలు పుట్టేలా చేస్తామంటూ నమ్మించి తిప్పుతున్నారన్న ఆరోపణలు ఉన్నాయి.

★ **పేరు, వైద్యులు మారిపోయారు..** విజయవాడలో గతంలో సృష్టి పేరుతో నిర్వహించిన కేంద్రాన్నే ఇప్పుడు యూనివర్సల్ సృష్టి అంటూ బోర్డు మార్చేశారు. లోపల అంతా సృష్టి పేరుతోనే వ్యవహారం నడిపిస్తున్నారు. ఈ కేంద్రం యజమాని డాక్టర్ నమ్రతపై నిషేధం విధించడం, పలు ఆరోపణలు వెల్లువెత్తడంతో ప్రస్తుతం కరుణ, వైశాలి అనే ఇద్దరు వైద్యుల పేర్లతో నడుపుతున్నారు. ★ **ఎలా అనుమతి ఇచ్చారు..** 2015, 2020లో పెద్దఎత్తున విజయవాడ కేంద్రంపై పోలీసులు, వైద్యారోగ్యశాఖ సిబ్బంది దాడులు నిర్వహించారు. వైద్యులు, సిబ్బందిని అదుపులోకి తీసుకున్నారు. అక్రమాలు నిజమేనని తేల్చారు. మళ్లీ ఇదే నిర్వాహకులకు ఎలా అనుమతులు ఇస్తున్నారనేది ప్రశ్నార్థకంగా మారింది.

అక్రమాలపై విచారణ చేస్తాం

విజయవాడ యూనివర్సల్ సృష్టి కేంద్రంలో అక్రమాలపై దృష్టి సారిస్తాం. వీరికి అనుమతి ఉందా లేదా అనేది పరిశీలిస్తాం. ఈ కేంద్రం వల్ల నష్టపోయిన వారు ఎవరైనా వచ్చి ఫిర్యాదు చేస్తే చట్టప్రకారం నిర్వాహకులపై చర్యలు తీసుకుంటాం. – దామోదర్, విజయవాడ సెంట్రల్ ఏసీపీ

ఆగస్టులో మోకీళ్ల మార్పిడి శస్త్రచికిత్సలు

గుంటూరు జీజీహెచ్‌లో ఏర్పాట్లు

ఈనాడు, అమరావతి

మోకీళ్లు, కాలేయ మార్పిడి శస్త్రచికిత్సల నిర్వహణపై గుంటూరు ప్రభుత్వ సమగ్ర వైద్యశాల అధికారులు దృష్టి సారించారు. ఆగస్టులో రెండు లేదా మూడో వారంలో మోకీళ్లకు, అక్టోబరులో కాలేయమార్పిడి శస్త్రచికిత్సలు ప్రారంభించాలని వారు నిర్ణయించారు.

రాజధాని అమరావతి ప్రాంతంలో కీలకమైన ఈ ఆసుపత్రిలో 1,200 పడకలున్నాయి. నిత్యం 3 వేలమందికిపైగా వైద్య సేవలు పొందుతున్నారు. ఎంతో ఖరీదైన వైద్య సేవలను పేదలకు ఉచితంగా అందిస్తోంది. రెండు కీలక శస్త్రచికిత్సలపై దృష్టి పెట్టిన కూటమి ప్రభుత్వం... గతంలోలా రిజిస్ట్రేషన్ విధానంలో కాకుండా వచ్చినవారందరికీ మోకీళ్లు, మోకాళ్లు, తుంటి, జాయింట్ ఆపరేషన్లు ఉచితంగా చేయడానికి అనుమతులిచ్చింది.

ఇంప్లాంట్స్ కోసం అధికారులు రివాల్వింగ్ ఫండ్ కోరుతున్నారు. ఎన్టీఆర్ వైద్యసేవ ద్వారా ఏడాదికి ఎన్ని చేయగలరో అంచనా వేసి.. ఆ మేరకు 25% నిధులివ్వాలని కోరుతున్నారు.



గతంలో.... జీజీహెచ్‌లో మోకీళ్ల మార్పిడి శస్త్రచికిత్సలకు గతంలోనే తెదేపా ప్రభుత్వం అనుమతించింది. 2016లో అప్పటి రాష్ట్ర వైద్యఆరోగ్యశాఖ మంత్రి కామినేని శ్రీనివాస్ ఇక్కడే శస్త్రచికిత్స చేయించుకున్నారు. 2017 జులైలో నాటి ప్రభుత్వం రూ. 65 లక్షలు మంజూరు చేయడంతో పేదలకూ సర్జరీలు ప్రారంభించారు. వందమందికి మోకీళ్ల మార్పిడి చేయగా.. వెయ్యిమందికిపైగా నిరీక్షణ జాబితాలో ఉన్నారు. అప్పట్లో మధుమేహం, గుండెజబ్బులు, మూత్రపిండాల వ్యాధులున్నవారికీ విజయవంతంగా శస్త్రచికిత్సలు చేశారు. ఏ ఒక్కరిలోనూ ఇన్‌ఫెక్షన్ రాలేదు. 2019లో అధికారంలోకొచ్చిన వైకాపా ప్రభుత్వం ఉచితంగా శస్త్రచికిత్సలు చేయిస్తామని హామీ ఇచ్చినా.. ఐదేళ్ల కాలంలో అమలు చేయలేదు.

అక్టోబరు నుంచి కాలేయ ఆపరేషన్లు..

అక్టోబరు నాటికి జీజీహెచ్‌లో కాలేయం (లివర్) మార్పిడి శస్త్రచికిత్సలు చేసేందుకు ప్రభుత్వం అనుమతులిచ్చింది. చెన్నైకు చెందిన లివర్ ట్రాన్స్‌ప్లాంట్ నిపుణుడు డాక్టర్ రజనీకాంత్ ఇప్పటికే సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. రూ. 10 లక్షలతో రెండు ప్రత్యేక ఆపరేషన్ థియేటర్లు సిద్ధం చేస్తున్నారు. ముగ్గురు ట్రాన్స్‌ప్లాంట్ కోఆర్డినేటర్లనూ నియమించారు. జీవన్‌దాన్ నుంచి ధ్రువపత్రం రాగా.. రోగులు రిజిస్టర్ చేసుకోవాల్సి ఉంటుంది. గతంలో డాక్టర్ ఆళ్ల గోపాలకృష్ణ గోఖలేకు చెందిన సహృదయ హెల్త్‌కేర్ ట్రస్టు ఆధ్వర్యంలో పేదలకు ఉచితంగా గుండె మార్పిడి శస్త్రచికిత్సలు చేశారు. వైకాపా అధికారంలోకి వచ్చాక ఆ సేవలు నిలిచిపోయాయి. వాటినీ పట్టాలెక్కిస్తే పేదలకు ఎంతో ఉపయుక్తంగా ఉంటుంది.

అవయవదానాన్ని ప్రోత్సహించేలా...


జీజీహెచ్‌లో అవయవదానాన్ని ప్రోత్సహించడంపైనా అధికారులు దృష్టి పెట్టారు. ప్రస్తుతం డిసీజ్డ్ డోనర్‌కు మాత్రమే అనుమతి వచ్చింది. లైవ్ డోనర్‌కు అనుమతి ఇవ్వలేదని సమాచారం. ఇందుకోసం ఏర్పాటైన ట్రాన్స్‌ప్లాంట్ కోఆర్డినేటర్లు 16 ఐసీయూల్లోనూ గ్లాస్కో కోమా స్కేల్ 5 కంటే తక్కువగా (బ్రెయిన్‌డెడ్) ఉంటే ఆ వివరాలు ఉన్నతాధికారులకు తెలియజేయడం.. బ్రెయిన్‌డెడ్ అయిన వ్యక్తి కుటుంబ సభ్యులతో మాట్లాడి అవయవదానానికి సిద్ధం చేయడం.. ప్రాధాన్యతాక్రమంలో అవసరమైనవారికి అవయవాలను అందించడంపై దృష్టి పెట్టారు. ప్రత్యేక ట్రాన్స్‌ప్లాంట్ యూనిట్, పోస్ట్ ఆపరేటివ్ వార్డు, ప్రత్యేక వైద్యులు, సిబ్బంది ఉంటే నిర్వహణ పక్కాగా ఉంటుంది. ఆసుపత్రి సూపరింటెండెంట్ యశస్వి రమణతో 'ఈనాడు' మాట్లాడగా.. ఆగస్టులో మోకీళ్లు, అక్టోబర్ నాటికి కాలేయ మార్పిడి శస్త్రచికిత్సలు జీజీహెచ్‌లో ప్రారంభించడంపై కసరత్తు జరుగుతోందని వివరించారు.

పానీ.. పోనీకండి..!

★ 7.47 టీఎంసీల గోదారి జలాల రాక
★ సముద్రంలో కలిసిన 7.49 టీఎంసీల వరద

ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే

కృష్ణా నదిలో ప్రతిపాదిత అదనపు బ్యారేజీల నిర్మాణాలు కార్యరూపం దాల్చకపోవడంతో వరద నీటిని నిల్వ చేసుకోలేని పరిస్థితి ఏర్పడింది. భారీ వర్షాలు పడిన సందర్భాల్లో వృథాగా సముద్రంలోకి వదిలేయాల్సి వస్తోంది. నీళ్లు లేని సమయంలో గోదావరి జలాలను మళ్లించుకుని.. డెల్టా ఆయకట్టును బతికించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. పులిచింతల-ప్రకాశం బ్యారేజీల మధ్య వైకుంఠపురం వద్ద, బ్యారేజీ దిగువన చోడవరం, బండికోళ్లలంకల వద్ద మరో రెండు మినీ బ్యారేజీల నిర్మాణాలకు ప్రతిపాదించారు. ఏళ్లు గడుస్తున్నా అడుగు ముందుకు పడడం లేదు.



డెల్టాను ఆదుకున్న పట్టిసీమ

ప్రకాశం బ్యారేజీ పరిధిలో కృష్ణా డెల్టా ఆయకట్టు 13.08 లక్షల ఎకరాలు ఉంది. గత ఏడాది కంటే ఈ ఏడాది ముందుగానే జూన్ 15వ తేదీన సాగునీటిని విడుదల చేశారు. అవసరాలకు సరిపడా నీటి నిల్వలు పులిచింతల ప్రాజెక్టులో లేకపోవడంతో, పట్టిసీమ ద్వారా గోదావరి జలాల మళ్లింపునకు ప్రతిపాదించారు. ఈ నెల 3న పట్టిసీమ పంపులను ఆన్ చేయగా, సుమారు వారం తర్వాత కృష్ణా నదిలో ప్రకాశం బ్యారేజీకి చేరాయి. నారు మళ్లు పోసుకునే తరుణంలో గోదావరి జలాలు జీవం పోశాయి. ఇటు పట్టిసీమ, అటు పులిచింతల నీటిని అవసరాలను బట్టి కొన్ని రోజులు వినియోగించగా, తర్వాత పులిచింతల నీటిని నిలిపివేశారు. తొలుత వర్షాభావ పరిస్థితుల కారణంగా రైతుల విజ్ఞప్తి మేరకు బ్యారేజీ నుంచి కృష్ణా తూర్పు, పశ్చిమ ప్రధాన కాలువలకు రోజుకు సుమారు 14,000 క్యూసెక్కుల వరకు సాగునీటిని అందించారు. ఆ తర్వాత వాతావరణ పరిస్థితులు మారిపోయాయి. భారీ వర్షాలు కురవడంతో కృష్ణా పరివాహక పరిధిలోని వాగులు, వంకల ద్వారా స్థానిక వరద నీరు వచ్చి చేరింది. సాగు నీటి అవసరాలు తగ్గాయి. పలు కాలువలను కట్టివేయడం, మిగతా వాటికి నీటిని బాగా తగ్గించారు. ఈ నెల 21వ తేదీన బ్యారేజీ గేట్లను ఎత్తారు. సముద్రంలోకి వరద నీటిని విడుదల చేస్తున్నారు. వారం రోజుల వ్యవధిలో ఆదివారం వరకు 7.49 టీఎంసీలను సముద్రంలోకి వృథాగా విడుదల చేశారు. కడలి వైపు వరద ప్రవాహం కొనసాగుతోంది. ఈనెల 10 నుంచి ఇప్పటి వరకు పట్టిసీమ ద్వారా వచ్చిన 7.47 టీఎంసీల గోదావరి జలాలను కృష్ణా డెల్టా సాగు అవసరాలకు వినియోగించారు. పట్టిసీమ నీటిని వినియోగిస్తున్న తరుణంలో, భారీ వర్షాలు కురవడంతో కృష్ణా నది చెంతన ఉన్న వాగులు, వంకలు ఒక్కసారిగా పొంగాయి. ఇలా వచ్చిన వరద నీరంతా కడలి ఒడికి చేరుతోంది.

వాగుల నుంచి విలీనం

ఆంధ్రా-తెలంగాణ సరిహద్దుల్లో కురిసిన భారీ వర్షాలకు మునేరు, తదితర వాగులు ఉప్పొంగాయి. వివిధ వాగుల ద్వారా కృష్ణా నదిలోకి ఇప్పటి వరకు 8.4 టీఎంసీలకు పైగా వరద నీరు వచ్చి చేరింది. మునేరులో వారం వ్యవధిలో రోజు వారీగా పరిశీలిస్తే 24,500 క్యూసెక్కులు అధిక ప్రవాహంగా ఉంది. వజినేపల్లి నుంచి 1,500లు, బుడమేరు నుంచి 5,000 క్యూసెక్కుల ప్రవాహం ఉండగా, పాలేరు నుంచి స్వల్పంగా నదిలో విలీనమైంది.

వడివడిగా సాగు

ఉమ్మడి జిల్లాలో ముమ్మరంగా నాట్లు



ఈనాడు, అమరావతి

జిల్లా	(హెక్టార్లలో)	
	మొత్తం విస్తీర్ణం	నాట్లు వేసినవి
కృష్ణా	1,60,000	70,000
ఎన్టీఆర్	48,167	10,500
మొత్తం	2,08,167	80,500

జులై మూడు వారాలు ఎండలు మండిపోయాయి. నారు అందుబాటులో ఉన్నా నాటేసేందుకు నీరు లేని దైన్యం అన్నదాతను ఆవరించింది. కొద్ది రోజుల నుంచి విస్తారంగా వర్షాలు కురవడంతో రైతులు తేరుకుని నాట్లు వేసే పనిలో నిమగ్నమయ్యారు.

ఉమ్మడి కృష్ణా జిల్లాలో మొత్తం వరినాట్లు వేయాల్సిన భూమి 2,08,167 హెక్టార్లు. ఇందులో వర్షాలకు ముందు వరకు 60వేల హెక్టార్లలో మాత్రమే నాట్లు వేశారు. గత వారం రోజుల్లో నీరు సమృద్ధిగా ఉండడంతో మరో 20వేల హెక్టార్లలో నాట్లు పడ్డాయి. తిరువూరు, గంపలగూడెం, రెడ్డిగూడెం మండలాల్లో 70శాతం వరకు నాట్లు పూర్తి చేశారు. విజయవాడ గ్రామీణ పరిధిలో మొదలయ్యాయి. మచిలీపట్నం, పెడన, పామర్రు ప్రాంతాల్లో చివరి దశకు వచ్చాయి. ఎన్టీఆర్‌లో జగ్గయ్యపేట, పెనుగంచిప్రోలు కృష్ణాలో అవనిగడ్డ, నాగాయలంక ప్రాంతాల్లో అధిక శాతం నారు అందుబాటులో లేక ఇంకా పూర్తి స్థాయిలో మొదలు కాలేదు. ఆగస్టు నెలాఖరుకు నాట్లు పూర్తవుతాయని వ్యవసాయాధికారులు అంచనా వేస్తున్నారు.

కూలీలకు భారీ డిమాండ్..

గతేడాదితో పోల్చితే వారం పది రోజులు ఆలస్యంగా నాట్లు పడుతున్నాయి. ముందస్తు వర్షాలు కురుస్తాయని అంచనాలున్నా వరుణుడు కరుణించలేదు. దీంతో నాట్లు పెద్దగా వేయలేదు. గన్నవరం, ఉంగుటూరు మండలాల్లో వందల ఎకరాల్లో వెద పద్ధతిలో నాట్లు వేసిన పంటలు ఎండ దెబ్బకి ఎందుకూ కొరగాకుండా పోయాయి. దీంతో అసలు పంట వేయని వారు, పంట నష్టపోయిన వారూ ఒకేసారి నాట్లు వేస్తున్నారు. కూలీల ఎద్దడితో రేట్లు బాగా పెంచేశారు. ఎకరానికి రూ.4,500 నుంచి రూ.5,000 వరకు తీసుకుంటున్నారు. ఎరువులు, పురుగు మందుల ధరలు పెరుగుతున్న నేపథ్యంలో ఇది గోరుచుట్టుపై రోకటి పోటులా మారింది. మరోవైపు రోజువారీ కూలీలకు చేతినిండా పని దొరకడంతో సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఎకరాల ప్రకారం ఒప్పందం చేసుకొని పనులు సాగిస్తున్నారు. బెంగాల్ కూలీలు భారీగా దిగారు. తిరువూరు, జగ్గయ్యపేట, నందిగామ తదితర ప్రాంతాలకు తెలంగాణ సరిహద్దు కావడంతో అక్కడ నుంచి కూడా కూలీలు వస్తున్నారు.

కొరత రాకుండా ప్రణాళికలు..

వరి నాట్లు వేగంగా పడుతున్న నేపథ్యంలో అన్నిచోట్లా ఒకేసారి ఎరువుల అవసరం ఉంటుంది. దీనిపై ఉమ్మడి జిల్లాల అధికారులు ప్రణాళికలు సిద్ధం చేసుకుంటున్నారు. సాగు విస్తీర్ణం, ఆయా సమయాల్లో ఏఏ ఎరువులు ఎంత మేరకు అవసరం అన్న అంశంపై అంచనాలు సిద్ధం చేశారు. ఎరువులు, పురుగు మందులు రైతు సేవా కేంద్రాలు, వ్యవసాయ సహకార పరపతి సంఘాలు, ప్రైవేటు డీలర్ల వద్ద ఉంచేలా చర్యలు చేపట్టారు.

పీఎంశ్రీతో మారిన దశ

జడ్పీ ఉన్నత పాఠశాలల్లో సౌకర్యాల కల్పన

నందిగామ గ్రామీణం, న్యూస్‌టుడే

ప్రధాన మంత్రి స్కూల్స్ ఫర్ రైజింగ్ ఇండియా(పీఎంశ్రీ) పథకంతో ఉన్నత పాఠశాలల్లో సౌకర్యాలు ఏర్పడుతున్నాయి. విద్యార్థుల దినచర్యలు దశల వారీగా ఈ పథకంలో ఎంపికైన పాఠశాలలను ఎంపికచేసిన విద్యార్థులకు క్రీడా వసతులు, సైన్స్ ల్యాబ్‌లు, వృత్తి శిక్షణ, శుద్ధ జలం వంటి సౌకర్యాలు కల్పిస్తున్నారు. ఈ పథకంలో ఇప్పటికే కొన్ని పాఠశాలల్లో క్రీడా వసతులు, వృత్తి శిక్షణ కొనసాగుతున్నాయి. మిగిలిన సౌకర్యాలు కూడా కల్పిస్తే పేద విద్యార్థులకు కార్పొరేట్ పాఠశాలలకంటే మెరుగైన వసతులతో విద్యాబోధన సాధ్యపడుతుంది.

జిల్లాలో ఈ పథకం ద్వారా ఇప్పటి వరకు 29 జడ్పీ ఉన్నత పాఠశాలలను ఎంపిక చేశారు. వీటిలో వసతులు కల్పించడానికి రూ.6.72 కోట్లు కేటాయించారు. ఇందులో రూ.4.71 కోట్లు మంజూరు చేయగా... రూ.2.23 కోట్లు మాత్రమే ఖర్చు పెట్టి సౌకర్యాలు కల్పించారు. పీఎంశ్రీ నిధులతో సైన్స్ ల్యాబ్‌లు, డిజిటల్ బోర్డులు, ఎల్ఈడీ దీపాలు, గ్రంథాలయాలు, క్రీడా మైదానాల అభివృద్ధి, కిచెన్ గార్డెన్ ఏర్పాటు, ఇంకుడుగుంతల తవ్వకం, దివ్యాంగుల కోసం ర్యాంప్‌లు నిర్మించడం తదితర 14 రకాల సౌకర్యాలు కల్పించాలి.

విడతల వారీగా నిధులు: నందిగామ జడ్పీ ఉన్నత పాఠశాలలో ఇప్పటి వరకు రూ.8.47 లక్షలు ఖర్చుపెట్టి వాలీబాల్, బాల్‌బ్యాడ్మింటన్, నెట్‌బాల్ కోర్టులను అభివృద్ధి చేశారు. దివ్యాంగుల కోసం రెండు ర్యాంపులను నిర్మించారు. రెండు ఇంకుడుగుంతలు తవ్వించారు. సైన్స్ ల్యాబ్, మూడు అదనపు తరగతి గదులు నిర్మించారు. ★ లింగాలపాడు పాఠశాలలో రూ.4.25 లక్షలు ఖర్చుపెట్టి అవుట్‌డోర్ కబడ్డీ, వాలీబాల్, ఖోఖో కోర్టులు అభివృద్ధి చేశారు. తొమ్మిది, పది తరగతుల విద్యార్థులకు అగ్రికల్చర్, ఎలక్ట్రానిక్స్ వృత్తి విద్యా కోర్సుల్లో ఇద్దరు ఒకేషనల్ ఉపాధ్యాయులతో శిక్షణ ఇస్తున్నారు. ఈ పథకంలో ఒక్కో ప్రాథమిక పాఠశాలకు ఆవరణాన్ని బట్టి గరిష్ఠంగా రూ.1.50 కోట్లు, జడ్పీ పాఠశాలకు రూ.2.50 కోట్ల వరకు కేటాయిస్తారు. జరిగిన పనులు బట్టి నిధులు విడతల వారీగా విడుదల చేస్తారు.

ఎంపిక చేసిన పాఠశాలలు ఇవీ..

నందిగామ, లింగాలపాడు, చందర్లపాడు మండలం చింతలపాడు, ముప్పాళ్ల జడ్పీ ఉన్నత పాఠశాలలు, ఎ.కొండూరు మండలం కృష్ణారావుపాలెం ఏపీఎస్‌డబ్ల్యూఆర్ఎస్, జి.కొండూరు మండలం కుంటముక్కల ఏపీఎస్‌డబ్ల్యూఆర్ జూనియర్ కళాశాల, ఇబ్రహీంపట్నం మండలం మూలపాడు జడ్పీ ఉన్నత, జగ్గయ్యపేట ఏపీఎస్‌డబ్ల్యూఆర్ బాలికల, షేర్‌మహమ్మద్‌పేట జడ్పీ, కంచికచర్ల మండలం పెండ్యాల జడ్పీ, మైలవరం జడ్పీ బాలికల, వీరులపాడు మండలం అల్లూరు జడ్పీ, వత్సవాయి మండలం కంభంపాడు జడ్పీ, గంపలగూడెం ఏపీ మోడల్ పాఠశాల, కంచికచర్ల జడ్పీ తదితర 29 ఉన్నత పాఠశాలలను ఈ పథకం కింద ఎంపిక చేశారు.



నందిగామ పాఠశాలలో నిర్మించిన క్రీడా కోర్టులు

పనులు వేగవంతం చేయిస్తాం

పీఎంశ్రీ పథకం ఎంపిక చేసిన పాఠశాలల్లో పనులు కల్పిస్తున్నాం. ప్రస్తుతం 27 పాఠశాలల్లో అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయి. కొత్తగా ఎంపిక చేసిన రెండు పాఠశాలల్లో పనులు ప్రారంభం దశలో ఉన్నాయి. ఎంపిక చేసిన పాఠశాలల్లో పీఎంశ్రీ పేరుతో బ్యాంకు ఖాతా తెరిచి నిధులు మంజూరు చేస్తున్నాం. సమగ్రశిక్ష ఇంజినీరింగ్ అధికారులు పనులు పర్యవేక్షిస్తున్నారు.

– అశోక్, ఏఎంఓ సమగ్రశిక్ష

ఆరోగ్య పరిస్థితి మెరుగుకు ఎక్మో దోహదం



జ్యోతి వెలిగించి సదస్సు ప్రారంభిస్తున్న డాక్టర్ దేవానంద తదితరులు

లబ్బీపేట(విజయవాడ సిటీ), న్యూస్‌టుడే : క్రిటికల్ కేర్‌లో అధునాతన పరికరం ఎక్మో అని, ఊపిరితిత్తులు, గుండె పనితీరు క్షీణించినప్పుడు ఎక్మోపై ఉంచి రోగికి చికిత్స అందించవచ్చని మణిపాల్ హాస్పిటల్స్ ఛైర్మన్ డాక్టర్ సునీల్ కారంత్ అన్నారు. మణిపాల్ హాస్పిటల్స్, ఇండియన్ మెడికల్ అసోసియేషన్ విజయవాడ శాఖ సహకారంతో 'మాస్టరింగ్ ఎక్మో' అనే అంశంపై కంటిన్యూయింగ్ మెడికల్ ఎడ్యుకేషన్ (సీఎంఈ) సదస్సు విజయవాడ ఎంజీ రోడ్డులోని ఓ హోటల్లో ఆదివారం నిర్వహించారు. అనంతరం మణిపాల్ హాస్పిటల్ (బెంగళూరు) కార్డియోవాస్కులర్ సర్జరీ హెచ్‌ఓడీ డాక్టర్ దేవానంద్, ఏపీ కార్డియాలజిస్ట్ డాక్టర్ ఎన్.మురళీకృష్ణన్, మెడికల్ సర్వీసెస్ హెడ్ డాక్టర్ ఉత్తమశర్మ, ఐఎస్‌సీసీఎం అధ్యక్షుడు డాక్టర్ శ్రీనివాస్ సామవేదం (హైదరాబాద్), డాక్టర్ కార్తీక్ హనుమాన్‌శెట్టి (బెంగళూరు), ఐఎంఏ ఎగ్జిక్యూటివ్ సభ్యుడు డాక్టర్ బీవీఎస్‌వీ ప్రసాద్ ఎక్మోలో అధునాతన పద్ధతులు, నూతన ఆవిష్కరణల గురించి వివరించారు. వి-వి, వి-ఏ ఎక్మో పద్ధతుల నుంచి కేస్-ఆధారిత చర్చలు, వ్యూహాలు, గుండె మార్పిడికి వినియోగించే బ్రిడ్జింగ్ వంటి కష్టతరమైన సంరక్షణ అంశాల గురించి విశ్లేషణాత్మకంగా చర్చించారు.



కృష్ణా నది పవిత్ర జలాలతో జైనుల ప్రదర్శన



హాజరైన మహిళలు

శ్రావణం.. భక్తి పరవశం

కరెన్సీనగర్, న్యూస్‌టుడే: శ్రావణ మాసాన్ని పురస్కరించుకొని స్థానిక గురునానక్ కాలనీ శివాలయంలో కొలువైన శ్రీబాల గణేష్, పార్వతీ సమేత రామలింగేశ్వర స్వామికి ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. విజయవాడ మార్వాడీ సమ్మేళన్, శివశక్తి మండలి ఆధ్వర్యంలో మధ్యాహ్నం కృష్ణా నది జలాలను తీసుకుని కావిడి యాత్ర.. స్వర్ణాలు చేసుకుంటూ బందరు రోడ్డు, జాతీయ రహదారి మీదుగా గురునానక్ కాలనీకి చేరుకున్నారు. అనంతరం తీసుకొచ్చిన కృష్ణా జలాలను స్వామి వారికి అభిషేకం చేశారు. పెద్ద సంఖ్యలో మార్వాడీలు, సింధీలు పాల్గొన్నారు.

రజక సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా రామకృష్ణ

లబ్బీపేట(విజయవాడ సిటీ), న్యూస్‌టుడే : నగరంలోని ఓ హోటల్లో ఆంధ్రప్రదేశ్ రజక సేవా సంఘం రాష్ట్ర కార్యవర్గ సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. రాష్ట్ర అధ్యక్షుడిగా కొండపల్లి రామకృష్ణ, ప్రధాన కార్యదర్శిగా నాగరాజు, కోశాధికారిగా ఎ.దుర్గాప్రసాద్, సంయుక్త కార్యదర్శి, సోషల్ మీడియా ఇన్‌ఛార్జిగా ఎన్.రాజు, గౌరవ సలహాదారులుగా జి.సత్యనారాయణ, కె.రామ్మోహన్, ఉపాధ్యక్షులుగా జి.లక్ష్మీరంగయ్య, సీహెచ్ నాగేశ్వరరావు, న్యాయ సలహాదారుగా టి.శ్రీధర్‌లతో కూడిన కార్యవర్గాన్ని నియమించినట్లు సంఘం వ్యవస్థాపకుడు కేతిగుంట్ల సుబ్బారాయుడు తెలిపారు. రెండు సంవత్సరాలు కార్యవర్గం పదవిలో కొనసాగుతుందని చెప్పారు.



నూతన కార్యవర్గ సభ్యులు

రాష్ట్రాభివృద్ధిపై అసెంబ్లీలో చర్చిద్దాం రండి

జగన్‌కు తిరువూరు ఎమ్మెల్యే కొలికపూడి సవాల్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రీనివాసరావు

తిరువూరు, గంపలగూడెం, న్యూస్‌టుడే: రాష్ట్రానికి పెట్టుబడులు తీసుకు వచ్చేందుకు సింగపూర్ పర్యటనలో సీఎం చంద్రబాబు చేస్తున్న ప్రయత్నాలపై ప్రజల దృష్టి పడకుండా ఉండేందుకు జగన్‌మోహన్ రెడ్డి తన పత్రికలో తప్పుడు కథనాలు రాయిస్తున్నారని ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు మండిపడ్డారు. తిరువూరులోని తన కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో ఆర్థిక పరిస్థితి దారుణమని, సంక్షోభంలో ఉందని జగన్ దురుద్దేశ పూర్వకంగా తన పత్రికలో కథనం రాయించారన్నారు. గత వైకాపా ప్రభుత్వం చేసిన అప్పులు గుర్తించేందుకే ఎన్డీయే ప్రభుత్వానికి ఆరు నెలల సమయం పట్టిందన్నారు. రాష్ట్ర సొంత ఆదాయం 3.47 శాతం పెరిగిందని జగన్ ఒప్పుకొంటూనే ఆర్థిక సంక్షోభం అంటూ అసత్య ప్రచారాలు చేయిస్తున్నట్లు ఆగ్రహించారు. జగన్ ఐదేళ్ల పాలనలో ప్రతి మంగళవారం ఆర్‌బీఐ నుంచి అప్పు తీసుకునే పాలన చేశారని గుర్తు చేశారు. వైకాపా పాలన, ఎన్డీయే పాలనలో రాష్ట్ర అభివృద్ధిపై మాట్లాడేందుకు అసెంబ్లీకి రావాలని జగన్‌కు సవాల్ విసిరారు.

కలాం సేవలు మరువలేనివి



చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి దేవినేని

గొల్లపూడి, న్యూస్‌టుడే: మాజీ రాష్ట్రపతి, శాస్త్రవేత్త అబ్దుల్ కలాం దేశానికి అందించిన సేవలు మరువలేనివని మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు పేర్కొన్నారు. కలాం వర్ధంతి కార్యక్రమాన్ని గొల్లపూడిలోని కార్యాలయంలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కలాం జీవితాన్ని యువత ఆదర్శంగా తీసుకోవాలని కోరారు. దేశానికి నిస్వార్థంగా సేవలు అందించారని వెల్లడించారు. రాష్ట్రపతిగా ఆయన వ్యక్తిత్వం ప్రతి ఒక్కరిని ప్రభావితం చేసిందన్నారు. కలాం చిత్రపటం వద్ద పూల మాల వేసి నివాళులు అర్పించారు. తెదేపా నాయకులు పాల్గొన్నారు.

ప్రభుత్వం దృష్టికి మహిళా ఉద్యోగుల సమస్యలు

గాంధీనగర్: మహిళా ఉద్యోగుల సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తామని ఏపీ ఎన్జీవో రాష్ట్ర అధ్యక్షుడు ఎ.విద్యాసాగర్ అన్నారు. ఆదివారం గాంధీనగర్‌లోని సంఘ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఎన్జీవోలోని వివిధ విభాగాల మహిళా ఉద్యోగుల సమస్యల పరిష్కారంలో నాయకులు కీలకపాత్ర పోషించాలని సూచించారు. చైల్డ్ కేర్ లీవ్‌లో సాంకేతిక ఇబ్బందులను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామన్నారు. డీఏ బకాయిలు విడుదల చేయాలని కోరారు. వైద్య ఆరోగ్యశాఖలో అనవసర యాప్‌లను తొలగించాలని కోరారు. కార్యక్రమంలో మహిళా సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు వి.నిర్మలాకుమారి, పి.మాధవి, శివలీల, లలితాంబ, బి.తులసీ రత్నం పాల్గొన్నారు.

ఉత్సాహంగా పవర్ లిఫ్టింగ్ పోటీలు

రేవేంద్రపాడు(దుగ్గిరాల), న్యూస్‌టుడే: బాలబాలికల్లో క్రీడల్లో రాణించడం ద్వారా మరింత ఉన్నత స్థాయికి వెళ్లాలని రేవేంద్రపాడు హైస్కూలు హెచ్‌ఎం టీవీ కృష్ణారావు అన్నారు. అమరావతి పవర్‌లిఫ్టింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో దుగ్గిరాల మండలం రేవేంద్రపాడులో నిర్వహించిన రాష్ట్రస్థాయి సబ్‌జూనియర్, జూనియర్, సీనియర్, మాస్టర్ పవర్‌లిఫ్టింగ్, బెంచ్ ప్రెస్, స్క్వాట్ పోటీలు స్కూలు పీడీలు శిరీష, రాంబాబుల పర్యవేక్షణలో ఆదివారం రాత్రి ముగిశాయి. అనంతరం జరిగిన బహుమతి ప్రదానోత్సవ సభలో పలువురు వక్తలు మాట్లాడారు. క్రీడల్లో ప్రతిభ కనబరిచిన వారికి కూటమి ప్రభుత్వం 3 శాతం రిజర్వేషన్ ఇచ్చి ప్రోత్సహిస్తోందని ఉపయోగించుకోవాలని దుగ్గిరాల మార్కెట్ కమిటీ పాలకవర్గ సభ్యుడు కాసరనేని జశ్వంత్ చెప్పారు. ఎంపీటీసీ సభ్యుడు కొప్పులు మధుబాబు, స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి మెల్లెంపూడి రవి, అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు మహేష్ బాబు, దినేష్‌బాబు, రాష్ట్ర మాజీ అధ్యక్షురాలు శ్రీదేవి, భాస్కరరావు, ఉపాధ్యాయుడు బి.శ్రీనివాసరావు, ఆయా జిల్లాల కార్యదర్శులు పాల్గొన్నారు.



గెలుపొందిన కర్నూలు బాలికల జట్టు

ఓవరాల్ ఛాంపియన్లుగా కర్నూలు, కృష్ణా జట్లు

బాలికల్లో కర్నూలు జట్టు, బాలురులో ఉమ్మడి కృష్ణా జిల్లా జట్టు ఓవరాల్ ఛాంపియన్‌గా నిలిచాయి. గుంటూరు జిల్లా బాలురు, బాలికల జట్టు ద్వితీయస్థానాన్ని కైవసం చేసుకున్నాయి. బాలురు విభాగంలో విజయనగరం జిల్లా, బాలికల్లో ఉమ్మడి కృష్ణా జిల్లా జట్టు తృతీయ స్థానంలో నిలిచాయి.

బ్రాయిలర్ ధరలు (కిలో 1కి రూ.లలో)



వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -114 రిటైల్ ధర 136 చికెన్ విత్ స్కిన్ -197, చికెన్ స్కిన్‌లెస్ - 224.

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 122, 131, 142 చికెన్ విత్ స్కిన్ - 232 చికెన్ స్కిన్‌లెస్ - 242.

నెక్ సూచించిన కోడిగ్రుడ్ల ధర

ఈరోజు నెక్ విజయవాడ జోన్ సూచించే ప్లాస్టిక్ ట్రే ఫారం- గేటు గుడ్డు ధర 100 గుడ్లకు రూ. 475 (వాణిజ్యం & పరిశ్రమల సమాచారం కోసం) ★ నెక్ విజయవాడ. ఈరోజు ఫారం కోడి ధర కిలో రూ.90/-.

ఏషియన్ రోలర్ డెర్బీలో సత్తా



పతకంతో చేబోయిన ఆర్యాని

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే: దక్షిణ కొరియాలో జరుగుతున్న 20వ ఏషియన్ రోలర్ స్కేటింగ్ ఛాంపియన్‌షిప్‌లో విజయవాడకు చెందిన చేబోయిన ఆర్యాని రజత పతకంతో సత్తా చాటింది. ఈ నెల 24 నుంచి 30వ తేదీ వరకు జరుగుతున్న పోటీల్లో ఆదివారం జరిగిన రోలర్ డెర్బీలో ఆర్యాని ద్వితీయ స్థానంలో నిలిచింది. రాష్ట్రం నుంచి ఏకైక క్రీడాకారిణిగా ఆర్యాని భారత సీనియర్ మహిళా రోలర్ డెర్బీ జట్టుకు ప్రాతినిధ్యం వహించిందని రాష్ట్ర రోలర్ స్కేటింగ్ సంఘం ఉపాధ్యక్షుడు బచ్చు మురళీకృష్ణ తెలిపారు. కృష్ణా జిల్లా రోలర్ స్కేటింగ్ సంఘం గౌరవాధ్యక్షుడు డి.దుర్గాప్రసాద్, అధ్యక్షుడు జె.దుర్గాప్రసాద్, ప్రధాన కార్యదర్శి డి.శ్రీనివాసరెడ్డి, కోశాధికారి షోమ్ తాతియా తదితరులు ఆమెను అభినందించారు.

బాక్సింగ్ సంఘం సంయుక్త కార్యదర్శిగా ఉమామహేశ్వరరావు



విజయవాడ క్రీడలు : రాష్ట్ర బాక్సింగ్ సంఘం సంయుక్త కార్యదర్శిగా విజయవాడకు చెందిన వైవీఎస్ ఉమామహేశ్వరరావు ఎన్నికయ్యారు. విశాఖలో ఆదివారం రాష్ట్ర బాక్సింగ్ సంఘం సర్వసభ్య సమావేశం, నూతన కమిటీ ఎన్నిక నిర్వహించారు. ఎన్టీఆర్ జిల్లా నుంచి ఉమామహేశ్వరరావు పోటీకి దిగి విజయం సాధించారు. ఆయన ప్రస్తుతం ఎన్టీఆర్ జిల్లా బాక్సింగ్ సంఘం కార్యదర్శిగా కొనసాగుతున్నారు. ఉమామహేశ్వరరావును పలువురు అభినందించారు

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

మహిళా చెస్ ఛాంప్ శ్రావ్యశ్రీ

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే: నగరంలోని ఆచార్య ఇన్‌స్టిట్యూట్‌లో రెండు రోజుల పాటు జరిగిన రాష్ట్ర స్థాయి సీనియర్ మహిళల చెస్ ఛాంపియన్‌షిప్‌లో అనకాపల్లి జిల్లాకు చెందిన భీమరశెట్టి శ్రావ్యశ్రీ ఛాంపియన్‌గా నిలిచింది. ఏడు రౌండ్ల పాటు జరిగిన పోటీలో కృష్ణా జిల్లాకు చెందిన మహిళా ఫిడే మాస్టర్ పొట్లూరి సుప్రీత, ఎన్టీఆర్ జిల్లాకు చెందిన చీదెళ్ల శర్వాణి, మహిళా ఫిడే మాస్టర్ గోలి లాస్య తర్వాత మూడు స్థానాలు సొంతం చేసుకున్నారు. ఆదివారం ముగింపు కార్యక్రమానికి ఏసీపీ (పశ్చిమ) ఎన్ఎస్‌వీకే దుర్గారావు ముఖ్యఅతిథిగా హాజరై విజేతలకు ట్రోఫీలు బహూకరించారు. రాష్ట్ర చెస్ సంఘం అధ్యక్షుడు ఎ.సురేష్, నిమ్మగడ్డ శౌరయ్య, ఎన్.ప్రకాశరావు, ఎండీ అక్బర్ పాషా, ఎం.రాజీవ్, ఎన్ఎం ఫణికుమార్ పాల్గొన్నారు. తొలి నాలుగు స్థానాల్లో నిలిచిన క్రీడాకారిణులు రాష్ట్ర జట్టుకు ఎంపికయ్యారని ఎ.సురేష్ ప్రకటించారు.



విజేతలతో అతిథులు దుర్గారావు, సురేష్ తదితరులు

స్థల విషయంలో ఇరువర్గాల వివాదం



ఘర్షణ పడుతున్న వారితో మాట్లాడుతున్న ఎస్సై

నెమలి (గంపలగూడెం), న్యూస్‌టుడే: మండలంలోని నెమలిలో స్థల వివాదం మరో సారి ఇరువర్గాల మధ్య వివాదానికి దారి తీసింది. గ్రామానికి చెందిన కె.బాలస్వామి, ప్రసాద్‌కు అదే గ్రామానికి చెందిన టి.రఘు కుటుంబాల మధ్య ప్రధాన రహదారి పక్కన స్థలం, అందులో పక్కా భవన నిర్మాణాల హక్కులపై గత కొన్నేళ్లుగా వివాదం జరుగుతోంది. గతంలో పలుసార్లు ఇరువర్గాలు మధ్య, ఘర్షణలు, పోలీసులకు ఫిర్యాదులు చేసుకున్న ఘటనలు ఉన్నాయి. ఆదివారం కూడా బాలస్వామి, రఘు కుటుంబాల మధ్య గొడవ జరిగింది. ఆ స్థలంలో నిర్మించిన దుకాణం ఖాళీ చేయించి స్వాధీన పరుచుకునే ప్రయత్నంలో ఇరువర్గాల మధ్య తోపులాట జరిగి కొంత సేపు ఉద్రిక్తతకు దారితీసింది. సమాచారం అందగానే గంపలగూడెం, తిరువూరు ఎస్సైలు శ్రీను, సత్యనారాయణ తమ సిబ్బందితో నెమలి చేరుకుని ఘర్షణ పడుతున్న వారిని పంపించేశారు. ఆ స్థలం హక్కు దారులు ఎవరో చట్టపరంగా తేల్చుకోవాలని ఘర్షణలకు పాల్పడితే చర్యలు ఉంటాయని వారిని హెచ్చరించారు. పోలీస్ పికెట్ ఏర్పాటు చేసినట్లు ఎస్సై తెలిపారు.

కార్మికులకు పథకాలు అమలు చేయండి

గాంధీనగర్: భవన నిర్మాణ కార్మికులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు చేయాలని ఇఫ్టూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.రామకృష్ణ కోరారు. ఏపీ బిల్డింగ్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఆదివారం ప్రెస్ క్లబ్‌లో నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు కార్మికులకు ఇచ్చిన అన్ని హామీలు విస్మరించిందని విమర్శించారు. ఇతర రాష్ట్రాల్లో కార్మికులకు అన్ని ప్రయోజనాలు కల్పిస్తుండగా రాష్ట్ర ప్రభుత్వం మాత్రం పట్టించుకోవడం లేదని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఇఫ్టూ నాయకులు షేక్ మీరావలి, కె.వి.రమణ, కొప్పుల కుమార్, కె.రవిచంద్ర, చారి పాల్గొన్నారు.

'ఉన్మాదుల చర్యను ఖండిస్తున్నాం'

గాంధీనగర్, న్యూస్‌టుడే : 'మదనపల్లి మండలం, అంకిశెట్టిపల్లి సమీపంలోని బుద్ధునికొండ విహారంలో గత 21 ఏళ్లుగా ఆధ్యాత్మిక, మానవ కేంద్రంగా బుద్ధ విహారాన్ని కోట్లాది రూపాయలతో అభివృద్ధి చేశారు. ఇటీవల కొంత మంది ఉన్మాదులు దాడులు చేసి విగ్రహాలను ధ్వంసం చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని' సమతా సైనిక్ దళ్ రాష్ట్ర అధ్యక్షుడు బేతాళ సుదర్శనం అన్నారు. ఆదివారం ప్రెస్ క్లబ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ ఘటనపై ప్రభుత్వం ప్రత్యేక దర్యాప్తు బృందం ఏర్పాటు చేయాలని, నిందితులను గుర్తించి కఠినంగా శిక్షించాలని, బౌద్ధులపై ప్రయోగించిన సెక్షన్ 129ను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పోలీసు అధికారుల మృతికి సంతాపం

విజయవాడ నేరవార్తలు, న్యూస్‌టుడే : తెలంగాణ రాష్ట్రం చౌటుప్పల్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇంటెలిజెన్స్ సెక్యూరిటీ వింగ్ డీఎస్పీలు ఎం.చక్రధరరావు, జె.శాంతారావు మృతి చెందడం బాధాకరమని కృష్ణా, ఎన్టీఆర్ జిల్లా రిటైర్డ్ పోలీస్ ఆఫీసర్స్ అసోసియేషన్ పేర్కొంది. ఈ మేరకు అధ్యక్ష, కార్యదర్శులు ఎ.ఎస్.ఎన్.రెడ్డి, టి.హరికృష్ణలు ఒక ప్రకటనలో సంతాపం తెలియజేశారు. నిరంతరం ప్రజలకు సేవలు అందిస్తూ రోడ్డు ప్రమాదంలో మరణించడం బాధాకరమన్నారు. వారి కుటుంబ సభ్యులకు అసోసియేషన్ తరపున ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. గాయపడిన అధికారులు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

తిరువూరు
• తిరువూరు • మైలవరం

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM
తిరువూరు: 98853 28820 మైలవరం: 80085 74705

? బాలుర ఉన్నత పాఠశాల పక్కన మురుగు కాలువల్లో పూడిక తీయక పోవడంతో మురుగు పారక ఇబ్బందులు పడుతున్నాం. - **వెంకటేశ్వరరావు, మైలవరం** ✔ పూడిక తీయిస్తాం. - **ఉమామహేశ్వరరావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్**
– న్యూస్‌టుడే, మైలవరం

విద్యుత్తు సరఫరాకు అంతరాయం నేడు

గంపలగూడెం, న్యూస్‌టుడే: మండలంలోని తోటమూల రింగ్ నుంచి మధిర రోడ్డు వరకు సోమవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు కొత్త లైన్ల నిర్మాణం కోసం విద్యుత్తు సరఫరా ఆపేస్తున్నట్లు ఏఈ కె.వాసు తెలిపారు.

రహదారుల అభివృద్ధికి మంత్రి హామీ

కొండపర్వ(విస్సన్నపేట), న్యూస్‌టుడే: రాష్ట్ర గృహ నిర్మాణ, పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి ఆదివారం మధ్యాహ్నం మండలంలోని కొండపర్వలో కొద్దిసేపు ఆగి స్థానిక తెదేపా నాయకులతో ముచ్చటించారు. తన నియోజకవర్గ పరిధిలోని నూజివీడు నుంచి చాట్రాయి వెళ్తూ మార్గమధ్యంలో ఆగారు. అనంతరం ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులర్పించారు. కాలనీ గృహాలు మంజూరు, రహదారుల అభివృద్ధి తదితర అంశాలను పార్టీ నాయకులు ఆయన దృష్టికి తీసుకెళ్లగా.. పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. తెదేపా మండలాధ్యక్షుడు ఆర్.సుబ్బారావు, మాజీ అధ్యక్షుడు ఎం.వేణుగోపాల్, జి.సుబ్రహ్మణ్యేశ్వరరావు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు


గంగినేనిలో ఎన్టీఆర్ విగ్రహ ఆవిష్కరణలో ఎమ్మెల్యే కృష్ణప్రసాద్ తదితరులు

జి.కొండూరు, న్యూస్‌టుడే: కూటమి పాలనలో పక్షపాతం లేకుండా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నామని ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ అన్నారు. గంగినేని గ్రామంలో ఆదివారం స్థానిక నాయకులతో కలిసి 'సుపరిపాలనకు తొలి అడుగు' కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. తొలుత గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఎన్టీఆర్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. అనంతరం సొసైటీ బ్యాంకు త్రిసభ్య కమిటీ ప్రమాణ స్వీకారం, సీఎం సహాయ నిధి చెక్కుల పంపిణీ తదితర కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఇంటింటికీ తిరిగి సంక్షేమ కరపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో నియోజకవర్గ జనసేన ఇన్‌ఛార్జి అక్కల రామ్మోహన్‌రావు, ఎం.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. ★ కంచికచర్ల [illegible] ఆధ్వర్యంలో ఆదివారం సుపరిపాలనకు తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. మండల అధ్యక్ష కార్యదర్శులు పజ్జూరు రవికుమార్, లంకా రామకృష్ణ, ఏఎంసీ మాజీ ఛైర్మన్ వెంకట నరసింహారావు, గ్రామ పార్టీ అధ్యక్షుడు అలూరి రాజాబాబు, సర్పంచి శ్రీదేవి దంపతులు తదితరులు పాల్గొన్నారు.

కొండపర్వ(విస్సన్నపేట), న్యూస్‌టుడే: మండలంలోని కొండపర్వలో ఆదివారం తెదేపా జిల్లాధ్యక్షుడు, కేడీసీసీ బ్యాంక్ ఛైర్మన్ నెట్టెం రఘురామ్ స్థానిక నాయకులతో కలిసి సుపరిపాలనకు తొలి అడుగు కరపత్రాలు పంపిణీ చేశారు. పలు గృహాలకు వెళ్లి ఏడాది కాలంలో ఎన్డీయే ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి తదితర అంశాలపై వివరించారు. పార్టీ మండలాధ్యక్షుడు ఆర్.సుబ్బారావు, మాజీ అధ్యక్షుడు ఎం.వేణుగోపాల్, నాయకులు జి.సుబ్రహ్మణ్యేశ్వరరావు, సీహెచ్ రాజేంద్రప్రసాద్, కె.శ్రీనివాసరావు, పి.శ్రీనివాసరావు, ఎ.మల్లి పాల్గొన్నారు.


విస్సన్నపేట: కొండపర్వలో..

చెరువుకు నీరు.. చేరిన నారు

★ అన్నదాతల్లో ఆనందం
★ వేల ఎకరాల్లో నాట్లకు సిద్ధం

మైలవరం, న్యూస్‌టుడే

ఖరీఫ్ సీజనుకు పచ్చని పైరు కళ వచ్చింది. నిరాశాజనకంగా మొదలైన తొలకరి వాన, ఇటీవల భారీ వర్షాలతో లోటు పూడ్చుకుంది. నాలుగైదు రోజుల పాటు నియోజకవర్గవ్యాప్తంగా భారీ వర్షాలు పడడంతో, చెరువులకు జలకళ వచ్చింది. లోటు వర్షపాతాన్ని అధిగమించడంతో, వరినాట్లు వేయడానికి అన్నదాతలు సన్నాహాలు ప్రారంభించారు.


నాటుకు సిద్ధంగా పైరు

నియోజకవర్గంలోని నాలుగు మండలాల పరిధిలో నాలుగు రోజుల్లోనే సుమారు 120 మి.మీ.ల వర్షపాతం నమోదైంది. అంతకుముందు సాధారణ వర్షపాతం కూడా లేకపోవడంతో అన్నదాతలు ఆశలు సన్నగిల్లాయి. దాంతో మెట్ట భూముల్లో [illegible] నారు పోసినా, వర్షాభావం లోలోపల ఆందోళన రేకెత్తించింది. గత వారం రోజుల్లోనే లోటును పూడ్చేలా కురిసిన వర్షాలతో నాట్లకు సిద్ధమయ్యారు. తాజా వర్షాలతో మొన్నటి వరకు నీరు లేక ఒట్టిపోయిన చెరువులు నేడు కళకళలాడుతున్నాయి. నియోజకవర్గంలోనే అత్యధికంగా వరి సాగు చేసే రెడ్డిగూడెం మండలంలో ఇప్పటికే సగానికి పైగా గ్రామాల్లో 30 శాతం వరకు నాట్లు పూర్తి చేశారు. ఇబ్రహీంపట్నం మండలంలోనూ సాగుతుండగా, మైలవరం, జి.కొండూరు, మండలాల్లో గత రెండ్రోజులు దమ్ము తొక్కుతూ నాటుకు సిద్ధం చేస్తున్నారు.


మైలవరంలో సరంజామాతో వచ్చిన పశ్చిమ బెంగాల్ కూలీలు

పట్టిసీమతో కళ

అన్నదాతలకు పట్టిసీమ ఎత్తిపోతల వరంలా మారగా, గడచిన రెండు వారాలుగా నీటి సరఫరాతో జి.కొండూరు మండలంలోని వెలగలేరు, కవులూరు, ముత్యాలంపాడు వంటి గ్రామాల్లో రైతులు నాట్లకు సిద్ధమయ్యారు. గోదావరి నీటి తరలింపు వల్ల దిగుబడులు సైతం సాధారణాన్ని మించి ఉండడంతో, వరి పొలాలకు ఆయా గ్రామాల్లో గిరాకీ పెరిగింది.

పొరుగు రాష్ట్రాల నుంచి కూలీలు

గత కొన్నాళ్లుగా ఒడిశా, పశ్చిమ బెంగాల్, అస్సాం తదితర రాష్ట్రాల నుంచి సైతం కూలీలు ఈ ప్రాంతాల్లో వరినాట్లకు వలస వస్తున్నారు. ఈ ఏడాది అన్ని ప్రాంతాల్లో ఒకేసారి నాట్లు వేసే అవకాశం ఉండడంతో, ఇతర రాష్ట్రాల కూలీలతో కొరత తీరుతుందని రైతులు భావిస్తున్నారు.

నియోజకవర్గంలో ఇలా..

సాధారణ విస్తీర్ణం	– 25 వేల ఎకరాలు
నాట్లు వేసింది	– 2 వేల ఎకరాలకు పైగా
ఎదజల్లు సాగు	– 15 శాతం వరకు

వైద్య శిబిరానికి స్పందన


చీమలపాడులో పరీక్షలు చేయించుకుంటున్న ప్రజలు

చీమలపాడు(ఎ.కొండూరు), న్యూస్‌టుడే: మండలంలోని చీమలపాడులో ఆదివారం విజయవాడ ఎంజే నాయుడు ఆస్పత్రి, స్థానికుడు ఎన్.రామకృష్ణ సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. డాక్టర్ జాఫర్ ఆధ్వర్యంలో వైద్యుల బృందం శిబిరంలో పాల్గొన్న వారికి ఎముకలు, రక్తపోటు, చక్కెర తదితర వ్యాధులకు పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. పలువురు తెదేపా నాయకులు తదితరులు పాల్గొన్నారు.

బ్యాడ్మింటన్‌లో ప్రతిభ


నాగూర్ పాషా

కొండపల్లి, న్యూస్‌టుడే: జాతీయ స్థాయి బధిరుల బ్యాడ్మింటన్‌లో కొండపల్లికి చెందిన నాగూర్ పాషా ప్రతిభ చాటి రన్నర్-అప్‌గా నిలిచారు. ఈ నెల 24 నుంచి 26 వరకూ చెన్నై రాయపేటలో బధిరుల బ్యాడ్మింటన్ ఛాంపియన్ షిప్ పోటీలు డీఈఎఫ్(డెఫ్ ఎనబుల్డ్ ఫౌండేషన్) ఆధ్వర్యంలో నిర్వహించారు. ఎన్టీటీపీఎస్‌లో ఒప్పంద కార్మికుడిగా విధులు నిర్వహిస్తున్న పాషా అండర్-18 విభాగంలో పాల్గొని ప్రతిభ కనబరిచారు. ఆదివారం కొండపల్లికి చేరుకొన్న అతడిని స్థానికులు, ముస్లిం పెద్దలు అభినందించారు.

ప్రతి ఒక్కరూ మొక్కలు పెంచాలి

కొండపల్లి, న్యూస్‌టుడే: కొండపల్లి 3వ సచివాలయం ఆవరణలో మెప్మా సభ్యులకు మొక్కల పెంపకంపై అవగాహన కార్యక్రమాన్ని సీటీజీ (సిటీస్ టెర్రాస్ గార్డెన్) సభ్యులు ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా మెప్మా సిటీ మిషన్ మేనేజర్ శ్రీధర్, కోఆర్డినేటర్ నరసమ్మలు సభ్యులను ఉద్దేశించి మాట్లాడారు. నగరంలో మొక్కలు పెంచాలన్నారు. కార్యక్రమంలో మెప్మా మహిళలు, సీటీజీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

కుట్టు శిక్షణతో ఆర్థిక భరోసా

ఇబ్రహీంపట్నం (గ్రామీణం, న్యూస్‌టుడే: మహిళలు చేతి వృత్తుల్లో నైపుణ్యం సాధించి ఆర్థికంగా ఎదగాలని కేతనకొండకు చెందిన గ్రేస్ మినిస్ట్రీస్ డైరెక్టర్ మోగులూరి ఏలీషా పేర్కొన్నారు. ఆ సంస్థ ఆధ్వర్యంలో ఐదు నెలలుగా నిర్వహించిన ఉచిత కుట్టు శిక్షణ శిబిరంలో శిక్షణ పొందిన 30 మంది మహిళలకు ఆదివారం కుట్టు మిషన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మహిళలు స్వయం ఉపాధి పొందేందుకు కుట్టు శిక్షణ ఇస్తున్నట్లు వివరించారు. మహిళలు విద్య, వైద్య రంగాల్లో ఎదిగేందుకు తమ సంస్థ చేయూత ఇస్తుందని వివరించారు. కార్యక్రమంలో మినిస్ట్రీస్ కార్యదర్శి సుమలత, పాస్టర్ పాల్, సంఘ పెద్దలు, శిక్షణ ఉపాధ్యాయులు, గ్రామస్థులు పాల్గొన్నారు.


శిక్షణ పొందిన మహిళలు, మినిస్ట్రీస్ డైరెక్టర్లు

మహిళలకు చీరల పంపిణీ

జి.కొండూరు, న్యూస్‌టుడే: సీఎస్ఐ చర్చి ఆవరణలో ఆదివారం ప్రవాస భారతీయులు బేతపూడి శ్రీనివాసరావు, దీప దంపతులు ఆర్థిక సాయంతో వృద్ధులు, వితంతువులకు చీరలు పంపిణీ చేశారు. ఏళ్ల తర్వాత స్వదేశానికి వచ్చినందుకు పంపిణీ చేశామని శ్రీనివాసరావు దంపతులు తెలిపారు. అనంతరం సంఘస్థులు బేతపూడి ఏసురత్నం, నిర్మల దంపతులు మిఠాయిలు పంచారు. కార్యక్రమంలో సంఘ కాపరి ఎం జాన్ కోటేశ్వరరావు, సర్పంచి ఎం.అరుణ, రాజు తదితరులు పాల్గొన్నారు.

అమ్మవార్లకు సారె సమర్పణ

జి.కొండూరు, న్యూస్‌టుడే: జి.కొండూరులో శ్రీ కోదండ రామాలయ విగ్రహ దాతలు పెదగమళ్ల వెంకటేశ్వరరావు, పద్మావతి దంపతుల కుటుంబ సభ్యులు నాగరాజు నాగరాణి దంపతులు అమ్మవార్లకు ఆదివారం శ్రావణ మాస సారె సమర్పించారు. తొలుత గ్రామంలోని అమృత లింగేశ్వరస్వామి సహిత పార్వతీ దేవికి, చెన్నకేశవస్వామి ఆలయంలో ఆండాళ్లమ్మ రాజ్యలక్ష్మి అమ్మవారికి అనంతరం కోదండ రామాలయంలో స్వామి వారికి నూతన వస్త్రాలు బహూకరించి సీతమ్మకు సారె సమర్పించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.


జి.కొండూరులో చెన్నకేశవస్వామి ఆలయంలో సారెతో భక్తులు

ఇంటింటా సర్వే

చీమలపాడు(ఎ.కొండూరు), న్యూస్‌టుడే: మండలంలోని చీమలపాడులో జ్వర బాధితులను గుర్తించేందుకు ఆరోగ్య శాఖ ఉద్యోగులు ఆదివారం ఇంటింటికీ పర్యటించి తనిఖీ చేశారు. గ్రామంలో బాబు అనే వ్యక్తి జ్వరంతో చనిపోయినట్లు కుటుంబ సభ్యులు వెల్లడించినట్లు నేపథ్యంలో జ్వరాలపై సర్వే చేయించారు. వివిధ మండలాల నుంచి ఆ శాఖ సిబ్బందిని ఇక్కడకు పంపించి 15 బృందాలుగా ఇంటింటా నీటి నిల్వలపై దోమల లార్వాలపై కూడా పరిశీలన చేయించారు. ఆదివారం జరిగిన సర్వేలో ఇద్దరికి సాధారణ జ్వరం ఉన్నట్లు గుర్తించి మందులు అందించారు. చీమలపాడు, కేశ్యాతండా, వల్లంపట్ల గ్రామాల్లో కూడా వైద్య శిబిరాలు ఏర్పాటు చేశారు. జ్వరం ఉంటే తమ సిబ్బందిని సంప్రదిస్తే వైద్య సదుపాయం ఏర్పాటు చేస్తారని ఆ శాఖ ఉన్నతాధికారులు తెలిపారు.


దోమల లార్వా పరిశీలిస్తున్న ఆరోగ్య శాఖ అధికారులు

» దారంతా బురదే..



మైలవరంలో రెండు దశాబ్దాల కిందట ఏర్పాటైన భవానీనగర్‌లో కనీస రహదారి సౌకర్యం లేక నివాసితులు తీవ్ర అవస్థలకు గురవుతున్నారు. వర్షమొస్తే నడవడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు ఆ ప్రాంతంలోని ప్రధాన రహదారిపై మోకాలి లోతు నీరు నిలిచింది. వర్షాలు తగ్గినా, బురద వీడలేదు. కనీసం ప్రధాన రహదారినైనా బాగు చేయాలని పంచాయతీ సిబ్బందికి, ప్రజాప్రతినిధులకు స్థానికులు విజ్ఞప్తులు చేస్తున్నారు. **- న్యూస్‌టుడే, మైలవరం**

» కృష్ణా జలాల వృథా



జి.కొండూరు శివారు పులివాగు వంతెన పక్కన కొత్తూరు వెళ్లే ప్రధాన రహదారి వెంట కృష్ణా జలాల పైపులైన్ లీకై నీరంతా వృథాగా పోతుంది. దీంతో అటు ప్రయాణించే పాదచారులు, వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. రహదారి పై లోతైన గుంత పడి ప్రయాణానికి అసౌకర్యంగా ఉందని గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నీరంతా వృథాగా పోతోందని పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ప్రయోజనం లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు పైపులైన్ మరమ్మతులు చేపట్టి నీటి వృథా అరికట్టాలని స్థానికులు కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, జి.కొండూరు**

» కట్ట కుంగుతోంది



గతేడాది వర్షాలకు భారీగా కోతకు గురైన కట్టు కాలువకు గండి పూడ్చిన మళ్లీ కోతకు గురవుతోంది. కొత్తగూడెం ఆంజనేయస్వామి ఆలయం సమీపంలో పడిన గండిని మరమ్మతుల్లో భాగంగా రెండు నెలల కిందట చెరువు మట్టితో గండిని పూడ్చారు. వారం కిందటి భారీ వర్షాలకు గండి పడిన ప్రాంతంలో పోసిన చెరువు మట్టి కుంగింది. మరోసారి భారీ వర్షం వస్తే కట్టకు మళ్లీ గండి పడే అవకాశాలు ఉన్నాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. **- న్యూస్‌టుడే, మైలవరం**

ఉపాధ్యాయులకు సత్కారం


భరతకుమారి, శంకరాచారితో నిర్వాహకులు

తిరువూరు, న్యూస్‌టుడే: అమరావతి సాంస్కృతిక ఉత్సవంలో కవితాగానం చేసిన తిరువూరు, ఎ.కొండూరు మండలాలకు చెందిన కవులు ఈడే వెంకట భరతకుమారి, విశ్వనాథుని శంకరాచారిని నిర్వాహకులు శాలువలతో సత్కరించి, ప్రశంసాపత్రం, జ్ఞాపికలు అందజేశారు. విజయవాడ బుక్ ఫెస్టివల్ సొసైటీలో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో తిరువూరు మండలం మునుకుళ్ల ఉన్నత పాఠశాల సైన్స్ ఉపాధ్యాయిని భరతకుమారి, రెడ్డిగూడెం ఉన్నత పాఠశాల తెలుగు ఉపాధ్యాయుడు శంకరాచారి పలు సామాజిక అంశాలను మేళవిస్తూ కవితాగానం చేసి నిర్వాహకుల ప్రశంసలు అందుకున్నారు. ఆర్ట్స్ ఫౌండేషన్ ఛైర్‌పర్సన్ బెల్లంకొండ విజయలక్ష్మి, సాంస్కృతిక ఉత్సవ నిర్వాహకులు పొట్లూరి హరికృష్ణ సదరు ఉపాధ్యాయులను సత్కరించారు.

రహదారిపై ప్రయాణాలు పునఃప్రారంభం


ప్రయాణికుల అవస్థలు

గంపలగూడెం, న్యూస్‌టుడే: కట్లేరులో వరద ఆదివారం తగ్గుముఖం పట్టింది. వినగడప సమీప వంతెన వద్ద మళ్లింపు రహదారిపై కూడా ప్రవాహం తగ్గింది. దీంతో ఆదివారం ఉదయం పాదచారులు, ద్విచక్ర వాహనదారుల రాకపోకలు పునఃప్రారంభమయ్యాయి. మధ్యాహ్నం నుంచి ఆటోలు, కార్లు, ట్రాక్టర్లు తిరుగుతున్నాయి. ఆర్‌అండ్‌బీ అధికారులు మళ్లింపు రోడ్డుకు మరమ్మతులు చేస్తే బస్సులు, లారీలు కూడా తిరిగే అవకాశాలు ఉన్నాయి. వరద తాకిడికి ధ్వంసమైన మళ్లింపు రహదారిపై రాకపోకలు సాగించేందుకు అవస్థలు పడ్డారు.

మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాంకు నివాళి

పెనుగొలను(గంపలగూడెం), న్యూస్‌టుడే: మండలంలోని పెనుగొలనులో ఆదివారం క్షిపణి శాస్త్రవేత్త, మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలాం వర్ధంతి నిర్వహించారు. ఆయన చిత్రపటానికి విద్యార్థులు, శిర్డీ సాయిబాబా సేవా కమిటీ సభ్యులు నివాళులర్పించారు. శాస్త్రవేత్తగా, రాష్ట్రపతిగా దేశానికి ఆయన అందించిన సేవలను వక్తలు వివరించారు.

రైతుబజార్ నిర్మాణం కలేనా?

జి.కొండూరు, న్యూస్‌టుడే

ప్రభుత్వాలు మారిన రైతుల ఆవేదన పట్టించుకునే దాఖలాలే లేవని మండలంలోని పలు గ్రామాల రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దాదాపు 800 ఎకరాల కూరగాయలు సేద్యం చేస్తున్న మండలంలో రైతుబజార్ లేకపోవడంతో తీవ్రంగా నష్టపోతున్నామని వాపోతున్నారు. లక్షల్లో పెట్టుబడి పెట్టి కనీస మద్దతు ధర కూడా లేక దళారుల చేతిలో మోసపోయి అప్పులు చేయాల్సిన పని వస్తోందని ఆందోళన చెందుతున్నారు. కూటమి ప్రభుత్వమైనా రైతుబజార్ నిర్మాణం చేపట్టి రైతులను ఆదుకోవాలని కోరుతున్నారు.

★ 2019లో అప్పటి జలవనరుల శాఖ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు రైతుబజార్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఎన్నికల అనంతరం వైకాపా ప్రభుత్వం రావడంతో రైతుబజార్ నిర్మాణం అటకెక్కింది. ★ వైకాపా పాలనలో రైతుల ఆశలపై అలానే మిగిలిపోయాయని కూరగాయలు సేద్యం చేసే రైతులు చెబుతున్నారు. తాము పండించిన కూరగాయలు దళారులకు అయినా కాడికి అమ్ముతున్నట్లు అన్నదాతలు విచారం వ్యక్తం చేస్తున్నారు.


గతంలో మాజీ మంత్రి ఉమామహేశ్వరరావు శంకుస్థాపన చేసిన శిలాఫలకం ఇలా..

అమ్మేందుకు అదనపు వ్యయం

మండలంలో కూరగాయల రైతులకు అనుకూలంగా రైతుబజార్ లేకపోవడంతో దూర ప్రాంతాలలోని విజయవాడ, మైలవరం, ఇబ్రహీంపట్నం రైతుబజార్లలో రైతులు పండించిన కూరగాయలు అమ్ముకునేందుకు వెళ్లాల్సి వస్తోంది. దీంతో సరైన రవాణా సౌకర్యాలు లేక ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోందని చెబుతున్నారు. కూరగాయలకు మద్దతు ధర లేకపోవడంతో పొలాల్లో పారబోసుకుని, దీంతో తీవ్ర నష్టాల పాలై అప్పుల్లో కూరుకు పోతున్నామని రైతులు ఆవేదన చెందుతున్నారు.

సేద్యం పెరుగుతుంది



కూరగాయల సేద్యం పెరగాలంటే మండల కేంద్రం జి.కొండూరులో రైతుబజార్ నిర్మాణానికి పూనుకోవాలి. దీంతో రైతుకు, వినియోగదారుకు లాభం. దూరం వెళ్లకుండా ఇక్కడే కొనుగోలు చేసే అవకాశం ఉంటుంది.
- గంపా శ్రీనివాసరావు

నిర్మిస్తే మేలు



తాము పండించిన కూరగాయలకు కనీస మద్దతు ధర కూడా లేకపోవడంతో కూరగాయలు సాగులో తీవ్ర నష్ట వాటిల్లుతోంది. రైతులు బజార్ నిర్మాణం చేపడితే మండలంలోని కూరగాయల రైతులకు మేలు జరుగుతోంది.
- నూతక్కి నాగేశ్వరరావు

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం


సుధాకర్ (పాత చిత్రం)

జి.కొండూరు, న్యూస్‌టుడే: చికిత్స పొందుతూ యువకుడు మృతి చెందిన ఘటనపై కేసు నమోదైంది. పోలీసుల వివరాల ప్రకారం.. భీమన సుధాకర్ (31) మండలంలోని చెవుటూరులో ఉంటూ మైలవరంలో ద్విచక్ర వాహన మెకానిక్‌గా చేస్తుంటారు. శుక్రవారం రాత్రి సమయంలో పని ముగించుకుని ద్విచక్ర వాహనంపై ఇంటికి బయలుదేరారు. చెవుటూరు శివారు వద్ద వాహనం అదుపు తప్పి కింద పడిపోగా తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు 108లో మైలవరం ప్రభుత్వాసుపత్రికి తరలించగా మెరుగైన వైద్యం నిమిత్తం విజయవాడలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. ఆదివారం ఉదయం చికిత్స పొందుతూ మృతి చెందాడు. అతడి తండ్రి రాము ఫిర్యాదు మేరకు జి.కొండూరు ఎస్సై కె సతీష్‌కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

అలరించిన నృత్య రూపకం

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే: ఇంద్రకీలాద్రిపై ధర్మపథం కార్యక్రమంలో భాగంగా చెన్నైకు చెందిన మధుర కళానికేతన్ కూచిపూడి డ్యాన్స్ అకాడమీ విద్యార్థులు ఆదివారం ప్రదర్శించిన నృత్యరూపకం భక్తులను అలరించింది. మహిషాసుర సంహారం కళ్లకు కట్టినట్లుగా వారు ప్రదర్శించారు. నృత్య రూపకంలో పాల్గొన్న విద్యార్థులకు దేవస్థానం అధికారులు ఆలయమర్యాదలతో అమ్మవారి దర్శనం చేయించి, ప్రసాదాలు అందజేశారు.

వరి నాట్ల పనుల్లో రైతులు


నరుకుళ్లపాడు గ్రామంలో నాట్లు వేస్తున్న కూలీలు

రెడ్డిగూడెం, న్యూస్‌టుడే: మండల పరిధిలో గ్రామాల్లో రైతులు నాట్లు వేసే పనుల్లో నిమగ్నమయ్యారు. ఇటీవల కురిసిన వర్షాలకు మెరక భూముల్లోకి వర్షం నీరు చేరడంతో రైతులు వరి పొలాలను దమ్ములు చేసి వరినాట్లు వేస్తున్నారు. పలు గ్రామాల్లో నార్లు పెంచిన రైతులు వరినాట్లు పూర్తి చేస్తున్నారు. నెల రోజుల కిందటే కొందరు వరి ఎదపెట్టే పద్ధతి ద్వారా వరి విత్తనాలు చల్లారు. దీని ద్వారా మండలంలో 1800 ఎకరాలు వేసినట్లు ఆదివారం మండల వ్యవసాయ అధికారి డి.శ్రీనివాసరావు తెలిపారు. వరి నారు పెంచి వేసే విధానం ద్వారా 1500 ఎకరాల్లో వరి నాట్లు వేశారన్నారు.

భక్తిశ్రద్ధలతో సూర్యోపాసన పూజ


క్రతువు నిర్వహిస్తున్న రుత్వికులు

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే: ఇంద్రకీలాద్రిపై రాజగోపుర ప్రాంగణంలో సూర్యోపాసన పూజను ఆదివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. సమస్త జీవరాశికి వెలుగు ప్రసాదించే సూర్యభగవానుడి చిత్రపటాన్ని ఉంచి వేదపండితుల మంత్రోచ్చారణల మధ్య అర్చకులు పూజ చేశారు. పూజలో పాల్గొన్న ఉభయదాతలకు దేవస్థానం సిబ్బంది ఆలయ మర్యాదలతో అమ్మవారి దర్శనం చేయించి ప్రసాదాలు అందజేశారు.

రోడ్లపైనే వర్షపు నీరు

ప్రజలకు తప్పని ఇబ్బందులు

చీమలపాడు(ఎ.కొండూరు), రెడ్డిగూడెం, న్యూస్‌టుడే

మండలంలోని చీమలపాడు వద్ద జాతీయ రహదారిపై ఏర్పడిన అతి పెద్ద గుంత ప్రమాదాలకు నెలవుగా ఉంది. అధికారులు మరమ్మతులు చేయకుండా గుంత మధ్యలో తారు డబ్బాలు అడ్డుగా పెట్టి చోద్యం చూస్తున్నారు. ఒకట్రెండు రోజులు కాదు ఏకంగా నెలల తరబడి నడి రోడ్డుపై గుంత సమస్య ఉన్న అధికారులకు చలనం లేదు. రోడ్డులో ఏర్పడిన అతిపెద్ద గుంతలో వర్షపు నీరు నిలిచి దోమల సంతతి పెరిగింది. దీంతో రోగాల బారిన పడుతున్నామని స్థానికులు వాపోతున్నారు. అధికారులు స్పందించి చీమలపాడులో జాతీయ రహదారిపై గుంతను పూడ్చించి ప్రజల ప్రాణాలకు రక్షణ కల్పించాలని గ్రామస్థులు కోరుతున్నారు.


చీమలపాడు వద్ద..

★ పాత నాగులూరు కాలనీలో సీసీ రహదారిపైకి చేరుతున్న వర్షం నీటితో కాలనీ వాసులు ఇక్కట్లు పడుతున్నారు. వర్షం వస్తే నీటిలో నుంచి వృద్ధులు, చిన్నారులు నడవాలంటే నానా అవస్థలు పడాల్సి వస్తుందని కాలనీ వాసులు వాపోతున్నారు. స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులకు విజ్ఞప్తి చేస్తున్న పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. దోమలు, ఈగలకు నిలయంగా మారి సీజనల్ వ్యాధుల బారిన పడాల్సివస్తుందని ఆందోళన చెందుతున్నారు. రోడ్డు పల్లంగా ఉండటంతోపాటు డ్రెయినేజీ సౌకర్యం లేకపోవడంతో నీరు అంతా అక్కడే నిలిచి పోతుందని చెబుతున్నారు.


పాతనాగులూరు కాలనీలో సీసీ రహదారిపై...

శ్రీవారి సేవలో గవర్నర్ అబ్దుల్ నజీర్



దర్శనానంతరం ఆలయం ఎదుట అబ్దుల్ నజీర్ దంపతులు. చిత్రంలో బీఆర్ నాయుడు, శ్యామలరావు, వెంకయ్యచౌదరి తదితరులు

తిరుమల, న్యూస్‌టుడే: తిరుమల శ్రీవేంకటేశ్వర స్వామివారిని గవర్నర్ అబ్దుల్ నజీర్ దంపతులు ఆదివారం దర్శించుకున్నారు. ఉదయం వీఐపీ బ్రేక్‌లో ఆలయం వద్దకు చేరుకున్న గవర్నర్‌కు తితిదే ఛైర్మన్ బీఆర్ నాయుడు, ఈవో శ్యామలరావు, అదనపు ఈవో వెంకయ్యచౌదరి, అర్చకులు ఇస్తికఫాల్ స్వాగతం పలికారు. ముందుగా ధ్వజస్తంభానికి నమస్కరించుకున్న గవర్నర్ దంపతులు.. అనంతరం శ్రీవారి మూలమూర్తిని దర్శించుకున్నారు. వారికి రంగనాయకుల మండపంలో వేదపండితులు ఆశీర్వచనం, తితిదే ఛైర్మన్, ఈవో శ్రీవారి తీర్థప్రసాదాలు, చిత్రపటం, డైరీలను అందించారు.

● శ్రీవారిని సీఎస్ కె.విజయానంద్ ఆదివారం దర్శించుకున్నారు. ఉదయం వీఐపీ బ్రేక్‌లో ఆలయం వద్దకు చేరుకున్న సీఎస్‌కు అధికారులు స్వాగతం పలికి మూలమూర్తి దర్శనం చేయించారు. అనంతరం రంగనాయకుల మండపంలో అర్చకులు వేదాశీర్వచనం, ఈవో శ్యామలరావు శ్రీవారి ప్రసాదాలు, డైరీ, క్యాలెండర్‌ను అందించారు.



విజయానంద్ దంపతులకు శ్రీవారి తీర్థప్రసాదాలు అందిస్తున్న శ్యామలరావు, చిత్రంలో వెంకయ్యచౌదరి



చుట్టూ ఉన్నవారు మీకు స్ఫూర్తినిస్తున్నారా?

ఆఫీసులో, బయట మీ చుట్టూ ఉంటున్న వ్యక్తులను ఒకసారి బాగా గమనించండి. వారిలో కొందరినైనా చూసి మీరు స్ఫూర్తి పొందే పరిస్థితి లేకపోతే- మీరుంటున్నది మెరుగైన పరివారంలో కాదు.. బోనులో! దాన్నుంచి త్వరగా బయటపడేందుకు ప్రయత్నించండి.
– లెవిస్ హోవెస్, రచయిత

సింగపూర్‌లో చంద్రబాబు రెండో రోజు పర్యటన ఇలా..

ఎయిర్‌బస్, హనీవెల్, ఎవర్‌వోల్ట్ ప్రతినిధులతో సమావేశాలు

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలో పోర్టులు, నగరాలు, క్రీడల అభివృద్ధే లక్ష్యంగా సింగపూర్‌లో రెండో రోజు సోమవారం ముఖ్యమంత్రి చంద్రబాబు పర్యటించనున్నారు. పలువురు ప్రభుత్వ, ప్రైవేటు సంస్థల ప్రతినిధులతో సీఎం బృందం సమావేశం కానుంది.

● ఉదయం 7 గంటలకు (భారత కాలమానం ప్రకారం) ట్రెజరీ బిల్డింగ్‌లో సింగపూర్ వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి డా. టాన్‌సీలెంగ్‌తో చంద్రబాబు భేటీ అవుతారు. విద్యుత్తు, సైన్స్ అండ్ టెక్నాలజీ, పారిశ్రామిక సహకారంపై చర్చిస్తారు.
● 8.30: ఎయిర్‌బస్ సంస్థ ప్రతినిధులు కృతీవాస్, వెంకట్ కట్కూరితో భేటీ.
● 9.00: హనీవెల్ సంస్థ ప్రతినిధులతో సమావేశం.
● 9.30- 11: బిజినెస్ రౌండ్‌టేబుల్ సమావేశం
● 11: ఎవర్‌వోల్ట్ ఛైర్మన్ మిస్టర్ సైమన్ టాన్‌తో భేటీ
● 11.30: సింగపూర్ స్పోర్ట్స్ స్కూల్ సందర్శన.
● మధ్యాహ్నం 1.00: టువాస్ పోర్టు సైట్‌లో పర్యటిస్తారు. పోర్టు సీఈవో విన్సెంట్ ఆధ్వర్యంలో ప్రత్యేక చర్చలో పాల్గొంటారు.
● సాయంత్రం 4.30: ఆంధ్రప్రదేశ్- సింగపూర్ బిజినెస్ ఫోరం నిర్వహించే రోడ్ షోలో ప్రసంగిస్తారు.
● 6.00: అదానీ పోర్ట్స్ ఎండీ కరణ్ అదానీతో సమావేశమవుతారు.

గ్రంథాలయ పరిషత్ సభ్యుల నియామకం

ఈనాడు, అమరావతి: ఆంధ్రప్రదేశ్ గ్రంథాలయ పరిషత్ సభ్యులుగా రాష్ట్ర ప్రభుత్వం నలుగురిని నియమించింది. ఆంధ్ర విశ్వవిద్యాలయం లైబ్రరీ సైన్స్ విభాగం ప్రొఫెసర్ కె.సోమశేఖరరావు, శ్రీవెంకటేశ్వర విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ వీఆర్ రాసాని, బొబ్బిలికి చెందిన విశ్రాంత సూపరింటెండెంట్ రౌతు రామమూర్తి, గుంటూరు వాసి ఎం.పద్మజను సభ్యులుగా నియమిస్తూ పాఠశాల విద్యాశాఖ కార్యదర్శి కోన శశిధర్ ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు.


సినిమా పైరసీకి పాల్పడితే.. మూడేళ్ల జైలుశిక్ష: కేంద్రం

దిల్లీ: డిజిటల్ పైరసీని అరికట్టే ప్రయత్నంలో భాగంగా కేంద్ర ప్రభుత్వం చట్టాలను సవరించింది. చట్ట విరుద్ధంగా సినిమాల రికార్డింగు, ప్రసారం చేసేవారికి మూడేళ్ల జైలుశిక్షతోపాటు సినిమా నిర్మాణవ్యయంలో 5 శాతం వరకు జరిమానా విధించేలా మార్పులు చేసింది. సినిమా పైరసీ వ్యతిరేక నిబంధనలను బలోపేతం చేయడానికి సినిమాటోగ్రఫీ చట్టంలో ప్రభుత్వం రెండేళ్ల క్రితమే ఈ సవరణలు తీసుకువచ్చింది.

చోళుల పాలన ప్రేరణతోనే వికసిత్ భారత్

● బ్రిటన్ కన్నా ముందుగా వీరి కాలంలోనే ఎన్నికలు
● ఆడి తిరువాదిరై ముగింపు ఉత్సవాల్లో ప్రధాని మోదీ

ఈనాడు, చెన్నై: చోళుల పాలన ప్రేరణతోనే వికసిత్ భారత్ కార్యక్రమం నడుస్తోందని ప్రధాని నరేంద్ర మోదీ పేర్కొన్నారు. నాటి రాజేంద్రచోళుడు-1 'గంగైకొండ చోళపురం' రాజధానిని నిర్మించి 1,000 సంవత్సరాలు పూర్తవుతున్న సందర్భంగా తమిళనాడు అరియలూరు జిల్లాలోని అదే ప్రాంతంలో ఆదివారం నిర్వహించిన ఆడి తిరువాదిరై ఉత్సవాల ముగింపు వేడుకలో ప్రధాని ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. చోళుల జ్ఞాపకార్థం నాణేన్ని విడుదల చేశారు. ఈ సందర్భంగా మోదీ ప్రసంగిస్తూ.. 'శివుని భక్తితో నిండిన చోళరాజుల సామ్రాజ్యం అమరత్వం పొందింది. రాజరాజచోళుడు, రాజేంద్రచోళుడు-1 భారత దేశ గుర్తింపునకు, గౌరవానికి పర్యాయ పదాలు. ప్రజాస్వామ్య ఎన్నికలంటే 'బ్రిటన్ మాగ్నా కార్టా' గురించి చెబుతారు. కానీ వారికన్నా ముందుగా చోళ సామ్రాజ్యంలో ఎన్నికలు జరిగాయి. విజయం దక్కిన తర్వాత ఏ రాజులైనా బంగారు, వెండి ఇతర సంపద తెస్తారు. రాజేంద్రచోళుడు మాత్రం ఉత్తర భారతం నుంచి గంగా జలాన్ని తెచ్చారు. ఆ జలాల్ని ఇక్కడి 'చోళగంగై' చెరువులో కలిపారు. వారి స్ఫూర్తితో నేను కూడా గంగాజలాన్ని కాశీ నుంచి తెచ్చి, ఇక్కడ అభిషేకం చేయించా. చోళ సామ్రాజ్యంలోని ఐక్యతను గుర్తుచేసుకుంటూ.. కాశీ తమిళ్ సంగమం, సౌరాష్ట్ర తమిళ్ సంగమం వంటి కార్యక్రమాలూ చేపట్టాం. అక్రమంగా విదేశాలకు తరలించిన విగ్రహాల్ని తిరిగి వెనక్కి రప్పించాం. అందులో 36 విగ్రహాలు, ఇతర పూర్వ సంపద తమిళనాడుకు చెందినవి ఉన్నాయి' అని వెల్లడించారు.





గంగైకొండ చోళపురంలో శివునికి హారతిస్తున్న ప్రధాని

గంగైకొండ చోళపురం ఆలయంలో కలశంతో ప్రదక్షిణలు చేస్తున్న ప్రధాని మోదీ

భారత్ శక్తి ప్రపంచానికి తెలిసొచ్చింది..

'రాజరాజచోళుడు అద్భుతమైన నావికా, రక్షణ వ్యవస్థల్ని ఏర్పాటు చేయగా, వాటిని రాజేంద్రచోళుడు-1 మరింత బలపరిచారు. వికసిత్ భారత్ కోసం మన నావికా, రక్షణ రంగాలు మరింత బలోపేతం కావాల్సిన అవసరముంది. చోళుల ప్రేరణతోనే ఆ విషయంలో మేము ముందుకెళ్తున్నాం. ఆపరేషన్ సిందూర్ ద్వారా భారత్ ఎలా సమాధానం చెబుతోందో ప్రపంచానికి తెలిసొచ్చింది. ప్రపంచం భారత్ శక్తిని అంగీకరించాల్సిన అవసరం ఏర్పడింది. చోళ రాజధానికి గుర్తింపు తెచ్చేలా రాజరాజచోళుడు, రాజేంద్రచోళుడు-1 విగ్రహాల్ని ఏర్పాటు చేస్తాం' అని మోదీ వివరించారు. అంతకుముందు ప్రధాని బస చేసిన తిరుచ్చి, గంగైకొండ చోళపురంలో రోడ్‌షో నిర్వహించారు. రాజేంద్రచోళుడు నిర్మించిన ఆలయంలో పూజలు చేశారు. ఫొటో ప్రదర్శనను తిలకించారు. అనంతరం సినీ సంగీత దర్శకుడు ఇళయరాజా బృందం భక్తి సంగీత విభావరిని ఆలకించారు. ఈ కార్యక్రమంలో తమిళనాడు గవర్నర్ ఆర్ఎన్ రవి, కేంద్ర సహాయ మంత్రి ఎల్.మురుగన్ తదితరులు పాల్గొన్నారు.



ఇళయరాజా బృందం భక్తి గీతాల సంగీత విభావరి



తుంగభద్ర జలాశయం 26 గేట్ల నుంచి దిగువకు వెళ్తున్న జలాలు

తుంగభద్రకు పోటెత్తిన వరద

● 77 వేల క్యూసెక్కులకు పెరిగిన ప్రవాహం

హొసపేటె, న్యూస్‌టుడే: తుంగభద్ర జలాశయానికి వరద ప్రవాహం ఆదివారం మరింత పెరిగింది. ఎగువ ప్రాంతం నుంచి 77 వేల క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతోంది. డ్యామ్ భద్రత దృష్ట్యా 26 గేట్లను పైకెత్తి 90 వేల క్యూసెక్కుల నీటిని కిందికి విడుదల చేస్తున్నారు. 10 గేట్లను రెండడుగులు, 16 గేట్లను మూడున్నర అడుగులు పైకెత్తి నీటిని వదిలారు. విద్యుదుత్పత్తికి కలిపి దిగువకు మొత్తం 93 వేల క్యూసెక్కుల నీరు వస్తోందని డ్యామ్ ఇంజినీర్లు తెలిపారు. ప్రస్తుతం జలాశయంలో 75.36 టీఎంసీల నీటి నిల్వ ఉంది.

శ్రీశైలం నుంచి నీటి విడుదల

సున్నిపెంట సర్కిల్, న్యూస్‌టుడే: శ్రీశైలం జలాశయం ఒక రేడియల్ క్రస్ట్ గేటును 10 అడుగుల మేర పైకి ఎత్తి స్పిల్‌వే ద్వారా 26,698 క్యూసెక్కుల నీటిని కిందకు వదిలారు. అదే సమయంలో కుడి, ఎడమ గట్టు జలవిద్యుత్తు కేంద్రాల్లో విద్యుదుత్పత్తి చేస్తూ 66,417 క్యూసెక్కుల నీటిని నాగార్జున సాగర్‌కు విడుదల చేస్తున్నారు. జూరాల, సుంకేసుల జలాశయాల నుంచి 1,18,274 క్యూసెక్కుల వరద వస్తోంది. శ్రీశైలం జలాశయం నీటిమట్టం ఆదివారం సాయంత్రం 6 గంటలకు 882 అడుగులు, నీటి నిల్వ 198.8120 టీఎంసీలుగా నమోదైంది.

హంద్రీ-నీవా కాలువకు 6 పంపుల ద్వారా జలాలు


నందికొట్కూరు గ్రామీణం, న్యూస్‌టుడే: కర్నూలు జిల్లా నందికొట్కూరు మండలం మల్యాల వద్దనున్న హంద్రీ-నీవా సుజల స్రవంతి ఎత్తిపోతల పథకం నుంచి ఆదివారం ఆరు పంపుల ద్వారా కాలువకు నీటిని ఎత్తిపోస్తున్నారు. ఈ నెల 17న సీఎం చంద్రబాబు చేతుల మీదుగా మూడు పంపుల ద్వారా నీటిని విడుదల చేశారు. తర్వాతి రోజు నుంచి 4 పంపుల ద్వారా ఈ నెల 26 వరకు నీటి తరలింపు కొనసాగింది. ఆదివారం 3, 7, 8, 9, 10, 11వ నంబర్ల పంపులను కూడా ఆన్ చేశారు. మొత్తంగా 2,025 క్యూసెక్కుల నీటిని ఎత్తిపోస్తున్నట్లు అధికారులు తెలిపారు.



ఆరు పంపుల ద్వారా హంద్రీనీవా కాలువకు ఎత్తిపోస్తున్న నీరు

జలవివాదాల కమిటీ ఏర్పాటుపై ఏదీ కదలిక?

● కేంద్ర జలశక్తి మంత్రిత్వశాఖను ఆరా తీయనున్న అధికారులు
● పోలవరం-బనకచర్ల ప్రతిపాదన ఆర్థికశాఖ నుంచి వెనక్కి
● అన్ని నిధులు ఎలా సర్దుబాటు చేస్తారని ప్రశ్న?



ఈనాడు, అమరావతి: ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల మధ్య జల వివాదాల పరిష్కారానికి కమిటీ ఏర్పాటుకు రెండు రాష్ట్రాలూ అంగీకరించినా ఇంకా ఎలాంటి కదలికా లేదు. దిల్లీలో కేంద్ర జలశక్తి శాఖ మంత్రి వీరేంద్ర పాటిల్ సమక్షంలో ఈ నెల 16న రెండు రాష్ట్రాల ముఖ్యమంత్రులు సమావేశమయ్యారు. పోలవరం-బనకచర్ల అనుసంధానం సహా మొత్తం 10 ఎజెండా అంశాలపై చర్చించారు. జలవివాదాల పరిష్కారానికి ఒక కమిటీ ఏర్పాటు చేయాలనే ప్రతిపాదనకు రెండు రాష్ట్రాలూ అంగీకరించాయి. ఈ కమిటీలో కేంద్ర జలశక్తి శాఖ నుంచి కూడా ప్రతినిధులను నియమించాలని నిర్ణయించారు. నాటి సమావేశంలో ఈ నెల 21 నాటికే కమిటీ సభ్యులను ఖరారు చేయాలని నిర్ణయించుకున్నారు. కేంద్ర జలశక్తి శాఖ కార్యదర్శి దేబశ్రీ ముఖర్జీ మాత్రం తమకు మరికొంత సమయం కావాలన్నారు. కమిటీలో రెండు రాష్ట్రాల నుంచి ఎవరెవరు సభ్యులుగా ఉంటారన్నది ఇంకా తేలలేదు. కేంద్ర జలశక్తి శాఖ నుంచి సమాచారం వస్తుందేమోనని రాష్ట్ర జలవనరులశాఖ అధికారులు ఎదురుచూస్తున్నారు. ఆ సమావేశం రెండు రాష్ట్రాల మధ్య ఏకాభిప్రాయం కోసమే ఏర్పాటుచేశామని కేంద్రం ప్రకటించింది. ఇద్దరూ ఒక నిర్ణయానికి వస్తే వాటిని అమలుచేస్తామని వెల్లడించింది. ఆ సమావేశం మినిట్స్ సైతం ఇంకా అందలేదు. కేంద్రం నుంచి ఎలాంటి స్పందన లేకపోవడంతో రాష్ట్ర జలవనరులశాఖ అధికారులు తర్జనభర్జన పడుతున్నారు. ఈ విషయంపై కేంద్ర జలశక్తి శాఖను మరోసారి సంప్రదించాలని మంత్రి నిమ్మల రామానాయుడు ఆదేశాలిచ్చారు. శనివారం కేంద్ర వర్గాలను సంప్రదించాలని రాష్ట్ర అధికారులు భావిస్తున్నారు. ఈ కమిటీలో రెండు రాష్ట్రాల నుంచి ఎంతమంది సభ్యులను ప్రతిపాదించాలన్న అంశంపైనా స్పష్టత లేదు.

పోలవరం-బనకచర్ల అనుసంధాన ఫైలు వెనక్కి

పోలవరం-బనకచర్ల అనుసంధాన ప్రాజెక్టు చేపట్టేందుకు వీలుగా రూ.80,400 కోట్లతో రాష్ట్ర జలవనరుల శాఖ ఆర్థికశాఖకు ప్రతిపాదనలు పంపింది. పాలనామోదం ఇచ్చి టెండర్లు పిలవాలనేది ప్రభుత్వ లక్ష్యం. ఇందుకు అనుగుణంగా లైన్ అంచనాలు సిద్ధం చేసి ప్రతిపాదనలు పంపారు. ప్రాజెక్టుకు నిధులు ఎక్కడి నుంచి సమీకరిస్తారు, ఆర్థిక నమూనా ఏంటనే అంశాలను ప్రస్తావిస్తూ రాష్ట్ర ఆర్థికశాఖ దీన్ని తిప్పిపంపింది. ముఖ్యమంత్రి చంద్రబాబు గతంలో ఈ ప్రాజెక్టుపై సమీక్షిస్తూ ఎలాంటి నమూనాలో దీన్ని చేపట్టాలో ఆర్థికశాఖ, జలవనరులశాఖ అధికారులు కూర్చుని ఫార్ములా తయారుచేయాలని ఆదేశించారు. అలాంటిది ఆర్థికశాఖ మాత్రం ఆర్థిక కారణాలు చూపుతూ తిప్పి పంపడం విశేషం.

ఉద్యానంలో సిరుల పంట

● అగ్రస్థానంలో అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాలు
● రూ.30 వేల కోట్ల స్థూల విలువ జోడింపు

అధిక జీవీఏ సాధించిన 5 జిల్లాలు, ముఖ్యమైన పంటల వివరాలు

జిల్లా	జీవీఏ (రూ.కోట్లలో)	పంటలు (విలువ రూ.కోట్లలో)
అనంతపురం	17,990	అరటి(4,397), టమాటా (2,378), బత్తాయి (2,144)
శ్రీసత్యసాయి	11,875	పుచ్చ (1,409), టమాటా (1,402), మామిడి (1,016)
వైఎస్సార్ కడప	11,400	అరటి (3,978), బత్తాయి (1,566), చామంతి (1,441)
కర్నూలు	9,102	మిరప (4,431), మల్లె (1,242), ఉల్లి (656)
అన్నమయ్య	9,069	అరటి (2,603), టమాటా(1,646), మామిడి (1,573)

ఈనాడు-అమరావతి: కరవు ప్రాంతాలుగా పేరొందిన అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల్లో పండ్లు, కూరగాయలు, పూలు, సుగంధ ద్రవ్యాలను పండిస్తూ అక్కడి రైతులు అధిక ఆదాయం పొందుతున్నారు. 2024-25లో అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాలు ఈ పంటల సాగుతో రూ.30 వేల కోట్ల స్థూల ఉత్పత్తి విలువ జోడింపు (జీవీఏ) సాధించి రాష్ట్రంలోనే అగ్రస్థానంలో నిలిచాయి. ప్రకాశం జిల్లా మార్కాపురం, యర్రగొండపాలెం లాంటి మండలాలూ జీవీఏ సాధనలో అగ్రభాగాన ఉండటం గమనార్హం. ఉద్యాన పంటల జీవీఏలో రాష్ట్రంలోనే అగ్రస్థానంలో నిలిచిన జిల్లాలు, డివిజన్లు, మండలాల వివరాలను రాష్ట్ర ప్రభుత్వం రూపొందించింది. వివరాలు ఇలా ఉన్నాయి.

అగ్రస్థానంలో లింగాల మండలం

వైఎస్సార్ కడప జిల్లా లింగాల మండలం అత్యధికంగా రూ.2,130 కోట్ల జీవీఏ సాధించింది. బత్తాయి, అరటి, పుచ్చ, టమాటా పంటల సాగు ద్వారా అధిక ఆదాయం లభించినట్లు ఉద్యానశాఖ పేర్కొంది.

● తూర్పుగోదావరి జిల్లా కడియంలో అలంకరణ మొక్కలు, పండ్ల నర్సరీల ద్వారా గణనీయమైన ఆదాయం లభించింది. ఈ మండల మొత్తం జీవీఏ రూ.1,758 కోట్లుగా ఉంది. అగ్రస్థానంలో ఉన్న జిల్లాలను పరిశీలిస్తే.. అనంతపురం జిల్లా పుట్లూరు, ఎల్లనూరు, ప్రకాశం జిల్లా యర్రగొండపాలెం, ఎన్టీఆర్ జిల్లా మైలవరం, ఏలూరు జిల్లా ద్వారకా తిరుమల, అనంతపురం జిల్లా నార్పల, అన్నమయ్య జిల్లా రైల్వేకోడూరు తర్వాత స్థానాల్లో నిలిచాయి.

డివిజన్లలో అనంతపురం.. తర్వాత పులివెందుల

రాష్ట్రంలోనే అత్యధిక జీవీఏ సాధించిన డివిజన్‌గా అనంతపురం డివిజన్ నిలిచింది. అరటి, బత్తాయి పంటల ద్వారా అక్కడ రూ.9,876 కోట్ల జీవీఏ సాధించింది.

● రెండోస్థానంలో వైఎస్సార్ కడప జిల్లా పులివెందుల డివిజన్‌లో అరటి, బత్తాయి, టమాటా పంటల ద్వారా రూ.6,177 కోట్ల జీవీఏ లభించింది.

● మూడోస్థానంలో అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు డివిజన్‌లో మిరియాలు, పసుపు, కాఫీ ద్వారా రూ.5,674 కోట్లు వచ్చింది. అక్కడ మిరియాల పంట ద్వారా రూ.2,326 కోట్లు, పసుపు రూ.552 కోట్లు, కాఫీ ద్వారా రూ.534 కోట్ల జీవీఏ సమకూరింది.

● అనంతపురం జిల్లా కల్యాణదుర్గం రూ.5,264 కోట్లు, శ్రీసత్యసాయి జిల్లా పెనుకొండ రూ.4,433 కోట్లు, తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరు రూ.4,175 కోట్లు, ప్రకాశం జిల్లా మార్కాపురం రూ.4,028 కోట్లు, అన్నమయ్య జిల్లా రాజంపేట రూ.4,003 కోట్లు, శ్రీసత్యసాయి జిల్లా ధర్మవరం రూ.3,793 కోట్లు, తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం రూ.3,594 కోట్ల జీవీఏ సాధించాయి.

పాలిటెక్నిక్‌లలో 57% సీట్ల భర్తీ!

ఈనాడు, అమరావతి: పాలిటెక్నిక్ కోర్సుల్లో ప్రవేశాల తుది కౌన్సెలింగ్ ఆదివారంతో ముగిసింది. రాష్ట్రవ్యాప్తంగా కన్వీనర్ కోటాలో 79,367 సీట్లు ఉండగా 45,283 (57%) భర్తీ అయ్యాయి. 88 ప్రభుత్వ పాలిటెక్నిక్‌లలో 17,943 సీట్లు ఉండగా, 11,954 (67%) నిండాయి. 165 ప్రైవేట్ కళాశాలల్లో ఉన్న 61,424 సీట్లలో 33,329 (54%) భర్తీ అయినట్లు ఏపీ పాలిసెట్-2025 కన్వీనర్, సాంకేతిక విద్యాశాఖ సంచాలకుడు జి.గణేష్‌కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. తుది కౌన్సెలింగ్ సీట్ల కేటాయింపు జాబితా ఆదివారం విడుదలైంది. ఈ కౌన్సెలింగ్ ద్వారా 4,628 మంది విద్యార్థులు కొత్తగా ప్రవేశాలు పొందారు.

వ్యవసాయ యంత్రాలపై సమగ్ర సర్వే: ఢిల్లీరావు

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలోని గ్రామ వ్యవసాయ యంత్రాల వినియోగంపై సమగ్ర సర్వేను త్వరలో గ్రామ వ్యవసాయ సహాయకుల ద్వారా ప్రారంభిస్తున్నామని, ఆగస్టు 31లోగా పూర్తి చేయనున్నట్లు వ్యవసాయ శాఖ డైరెక్టర్ ఢిల్లీరావు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. రైతులు, సంస్థలు, రైతు ఉత్పత్తి సంఘాలు, ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల వద్ద ఉన్న వ్యవసాయ యంత్రాలను సర్వే చేస్తున్నట్లు తెలిపారు. సర్వే డేటాను కృత్రిమ మేధ ఆధారిత పంటల సలహా వ్యవస్థతో అనుసంధానించనున్నట్లు పేర్కొన్నారు.

తిరుమల అన్నప్రసాదాలు రుచిగా, శుచిగా ఉన్నాయ్

● మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు



తిరుమలలో అన్నప్రసాదం స్వీకరిస్తున్న వెంకయ్యానాయుడు. చిత్రంలో బీఆర్ నాయుడు, భానుప్రకాశ్‌రెడ్డి

తిరుమల, న్యూస్‌టుడే: తిరుమలలో మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ కేంద్రంలో భక్తులకు అందిస్తున్న భోజనం ఎంతో శుచిగా, రుచిగా ఉందని మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యానాయుడు పేర్కొన్నారు. శ్రీవారి దర్శనార్థం ఆదివారం తిరుమలకు చేరుకున్న ఆయన తితిదే ఛైర్మన్ బీఆర్ నాయుడితో కలిసి మధ్యాహ్నం ఇక్కడ అన్నప్రసాదం స్వీకరించారు. భక్తులకు అందిస్తున్న వడలు.. నెల్లూరు వడల్లా రుచిగా ఉన్నాయని తెలిపారు. శ్రీవారి సేవకులు, భక్తులతో వెంకయ్యానాయుడు ముచ్చటించారు. ఫీడ్‌బ్యాక్ పుస్తకంలో తన అభిప్రాయం నమోదుచేసి సంతృప్తిని వ్యక్తం చేశారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ శ్రీవారి సేవకులు స్వచ్ఛందంగా భక్తులకు సేవలందించడం ఆనందదాయకమైన విషయమని కొనియాడారు. అంతకుముందు తిరుమలకు చేరుకున్న వెంకయ్యానాయుడికి అదనపు ఈవో వెంకయ్యచౌదరి స్వాగతం పలికారు. సోమవారం ఉదయం ఆయన శ్రీవారిని దర్శించుకోనున్నారు. తితిదే బోర్డు సభ్యుడు భానుప్రకాశ్‌రెడ్డి తదితరులు ఆయన వెంట ఉన్నారు.

నీవా కాలువ ద్వారా తిరుపతికి తాగు నీరందిస్తాం

● మంత్రి నిమ్మల రామానాయుడు



శ్రీవారి ఆలయం ఎదుట కామినేని శ్రీనివాస్, నిమ్మల రామానాయుడు తదితరులు


తిరుమల, న్యూస్‌టుడే: హంద్రీ- నీవా నుంచి 3,850 క్యూసెక్కుల కృష్ణా జలాలను అడివిపల్లి జలాశయంలో నింపి, నీవా కాలువ ద్వారా భవిష్యత్తులో తిరుపతి పారిశ్రామిక అవసరాలకు, తాగునీరు అందిస్తామని జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు చెప్పారు. అలాగే బాలాజీ జలాశయం నుంచి తిరుమలకు నీటిని తరలించి భక్తులకు తాగునీటి కొరత లేకుండా చూస్తామని తెలిపారు. ఆదివారం ఉదయం వీఐపీ బ్రేక్‌లో ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్‌తో కలిసి స్వామివారిని ఆయన దర్శించుకున్నారు. అనంతరం ఆలయం వెలుపల మంత్రి మాట్లాడుతూ.. 'పాతికేళ్లలో మొదటిసారి జులైలోనే శ్రీశైలం నుంచి కృష్ణా జలాలు కిందకు విడుదల చేశాం. విజన్ 2047లో భాగంగా యువతకు లక్షల ఉద్యోగాలు లభించి, ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలని శ్రీవారిని ప్రార్థించా' అని పేర్కొన్నారు. అంతకుముందు ఆయన కుటుంబసభ్యులతో కలిసి అలిపిరి మెట్ల మార్గంలో తిరుమలకు చేరుకున్నారు.

హక్కులపై ప్రజలకు అవగాహన ముఖ్యం

నల్సా సదస్సులో సీజేఐ జస్టిస్ బి.ఆర్.గవాయ్



శ్రీనగర్: ప్రజలకు తమ హక్కుల గురించి తెలియకపోతే వాటి వల్ల ఉపయోగం ఉండదని భారత ప్రధాన న్యాయమూర్తి(సీజేఐ) జస్టిస్ బి.ఆర్.గవాయ్ పేర్కొన్నారు. హక్కుల గురించి ప్రజలకు అవగాహన కల్పించాల్సిన ఆవశ్యకతను ఆయన తెలియజేశారు. ఆదివారం శ్రీనగర్‌లో జాతీయ న్యాయ సేవల సంస్థ (నల్సా) ఉత్తర మండల ప్రాంతీయ సదస్సులో సీజేఐ మాట్లాడారు. "దేశంలో చివరి పౌరుడి వరకు న్యాయం అందించేందుకు న్యాయమూర్తులు, న్యాయవాదులు కలిసి పనిచేయాల్సిన అవసరం ఉంది. నల్సా ఆ దిశగా పనిచేస్తోంది. నల్సా సేవలను దేశంలో మారుమూల ప్రాంతాలకు చేరువ చేసేందుకు మేం ప్రయత్నిస్తున్నాం. జమ్మూకశ్మీర్‌లో గతంలో కొన్ని తప్పిదాలు జరిగాయి. వాటిని మర్చిపోయి అందరూ సామరస్యంతో జీవించే కశ్మీర్ పునరుద్ధరణకు కృషి చేయాల్సిన అవసరం ఉంది" అని జస్టిస్ గవాయ్ అన్నారు. కశ్మీర్ విశ్వవిద్యాలయంలో జరిగిన పూర్వ విద్యార్థుల సమావేశంలోనూ సీజేఐ ప్రసంగించారు. దేశ పురోభివృద్ధికి ఉపయోగపడే భావి పౌరులను కశ్మీర్ వర్సిటీ అందిస్తోందని జస్టిస్ గవాయ్ పేర్కొన్నారు. పూర్వ విద్యార్థుల సేవలనూ వర్సిటీ వినియోగించుకోవాలని సూచించారు.



సుభద్రాదేవి, శ్రీనివాసరాజులకు పురస్కారాలు అందజేస్తున్న మాడభూషి లలితాదేవి, పత్తిపాక మోహన్. చిత్రంలో కసిరెడ్డి వెంకటరెడ్డి తదితరులు

శీలా, అమ్మినలకు 'అమరవాది' పురస్కారాలు

రవీంద్రభారతి, న్యూస్‌టుడే: బాలసాహిత్యంతోపాటు, సాహితీరంగంలో విశేష కృషిచేసిన రచయితలకు అమరవాది ఫౌండేషన్ పురస్కారాల ప్రదాన కార్యక్రమం ఆదివారం హైదరాబాద్ రవీంద్రభారతిలో నిర్వహించారు. ఈ సందర్భంగా 3 పుస్తకాలను ఆవిష్కరించడంతోపాటు హైదరాబాద్ స్థాయిలో నిర్వహించిన బాలల కథల పోటీల విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత డా.పత్తిపాక మోహన్ అధ్యక్షతన జరిగిన సభలో ఓయూ తెలుగుశాఖ పూర్వ అధ్యక్షుడు, ప్రముఖ రచయిత ఆచార్య కసిరెడ్డి వెంకటరెడ్డి ముఖ్య అతిథిగా; మాడభూషి స్మారక సమితి అధ్యక్షురాలు మాడభూషి లలితాదేవి విశిష్ట అతిథిగా పాల్గొన్నారు. 2025 సంవత్సరానికిగాను అమరవాది హైమావతి సాహిత్య పురస్కారాన్ని ప్రముఖ రచయిత్రి శీలా సుభద్రాదేవికి, అమరవాది ప్రసాద్ బాలసాహిత్య పురస్కారాన్ని బాలసాహితీవేత్త డా.అమ్మిన శ్రీనివాసరాజుకి ప్రదానం చేశారు. సభలో తొలుత అమరవాది నీరజ రచించిన బాలల బొమ్మల పుస్తకం అంజు, పత్తిపాక మోహన్ తెలుగు బాలగీతాల పుస్తకం 'ఆకుపచ్చపాట'కు డా.షేక్ అబ్దుల్‌ఘనీ చేసిన హిందీ అనువాదం 'హరేభరే గీత్, బాలసాహితీవేత్త గరిపెల్లి అశోక్ పిల్లల కథల పుస్తకం 'గోటీలాట'ను ఆచార్య కసిరెడ్డి ఆవిష్కరించారు. సాహితీవేత్తలు శాంతారావు, ఆకెళ్ల వెంకట సుబ్బలక్ష్మి, మంచిరాజు కామేశ్వరరావు, కొసరాజు సురేష్, డాక్టర్ నాశేశ్వరం శంకరం, చింతకింది కామేశ్వరరావు, మాల్యశ్రీ, డా.హారిక చెరుకుపల్లి, జొన్నలగడ్డ శ్యామల తదితరులు పాల్గొన్నారు.

మాధవరావుకు ఉత్తమ జర్నలిస్టు అవార్డు

ఈనాడు, అమరావతి: మోటూరు హనుమంతరావు స్మారక ఉత్తమ జర్నలిస్టు అవార్డు-2025ను శ్రీకాకుళం జిల్లా ఏజెన్సీ ప్రాంతమైన మెళియాపుట్టి ఆంధ్రజ్యోతి విలేకరి మాధవరావుకు ఇవ్వాలని నిర్ణయించినట్లు ప్రజాశక్తి సాహితీ సంస్థ వెల్లడించింది. గిరిజనుల దుర్భర పరిస్థితులపై రాసిన కథనాలకుగానూ మాధవరావుకు ఈ పురస్కారం ప్రదానం చేయనున్నట్లు తెలిపింది. ఆగస్టు 1న గుంటూరులో ఈ కార్యక్రమం ఉంటుంది. ఈ మేరకు ఆ సంస్థ కార్యదర్శి ఎంవీఎస్ శర్మ ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు.

పల్లె సారథులకు దిల్లీ పిలుపు!

దిల్లీలో భారత స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు... దేశ సైనిక శక్తినీ, సాంస్కృతిక విశిష్టతల్నీ ప్రపంచానికి చూపే సంబరం. ఎర్రకోట వేదికగా జరిగే ఈ ఉత్సవాలకి ప్రత్యేక ఆహ్వానం అందుకుని గొప్ప గౌరవం పొందారీ మహిళలు. గ్రామ సర్పంచ్‌లుగా తమ పల్లెల్ని అభివృద్ధి పథంలో నడిపించినందుకుగాను, ఆగస్టు 15న పతీ సమేతంగా దిల్లీ రావాలంటూ కేంద్రం నుంచి పిలుపు అందుకున్నారు.

సర్పంచ్ అవ్వడం నాన్న కల...



ప్రకాశం జిల్లా మద్దిపాడు మండలంలోని ఏడుగుండ్లపాడు గ్రామం **దాసరి శిల్ప సౌందర్య**ది. ఎమ్‌కాం చదువుకున్నారు. రాష్ట్ర సచివాలయంలో ఉద్యోగం కూడా వచ్చింది. కానీ, 2021 సర్పంచ్ ఎన్నికల్లో పోటీ చేసే అవకాశం రావడంతో ఉద్యోగం వదిలేశారామె. 'విద్యావంతులు రాజకీయాల్లోకి రావాలి. అప్పుడే రాష్ట్రం అభివృద్ధి బాటలో నడిచేది' అని శిల్ప నాన్న రమేష్ ఎప్పుడూ చెబుతుండేవారట. ఆయన సర్పంచ్ అయ్యి గ్రామానికి సేవ చేయాలనుకున్నారు. ప్రయత్నించి విఫలమయ్యారట. ఆయన కోరిక నేరవేర్చడం కోసమే ఆమె ఎన్నికల్లో పాల్గొన్నారు. కానీ, 'నామినేషన్ వేయడానికి రాజకీయ, సామాజిక ఇబ్బందులు చాలానే ఎదుర్కొన్నా' అంటారామె. 'గ్రామస్థుల ప్రోత్సాహంతో గెలిచినా బెదిరింపులు తగ్గలేదు. అయినా మొదట్నుంచీ అన్ని కార్యక్రమాల్లో చురుగ్గా ఉండేదాన్ని. దాని ఫలితమే.. . సిమెంటు, అంతర్గత రోడ్లు, కాలవల నిర్మాణానికి రూ.కోటికి పైగా వెచ్చించి, పనులు చేయించా. ఎప్పట్నుంచో ఉన్న వీధి దీపాల సమస్యను పరిష్కరించా. వర్షపు నీటి నిల్వకి ఇంకుడు గుంతలు తవ్వించా. క్యాన్సర్‌ను ఓడించిన... నటి గౌతమితో కలిసి మా గ్రామంలో క్యాన్సర్ అవగాహన సదస్సును నిర్వహించా' అంటారు శిల్ప.



– బాపట్ల వెంకటేశ్వర్లు, మద్దిపాడు

ఏడాదిలో రెండోసారి...



గుంటూరు జిల్లా తెనాలి మండలం సంగం జాగర్లమూడి గ్రామ సర్పంచ్ **పాలడుగు జయనాగలక్ష్మి** దిల్లీ నుంచి పిలుపు అందుకోవడం ఇది రెండోసారి. ఈ ఏడాది గణతంత్ర దినోత్సవం సందర్భంగా కేంద్ర పంచాయతీరాజ్ విభాగ వేడుకలకు ఆహ్వానం అందుకున్నారు. కేంద్ర పథకాలతోపాటు ఇతర అంశాల్లో ఉత్తమ పనితీరుకుగాను సర్పంచుల విభాగంలో ఎన్నికై వేడుకలో పురస్కారం అందుకున్నారు. ఇప్పుడు స్వాతంత్ర్య వేడుకలకు హాజరు కానున్నారు. 2021లో గ్రామ సర్పంచ్‌గా ఎన్నికైన నాగలక్ష్మి... నిత్యం ప్రజల సమస్యలు వింటూ వాటి పరిష్కారానికి కృషిచేశారు. గ్రామంలో పలు దేవాలయాల అభివృద్ధి పనుల్లో భాగస్వామ్యులయ్యారు. హిందూ శ్మశాన వాటికలో నిర్మాణ పనులు, కర్మల భవనం ఏర్పాటు, బస్టాప్ నిర్మాణం, ఆర్ఓ ప్లాంటు అందుబాటులోకి తీసుకురావడం, ప్రాథమిక పాఠశాలకు ప్రహరీ ఏర్పాటు పనుల్ని సొంత నిధులు, మిత్రులు, దాతల సహకారంతో పూర్తిచేశారు. క్రమం తప్పక ఉచిత ఆరోగ్య శిబిరాలు నిర్వహిస్తున్నారు. రూ.4 కోట్ల ప్రభుత్వ నిధులతో రోడ్లు, కాలువలు నిర్మించారు. ప్రతి ఇంటికి కుళాయి ఇవ్వడంతో పాటు స్వచ్ఛతలోనూ గ్రామాన్ని ఆదర్శంగా నిలిపే లక్ష్యంతో ముందుకు సాగుతున్నట్లు చెబుతారు నాగలక్ష్మి.

– షేక్.అబ్దుల్ తాజుద్దీన్, తెనాలి

చెక్‌డ్యామ్‌తో జలపాతాన్ని సృష్టించి...



గ్రామాన్ని అన్ని రంగాల్లో అగ్రగామిగా నిలపాలని తపించేవారు కర్నూలు జిల్లా ఓర్వకల్లు మండలం పాలకొలను సర్పంచ్ **సి. సుజాతమ్మ**. 2013, 2021ల్లోనూ సర్పంచ్‌గా ఎన్నికైన ఈమె... కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా చూశారు. గ్రామంలో సీసీ రోడ్లు, చెత్త నుంచి సంపద సృష్టించే సదుపాయం, రక్షిత మంచినీటి సరఫరా, గర్భిణులు, బాలింతలు, శిశువులకు పౌష్టికాహారం... తదితర సౌకర్యాల్ని కల్పించారు. ఈ గ్రామ శివారులో ఉన్న కొండ మధ్యలో అర కిలోమీటరు పొడవున భారీ చీలిక ఉంది. ఆ చీలికకు అడ్డంగా 60 అడుగుల ఎత్తైన కాంక్రీటు గోడ నిర్మించి దాన్ని చెక్‌డ్యామ్‌గా తీర్చిదిద్దారు. వర్షం కురిసినప్పుడు ఆ చీలికలో భారీగా నీరు చేరుతోంది. ఆ నీరు సుమారు 150 ఎకరాల సాగుకు ఉపయోగపడుతోంది. వర్షాలు ఎక్కువగా కురిసినప్పుడు కొండలు, పచ్చని చెట్ల మధ్యన జలపాతాన్ని తలపించేలా చెక్‌డ్యాం కాంక్రీటు గోడపై నుంచి నీరు పడుతుండడంతో ఓ పర్యాటక ప్రాంతంగానూ మారింది. 'నేను అనుకున్న విధంగా గ్రామాభివృద్ధి చేయగలిగాను. రెండుసార్లు సర్పంచ్‌గా అవకాశం రావడం కూడా నాకు వరంలా మారింది. అన్ని శాఖల పరిధిలో కలిపి సుమారు రూ.10కోట్ల విలువైన పనులు గ్రామంలో చేయించగలిగాను. మా కృషిని దిల్లీ పెద్దలు గుర్తించడం గ్రామానికి దక్కిన గౌరవం' అంటున్నారు సుజాతమ్మ.





– బి.ఎస్.రామకృష్ణ, కర్నూలు

పెద్ద కూతురిలా ఉండాలని...



అనుకోని పరిస్థితుల్లో సర్పంచ్‌గా పోటీ చేయాల్సి వచ్చినా... తనకు దక్కిన అవకాశాన్ని సద్వినియోగపరచుకోవాలనుకున్నారు శ్రీసత్యసాయి జిల్లా, గొట్లూరు గ్రామ సర్పంచ్ **పిట్టా నరసమ్మ**. ఉమ్మడి జిల్లాలోనే మొదటి బహిరంగ మలమూత్ర విసర్జన రహిత గ్రామం గొట్లూరు. జిల్లాలో స్వచ్ఛత కార్యక్రమాలను చేపట్టాలంటే ఈ గ్రామంలోనే పంచాయతీ అధికారులకు శిక్షణ ఇస్తారు. ఆ పేరుని అలానే కొనసాగించాలనుకున్నారు నరసమ్మ. 'జీ ఫర్ గొట్లూరు- జీ ఫర్ గ్రీన్ విలేజ్' నినాదంతో... చెత్త సేకరణపై ప్రత్యేక దృష్టి పెట్టారు. ఈ గ్రామంలోని 'చెత్త నుంచి సంపద' కేంద్రంలో తయారైన సేంద్రియ ఎరువుకు మంచి డిమాండ్ ఉంటుంది. ఇదేకాదు, స్వయం సహాయక సంఘాల సభ్యులతో సమావేశమై బిన్-బ్యాగ్ పద్ధతిని వివరించడంతోపాటు ప్రభుత్వ నిధులతో ప్రతి ఇంటికీ మంచినీటి కుళాయిలను ఏర్పాటు చేయించారు నరసమ్మ. సుమారు రెండున్నర కోట్ల రూపాయల ఖర్చుతో గ్రామంలో సీసీరోడ్లు, డ్రైనేజీల నిర్మాణం చేపట్టారు. సురక్షిత మంచినీటి సరఫరాకు రూ.20 లక్షల నిధులు, ప్రభుత్వ పాఠశాల్లో రూ.3లక్షలు ఖర్చు చేసి వంటగదులను నిర్మించారు. 'సర్పంచ్... అంటే ఆడదో పదవిగా భావించలేదు. ఊరికి పెద్ద కూతురిలా ఉండాలనుకున్నాను. గ్రామాభివృద్ధే లక్ష్యంగా పెట్టుకున్నా. రాష్ట్ర ప్రభుత్వం, స్థానిక అధికారుల సహకారంతో ఇది సాధ్యమైంది. స్వాతంత్ర్య వేడుకలకు హాజరు కాబోతున్నందుకు చాలా సంతోషంగా ఉంది' అంటున్నారు నరసమ్మ.



– యస్ ముజబుర్ రెహమాన్, ధర్మవరం

వసుంధర

vasundhara@eenadu.in

అతన్ని పెళ్లి చేసుకోవాలా... వద్దా!

డియర్ వసుంధర



డా. మండాది గౌరీదేవి
మానసిక నిపుణురాలు

అక్క బీటెక్ చదువుతున్నప్పుడు ఒక అబ్బాయిని ప్రేమించింది. ఇంట్లో ఒప్పుకోరని భయపడి చెప్పలేదట. ఇప్పుడు ఆమెకి పెళ్లై ఇద్దరు పిల్లలు. అయితే మొన్న అదే అబ్బాయి సంబంధం నాకు వచ్చింది. పెళ్లిచూపుల్లో అతన్ని చూసి అక్క నాకు చెప్పింది. ఇప్పుడు నేను అతన్ని పెళ్లి చేసుకోవాలా... వద్దా?

- ఓ సోదరి

■ ఇద్దరూ ప్రేమించుకున్నారా... లేక మీ అక్కే ఇష్టపడిందా అన్నది మీరు చెప్పిన దాన్ని బట్టి అర్థం కాలేదు. అయినా పెళ్లి అనేది పూర్తిగా వ్యక్తిగత విషయం. ఒకవేళ ఇద్దరూ ఇష్టపడినట్లయితే అతను ఇలా మిమ్మల్ని చూసుకోవడానికి రారు. కాబట్టి మీరు కంగారు పడకండి. ఒక్కసారి మీ అక్కతో మాట్లాడి స్పష్టత తెచ్చుకోండి. అతను కూడా ఆమెను ఇష్టపడ్డాడా? లేదా?, ఆమె ఏమనుకుంటుందో... గతంలో జరిగిన విషయం ఇప్పుడు చెప్పడానికి కారణం ఏమిటో అడిగి తెలుసుకోండి. దాన్నిబట్టి నిర్ణయం తీసుకోండి. దీనివల్ల భవిష్యత్తులో మీ అక్కాచెల్లెళ్ల బంధం చెడిపోకుండా ఉంటుంది. ఒకవేళ ఆమెది వన్‌సైడ్ అయితే... ఏ సమస్యా లేదు. అబ్బాయి మీకు అన్నివిధాలా తగిన వాడా కాదా అన్నది చూసుకోండి. తర్వాత మీ ఇంట్లో వారికీ, వాళ్ల వాళ్లకీ అన్నీ కుదిరి ఒప్పుకొన్నట్లయితే... ముందడుగు వేయండి.

చనిపోవాలనిపిస్తోంది..!

మాది దిగువ మధ్యతరగతి కుటుంబం. నేనో అబ్బాయిని రెండేళ్లుగా ప్రేమిస్తున్నా. తనకీ నేనంటే ఇష్టమే. కానీ వాళ్ల అమ్మానాన్నలకు మా పెళ్లి ఇష్టం లేదు. దాంతో అబ్బాయి కూడా వెనకడుగు వేశాడు. నన్ను అనుమానిస్తున్నాడు కూడా. ఈ మధ్యే పెళ్లి చూపులకూ వెళ్లొచ్చాడని తెలిసింది. తన ప్రవర్తనకు చనిపోవాలనిపిస్తోంది. డిగ్రీ చదివినా ఉద్యోగం చేయాలి అనిపించడం లేదు. **-ఓ సోదరి**

■ మీరు చెబుతున్న దాన్నిబట్టి చూస్తే... అతను జీవితంలో ముందుకి(మూవ్ ఆన్)వెళ్లినట్లు అర్థమవుతోంది. అందుకే మిమ్మల్ని దూరం పెడుతున్నారు. రెండు సంవత్సరాల ప్రేమ గురించి మీరు ఆత్మహత్య చేసుకోవాలనుకోవడం సబబు కాదు. ఈ నిర్ణయం మీ కుటుంబానికి తీరని లోటు. మీకు డిప్రెషన్ లక్షణాలు ఎక్కువగా ఉన్నట్లు అనిపిస్తుంది. అందుకే ఇలాంటి ఆలోచనలు వస్తున్నాయి. ఇవి దూరం చేసుకోవడానికి సైకియాట్రిస్టుని కలవండి. మీ మానసిక స్థితిని తెలుసుకుని... మందులిస్తారు. అవసరమైతే మీ అమ్మానాన్నలతో మాట్లాడి ఇలాంటి పరిస్థితుల్లో కుటుంబ సహాయ సహకారాలు ఎలా ఉండాలో వివరిస్తారు. దీనివల్ల సూసైడ్ టెండెన్సీ తగ్గుతుంది. తర్వాత వాళ్లే సైకాలజిస్టుని సంప్రదించమని సూచిస్తారు. 'ఇండివిడ్యువల్ సపోర్టివ్ సైకో థెరపీ' ద్వారా సమస్యల్ని ఎదుర్కొనే నైపుణ్యాలను నేర్పుతారు మానసిక నిపుణులు. ఆలస్యం చేయకుండా సైకియాట్రిస్టుని కలవండి.

ఆమె అడవుల్ని సంరక్షిస్తోంది!

నేడు వరల్డ్ కన్జర్వేషన్ డే

విలువైన జీవ వైవిధ్యానికి నెలవైన అడవులవి. పేదలైన వాటి యజమానులకు డబ్బు ఆశ చూపి అక్కడి చెట్లను కొట్టేస్తుంటారు వ్యాపారులు. పశ్చిమ కనుమల్లోని ఆ విశిష్ట అడవులతో పర్యావరణానికి మేలని భావించారు అర్చనా జగదీష్ గాడ్‌బోలే. భావించడమే కాదు, వేల ఎకరాల్ని కాపాడుతున్నారు. దానికోసం ఆమె ఏం చేస్తున్నారంటే...






వృక్ష పరిశోధకురాలైన అర్చన మొదట్లో 'బొటానికల్ సర్వే ఆఫ్ ఇండియా'లో శాస్త్రవేత్తగా పనిచేసేవారు. అరుదైన మొక్కల్ని గుర్తించి వాటికి పేర్లు పెట్టడం ఆమె విధులు. కానీ వృక్ష సంపదను, పర్యావరణాన్నీ పరిరక్షించాలన్న ఆమె లక్ష్యం అక్కడ నెరవేరలేదు. దాంతో ఉద్యోగం వదిలి 1995లో పుణె కేంద్రంగా 'అప్లైడ్ ఎన్విరాన్మెంటల్ రిసర్చ్ ఫౌండేషన్(ఏఈఆర్ఎఫ్)'ను స్థాపించారు. ఆమె లక్ష్యం నచ్చి అప్పటికే పర్యావరణ పరిరక్షణ దిశగా పని చేస్తున్న జయంత్ శర్నాయిక్ తోడొచ్చారు. జీవవైవిధ్యాన్ని కాపాడటానికి వివిధ మార్గాల్లో ప్రయత్నిస్తోందా సంస్థ. ఆ క్రమంలోనే మహారాష్ట్రలో విస్తరించిన పశ్చిమ కనుమల్లోని ప్రైవేటు అడవుల్లో భారీగా చెట్లను నరికేస్తున్నట్టు గుర్తించారు. తమ ఆర్థిక అవసరాల కోసం ఎంతో విలువైన చెట్లను వర్తకులకు అమ్మేవారు యజమానులు. దీన్ని ఆపడానికి ఓ వినూత్న పరిష్కారాన్ని చూపారు అర్చన. అడవుల్లో చెట్లను కొట్టకుంటే డబ్బులిస్తామని రైతులకు చెప్పారు. మొదట్లో వీరి మాటల్ని ఎవరూ నమ్మలేదు. అనేక అవగాహన కార్యక్రమాలు, సమావేశాలు నిర్వహించడంతో ఇది ఆచరణలోకి వచ్చింది. 2007లో 100 ఎకరాలతో చట్టబద్ధంగా మొదటి ఒప్పందం కుదుర్చుకున్నారు. దీని ప్రకారం భూ యాజమాన్య హక్కులు రైతులకే ఉంటాయి. అయిదేళ్లపాటు రైతులు చెట్లు కొట్టరు. బదులుగా ఏడాదికి కొంత మొత్తం వాళ్లకి చెల్లిస్తారు. రత్నగిరి, పుణె, రాయగడ్, సింధుదుర్గ్ జిల్లాల్లో ప్రధానంగా ఏఈఆర్ఎఫ్ రైతులతో పనిచేస్తోంది.



పవిత్ర తోటలు...

ఈ అడవుల్ని పవిత్ర తోటలుగా పిలుస్తారు స్థానికులు. వీటిలో ఆలయాలు ఉంటాయి. ఒక్కో కుటుంబానికి 5-10, 50-100 ఎకరాలు ఉంటాయి. చెట్ల నుంచి వచ్చే పండ్లు, కాయలు, బెరడు... లాంటి వాటిని మాత్రం రైతులు తీసుకొని అమ్ముకోవచ్చు. 'మొదట్లో దీనికి నిధులు సమకూర్చడం కష్టమయ్యేది. క్రౌడ్ ఫండింగ్, స్పాన్సర్ ఏ ఫారెస్ట్... కార్యక్రమాలు చేపట్టి విజయవంతమయ్యాం. ఇప్పుడు మాకు మద్దతు తెలిపేవారు చాలామంది ఉన్నారు. గ్రామస్థుల నమ్మకాన్ని పొందడమూ ఇక్కడ కీలకం. ఏ చిన్న కష్టం వచ్చినా రైతులూ, గిరిజనులూ అడవులవైపే చూస్తారు. అందుకే మేమూ ఆర్థిక ప్రయోజనం చూపించాం. చెట్లను కొట్టుకుంటూ పోతే చివరకు ఆదాయమే ఉండదన్న సంగతి గుర్తుచేశాం' అని చెబుతారు అర్చన. ఈ అటవీ ఉత్పత్తుల్లో ఔషధ లక్షణాలు ఉన్నవాటికి ఏఈఆర్ఎఫ్ మార్కెట్‌నీ చూపిస్తోంది. మహారాష్ట్రలో 25 లక్షల ఎకరాల ప్రైవేటు అడవులు ఉన్నాయి. ఏఈఆర్ఎఫ్ ద్వారా 13వేల ఎకరాల అడవుల్ని సంరక్షిస్తున్నారు. బదులుగా కోట్ల రూపాయలు ఇస్తున్నారు. రైతులు ఒప్పందాన్ని ప్రతి అయిదేళ్లకూ సమీక్షించి పునరుద్ధరిస్తారు. ఈ అడవులవల్ల లక్షల టన్నుల కార్బన్ డయాక్సైడ్ పర్యావరణంలో కలవకుండా ఆగుతోంది. ఇక్కడ విభిన్న వృక్షాలే కాదు, పక్షులూ, జంతువులూ ఉన్నాయి. వీటితోపాటు పశ్చిమ తీరంలోని కొన్ని ప్రైవేటు మడ అడవుల్నీ, మహారాష్ట్రలో గోండియా, ఛత్తీస్‌గఢ్‌లో కేంకర్ లాంటిచోట్ల అడవుల్నీ సంరక్షిస్తోంది ఏఈఆర్ఎఫ్. రఫోర్డ్ స్మాల్ గ్రాంట్స్ ఫౌండేషన్, ఎల్ అండ్ టీ, ఆపిల్, ప్రజ్ ఇండస్ట్రీస్, ఇన్నొవేటివ్ ఇండస్ట్రీస్, పక్కా హెర్బ్స్ సహా పలు కార్పొరేట్ సంస్థలు వీరికి నిధులు అందిస్తున్నాయి.



'జీవవైవిధ్యం లేని పర్యావరణంతో లాభంలేదు. కలిసి కట్టుగా పనిచేస్తే ఎలాంటి పర్యావరణ సమస్యలకైనా పరిష్కారం చూపించవచ్చు' అర్చన.



వేడివేడిగా వీటిని తినొచ్చుగా!

బయట వర్షం... దానికితోడు చలి! 'వేడివేడిగా స్నాక్స్ తింటే బాగుంటుంది కదూ' అన్న సలహా ఇంట్లోవాళ్ల నుంచి రావడం ఆలస్యం! వంటింటి వైపు అడుగులేస్తాం. ఇంతలో 'ఉల్లిపాయలు ఎక్కువ వేసి పకోడీలు చెయ్' అనో 'బజ్జీలు, ఉల్లిపాయ సమోసాలు...' అనో ఆర్డర్లు ఇచ్చేస్తుంటారు. అప్పుడు మనమూ ఆస్వాదిస్తాం. కానీ పెరిగే కెలోరీల సంగతేంటి? పైగా నూనె వేపుళ్లు... అసలే చల్లని వాతావరణానికి తిన్నది ఓ పట్టాన అరగదు. కాబట్టి, వేడిగా ఆరోగ్యంగా ప్లాన్ చేయండి.

అటుకులు ఉండని ఇల్లు దాదాపుగా ఉండదు. వాటికి క్యారెట్, టొమాటో, కొత్తిమీర, పల్లీలు వంటివి జోడించి పోహా చేయండి. కార్బోహైడ్రేట్స్, ఐరన్, ఫైబర్ అందడమే కాదు... నూనె తక్కువ పడుతుంది. లేదంటే నేరుగా వేయించుకుని, పల్లీలు జోడించుకుని తిన్నా మంచిదే. టీకి మంచి కాంబినేషన్ కూడా. చక్కగా ఫూల్ మఖానాని కాస్త నెయ్యిలో వేయించుకుని బెల్లంతోనో, స్పైసీగానో తినేయండి. కాల్షియం, యాంటీ ఆక్సిడెంట్లు లభిస్తాయి... కెలోరీలూ తక్కువ. ఈ చలికి తినాలనిపించే వాటిలో చాట్ కూడా ఒకటి. పెసర మొలకలతో ప్రయత్నించండి. ఉల్లిపాయలు, నిమ్మరసం, కొత్తిమీర వంటివి చేర్చుకుంటే ఫ్లేవర్‌కి ఫ్లేవర్... రోగనిరోధకతా పెరుగుతుంది. ఇదైతే ఎక్కువ సమయం ఆకలి కాకుండానూ చూస్తుంది. బరువునీ పెంచదు. ఇవనే కాదు... ఆలోచించాలే గానీ బోలెడు హెల్తీ ఆప్షన్లు. కెలోరీలు తద్వారా బరువు పెరగకుండా సాయపడేవేవో ఆలోచించండి మరి!

మీకు తెలుసా?

లిల్లియన్ మోల్లర్ గిల్‌బ్రెత్... ఇండస్ట్రియల్ ఇంజినీర్ అయిన ఈమె, చేత్తో తాకే పనిలేకుండా డస్ట్‌బిన్ మూత తెరచుకునేలా 'ఫుట్ పెడల్ ట్రాష్ క్యాన్'ను కనిపెట్టారు.



భారత్‌లో పర్యావరణ పరిరక్షణకు మనవైన పరిష్కారాలు చూపుతున్నవారు పెరుగుతున్నారు. భూమాతను రక్షించేందుకు రసాయన ఎరువులకు దూరంగా సేంద్రియ, సహజ వ్యవసాయం, పెర్మాకల్చర్ లాంటి విధానాలవైపు వెళ్తున్నారు. ఈ మార్పు వెనక మహిళల పాత్ర కీలకంగా ఉంటోంది.



- సునీతా నారాయణ్, పర్యావరణవేత్త

చిత్రం చాలు..!



వంట, తోటపని, డ్యాన్స్ చేయడం, పాటలు వినడం, పర్యటనలు... ఇలా ఒత్తిడిని నియంత్రించుకోవడానికి మన ముందు ఎన్నో మార్గాలు ఉన్నాయి. ఇంటాబయటా పనులతో సతమతమయ్యే మహిళలు, అమ్మాయిలు వీటిని సాధనంగా చేసుకుంటున్నారు. అయితే వీటన్నింటికంటే చిత్రాలు గీయడం ద్వారా ఎక్కువ ప్రయోజనం ఉంటుందంటున్నారు నిపుణులు. దీన్నే 'ఆర్ట్ థెరపీ'గా చెబుతున్నారు. ఒక చిత్రం గీయడం, దానికి రంగులు వేయడం, మెరుగులద్దుతూ దాన్ని తీర్చిదిద్దే ప్రక్రియలో ఒత్తిడి దూరమవుతుందట. మైండ్‌ఫుల్‌నెస్ విధానాల్లో ఇదీ ఒకటి. అంతేకాదు, ప్రస్తుత పరిస్థితుల నుంచి సులువుగా ధ్యాస మళ్లుతుందట. మానసిక సమస్యలతో బాధపడుతున్న కొందరు... మాటల్లో చెప్పలేని, చేతల్లో రాయలేని విషయాల్ని చిత్రాలు వేసి సాంత్వన పొందినట్లు ఓ సర్వేలో పేర్కొన్నారు. ఈక్రమంలో సృజనాత్మకత, అభిజ్ఞా నైపుణ్యాలు, ఏకాగ్రత కూడా అభివృద్ధి చెందుతుందట. అయితే దీనికోసం ఏ ఆస్పత్రులనో, వైద్యులనో ఆశ్రయించాల్సిన అవసరం లేదు. చక్కటి వాతావరణంలో ఓ పుస్తకం, పెన్సిల్, రంగులు పట్టుకుని బొమ్మలు వేయడం మొదలుపెడితే చాలు. పూర్తయ్యేటప్పటికల్లా మానసిక ప్రశాంతత దరిచేరుతుంది. అందుకే జెన్‌జీ, మిలీనియల్ అమ్మాయిలు వారాంతాల్లో స్థానిక పార్కులు వేదికగా... ఆర్ట్‌థెరపీని ప్రచారం చేస్తున్నారు. బృందాలుగా ఏర్పడి పోటీలు పెట్టుకుని మరీ చిత్రాలు గీస్తూ ఒత్తిడిని జయిస్తున్నారు. మీరూ ప్రయత్నించేయండి మరి!

చినుకుల సవ్వడి... కుసారి డోయి!





వర్షాలు మొదలయ్యాయి. వేడివేడి కాఫీనో, టీనో తాగుతూ దాన్ని ఆస్వాదించేవాళ్లు చాలా మందే. అయితే, ఆ వర్షపు శబ్దం కూడా లయబద్ధంగా ఉంటే... మనసెంతో హాయిగా, సరికొత్త సంగీత స్రవంతిలా అనిపిస్తుంది కదా! ఆ ఫీల్‌ని తెచ్చేవే ఈ 'రెయిన్ చైన్లు'. అలంకరణ వస్తువులుగా మాత్రమే కాదు, వర్షాల వేళ ఆహ్లాద వాతావరణాన్నీ సృష్టిస్తాయివి. నిజానికి వీటిని వందల ఏళ్ల క్రితమే జపనీయులు 'కుసారి-డోయి' పేరుతో వాడేవారట. ఇళ్లు, దేవాలయాల పైనుంచి వర్షపు నీటిని కిందకు మళ్లించేందుకు ఉపయోగించేవారట. అంతేకాదు, వర్షం కురిసేటప్పుడు అవి చేసే శబ్దానికి అక్కడి షింటో సంస్కృతిలో చాలా ప్రాముఖ్యత ఉందట. ఈ చైన్లే తదనంతర కాలంలో అలంకరణ వస్తువులుగానూ మారి, అంతటా ప్రాచుర్యంలోకి వచ్చాయి. కప్‌లు, లింక్‌లు... ఇలా భిన్న రకాల్లో అందుబాటులో ఉండే ఇవి... కాపర్, అల్యూమినియం... వంటి అనేక రకాల మెటీరియళ్లలో దొరుకుతున్నాయి. రూఫ్ నుంచి వస్తోన్న నీరు... వీటిపై పడి, ఓ వినసొంపైన శబ్దాన్నిస్తుంది. చూడ్డానికి ఓ మినియేచర్ వాటర్‌ఫాల్‌లా ఉంటుందనుకోండి. అంతేకాదు, వర్షపు నీటిని నిల్వ చేసుకుని ఇంటి తోటలకు మళ్లించొచ్చు. అందుకే, మినిమలిస్ట్, జెన్ గార్డెన్ లుక్ కోరుకునే వాళ్ల ఇంట్లో ఇవి తప్పక ఉంటాయి. ప్రశాంతత, ఉపయోగం... రెండూ ఉంటాయంటే కాదనేవారెవరు? మీకూ నచ్చాయా... ఇంకెందు కాలస్యం ఓ రెండు చైన్లు తీసుకొచ్చి, ఇంటికి తగిలించేయండి మరి.

స్వీట్ హోమ్



అది బిహార్ తుది ఓటర్ల జాబితా కాదు: ఈసీ

1 నుంచి అభ్యంతరాలు సమర్పించవచ్చని వెల్లడి

దిల్లీ: బిహార్ ఓటర్ల జాబితా మార్పులు చేర్పుల్లో ఏమైనా తప్పులు జరిగితే సవరించుకునేందుకు ఆగస్టు 1 నుంచి సెప్టెంబరు 1 వరకు సమయం ఉంటుందని కేంద్ర ఎన్నికల సంఘం స్పష్టం చేసింది. ఇప్పుడున్నదే తుది జాబితా అనే రీతిలో కొందరు పెద్దఎత్తున ఎందుకు అపోహలు సృష్టిస్తున్నారో అర్థం కావడంలేదని వ్యాఖ్యానించింది. ముసాయిదా జాబితాను ఆగస్టు 1న, తుది జాబితాను సెప్టెంబరు 30న ప్రచురించనున్నట్లు తెలిపింది. తగిన ప్రక్రియ పాటించకుండా.. ఏ ఒక్కరినీ జాబితా నుంచి తొలగించబోమంది. బిహార్ ఓటర్ల జాబితా 'ప్రత్యేక ముమ్మర సవరణ' (ఎస్ఐఆర్) తొలి దశ ముగిసిన నేపథ్యంలో ఆదివారం ఈ మేరకు ప్రకటన విడుదల చేసింది. ఈ దశలో 7.24 కోట్ల మంది ఓటర్ల నుంచి (91.69%) వివరాలు నింపిన దరఖాస్తులు తమకు తిరిగి అందాయని తెలిపింది. 36 లక్షల మంది వివరాలు మాత్రం వారి పాత చిరునామాల్లో లభ్యం కాలేదని వెల్లడించింది. ఏడు లక్షల మంది ఒకటికంటే ఎక్కువచోట్ల ఓటర్లుగా నమోదయ్యారని తెలిపింది. అభ్యంతరాలుంటే తామిచ్చే నెలరోజుల గడువులో వాటిని సమర్పించాల్సిందిగా బూత్‌స్థాయి ఏజెంట్లకు చెప్పాలని పార్టీలకు సూచించింది. ముసాయిదా జాబితాను తుది జాబితాగా పరిగణించబోమని స్పష్టంచేసింది.

కాంగో చర్చిలో కాల్పులు.. 34 మంది మృతి

కిన్‌షాసా: తూర్పు కాంగోలో ఇస్లామిక్ స్టేట్ మద్దతున్న తిరుగుబాటుదారులు రెచ్చిపోయారు. ఓ క్యాథలిక్ చర్చిపై దాడి చేసి 34 మందిని హతమార్చారు. ఈ సంఖ్య 40కు పైగా ఉండొచ్చని స్థానిక మీడియా సంస్థలు పేర్కొంటున్నాయి. అలైడ్ డెమోక్రటిక్ ఫోర్సెస్ (ఏడీఎఫ్)కు చెందిన సభ్యులు మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో చర్చి ప్రాంగణంలోకి ప్రవేశించి కాల్పులకు తెగబడ్డారు. అనేక గృహాలు, దుకాణాలకు కూడా నిప్పంటించారు. ఇస్లామిక్ స్టేట్‌తో ముడిపడి ఉన్న ఏడీఎఫ్.. ఉగాండా, డెమోక్రటిక్ రిపబ్లిక్ ఆఫ్ కాంగో సరిహద్దు ప్రాంతాల్లో కార్యకలాపాలు నిర్వహిస్తోంది. పౌరులే లక్ష్యంగా అనేక సంవత్సరాలుగా దాడులకు పాల్పడుతోంది. 2013 నుంచి ఇప్పటివరకు దాదాపు 6,000 మందిని బలిగొన్నట్లు నివేదికలు ఉన్నాయి. ఏడీఎఫ్‌పై అమెరికా, ఐరాస భద్రతా మండలి ఆంక్షలు విధించాయి.

మిషిగన్ వాల్‌మార్ట్‌లో కత్తిపోట్లు



- 11 మందికి గాయాలు

ట్రావెర్స్ సిటీ: అమెరికాలోని మిషిగన్‌లో ఓ వ్యక్తి 11 మందిని కత్తితో గాయపరిచాడు. ట్రావెర్స్ సిటీలోని వాల్‌మార్ట్ స్టోర్‌లో ఈ ఘటన చోటు చేసుకుంది. శనివారం సాయంత్రం ఓ 42 ఏళ్ల వ్యక్తి కత్తితో స్టోర్‌లోకి ప్రవేశించాడు. కనిపించిన వ్యక్తినల్లా పొడవడం ప్రారంభించాడు. పోలీసులు రంగప్రవేశం చేసి ఆ వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. 11 మందిలో ఆరుగురి పరిస్థితి విషమంగా ఉంది. కొందరికి శస్త్రచికిత్స చేయాల్సి ఉంటుందని పోలీసులు తెలిపారు. 'ఇలాంటి సంఘటన సినిమాల్లో మాత్రమే చూస్తాం. నాకు చాలా భయమేసింది' అని ఓ ప్రత్యక్ష సాక్షి తెలిపారు.

న్యూమెక్సికో వర్సిటీలో కాల్పులు..

న్యూమెక్సికో యూనివర్సిటీలో శుక్రవారం తెల్లవారుజామున జరిగిన కాల్పుల్లో ఒకరు మృతి చెందారు. మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. అప్రమత్తమైన యూనివర్సిటీ అధికారులు.. విద్యార్థులను సురక్షిత ప్రాంతాలకు తరలించారు. కాల్పులకు పాల్పడిన జాన్ అనే వ్యక్తిని అదుపులోకి తీసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

అంతరిక్షంపై పిల్లల్లో పెరిగిన ఆసక్తి

- ఈ రంగంలో 200కుపైగా అంకురాలొచ్చాయ్
- మన్‌కీ బాత్‌లో ప్రధాని వెల్లడి



దిల్లీ: భారత వ్యోమగామి శుభాంశు శుక్లా అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి (ఐఎస్ఎస్) వెళ్లి రావడంతో దేశంలో కొత్త ఉత్సాహం నెలకొందని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు. 2023 ఆగస్టులో చంద్రయాన్-3 విజయం తర్వాత చంద్రుడిపై కాలు మోపాలని, అంతరిక్ష శాస్త్రవేత్తలుగా ఎదగాలని పిల్లల్లో ఆసక్తి బాగా పెరిగిందని తెలిపారు. అంతరిక్ష రంగంలోనే 200కుపైగా అంకురాలు ఏర్పాటవడం శుభపరిణామమన్నారు. మాజీ నక్సలైట్లలో పరివర్తన రావడంపట్ల సంతోషం వ్యక్తం చేశారు. ప్రతి నెలా చివరి ఆదివారం నిర్వహించే 'మన్‌కీ బాత్'లో భాగంగా 124వ ఎపిసోడ్‌లో ఆయన మాట్లాడారు.

'క్రీడలు, సైన్స్, సాంస్కృతిక రంగాల్లో.. కొన్ని రోజులుగా భారతీయులు గర్వించదగ్గ ఎన్నో విజయాలు సాధిస్తున్నారు. ఇన్‌స్పైర్- మానక్ అభియాన్ అనేది పిల్లల్లో ఆవిష్కరణలను ప్రోత్సహించే కార్యక్రమం. ఇప్పటి వరకూ లక్షల మంది విద్యార్థులు ఇందులో చేరారు. వచ్చే నెల ముంబయిలో అతి పెద్ద ఖగోళశాస్త్ర ఒలింపియాడ్ జరగనుంది' అని మోదీ పేర్కొన్నారు. అంతర్జాతీయ కెమిస్ట్రీ ఒలింపియాడ్‌లో దేశానికి చెందిన దేవేశ్ పంకజ్, సందీప్ కూచి, దేవ్‌దత్ ప్రియదర్శి, ఉజ్వల్ కేసరి పతకాలు సాధించడం గర్వకారణమని వ్యాఖ్యానించారు. ఆగస్టు 23వ తేదీన అంతర్జాతీయ అంతరిక్ష దినోత్సవాన్ని దృష్టిలో పెట్టుకుని ప్రజలు సలహాలు, సూచనలు పంపాలని మోదీ పిలుపునిచ్చారు.

ఆగస్టు ఓ విప్లవ మాసం


'1908 ఆగస్టు 11న ముజఫర్‌పుర్‌లో ఓ యువకుడిని ఉరితీశారు. ఆ సమయంలో అతడి ముఖంలో భయం లేదు. ఆత్మవిశ్వాసం ఉంది. అతడి పేరు ఖుదీరామ్ బోస్. 18 ఏళ్ల వయసులో దేశాన్ని కదిలించాడు. అలాంటి ఎందరో త్యాగాల ఫలితంగానే మనం స్వేచ్ఛా వాయువులు పీలుస్తున్నాం. ఆగస్టు 1న లోకమాన్య తిలక్ వర్ధంతి, 8న క్విట్ ఇండియా ఉద్యమం ప్రారంభమైంది. 15న స్వాతంత్ర్య దినోత్సవం జరుపుకుంటున్నాం. ఆగస్టు నెల ఓ విప్లవ మాసం. 1905 ఆగస్టు 7న మొదలైన స్వదేశీ ఉద్యమం స్థానిక ఉత్పత్తుల్లో మరింత జవసత్వం నింపింది. దానికి చిహ్నంగానే ఆగస్టు 7ను జాతీయ చేనేత దినోత్సవంగా జరుపుకుంటున్నాం. ఈ 11 ఏళ్లలో స్వచ్ఛ భారత్ ఒక సామూహిక ఉద్యమంగా మారింది. ప్రజలు దీనిని తమ కర్తవ్యంగా భావిస్తున్నారు' అని ప్రధాని పేర్కొన్నారు.

హింసను వదిలి..

ఝార్ఖండ్‌లోని గుమ్లా జిల్లాలో హింసను వదిలి చేపల పెంపకంలో రాణిస్తున్న పలువురు మాజీ నక్సలైట్లను మోదీ ప్రశంసించారు. ఓం ప్రకాశ్ సాహు లాంటి వారు చేపల పెంపకం ద్వారా ఆదాయం గడిస్తున్నారని తెలిపారు. గుమ్లాలో దాదాపుగా 150 కుటుంబాలు ఈ రంగంలో ఫలితాలను సాధిస్తున్నారని, ఒకప్పుడు ఆ గ్రామానికి వెళ్లాలంటేనే భయపడే పరిస్థితులు ఉండేవని వివరించారు.

'సిందూర్'పై సమరం!

- నేటి నుంచి పార్లమెంటులో చర్చ
- విప్ జారీ చేసిన కాంగ్రెస్



దిల్లీ: 'ఆపరేషన్ సిందూర్'పై పార్లమెంటులో వాడివేడి చర్చకు రంగం సిద్ధమైంది. సోమవారం లోక్‌సభలో ప్రశ్నలు సంధించేందుకు విపక్షం, దీటైన బదులిచ్చేందుకు అధికార కూటమి సమాయత్తమయ్యాయి. పహల్గాంలో పర్యాటకుల ప్రాణాలు బలిగొన్న ముష్కరుల అంతు చూడటానికి మన సైన్యం 'ఆపరేషన్ సిందూర్' నిర్వహించిన విషయం తెలిసిందే. ఉగ్రవాద స్థావరాలను నాశనం చేసే దూకుడుమీద వెళ్తున్న సైన్యం హఠాత్తుగా ఆ ఆపరేషన్‌ను నిలిపివేయడాన్ని విపక్షాలు ఆక్షేపిస్తున్నాయి. వాణిజ్య సంబంధాలను అస్త్రంగా ప్రయోగించి భారత్-పాక్ పోరును తానే విరమింపజేశానని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ 26సార్లు చెప్పడాన్ని కాంగ్రెస్ నేతృత్వంలోని విపక్షం పార్లమెంటులో ప్రధానంగా ప్రస్తావించనుంది. ఉభయ సభల్లో ఒక్కోదానిలో చర్చకు 16 గంటలు చొప్పున సమయాన్ని కేటాయించారు. ముందుగా లోక్‌సభలో చర్చ మొదలవుతుంది. రాజ్యసభలో మంగళవారం నుంచి చర్చిస్తారు. సోమ, మంగళ, బుధవారాల్లో తమ సభ్యులంతా లోక్‌సభకు తప్పకుండా హాజరుకావాలంటూ కాంగ్రెస్ విప్ జారీచేసింది.

అమెరికా జోక్యంపై నిలదీత

ఆపరేషన్ విజయవంతంగా కొనసాగింది. పాక్‌ను కాళ్లబేరానికి రప్పించి, ప్రపంచ దేశాల్లో మన దాయాది తీరును పూర్తిగా ఎండగట్టే మద్దతు సమీకరించగలిగామని సభాముఖంగా చెప్పేందుకు అధికార పక్షం సిద్ధంగా ఉంది. అమెరికా జోక్యం నిజమా, కాదా? ఒకవేళ నిజమే అయితే అది మన సార్వభౌమాధికారంలో కలగజేసుకోవడం కిందికి రాదా? మన యుద్ధవిమానాలు కూడా కూలినట్లు వచ్చిన వార్తల్లో నిజమెంత? దాడికి పాల్పడిన అసలైన ముష్కరులను ఇంతవరకు ఎందుకు పట్టుకోలేకపోయారు?.. ఇలాంటి అంశాల్లో ప్రభుత్వాన్ని నిలదీయాలని విపక్షం కసరత్తు పూర్తిచేసింది.



భార్య మాటల్ని మనసుపెట్టి వినండి

మీ భార్య మాట్లాడుతున్నప్పుడు మీరు ఫోన్‌లో చెక్ చేసుకునే నోటిఫికేషన్లు.. ఆమె తన ఇబ్బందిని పూర్తిగా వివరించకముందే హడావుడిగా మీరు సూచించే పరిష్కార మార్గాలు.. అసలు విషయం అర్థం చేసుకోకుండా యథాలాపంగా మీ నోటి నుంచి వచ్చే సమాధానాలు.. ఇవన్నీ ఒక్కో ఇటుకలా మారి మీ ఇద్దరి మనసుల మధ్య గోడను నిర్మిస్తాయి. భార్య మాట్లాడేటప్పుడు ఎప్పుడూ మనసుపెట్టి వినండి.

– బెన్ మిచెల్, రిలేషన్‌షిప్ కోచ్

గాజాలో పాక్షిక కాల్పుల విరమణ

- రోజుకు 10 గంటలపాటు అమలుచేస్తున్న ఇజ్రాయెల్

డెయిర్ అల్–బలా: గాజాలో ఆకలి మరణాలతో ఇజ్రాయెల్ కొంత దిగివచ్చింది. జనాభా అధికంగా ఉన్న 3 ప్రాంతాల్లో రోజుకు 10 గంటలపాటు కాల్పుల విరమణను అమలు చేయాలని నిర్ణయించింది. దీనిని ఆదివారం నుంచే అమల్లోకి తెచ్చింది. గాజా సిటీ, డెయిర్ అల్-బలా, మువాసీ ప్రాంతాల్లో ఈ కాల్పుల విరమణను స్థానిక కాలమానం ప్రకారం.. ఉదయం 10 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకూ అమలు చేస్తున్నామని ఇజ్రాయెల్ సైన్యం వెల్లడించింది. దీనివల్ల ఆహారం అందడానికి మార్గం సుగమం అవుతుందని పేర్కొంది. ఇజ్రాయెల్ పాక్షిక కాల్పుల విరమణను ఐక్యరాజ్య సమితి ఆహార సంస్థ స్వాగతించింది. కానీ అవసరమైన వారందరికీ ఆహారం అందాలంటే విస్తృత కాల్పుల విరమణ అవసరమని అభిప్రాయపడింది.


హమాస్‌కు వ్యతిరేకంగా గాజాలోని మిగిలిన ప్రాంతాల్లో దాడులు కొనసాగుతున్నాయని ఇజ్రాయెల్ వెల్లడించింది.



గాజాలోని ప్రజల కోసం సహాయ సంస్థలు విమానం ద్వారా జార విడుస్తున్న ఆహార సంచులు

'భారత్'ను తర్జుమా చేయొద్దు

భాగవత్ సూచన



కొచ్చిన్: భారత్ పేరును తర్జుమా చేయొద్దని, అలా చేస్తే అది తన విలక్షణతను కోల్పోతుందని ఆరెస్సెస్ చీఫ్ మోహన్ భాగవత్ స్పష్టం చేశారు. భారత్ అనే గౌరవం ద్వారానే ప్రపంచంలో అది తన ఘనతను చాటుకుంటుందని తెలిపారు. ఆరెస్సెస్ అనుబంధ శిక్షా సంస్కృతి ఉద్థాన్ న్యాస్ ఆధ్వర్యంలో ఆదివారం కొచ్చిన్‌లో 'జ్ఞాన్ సభ' పేరుతో నిర్వహించిన జాతీయ సదస్సులో ఆయన మాట్లాడారు. ప్రజా బాహుళ్యంలో, వ్యక్తిగతంగా.. భారత్ అనే మాట్లాడాలి. రాయాలి. ఈ నామవాచకాన్ని తర్జుమా చేయకూడదు. ఇండియా అంటే భారత్. అదే నిజం. కానీ భారత్ అంటే భారతే. అందుకే అదే వాడాలి. భారత్ బంగారు పక్షి ఇక ఎంతమాత్రం కాదు. అది ఇప్పుడో 'సింహం' అని భాగవత్ స్పష్టం చేశారు.

నేడు థాయ్-కంబోడియా కాల్పుల విరమణ చర్చలు

- భేటీకి ఇరుదేశాలూ అంగీకరించాయన్న ట్రంప్

సురిన్: నాలుగు రోజులుగా సరిహద్దులో కాల్పులతో చెలరేగిపోతున్న థాయ్‌లాండ్-కంబోడియాలు ఎట్టకేలకు కాల్పుల విరమణ చర్చలకు అంగీకరించినట్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆదివారం ప్రకటించారు. చర్చల కోసం సోమవారం మలేసియాలో భేటీ కావాలని ఇరు దేశాలు నిర్ణయించాయి. అయితే ట్రంప్ ప్రకటన తర్వాత కూడా ఇరుదేశాల మధ్య కాల్పులు కొనసాగుతున్నట్లు అనధికార వర్గాల సమాచారం. నాలుగురోజుల థాయ్-కంబోడియా సరిహద్దు ఘర్షణలతో 34 మంది మరణించగా, లక్షా 68 వేల మంది నిర్వాసితులు అయ్యారు. యుద్ధం ఆపేందుకు థాయ్-కంబోడియా నేతలతో తాను మాట్లాడానని, వారు చర్చలు జరిపేందుకు సంసిద్ధత వ్యక్తంచేశారని సామాజిక మాధ్యమం 'ట్రూత్ సోషల్'లో ట్రంప్ ప్రకటించారు. మలేసియా ప్రధాని అన్వర్ ఇబ్రహీం ఆహ్వానం మేరకు థాయ్ తాత్కాలిక ప్రధాని ఫుమ్తామ్ వేచాయచాయ్ సోమవారం చర్చలకు హాజరవనున్నారు. ఈ చర్చలకు కంబోడియా ప్రధాని హున్ మానెట్ కూడా హాజరవుతారని థాయ్ ప్రధాని కార్యాలయ ప్రతినిధి తెలిపారు.



కంబోడియాలో ఓ తాత్కాలిక శిబిరంలో ఆహారం కోసం వేచి చూస్తున్న పాంగ్ల్యాక్ గ్రామ ప్రజలు

బీఎస్ఎఫ్ కోసం 5 వేల బాడీ కెమెరాలు

- బంగ్లాదేశ్ సరిహద్దుల్లో వినియోగం



దిల్లీ: అక్రమ చొరబాటుదారులను వెనక్కి పంపించే క్రమంలో భారత బలగాలపైనే తిరగబడుతూ దాడులు చేస్తున్న ఘటనలు చోటు చేసుకుంటున్నాయి. వీరి ఆగడాలకు అడ్డుకట్ట వేసేందుకు ప్రయత్నిస్తున్న సరిహద్దు బలగాలు.. ఇటువంటి ఘటనలను ఆధారాలతో సహా చిత్రీకరించేందుకు ప్రయత్నాలు చేస్తోంది. ఇందులో భాగంగా భారత్-బంగ్లాదేశ్ అంతర్జాతీయ సరిహద్దులోని బీఎస్ఎఫ్ జవాన్లకు 5వేలకు పైగా శరీరానికి ధరించే కెమెరాలను అందించేందుకు ప్రభుత్వం సిద్ధమైంది.

వీటితోపాటు ఎంపిక చేసిన సరిహద్దు శిబిరాల్లోని సిబ్బందికి ఫింగర్‌ప్రింట్, ఐరిస్ స్కాన్ వంటి బయోమెట్రిక్ పరికరాలను అందించనున్నట్లు తెలిసింది. బంగ్లాదేశ్ అక్రమ చొరబాటుదారుల నుంచి సేకరించిన ఈ సమాచారాన్ని విదేశీయుల నమోదు కార్యాలయం (ఎఫ్ఆర్‌వో)కు అందజేయనున్నట్లు అధికార వర్గాలు తెలిపాయి. బీఎస్ఎఫ్ ప్రధాన కార్యాలయం నుంచి అందిన ఈ రెండు ప్రతిపాదనలకు కేంద్ర హోంశాఖ ఇటీవల ఆమోదం తెలిపినట్లు వివరించాయి. బాడీ కెమెరాలను భారత్-బంగ్లా సరిహద్దులో విధులు నిర్వర్తిస్తున్న బీఎస్ఎఫ్ సిబ్బందికి రెండు విడతలుగా అందజేయనున్నట్లు పేర్కొన్నాయి. ఈ సాధనాలకు రాత్రిపూట చిత్రీకరణ, 12-14 గంటల ఫుటేజీని రికార్డు చేసుకునే సామర్థ్యం ఉన్నట్లు వెల్లడించాయి. అక్రమ వలసదారులను వెనక్కి పంపడానికి, సరిహద్దుల వెంబడి మాదకద్రవ్యాలు, పశువుల స్మగ్లింగ్, నకిలీ కరెన్సీ చలామణ వంటి నేరాల కట్టడికి కూడా ఇవి ఉపయోగపడతాయని పేర్కొన్నాయి.

బిహార్ ఓటర్ల జాబితాపై నేడు సుప్రీంకోర్టులో విచారణ

దిల్లీ: వివాదాస్పదంగా మారిన బిహార్ ఓటర్ల జాబితా 'ప్రత్యేక ముమ్మర సవరణ' (ఎస్ఐఆర్)పై సుప్రీంకోర్టు సోమవారం విచారణ జరపనుంది. ఎన్నికల ముంగిట కేంద్ర ఎన్నికల సంఘం చేపట్టిన సవరణను సవాల్ చేస్తూ పలు పిటిషన్లు దాఖలయ్యాయి. జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జొయ్‌మాల్యా బాగ్చీల ధర్మాసనం వీటిని విచారించనుంది. అనర్హుల్ని తొలగించి ఓటర్ల జాబితాను ప్రక్షాళన చేయడమే తమ ఉద్దేశమని ఈసీ సమర్థించుకుంటోంది. అన్ని రాజకీయపక్షాలూ ఈ కసరత్తులో పాల్గొని 1.50 లక్షల మంది బూత్‌స్థాయి ఏజెంట్లను భాగస్వాముల్ని చేశాయని, ఇప్పుడు సర్వోన్నత న్యాయస్థానంలో మాత్రం ఎస్ఐఆర్‌ను వ్యతిరేకిస్తున్నాయని వాదించనుంది. రాజ్యాంగ నిబంధనలు, ప్రజా ప్రాతినిధ్య చట్టంలోని వివిధ సెక్షన్ల ప్రకారం ఓటరుకు ఉండాల్సిన అర్హతను ప్రముఖంగా ప్రస్తావించనుంది. అనర్హుడైన వ్యక్తికి ఓటుహక్కు ఉండదని చెప్పనుంది. ఎస్ఐఆర్‌ను ఆపకపోతే తమ ప్రతినిధుల్ని ఎన్నుకునే హక్కును కొన్ని లక్షలమంది కోల్పోతారని 'ప్రజాస్వామ్య సంస్కరణల సంఘం' (ఏడీఆర్) వాదిస్తోంది. చెల్లుబాటయ్యే పత్రాలుగా ఆధార్, రేషన్‌కార్డులను ఎందుకు పరిగణించడం లేదనేది ఆ సంస్థ ప్రధాన అభ్యంతరం.

ఎస్ఐఆర్‌ను నిలిపివేయాలి: కాంగ్రెస్

బిహార్లో ఓటర్ల సంతకాలను ఫోర్జరీ చేసి, వారి సమ్మతి లేకుండానే ఆన్‌లైన్‌లో సమర్పించారని విపక్షాలు ఆరోపిస్తున్నాయి. ఎస్ఐఆర్‌ను నిలిపివేయాలని కాంగ్రెస్ డిమాండ్ చేసింది. ఈసీకి సంస్థాపరమైన దురహంకారం ఉండకూడదని ఆ పార్టీ నేత అభిషేక్ మనుసింఘ్వి అన్నారు. ఈ ప్రక్రియ పౌరసత్వ పరీక్షగా మారిందని విమర్శించారు. ఈసీ తన ఆలోచనను పునఃపరిశీలించుకోవాలని కోరారు. విదేశీ చొరబాటుదారుల కోసం భారత ప్రజాస్వామ్యాన్ని దోచుకునేందుకు ఇండియా కూటమి పక్షాలు ప్రయత్నిస్తున్నాయని భాజపా ఆరోపించింది. పారదర్శకంగా ఎన్నికల సంస్కరణలు తీసుకురావడమే ఈసీ ప్రయత్నాల ఉద్దేశమని పార్టీ అధికార ప్రతినిధి సుధాంశు త్రివేది చెప్పారు. చొరబాటుదారుల రాకతో జనాభాలో మార్పులు వచ్చినచోట ఇండియా కూటమి పార్టీలు గెలుస్తున్నాయన్నారు.

★ ఆర్జేడీ నుంచి బహిష్కరణకు గురైన బిహార్ మాజీ మంత్రి తేజ్‌ప్రతాప్ యాదవ్ తాను ఈసారి స్వతంత్ర అభ్యర్థిగా మహువా (వైశాలి జిల్లా) నుంచి పోటీచేస్తానని విలేకరులకు తెలిపారు. ఎన్నికల తర్వాత సీఎం నీతీశ్‌కుమార్ పదవి పోవడం ఖాయమన్నారు.



మాతోశ్రీకి రాజ్ ఠాక్రే

ముంబయి: మహారాష్ట్ర నవనిర్మాణ్ సేన (ఎంఎన్ఎస్) అధినేత రాజ్ ఠాక్రే ఆదివారం మాతోశ్రీకి వెళ్లారు. శివసేన (ఉద్ధవ్) అధినేత ఉద్ధవ్ ఠాక్రేకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. మాతోశ్రీకి వచ్చిన రాజ్ ఠాక్రేకు తొలుత సంజయ్ రౌత్ స్వాగతం పలికారు. ఉద్ధవ్ ఇంట్లోకి ఆహ్వానించారు. పుష్పగుచ్ఛం అందజేసిన రాజ్ ఠాక్రే.. ఉద్ధవ్‌కు 65వ జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఇద్దరూ బాల్ ఠాక్రే చిత్రపటం ముందు నిల్చుని ఫొటో దిగారు. రాజ్ రావడంతో తన ఆనందం రెట్టింపైందని ఉద్ధవ్ వ్యాఖ్యానించారు.

ఒలింపియన్‌ను మనువాడిన స్టీవ్ జాబ్స్ కుమార్తె



ఇంటర్నెట్‌డెస్క్: టెక్ దిగ్గజం, యాపిల్ సహ వ్యవస్థాపకుడు దివంగత స్టీవ్ జాబ్స్ కుమార్తె ఈవ్ వివాహం అత్యంత వైభవంగా జరిగింది. బ్రిటన్‌కు చెందిన ఒలింపిక్(2024) ఈక్వెస్ట్రియన్ స్వర్ణపతక విజేత హ్యారి చార్లెస్‌ను ఆమె మనువాడారు. ఇంగ్లండ్‌లోని గ్రేట్ ట్యూలో ఉన్న సెయింట్ మైకెల్స్ అండ్ ఆల్ ఏంజెల్స్ చర్చిలో జరిగిన ఈ పెళ్లి వేడుకకు 6.7 మిలియన్ డాలర్ల (దాదాపు రూ.58 కోట్లు) మేర ఖర్చయినట్లు డెయిలీ మెయిల్ పత్రిక కథనంలో పేర్కొంది. పెళ్లి అనంతరం నవదంపతులు విలాసవంతమైన ఎస్టెల్లే మానర్ కంట్రీ హోటల్‌లో రిసెప్షన్ ఇచ్చారు. దీనికి వందల మంది అతిథులు విచ్చేశారు. ఈ వేడుకలకు అమెరికా మాజీ ఉపాధ్యక్షురాలు కమలా హారిస్ సైతం హాజరయ్యారు. స్టీవ్ జాబ్స్-లారెన్ పావెల్ చిన్న కుమార్తె ఈవ్ జాబ్స్ స్టాన్‌ఫోర్డ్ విశ్వవిద్యాలయం నుంచి గ్రాడ్యుయేషన్ చేశారు. వృత్తిపరంగా ఫ్యాషన్ మోడల్. హార్స్ రైడింగ్ కూడా వచ్చు. అండర్-25 విభాగంలో ప్రపంచ వ్యాప్తంగా ఐదో అత్యుత్తమ రైడర్‌గా నిలిచారు. తన 22వ ఏట గ్లోసియర్ హాలిడే క్యాంపెయిన్‌తో మోడలింగ్‌లోకి అడుగుపెట్టారు. వోగ్ జపాన్ పత్రిక కవర్ పేజీపై ఆమె చిత్రాన్ని ప్రచురించారు.

నైసార్ ప్రయోగం.. సరికొత్త అధ్యాయానికి నాంది

కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్ వెల్లడి

ఈనాడు, దిల్లీ: నాసా-ఇస్రో సింథటిక్ ఎపెర్చర్ రాడార్ (నైసార్) ఉపగ్రహాన్ని ఈ నెల 30న ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీహరికోటలో ఉన్న సతీశ్ ధవన్ అంతరిక్ష కేంద్రం నుంచి ప్రయోగించనున్నట్లు కేంద్ర శాస్త్రసాంకేతిక వ్యవహారాల శాఖ మంత్రి జితేంద్రసింగ్ తెలిపారు. భారతీయ అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో), అమెరికాకు చెందిన నేషనల్ ఏరోనాటిక్స్ అండ్ స్పేస్ అడ్మినిస్ట్రేషన్ (నాసా) మధ్య కుదిరిన ఒప్పందం కింద రూపొందిన తొలి ఉమ్మడి భూపరిశీలన ఉపగ్రహం ఇదేనని ఆయన ఆదివారం ఇక్కడ తెలిపారు. రెండు దేశాల మధ్య అంతరిక్ష సహకారంలో ఇది సరికొత్త అధ్యాయంగా మిగులుతుందన్నారు. ఈ ఉపగ్రహం భూవాతావరణంలో వచ్చే మార్పులను పరిశీలిస్తుంది. పర్యావరణం, మంచు, పచ్చదనం, సముద్రమట్టాలు, భూగర్భజలాల్లో వస్తున్న స్వల్ప వైరుధ్యాలను పసిగట్టి.. భూకంపాలు, సునామీలు, అగ్నిపర్వతాల విస్ఫోటం ఇతర ప్రకృతి వైపరీత్యాలకు సంబంధించిన ముఖ్యమైన సమాచారాన్ని ఇస్తుంది.

రష్యా నౌకాదళ వేడుకల కుదింపు

మాస్కో: ఉక్రెయిన్ వరుస డ్రోన్ దాడుల నేపథ్యంలో తమ నౌకాదళ వేడుకలను రష్యా కుదించుకుంది. సెయింట్ పీటర్స్‌బర్గ్‌తోపాటు కలినిన్‌గ్రాడ్ ప్రాంతంలోని బాల్టిక్ తీరం, తూర్పు పోర్టు పట్టణమైన వ్లాదివొస్తోక్‌లలో ఏటా నిర్వహించే యుద్ధ నౌకల ప్రదర్శనలను అధికారులు రద్దు చేశారు. అయితే రష్యా అధ్యక్షుడు సెయింట్ పీటర్స్‌బర్గ్‌కు వచ్చారు. నౌకాదళ ప్రధాన కార్యాలయాన్ని సందర్శించారు. మరోవైపు ఆదివారం రాత్రి నుంచి 99 డ్రోన్లను కూల్చేశామని రష్యా రక్షణశాఖ వెల్లడించింది. సెయింట్ పీటర్స్‌బర్గ్‌లోనూ డ్రోన్లు వచ్చిపడ్డాయని తెలిపింది. డ్రోన్ల దాడుల భయంతో ఈ నగరంలోని పుల్కోవో విమానాశ్రయంలో డజన్లకొద్దీ విమానాలను రద్దు చేశారు.



కర్ణాటకలోని రత్నగిరిలో రింగానే గ్రామంలో ఆదివారం 'సంగ్రాణి' పండుగ ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా నిర్వహించిన ఎద్దుల పరుగు పందేలను ప్రజలు ఆసక్తిగా తిలకించారు

ఆస్ట్రేలియాలో భారతీయ విద్యార్థిపై కత్తితో దాడి

మెల్‌బోర్న్: ఆస్ట్రేలియాలో భారతీయులపై వరుస దాడులు ఆందోళన కలిగిస్తున్నాయి. ఇటీవల ఓ భారత విద్యార్థిపై దుండగులు తీవ్రంగా దాడి చేసిన ఘటన మరవకముందే మరో విద్యార్థిపై కత్తితో దాడి చేసిన ఘటన తాజాగా వెలుగులోకి వచ్చింది. మెల్‌బోర్న్‌లో ఉంటున్న భారత విద్యార్థి సౌరభ్ ఆనంద్ (33) ఇటీవల ఆల్టోనా మెడోస్‌లోని సెంట్రల్ స్క్వేర్ షాపింగ్ సెంటర్‌లో ఫార్మసీ నుంచి ఇంటికి వెళ్తున్న సమయంలో ఐదుగురు టీనేజర్లు అతడిపై కత్తులతో దాడి చేసి సౌరభ్ మెడ నరకడానికి ప్రయత్నించారు. దీంతో అతడు తీవ్రంగా ప్రతిఘటించాడు. ఈ ఘటనలో సౌరభ్ మెడ, తలకు తీవ్ర గాయాలు కాగా.. చేయి తెగిపడటంతో నిందితులు అక్కడి నుంచి పరారయ్యారు. దాడికి పాల్పడిన టీనేజర్లలో నలుగురిని అదుపులోకి తీసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

తుర్కియేలో సిన్వర్ సతీమణి!

- అక్కడ మరో వివాహం చేసుకున్న సమర్



ఇంటర్నెట్ డెస్క్: ఇజ్రాయెల్‌తో జరుగుతున్న పోరులో హమాస్ అధినేత యాహ్యా సిన్వర్ గతేడాది మృతి చెందిన విషయం తెలిసిందే. ఆ తర్వాత ఆయన భార్య సమర్ మహమ్మద్ అబూ జమర్ పిల్లలతో సహా గాజా నుంచి నకిలీ పాస్‌పోర్టుతో తుర్కియేకు పారిపోయినట్లు ఇజ్రాయెల్ వార్తా సంస్థ పేర్కొంది. అక్కడ ఆమె మరో వివాహం చేసుకున్నట్లు వెల్లడించింది. సిన్వర్‌తో ఆమెకు 2011లో వివాహం జరిగింది. సిన్వర్ మృతి తర్వాత హమాస్ ఉన్నతాధికారుల సహాయంతో.. గాజాలోని ఓ మహిళ పాస్‌పోర్టును వాడుకొని సమర్ తన పిల్లలతో ఈజిప్టునకు.. అక్కడి నుంచి తుర్కియేకు వెళ్లినట్లు మీడియా వర్గాలు పేర్కొన్నాయి. అక్కడ ఆమె మరో వివాహం చేసుకోవడానికి హమాస్ రాజకీయ బ్యూరోలోని సీనియర్ అధికారి ఫాతి హమ్మద్ సహకరించినట్లు తెలిపాయి. ఇజ్రాయెల్ దాడుల్లో యాహ్యా సిన్వర్ సోదరుడు మహమ్మద్ సిన్వర్ కూడా మరణించిన విషయం తెలిసిందే. మహమ్మద్ మరణానంతరం ఆయన భార్య నజ్వా.. యాహ్యా సిన్వర్ కార్యాలయంలో నకిలీ పాస్‌పోర్టులు రూపొందించే విభాగానికి నాయకత్వం వహించింది. ఇజ్రాయెల్ దాడుల్లో హమాస్ అధినేత మరణించడంతో ఆమె కూడా గాజాను వదిలి తుర్కియేకు పారిపోయినట్లు సమాచారం.

టేకాఫ్ అవుతుండగా ల్యాండింగ్ గేర్‌లో మంటలు

- అమెరికన్ ఎయిర్ లైన్స్ బోయింగ్‌కు తప్పిన ప్రమాదం

డెన్వర్: డెన్వర్ విమానాశ్రయంలో అమెరికన్ ఎయిర్ లైన్స్ బోయింగ్ విమానానికి పెను ప్రమాదం తప్పింది. శనివారం మధ్యాహ్నం డెన్వర్ నుంచి మయామి వెళ్లే విమానం టేకాఫ్ అయ్యేందుకు సిద్ధమవుతుండగా.. ల్యాండింగ్ గేర్‌లో సాంకేతిక సమస్య కారణంగా ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. దీంతో టేకాఫ్ ప్రక్రియను నిలిపివేసిన పైలట్ ఉన్నతాధికారులకు సమాచారమిచ్చారు. భయాందోళనకు గురైన ప్రయాణికులను గాలితో నింపిన జారుడుబల్ల ద్వారా కిందకు దిగారు. దీనిపై నుంచి జారే క్రమంలో కొందరు కింద పడిపోయారు. మరికొందరు రన్‌వేపై పరుగులు తీశారు. దీనికి సంబంధించిన వీడియోలు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి. సంఘటనా స్థలికి చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపులోకి తెచ్చారని ఫెడరల్ ఏవియేషన్ అడ్మినిస్ట్రేషన్ వెల్లడించింది. గాయపడిన అయిదుగురికి ప్రథమ చికిత్స అందించినట్లు తెలిపింది. ప్రమాద సమయంలో విమానంలో 173 మంది ప్రయాణికులు ఉన్నట్లు పేర్కొంది.



ఒబామాను వెంటాడుతున్న ట్రంప్! మరో పోస్టు వైరల్

ఇంటర్నెట్ డెస్క్: అమెరికా మాజీ అధ్యక్షుడు బరాక్ ఒబామాను అరెస్టు చేస్తున్నట్లుగా ఉన్న ఓ ఏఐ వీడియోను ఇటీవల అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ షేర్ చేశారు. తాజాగా ఒబామాను అపహాస్యం చేస్తూ.. మరో మీమ్ పోస్టు చేశారు. అందులో ఒబామా తెల్లటి ఫోర్డ్ బ్రోంకో కారులో పారిపోతుండగా.. ట్రంప్, ఉపాధ్యక్షుడు వాన్స్, ఇతర అధికారులు ఆయనను పోలీసు వాహనాల్లో వెంబడిస్తున్న దృశ్యాలు ఉన్నాయి. ఈ పోస్టుకు వాన్స్ నవ్వుతున్న ఎమోజీని జత చేయడంతో ట్రంప్ యంత్రాంగం మాజీ అధ్యక్షుడిని జైల్లో పెట్టడానికి చర్యలు తీసుకుంటున్నట్లు ప్రజలకు సూచన ఇస్తున్నారా అని రాజకీయ వర్గాలు అనుమానం వ్యక్తం చేస్తున్నాయి.



సింగపూర్‌లో సీఎం చంద్రబాబును కలిసిన ఎవర్సెండై ఇంజినీరింగ్ గ్రూప్ ఛైర్మన్, సీఎండీ తాన్‌శ్రీ ఎ.కె.నాథన్

ఏపీకి ఎవర్సెండై

- అధునాతన ఫ్యాబ్రికేషన్ ఫ్యాక్టరీ
- అమరావతి మౌలిక సదుపాయాల ప్రాజెక్టులో భాగస్వామ్యం

ఈనాడు, అమరావతి: బుర్జ్ ఖలీఫా, పెట్రోనాస్ టవర్, చెన్నైలోని డీఎల్ఎఫ్ డౌన్ టౌన్ తారామణి ప్రాజెక్టు, గుజరాత్‌లోని స్టాచ్యూ ఆఫ్ యూనిటీ ఫ్యాబ్రికేషన్ పనులూ నిర్వహించిన మలేసియాకు చెందిన ప్రఖ్యాత నిర్మాణసంస్థ ఎవర్సెండై కార్పొరేషన్ రాష్ట్రానికి రాబోతోంది. నిర్మాణ రంగంలో పెట్టుబడులు పట్టేందుకు ఆసక్తి తెలిపింది. బెర్హాద్‌కు చెందిన సంస్థ సీఎండీ తాన్‌శ్రీ ఎ.కె.నాథన్ ముఖ్యమంత్రి చంద్రబాబును సింగపూర్‌లో ఆదివారం కలిసి ప్రతిపాదనపై చర్చించారు. రాష్ట్రంలోని విశాఖ, కృష్ణపట్నంలో ఏదో ఒక చోట 2 లక్షల చదరపు మీటర్ల విస్తీర్ణంలో అత్యాధునిక ఫ్యాబ్రికేషన్ ఫ్యాక్టరీతో పాటు సమీకృత శిక్షణ కేంద్రం ఏర్పాటుకు ఆసక్తి చూపింది. ఇక్కడినుంచే దేశవ్యాప్తంగా ఫ్యాబ్రికేషన్ ఉపకరణాలను రవాణా చేయనున్నట్లు పేర్కొంది. రాజధాని అమరావతి మౌలిక సదుపాయాల ప్రాజెక్టుల్లో భాగస్వామ్యం వహించేందుకు ఆసక్తి తెలిపింది. ఐఐటీ తిరుపతి, ఐఐఐటీ శ్రీసిటీతో కలిసి స్ట్రక్చరల్ ఇంజినీరింగ్ శిక్షణ కేంద్రం ఏర్పాటుపై ముఖ్యమంత్రితో సంస్థ ప్రతినిధులు చర్చించారు.

రాష్ట్రానికి సుర్బానా జురాంగ్

సింగపూర్‌కు చెందిన గ్లోబల్ అర్బన్ ఇన్‌ఫ్రా కంపెనీ సుర్బానా జురాంగ్ రాష్ట్రంలో గృహనిర్మాణ రంగంలో పెట్టుబడులకు ఆసక్తి వ్యక్తం చేసింది. ఆ సంస్థ ప్రతినిధి చెర్‌ఎక్లో సీఎం చంద్రబాబుతో సమావేశమై చర్చించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ 'రాష్ట్రంలో మౌలిక వసతుల ప్రాజెక్టులపై దృష్టి సారించాం. 20 పోర్టులు, 15 విమానాశ్రయాలు అందుబాటులో ఉన్నాయి. రాష్ట్రం లాజిస్టిక్స్ హబ్‌గా తయారవుతుంది. పారిశ్రామికవాడలు అభివృద్ధి చేయాలన్నది ప్రభుత్వ ఆలోచన. రాష్ట్రంలో అందరికీ ఇళ్లు పథకంలో సుర్బానా సంస్థ సహకారం తీసుకుంటాం' అని పేర్కొన్నారు.

డిఫెన్స్, ఎలక్ట్రానిక్స్, ఏరోస్పేస్, గ్రీన్‌ఎనర్జీ రంగాల్లో..

రాష్ట్రంలో విస్తృత అవకాశాలు

- కొత్త విధానాలతో పెట్టుబడులకు అనుకూల వాతావరణం
- సింగపూర్‌లో భారత హై కమిషనర్‌తో చంద్రబాబు భేటీ
- 'సీబీఎన్ బ్రాండ్'కు ప్రత్యేక గుర్తింపు ఉందని హైకమిషనర్ కితాబు

ఈనాడు, అమరావతి: డిఫెన్స్, ఎలక్ట్రానిక్స్, ఏరోస్పేస్, పోర్టులు, గ్రీన్ ఎనర్జీ సహా వివిధ రంగాల్లో పెట్టుబడులకు ఏపీలో అపార అవకాశాలు ఉన్నాయని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. సింగపూర్ కంపెనీలు పెట్టుబడులు పెట్టేందుకు వీలుగా ప్రగతిశీల విధానాలు ప్రవేశపెట్టినట్టు వెల్లడించారు. సింగపూర్ పర్యటనలో భాగంగా అక్కడి భారత హై కమిషనర్ శిల్పక్ అంబులేతో ఆదివారం ఆయన భేటీ అయ్యారు. ఏఐ, స్టార్టప్‌లు, వైద్య పరికరాల రంగంలో పరిశోధన, ఏపీ-సింగపూర్ విశ్వవిద్యాలయాల భాగస్వామ్యం తదితర అంశాలపై చర్చించారు. సింగపూర్ ప్రభుత్వంలో, పారిశ్రామికవేత్తల్లో 'సీబీఎన్ బ్రాండ్'కు ప్రత్యేక గుర్తింపు ఉందని చంద్రబాబుకు శిల్పక్ అంబులే కితాబిచ్చారు. వివిధ రంగాల్లో సింగపూర్ సాధించిన ప్రగతి, వృద్ధి, అక్కడి ప్రభుత్వ పాలసీలు, భారతీయుల కార్యకలాపాల్ని ఆయన చంద్రబాబుకు వివరించారు. వివిధ రంగాల్లో సింగపూర్ అనుసరిస్తున్న విధానాల్ని తెలియజేశారు. భారత్‌లో.. ప్రత్యేకించి ఏపీలో పెట్టుబడులు పెట్టేందుకు సింగపూర్ సంస్థలు ఆసక్తిగా ఉన్నాయని తెలిపారు.

సింగపూర్ పెట్టుబడులకు ఏపీ గేట్ వే

సింగపూర్ నుంచి భారత్‌కు పెట్టుబడులు రావాలని, దీనికి ఏపీ గేట్ వేగా ఉంటుందని చంద్రబాబు తెలియజేశారు. "రాయలసీమలో డిఫెన్స్, ఏరోస్పేస్, ఎలక్ట్రానిక్స్, ఆటోమొబైల్ సంస్థలకు అనువైన పరిస్థితులు ఉన్నాయి. పెట్టుబడులు వచ్చేందుకు సహకరించండి" అని శిల్పక్ అంబులేను చంద్రబాబు కోరారు. సింగపూర్‌లో 83% మేర ప్రభుత్వ గృహనిర్మాణ ప్రాజెక్టులున్నాయని భారత హైకమిషనర్ వివరించారు. రాష్ట్రంలో విద్యారంగం అభివృద్ధికి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు, భవిష్యత్తు ఆలోచనల్ని హైకమిషనర్‌కు విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ వివరించారు. త్వరలో పలు ప్రతిష్ఠాత్మక విద్యాసంస్థలు వస్తాయన్నారు. హౌసింగ్ ప్రాజెక్టుల గురించి మంత్రి నారాయణ వివరించారు.

వైకాపా ప్రభుత్వంలో జరిగిన పొరపాట్లను సరిచేస్తా

గతంలో సింగపూర్ భాగస్వామ్యంతో అమరావతిలో చేపట్టిన వివిధ ప్రాజెక్టులు, 2019-24 మధ్య జరిగిన పరిణామాలతో వాటినుంచి సింగపూర్ వైదొలడం గురించి చంద్రబాబు ప్రస్తావించారు. "వైకాపా ప్రభుత్వంలో జరిగిన పరిణామాలే దీనికి కారణం. ఈ పర్యటనలో ఆ అపోహల్ని తొలగిస్తా. గ్రీన్ ఎనర్జీ రంగంలో 160 గిగావాట్ల విద్యుత్ ఉత్పత్తి లక్ష్యంగా పెట్టుకున్నాం. ఇప్పటికే విశాఖలో ఎన్టీపీసీ, కాకినాడలో గ్రీన్ హైడ్రోజన్ ప్రాజెక్టులు పట్టాలెక్కాయి. 'ఇండియా క్వాంటమ్ మిషన్'లో భాగంగా అమరావతిలో తొలి క్వాంటమ్ వ్యాలీ ఏర్పాటుచేయనున్నాం" అని చంద్రబాబు తెలిపారు.

ఏపీ టెక్ నిపుణులకు డిమాండ్

ఏపీ టెక్ నిపుణులకు సింగపూర్‌లో డిమాండ్ ఉందని చంద్రబాబుకు భారత హై కమిషనర్ తెలిపారు. ఈ అంశంపై ఏపీ ప్రభుత్వంతో సింగపూర్‌లోని భారత రాయబార కార్యాలయం కలిసి పనిచేస్తుందని హామీ ఇచ్చారు. ఎలక్ట్రానిక్స్, సెమీ కండక్టర్ల ఉత్పత్తి, షిప్ బిల్డింగ్, పోర్టు కార్యకలాపాల నిర్వహణ, డేటా సెంటర్ల ఏర్పాటు, ఫార్మా తదితర రంగాల్లో సింగపూర్ కంపెనీలు ఏపీలో పెట్టుబడి పెట్టేందుకు అవకాశాలు ఉన్నాయని వివరించారు. ఆసియా-పసిఫిక్ దిగ్గజ కంపెనీలు ఎస్టీటీ, కెప్పెల్, కాపిటాల్యాండ్, ఈక్వినిక్స్, పీఎస్ఏ తదితర సంస్థల విస్తరణకు అవకాశాలు ఉన్నట్టు వెల్లడించారు. సమావేశంలో మంత్రులు లోకేశ్, నారాయణ, టీజీ భరత్, ఏపీ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



సింగపూర్ పర్యటనలో భాగంగా సుర్బానా జురాంగ్ సంస్థ ప్రతినిధులతో చర్చిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు



సింగపూర్‌లో భారత హైకమిషనర్ శిల్పక్ అంబులేతో జరిగిన సమావేశంలో మంత్రులు నారాయణ, నారా లోకేశ్, టీజీ భరత్, ఏపీ ప్రభుత్వ అధికారులు కె.భాస్కర్, కె.కన్నబాబు



సింగపూర్ పర్యటనలో భాగంగా అక్కడి భారత హైకమిషనర్ శిల్పక్ అంబులేతో భేటీ అయిన ముఖ్యమంత్రి చంద్రబాబు

పెట్టుబడులకు ఆంధ్రప్రదేశ్ గమ్యస్థానమని చెప్పండి

తెలుగు డయాస్పోరాలో భారత హైకమిషనర్ శిల్పక్ అంబులే

ఈనాడు, అమరావతి: అభివృద్ధి, పెట్టుబడులకు ఆంధ్రప్రదేశ్ గమ్యస్థానంగా చెప్పాలని ప్రవాసాంధ్రులకు సింగపూర్‌లోని భారత హైకమిషనర్ శిల్పక్ అంబులే పిలుపునిచ్చారు. స్థానిక ఉత్పత్తుల్ని ప్రోత్సహించడానికి కేంద్రం వన్ డిస్ట్రిక్ట్-వన్ ప్రొడక్ట్ విధానాన్ని ప్రోత్సహిస్తోందని వివరించారు. 'ఇందులో భాగంగా ఆంధ్రప్రదేశ్‌లోని మీ జిల్లాల ఉత్పత్తుల్ని అతిథులకు బహూకరించండి. తద్వారా వాటికి అంతర్జాతీయ స్థాయిలో ప్రాచుర్యం కల్పించండి' అని సూచించారు. సింగపూర్‌లో నిర్వహించిన తెలుగు డయాస్పోరాలో ఆదివారం ఆయన మాట్లాడారు. "తెలుగు డయాస్పోరాకు ప్రవాసాంధ్రులే కాక.. మహారాష్ట్ర, గుజరాత్ సహా ఇతర రాష్ట్రాల వాళ్లూ రావడం సంతోషకరం. చంద్రబాబు రాక కోసం వీళ్లు చాలా రోజులుగా ఎదురుచూశారు. భారత్-సింగపూర్ దౌత్య సంబంధాలకు 60 ఏళ్లు పూర్తయిన నేపథ్యంలో చంద్రబాబు బృందం పర్యటన అత్యంత ప్రాధాన్యం సంతరించుకొంది" అని శిల్పక్ అంబులే తెలిపారు.

ప్రవాసాంధ్రుల నీరాజనం

కిక్కిరిసిన 'తెలుగు డయాస్పోరా ఫ్రం సౌత్ ఈస్ట్ ఆసియా'

ఈనాడు, అమరావతి: ముఖ్యమంత్రి చంద్రబాబుకు సింగపూర్‌లో అక్కడ స్థిరపడిన తెలుగువారు ఘనస్వాగతం పలికారు. 'తెలుగు డయాస్పోరా ఫ్రం సౌత్ ఈస్ట్ ఆసియా' కార్యక్రమానికి అధిక సంఖ్యలో ఎన్ఆర్ఐలు తరలివచ్చారు. సుమారు ఐదు గంటల పాటు సాగిన ఈ సమావేశానికి 1,500 సీట్ల సామర్థ్యంతో కూడిన వన్ ఇంటర్నేషనల్ స్కూల్ ఆడిటోరియం వేదికైంది. చంద్రబాబుకు రాకముందే ఈ ఆడిటోరియం నిండిపోయింది. దీంతో దానికి అనుబంధంగా ఉన్న మరో ఆడిటోరియంలోకి తరలించారు. 'అసమాన ధాత్రి అమరావతి' అంటూ ఆంధ్రప్రదేశ్ ఘనకీర్తిని చాటిచెబుతూ ఆలపించిన గేయం ఆకట్టుకుంది. చంద్రబాబు రెండున్నర గంటల పాటు నిల్చొని, వచ్చిన వారందరినీ ఆప్యాయంగా పలకరించి, 2,500 మందితో ఫొటోలు దిగారు. వారి అభిప్రాయాలు, సమస్యలు తెలుసుకున్నారు.



సింగపూర్‌లో హోటల్ వద్ద తనను ఆహ్వానించడానికి వచ్చిన ప్రవాసాంధ్ర మహిళలతో ముఖ్యమంత్రి చంద్రబాబు

సింగపూర్‌లో ద్వితీయ భాషగా తెలుగుకు గుర్తింపు తెస్తాం

'సింగపూర్‌లో సుమారు 40 వేల మంది తెలుగు వారున్నారు. ఇక్కడ ద్వితీయ భాషగా బెంగాలీ, హిందీ, తమిళం ప్రోత్సహిస్తున్నారు. తెలుగును కూడా ద్వితీయ భాషగా గుర్తించాలనేది తెలుగు వారందరి కోరిక. దీన్ని సాకారం చేసేందుకు ప్రయత్నిస్తా' అని చంద్రబాబు హామీ ఇచ్చారు. ఈ విషయాన్ని సింగపూర్ ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, పరిష్కరించాలని భారత హైకమిషనర్‌ను కోరారు. తెలుగువారు సుమారు 50 లక్షల మంది విదేశాల్లో ఉన్నారని, 120 దేశాల్లో తెలుగు కుటుంబాలు బలంగా ఉన్నాయని చంద్రబాబు వెల్లడించారు. 'రాబోయే రోజుల్లో విదేశాల్లో ఉండే తెలుగువారి సంఖ్య రెండు కోట్లకు చేరుతుంది. దేశ విదేశాల్లోని తెలుగు వారంతా ఏపీకి వచ్చి వెళ్లేందుకు వీలుగా విజయవాడ, విశాఖపట్నం, తిరుపతిలకు నేరుగా విమాన సౌకర్యం కల్పిస్తాం. త్వరలో అమరావతిలోనూ విమానాశ్రయం వస్తుంది' అని సీఎం చెప్పారు.



సింగపూర్‌లో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి చంద్రబాబు.. సభకు పెద్ద సంఖ్యలో హాజరైన ప్రవాసాంధ్రులు

రాష్ట్ర ప్రతిష్ఠ పునరుద్ధరణే లక్ష్యం

(మొదటి పేజీ తరువాయి)

సుస్థిర ప్రభుత్వం ఉంటే అద్భుతాలు సాధించవచ్చనడానికి సింగపూర్ ఉదాహరణ అని సీఎం పేర్కొన్నారు. '2004లో ఉమ్మడి రాష్ట్రంలో తెదేపా అధికారంలోకి వస్తే సింగపూర్‌తో సమానంగా మనం అభివృద్ధి చెందేవాళ్లం. 2019లో మళ్లీ గెలిచి ఉంటే అమరావతి, పోలవరం పూర్తయ్యేవి. ఇక్కడా అంతరాయం వచ్చింది. ఇందులో నా తప్పు ఉందా? రాబోయే రోజుల్లో ఇలాంటి పొరపాట్లు జరగకుండా చూస్తా. నన్ను సరైన మార్గంలో పెట్టే బాధ్యత ఎన్ఆర్ఐలుగా మీపై ఉంది' అని పేర్కొన్నారు.

జన్మభూమికి తిరిగిచ్చే సమయం

"ఐటీని ప్రోత్సహించడం తెలుగు ప్రజలు సాంకేతికంగా ఎదిగేందుకు దోహదం చేసింది. ప్రపంచవ్యాప్తంగా 128కి పైగా దేశాల్లో తెలుగు వారు ఉన్నారు. సింగపూర్‌లో 40 వేల మంది తెలుగువాళ్లు ఉన్నారు. ప్రజలు పన్నుల రూపంలో కట్టిన సొమ్ముతో ఎదిగిన మీరు.. ఇప్పుడు తిరిగిచ్చే సమయం వచ్చింది. మీకు అవకాశం కల్పించిన కర్మభూమి అభివృద్ధికి పని చేస్తూనే.. జన్మభూమికి తిరిగివ్వాల్సిన బాధ్యత మీపై ఉంది. పీ4 కార్యక్రమం ద్వారా పేదరికాన్ని తగ్గించే మిషన్ ప్రారంభించాం. మీ గ్రామాల్లోని పేదలను దత్తత తీసుకోండి" అని చంద్రబాబు కోరారు. ప్రముఖ సంస్థల్లో కీలక స్థానాల్లో ఉన్న తెలుగు ప్రజలు తమ అనుభవాన్ని ఏపీకి అందించాలని సీఎం కోరారు. 'మీరంతా ఏపీలో పెట్టుబడులు పెట్టొచ్చు. గ్రీన్ హైడ్రోజన్ వ్యాలీ ప్రకటించాం. సాంకేతికత అందుబాటులోకి వచ్చాక ఒక కంపెనీ ఏర్పాటు చేయాలంటే.. ఎక్కడి నుంచైనా సాధ్యమే. సర్వీసు ప్రొవైడర్లుగా స్టార్టప్‌లు పెట్టేందుకు ముందుకొస్తే పూర్తిగా సహకరిస్తాం' అని ఆయన పేర్కొన్నారు.

సింగపూర్ అంటే గౌరవం

సింగపూర్ అంటే తనకు అభిమానం, గౌరవమని చంద్రబాబు పేర్కొన్నారు. 'ఇక్కడి క్రమశిక్షణ నన్ను ఆకర్షించింది. రోడ్డుమీద ఒక్క కాగితం ముక్క కనిపించేది కాదు. ఒకరోజు రాత్రంతా తిరిగి చెత్తసేకరణ విధానాన్ని పరిశీలించా. దాన్ని విద్యుత్ ఉత్పత్తికి వినియోగించడం గురించి తెలుసుకుని.. హైదరాబాద్‌లో అమలుచేశా. దీన్ని అప్పటి సింగపూర్ ప్రధాని లీ క్వాన్ కూడా మెచ్చుకున్నారు. సింగపూర్‌లో కారు డ్రైవర్‌కు టిప్ ఇద్దామని ప్రయత్నించినా తిరస్కరించారు. ఇక్కడ ఎవరూ డబ్బులు తీసుకోరని డ్రైవర్ చెప్పారు' అని పేర్కొన్నారు.

తిరుమల.. మన అదృష్టం

వేంకటేశ్వరుడు కొలువైన తిరుమల మన రాష్ట్రంలో ఉండడం మన అదృష్టమని సీఎం పేర్కొన్నారు. 'ఎన్ఆర్ఐలకు వెంకన్న దర్శనం కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేస్తాం. ప్రతి దేశ రాజధానిలో వేంకటేశ్వరస్వామి దేవాలయం ఉండాలి' అని తెలిపారు. సింగపూర్ నుంచి ఏపీలోని విజయవాడ, విశాఖ, తిరుపతికి నేరుగా విమాన సేవలు త్వరలో అందుబాటులోకి తెస్తామని సీఎం పేర్కొన్నారు. 'ప్రపంచంలోనే గౌరవప్రదమైన కుటుంబ వ్యవస్థ మనది. మన సంస్కృతీ సంప్రదాయాలను కొనసాగించాలి. ఇక్కడి స్కూళ్లలో తెలుగు కూడా బోధించాలి' అని కోరారు.

ఎన్ఆర్ఐలే మా బ్రాండ్ అంబాసిడర్లు

- రాష్ట్ర పునర్నిర్మాణంలో భాగస్థులు అవ్వండి
- సింగపూర్‌లో మంత్రి లోకేశ్ పిలుపు

ఈనాడు, అమరావతి: ఆంధ్రప్రదేశ్ పునర్నిర్మాణానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ పేర్కొన్నారు. ప్రపంచవ్యాప్తంగా చంద్రబాబుపై ఉన్న నమ్మకమే తమకున్న బ్రాండింగ్ అని చెప్పారు. "రాష్ట్రంలో ఎంఎస్ఎంఈలను ప్రోత్సహిస్తున్నాం. మీరంతా రాష్ట్రానికి వచ్చి పెట్టుబడులు పెట్టండి. నాన్ రెసిడెంట్ ఇండియన్ (ఎన్ఆర్ఐ)లే మా బ్రాండ్ అంబాసిడర్లు. జగన్ హయాంలో ఐదేళ్లలో అభివృద్ధి పరంగా రాష్ట్రానికి జరిగిన నష్టాన్ని భర్తీ చేయాలన్నదే మా ఆలోచన" అని స్పష్టం చేశారు. ఏపీఎన్ఆర్‌టీ సొసైటీ ఆధ్వర్యంలో సింగపూర్‌లో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో లోకేశ్ మాట్లాడారు. 'రాష్ట్రంలో ఐదేళ్ల సైకో విధ్వంస పాలన చూశాం. చంద్రబాబు అరెస్టు తర్వాత మనకు ఎందుకీ సమస్యలు అని బ్రాహ్మణి (లోకేశ్ భార్య) వారించింది. హైదరాబాద్, ప్రపంచ దేశాల్లో ఉన్న ఐటీ నిపుణులు వేల మంది బాబుకు మద్దతుగా రోడ్లపైకి వచ్చి మాకు ధైర్యాన్నిచ్చారు. రాష్ట్రాన్ని తిరిగి గాడిన పెట్టేందుకు గత ఎన్నికల్లో మీరంతా సెలవులు పెట్టి వచ్చి పడిన తపనను చూశాను" అని చెప్పారు. సింగపూర్‌లో ఉద్యోగులుగా ఉన్న మీరు.. మన రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టి పారిశ్రామికవేత్తలుగా మారే అవకాశాలున్నాయని లోకేశ్ వ్యాఖ్యానించారు. "అంకుర సంస్థలు ఏర్పాటు చేయాలన్నా, పరిశ్రమలు పెట్టాలన్నా రాష్ట్ర ఎకనమిక్ డెవలప్‌మెంట్ బోర్డు (ఈడీబీ) ద్వారా సేవలు అందుతాయి. బ్రాండ్ ఏపీ ప్రమోషన్ కోసం ఇక్కడికి వచ్చాం. స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో సింగపూర్ మాకు ఆదర్శం. క్వాంటమ్ వ్యాలీ ఏర్పాటుతో ప్రపంచమే మన వైపు చూస్తోంది. పలు ఐటీ సంస్థలు విశాఖ నుంచి కార్యకలాపాలు ప్రారంభిస్తున్నాయి. ఎన్ఆర్ఐలకు ఉన్న సమస్యలను ఏపీఎన్ఆర్‌టీ ద్వారా పరిష్కరిస్తాం" అని చెప్పారు. పేదరికం లేని రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్‌ను తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం చేపట్టిన పీ4 కార్యక్రమంలో భాగస్వామ్యం కావడం ద్వారా పేదలను సొంత కాళ్లపై నిలుచునేలా చేద్దామని లోకేశ్ పిలుపునిచ్చారు.



సింగపూర్‌లో తెలుగు డయాస్పోరా నిర్వహించిన కార్యక్రమంలో మాట్లాడుతున్న మంత్రి నారా లోకేశ్

అన్ని ప్రాంతాలూ అభివృద్ధి

ఒకే రాష్ట్రం.. ఒకే రాజధాని.. అభివృద్ధి వికేంద్రీకరణ అనేది తమ నినాదమని లోకేశ్ పేర్కొన్నారు. "అన్ని ప్రాంతాల్లో పరిశ్రమల ఏర్పాటును ప్రోత్సహిస్తున్నాం. అమరావతికి దేశంలోనే మొదటి క్వాంటమ్ వ్యాలీని సీఎం తీసుకొచ్చారు. ఏపీలో టీసీఎస్ ఏర్పాటు చేయాలని ఎందుకు నిర్ణయించారు? అని టీసీఎస్ ఛైర్మన్ చంద్రశేఖరన్‌ను అడిగా. మా కంపెనీలో 35 శాతం మంది తెలుగువాళ్లు పని చేస్తున్నారని, వారంతా ఏపీలో బ్రాంచి పెట్టాలని పదేపదే ఒత్తిడి చేస్తున్నారని ఆయన బదులిచ్చారు. కాగ్నిజెంట్, ఇతర కంపెనీలు కూడా అలాగే రాష్ట్రానికి వచ్చాయి" అని లోకేశ్ పేర్కొన్నారు.

సింగపూర్‌లో ఉన్నానా.. సింహాచలంలోనా!



అమరావతి టీషర్టుతో తనను ఆహ్వానించడానికి వచ్చిన యువకుడితో లోకేశ్

సింగపూర్ వచ్చిన తమకు ఇక్కడి తెలుగు ప్రజలు ఘనంగా స్వాగతం పలికారని లోకేశ్ తెలిపారు. ఆ స్వాగతం చూసి సింగపూర్‌లో ఉన్నానా? సింహాచలంలో ఉన్నానా? అనే సందేహం కలిగిందన్నారు. "మిమ్మల్ని 'ఎన్ఆర్ఐ (నాన్ రెసిడెంట్ ఇండియన్)లుగా కాదు.. ఎంఆర్ఐ (మోస్ట్ రిలయబుల్ ఇండియన్)లుగా నేను భావిస్తా" అని వ్యాఖ్యానించారు. ఏపీ ఎన్ఆర్‌టీ నిర్వహించిన ఈ కార్యక్రమానికి మలేసియా, ఇండోనేసియా, ఫిలిప్పీన్స్ దేశాల నుంచి పెద్ద ఎత్తున తెలుగు ప్రజలు హాజరయ్యారు.

ప్రవాసాంధ్రుల సంక్షేమాన్ని ఆలోచించే ప్రభుత్వం

– తెలుగు డయాస్పోరా కార్యక్రమంలో వేమూరి రవి, ఏపీ ఎన్నార్టీఎస్ ఛైర్మన్

"ప్రవాసాంధ్రుల సంక్షేమం కోసం ఏపీ ప్రభుత్వం నిరంతరం ఆలోచిస్తుంది. మీకు ఏం కావాలి, ఏం చేయాలని ప్రవాసాంధ్రుల్ని అడుగుతున్న తొలి ప్రభుత్వం ఇదే. సీఎక్స్‌వో క్లబ్‌తో వివిధ దేశాల్లో ఉన్నత స్థానాల్లో ఉన్న ప్రవాసాంధ్రులంతా ఒక వేదిక మీదకు వస్తారు. తద్వారా ఓ అంతర్జాతీయ నెట్‌వర్క్ ఏర్పడుతుంది. దీంతో రాష్ట్రానికి, తెలుగు యువతకు మేలు జరుగుతుంది. ఏపీ ఎన్నార్టీఎస్ ప్రవాసాంధ్రుల సంక్షేమానికి కృషి చేస్తోంది. ఉన్నత స్థానాల్లో స్థిరపడ్డ ఎన్నారైలు రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకురావాలి."

సింగపూర్‌లోని సాంకేతికతను రాష్ట్రానికి అందించాలి:

– కానూరు శేషుబాబు, డైరెక్టర్, ఇన్వెస్ట్‌మెంట్స్, ఏపీఎన్నార్టీఎస్

"సీఎక్స్‌వో క్లబ్ ప్రపంచంలో వివిధ కంపెనీల్లో ఉన్నత స్థానాల్లో ఉన్న తెలుగు వారందరినీ ఓ వేదిక మీదకు తీసుకురానుంది. తద్వారా ఓ నెట్‌వర్కింగ్ ఏర్పాటుచేసి వారి సహకారంతో రాష్ట్రాన్ని ముందుకు తీసుకువెళతాం. సింగపూర్ క్వాంటమ్ కంప్యూటర్ ల్యాబ్ చాలా అధునాతనమైంది. వీళ్ల విజ్ఞానాన్ని రాష్ట్రానికి తీసుకొచ్చి యువ పారిశ్రామికవేత్తలకు అందించాలి."

చంద్రబాబు ఐటీ సంస్కరణలతో సింగపూర్ వచ్చాం

– హనుమంతరావు మాదల, అధ్యక్షుడు, తెలుగుదేశం ఫోరం, సింగపూర్

"అప్పట్లో చంద్రబాబు తెచ్చిన ఐటీ సంస్కరణలతో సింగపూర్ వచ్చి ఎంతో అభివృద్ధి సాధించాం. ఈ ఫలాల్ని ఆంధ్రా యువతకు అందిద్దాం. తెలుగు యువతకు సింగపూర్‌లో ఇంజినీరింగ్, డిజైన్, ఫైనాన్స్, హెల్త్‌కేర్, ఏరోస్పేస్, ఏఐ, డేటాసైన్స్ లాంటి రంగాల్లో గొప్ప అవకాశాలున్నాయి. ఇక్కడి తెలుగుసంఘాలు తెలుగుయువతకు మార్గదర్శకులుగాఉంటాయి."

సీఎక్స్‌వో క్లబ్‌తో ఓ అద్భుత ఎకో సిస్టం

–సుధాకర్, ప్రవాసాంధ్రుడు

"ఆంధ్రా సీఎక్స్‌వో క్లబ్‌తో అమరావతిని అమెరికాకు, విశాఖను వాంకోవర్, శ్రీకాకుళాన్ని సింగపూర్‌కు దీటుగా తయారుచేసే అవకాశం ఉంది. ఇది ఓ అద్భుత ఎకో సిస్టం సృష్టించనుంది. ఇందులో సభ్యులుగా ఉండే సీఈవోలు, సీఐవో, సీటీవోలు మన యువతకు మెంటార్లుగా ఉంటారు."

రోల్స్‌రాయిస్ ఏపీకి వచ్చేలా కృషి చేస్తా

- చంద్రబాబుతో ముఖాముఖిలో ప్రవాసాంధ్రురాలు
- ఆ సంస్థలో సీనియర్ ఐటీ ప్రోగ్రామ్ మేనేజర్‌గా పనిచేస్తున్నట్టు వెల్లడి
- అభినందించిన సీఎం.. పీ4లో భాగస్వామి కావాలని సూచన

ఈనాడు, అమరావతి: "రోల్స్‌రాయిస్ కంపెనీ ఆంధ్రప్రదేశ్‌కు రావాలని, స్థానిక యువతకు ఉపాధి కల్పించాలని కోరుకుంటున్నాను. ఇందుకు నా వంతు సహకారం అందిస్తాను. ఆగస్టు 4న కంపెనీ ప్రధాన కార్యాలయం నుంచి ప్రతినిధి రానున్నారు. ఈ అంశాన్ని ఆయనతో ప్రస్తావిస్తా" అని తెలుగు డయాస్పోరా వేదికగా సీఎం చంద్రబాబుతో ఓ ప్రవాసాంధ్రురాలు తెలిపారు. చంద్రబాబు దార్శనికత కారణంగా తాను రోల్స్‌రాయిస్‌లో సీనియర్ ఐటీ ప్రోగ్రామ్ మేనేజర్‌గా పనిచేస్తున్నానని, ఇక్కడ ఇలా నిలబడి మాట్లాడటానికి చంద్రబాబే కారణమన్నారు. రోల్స్‌రాయిస్‌లో ఏ ప్రాజెక్టులో పనిచేస్తున్నారని చంద్రబాబు ఆమెను అడగ్గా.. ఏఐలో క్లౌడ్‌టీమ్‌ను లీడ్ చేస్తున్నట్టు వివరించారు. ఆమెకు గట్టిగా చప్పట్లు కొట్టి అభినందించాలని చంద్రబాబు సభికులకు సూచించారు. 'నా మీద అభిమానం ఉంది కానీ, నాకు మాత్రం మీరు డబ్బులివ్వడం లేదమ్మా' అని ఈ సందర్భంగా ఆమెతో చంద్రబాబు చమత్కరించారు. పీ4లో భాగస్వామి కావాలని కోరారు. తప్పకుండా చేస్తానని, ఇప్పటికే స్నేహితులతో కలిసి ఓ ఈవెంట్ మేనేజ్ కంపెనీ ఏర్పాటుచేసి కొందరికి ఉపాధి కల్పిస్తున్నట్టు ఆమె తెలిపారు. ముఖాముఖి వివరాలు..



చంద్రబాబుతో మాట్లాడుతున్న రోల్స్ రాయిస్ ఉద్యోగిని

ప్రవాసాంధ్రురాలు: సింగపూర్‌లోని అగ్రశ్రేణి విశ్వవిద్యాలయాల్ని ప్రభుత్వ సంస్థలతో అనుసంధానం చేస్తారు. తద్వారా విద్యార్థులందరికీ ఉద్యోగాలు కల్పిస్తారు. ఈ విధానం అనుసరించడం ద్వారా రాష్ట్ర ప్రజలకూ ఉద్యోగాలు కల్పించొచ్చు.

చంద్రబాబు: సింగపూర్‌లో విద్యాసంస్థల్ని పరిశ్రమలకు అనుసంధానించి వాళ్ల అవసరాలకు తగ్గట్టు పాఠ్యప్రణాళిక రూపొందించి నైపుణ్య శిక్షణ ఇస్తున్నారు. మన రాష్ట్రంలో ఉద్యోగాలు రావాలి. అలాగే విదేశాల్లో నాలెడ్జ్ ఎకానమీలో మీ సత్తా చాటిచెప్పే పరిస్థితి రావాలి. ఈ రెండూ అనుసంధానిస్తున్నాం. త్వరలో రాష్ట్రంలో పాఠ్యప్రణాళిక మారుస్తాం. విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ స్టాన్‌ఫోర్డ్ విశ్వవిద్యాలయంలో చదివారు. భవిష్యత్తు అవసరాల్ని దృష్టిలో పెట్టుకొని ఆయా కోర్సులు తెస్తాం.

ప్రవాసాంధ్రురాలు: 20 ఏళ్లుగా సింగపూర్‌లో ఉంటున్నాం. మా పిల్లలు ఇక్కడే పుట్టి పెరిగారు. స్థానిక పాఠశాలల్లో మాతృభాష తెలుగులో చదువుకొనే అవకాశం వారికి కల్పించాలి.

చంద్రబాబు: దీన్ని తప్పకుండా పరిశీలిస్తాం. సింగపూర్‌లో కూడా తెలుగు నేర్చుకొనే పరిస్థితి వస్తుంది. దానికోసం ఏం చేయాలో చేస్తాం.

సత్యనారాయణ చౌదరి, పశ్చిమగోదావరి: సింగపూర్‌లో స్థిరపడ్డ తెలుగువారి పిల్లలకు డిగ్రీలో సీట్లు రావట్లేదు. మేం శాశ్వత నివాసులం, పౌరులం కాకపోవడంతో సీటు పొందే అవకాశం ఉండట్లేదు.

చంద్రబాబు: ఆయా దేశాల్ని బట్టి నిబంధనలుంటాయి. సింగపూర్ ప్రభుత్వ పెద్దలతో మాట్లాడి సమస్య పరిష్కారానికి కృషిచేస్తాం.

ఛాంపియన్

3

ఒక టెస్టు సిరీస్‌లో నాలుగు శతకాలు సాధించిన మూడో కెప్టెన్‌గా శుభ్‌మన్ రికార్డులకెక్కాడు. ఇంగ్లాండ్‌తో తొలి టెస్టు తొలి ఇన్నింగ్స్‌లో 147 పరుగులు చేసిన అతను... రెండో టెస్టు రెండు ఇన్నింగ్స్‌ల్లో 269, 161 స్కోర్లు సాధించాడు. నాలుగో టెస్టు రెండో ఇన్నింగ్స్‌లో 103 పరుగులు చేశాడు. గిల్ కంటే ముందు 1947-48లో భారత్‌పై బ్రాడ్‌మన్ (ఆస్ట్రేలియా), 1978-79తో వెస్టిండీస్‌పై గావస్కర్ (భారత్) మాత్రమే ఒక సిరీస్‌లో 4 చొప్పున శతకాలు సాధించారు.



అపూర్వ పోరాటం

మాంచెస్టర్‌లో అద్భుతం

- ఇంగ్లాండ్‌కు ఎదురొడ్డిన జడేజా, సుందర్
- నాలుగో టెస్టును డ్రా చేసుకున్న భారత్

ఒక్కరైనా ఊహించి ఉండరు మాంచెస్టర్ టెస్టును టీమ్ ఇండియా కాపాడుకుంటుందని.. సిరీస్ అవకాశాలను సజీవంగా ఉంచుకుంటుందని..

ఎందుకంటే

ఆతిథ్య ఇంగ్లాండ్ ఆధిపత్యాన్ని ప్రదర్శించిన పోరులో మొదటి నుంచీ భారత్ వెనుకబడే ఉంది. భారీ ఆధిక్యాన్ని సమర్పించుకుంది. రెండో ఇన్నింగ్స్‌లో ఖాతా తెరవకుండానే రెండు వికెట్లు చేజార్చుకుంది. ఆత్మవిశ్వాసం సన్నగిల్లింది. ఆశలు కోల్పోవడానికి ఇంకేం కావాలి. ఏ సానుకూలతా కనపడని వేళ.. ఓటమి తప్పదనే అనుకున్నారంతా! కానీ టీమ్ ఇండియా అద్భుతమే చేసింది. చరిత్రలో నిలిచిపోయే రీతిలో పరాభవాన్ని తప్పించుకుంది.

ఆల్‌రౌండర్లు జడేజా, సుందర్‌ల అద్వితీయ పోరాటంతో రోజంతా నిలిచిన భారత్.. నాలుగో టెస్టును డ్రాగా ముగించింది. మాంచెస్టర్‌లోనే సిరీస్‌ను చేజిక్కించుకోవాలనుకున్న ఇంగ్లాండ్ ఆశలపై నీళ్లు చల్లింది. అజేయ శతకాలు బాదిన జడేజా, సుందర్ క్రీజులో పాతుకుపోయి ప్రత్యర్థికి తీవ్ర అసహనాన్ని కలిగించారు. ఈ జంట పోరాటం ఎప్పటికీ గుర్తుండి పోతుందనడంలో సందేహం లేదు. రాహుల్, గిల్ కూడా కీలక ఇన్నింగ్స్‌లతో డ్రాకు బాటలు వేశాడు. మ్యాచ్ డ్రానే అయినా.. భారత్‌దే నైతిక విజయం.

మాంచెస్టర్

టీమ్‌ఇండియా అదరహో. అద్భుతం ఆ పోరాటం. అపూర్వం ఆ ఆట. ఓటమి ఖాయమనుకున్న పోరులో అద్వితీయ ప్రదర్శనతో భారత్ గట్టెక్కింది. రవీంద్ర జడేజా (107 నాటౌట్; 185 బంతుల్లో 13×4, 1×6), వాషింగ్టన్ సుందర్ (101 నాటౌట్; 206 బంతుల్లో 9×4, 1×6) అసాధారణ పోరాటపటిమతో నాలుగో టెస్టును డ్రాగా ముగించింది. 311 పరుగుల ఆధిక్యం కోల్పోయి, ఓవర్‌నైట్ స్కోరు 174/2తో చివరి రోజు, ఆదివారం రెండో ఇన్నింగ్స్‌లో బరిలోకి దిగిన టీమ్‌ఇండియా.. రోజంతా నిలిచింది. ఆట ఆఖరుకు 4 వికెట్ల నష్టానికి 425 పరుగులు చేసింది. కెప్టెన్ శుభ్‌మన్ గిల్ (103; 238 బంతుల్లో 12×4) కూడా సెంచరీతో జట్టు గట్టెక్కడంలో తన వంతు పాత్రను పోషించాడు. రాహుల్ (90; 230 బంతుల్లో 8×4)దీ అమూల్యమైన ఇన్నింగ్స్. 143 ఓవర్ల పాటు భారత్ క్రీజులో నిలవడం విశేషం. తొలి ఇన్నింగ్స్‌లో భారత్ 358 పరుగులు చేయగా.. ఇంగ్లాండ్ 669 పరుగులు చేసింది. ఈ డ్రాతో భారత్ సిరీస్ చేజారకుండా కాపాడుకోగలిగింది. స్టోక్స్‌కు 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డు లభించింది.

గట్టెక్కారిలా..: రోజంతా నిలవాలి. గాయంతో బాధపడుతున్న పంత్ ఎక్కువసేపు ఆడగలడన్న గ్యారంటీ లేదు. నాలుగో రోజు రాహుల్, గిల్ ఎంత పోరాడినా.. ఓటమి ముప్పు స్పష్టం. ఆఖరి రోజు టీమ్‌ఇండియా పరిస్థితిది. కానీ ఆశలు లేని స్థితిలో, ప్రతికూల పరిస్థితుల్లో గిల్ సేన అద్భుతమే చేసింది. గొప్ప పోరాటంతో ఒక్కో సెషన్‌ను దాటుకుంటూ మ్యాచ్‌ను కాపాడుకుంది. చేతిలో 8 వికెట్లు ఉండగా చివరి రోజు 137 పరుగుల లోటుతో ఇన్నింగ్స్ కొనసాగించింది భారత్. గిల్ (ఓవర్‌నైట్ 78), రాహుల్ (ఓవర్‌నైట్ 87) మొదలెట్టారు. కానీ కాసేపటికే స్టోక్స్ బౌలింగ్‌లో రాహుల్ వికెట్ల ముందు దొరికిపోవడంతో భారత్ డ్రా ఆశలకు పెద్ద ఎదురుదెబ్బ తగలినట్లయింది. కానీ సుందర్ రూపంలో చక్కని భాగస్వామి దొరికిన గిల్ పోరాటం కొనసాగించాడు. బంతి బొటన వేలికి తగిలి నొప్పితో విలవిల్లాడినా పట్టుదలగా బ్యాటింగ్ చేశాడు. వోక్స్ బౌలింగ్‌లో సింగిల్‌తో అతడు సెంచరీ పూర్తి చేశాడు. మరో వికెట్ పడకుండానే భారత్ లంచ్‌కు వెళ్తుందని అనిపించింది. మళ్లీ డ్రాపై ఆశలు చిగురించాయి. కానీ విరామానికి కాసేపు ముందు గిల్ నిష్క్రమించడంతో 40 పరుగుల నాలుగో వికెట్ భాగస్వామ్యానికి తెరపడింది. పంత్ సరిగా ఆడలేని స్థితిలో ఉన్న నేపథ్యంలో భారత్ ఇన్నింగ్స్‌ను ముగించడం కష్టమేమీ కాదని భావించి ఉంటుంది ఇంగ్లాండ్. ఇంకొక్క వికెట్ కూడా పడగొట్టలేమని కలలో కూడా ఊహించి ఉండదు. సుందర్, జడేజా ఊహించని పోరాటం ఆ జట్టుకు షాక్. దృఢ సంకల్పంతో ఆడిన ఈ జంట నిర్జీవమైన పిచ్‌పై ఏమాత్రం తొందరపడకుండా, ప్రశాంతంగా, అలవోకగా బ్యాటింగ్ చేస్తూ.. ఇంగ్లాండ్ బౌలర్లను విసిగిస్తూ రెండు సెషన్ల పాటు నిలిచింది. అభేద్యమైన అయిదో వికెట్‌కు 334 బంతుల్లో 203 పరుగులు జోడించింది. గాయంతో బాధపడుతున్న పంత్ బ్యాటింగ్‌కు రావాల్సిన అవసరం లేకుండా చేసింది.

పాతుకుపోయారు..: గిల్ లంచ్‌కు కాసేపటి ముందు ఔట్ కావడం ఇంగ్లాండ్ విజయానికి దారి తెరుచుకున్నట్లయింది. జడేజా, సుందర్‌లకు బ్యాటింగ్ వచ్చినా.. పూర్తిగా రెండు సెషన్ల పాటు ప్రత్యర్థిని నిలువరించగలని అనుకోలేదెవరూ! ఆత్మవిశ్వాసంతో ఆడిన ఈ జంట ఓవర్ల మీద ఓవర్లు కరగదీస్తూ సాగిపోయింది. ఇంగ్లాండ్ స్పిన్నర్ డాసన్ కట్టుదిట్టంగానే బౌలింగ్ చేసినా బ్యాటర్లపై ప్రభావం చూపలేకపోయాడు. ఎడమచేతి వాటం బ్యాటర్లకు ఆఫ్‌స్టంప్ ఆవల ఏర్పడ్డ గరకుదనాన్ని అతడు సద్వినియోగం చేసుకోలేకపోయాడు. ఆర్చర్ సహా పేసర్లు కూడా ఎంత శ్రమించినా లంచ్ తర్వాతి సెషన్లో ఈ భాగస్వామ్యాన్ని విడదీయలేకపోయారు. టీ సమయానికి భారత్ 322/4తో స్వల్ప ఆధిక్యంలోకి వచ్చింది. అప్పటికి సుందర్ 57, జడేజా 53 పరుగులతో ఉన్నారు. టీ తర్వాత కూడా ఇంగ్లాండ్ బౌలర్లు చెమటోడ్చారు. అయినా పరిస్థితిలో మార్పులేదు. చుట్టూ ఫీల్డర్లను మోహరించినా బ్యాటర్లపై ఆతిథ్య జట్టు ఎలాంటి ఒత్తిడీ తేలేకపోయింది. జడేజా, సుందర్‌లు అజేయ శతకాలతో మ్యాచ్‌ను ముగించారు. టెస్టుల్లో జడేజాకు ఇది అయిదో శతకం కాగా.. సుందర్ తొలి శతకాన్నందుకున్నాడు.



డ్రా కోసం ప్రతిపాదిస్తే..

నాలుగో టెస్టులో నాలుగో రోజు ఆట చివరికి భారత్ డ్రా చేసుకుంటే చాలు అనే పరిస్థితి! అలాంటిది అయిదో రోజు ఇంగ్లాండ్ కెప్టెన్ బెన్ స్టోక్స్ డ్రా కోసం ప్రతిపాదించినా.. భారత ఆటగాళ్లు ఒప్పుకోలేదు. టీమ్‌ఇండియా బ్యాటర్ల అద్భుత పోరాట ఫలితమే ఇది. రాహుల్, కెప్టెన్ శుభ్‌మన్ గిల్ వెనుదిరిగినా.. వాషింగ్టన్ సుందర్, జడేజా గొప్పగా ఆడి క్రీజులో పాతుకుపోయారు. ఇక ఫలితం తేలే అవకాశం లేకపోవడంతో మాండేటరీ ఓవర్లు (చివరి 15) మొదలు కావడానికి ముందు డ్రాతో మ్యాచ్‌ను ముగిద్దాం అన్నట్లుగా స్టోక్స్.. భారత ఆటగాళ్లతో కరచాలనం చేయబోయాడు. అప్పటికే సెంచరీలకు చేరువగా ఉన్న జడేజా, సుందర్ ఆ ప్రతిపాదనను అంగీకరించలేదు. ఎంతో కష్టపడి సెంచరీల ముంగిట దాకా వచ్చిన భారత బ్యాటర్లు.. ఈ మైలురాయిని అందుకోవాలని అనుకున్నారేమో! దీంతో స్టోక్స్‌తో పాటు ఇంగ్లాండ్ ప్లేయర్లు అసంతృప్తి వ్యక్తం చేశారు. 'బ్రూక్ బౌలింగ్‌లో సెంచరీ చేద్దాం అనుకుంటున్నావా' అని స్టోక్స్.. జడ్డూతో వెటకారంగా అన్నాడు. కానీ భారత బ్యాటర్లు ఆ మాటలేవీ పట్టించుకోలేదు. మొదట జడేజా.. తర్వాత సుందర్ శతకాలు అందుకున్నాక మ్యాచ్ ముగిసింది.

భారత్ తొలి ఇన్నింగ్స్: 358; **ఇంగ్లాండ్ తొలి ఇన్నింగ్స్:** 669

భారత్ రెండో ఇన్నింగ్స్: యశస్వి జైస్వాల్ (సి) రూట్ (బి) వోక్స్ 0; రాహుల్ ఎల్బీ (బి) స్టోక్స్ 90; సాయి సుదర్శన్ (సి) బ్రూక్ (బి) వోక్స్ 0; గిల్ (సి) స్మిత్ (బి) ఆర్చర్ 103; వాషింగ్టన్ సుందర్ నాటౌట్ 101; జడేజా నాటౌట్ 107; ఎక్స్‌ట్రాలు 24; **మొత్తం:** (143 ఓవర్లలో 4 వికెట్లకు) **425**; వికెట్ల పతనం: 1-0, 2-0, 3-188, 4-222; **బౌలింగ్:** వోక్స్ 23-4-67-2; ఆర్చర్ 23-3-78-1; కార్స్ 17-3-44-0; డాసన్ 47-11-95-0; రూట్ 19-2-68-0; స్టోక్స్ 11-2-33-1; బ్రూక్ 3-0-24-0



తేలేది నేడే..

- రెండో గేమూ డ్రానే
- ఫలితం కోసం టైబ్రేక్
- హంపి-దివ్య ప్రపంచకప్ ఫైనల్

బాటుమి (జార్జియా)

ఇద్దరూ ఏనుగులను త్యాగం చేసుకున్నారు.. మిడిల్, ఎండ్ గేమ్‌లలో పోటాపోటీగా ఎత్తులు వేశారు.. ఒత్తిడిలోనూ తప్పులు చేయలేదు.. బలాబలాల్లో సమానంగా నిలిచారు.. ఉత్కంఠను పెంచుతూ.. కోనేరు హంపి-దివ్య దేశ్‌ముఖ్ మధ్య ఫిడే మహిళల ప్రపంచకప్ ఫైనల్ చివరి రోజుకు మళ్లింది. ఆదివారం రెండో గేమ్ 34 ఎత్తుల్లో డ్రాగా ముగియడంతో సోమవారం టైబ్రేక్‌లో ఫలితం తేలబోతోంది. రెండో గేమ్‌లో హంపి-దివ్య ప్రయోగాలకు పోలేదు. తెల్ల పావులతో హంపి ప్రయోజనాన్ని పొందలేకపోయింది. హంపి ఇంగ్లిష్ ఓపెనింగ్‌ను దివ్య బలమైన డిఫెన్స్‌తో అడ్డుకుంది. కొన్ని సందర్భాల్లో హంపిని కాస్త ఒత్తిడికి గురి చేసింది. 16 ఎత్తుల తర్వాత ఇద్దరు ఏనుగులు త్యాగం చేసుకోవడంతో గేమ్ డ్రా దిశగా సాగింది. తర్వాత హంపి దూకుడుగా కొన్ని ఎత్తులు వేసింది. ఎండ్ గేమ్‌లో ఒక బంటును త్యాగం చేసి ఎర వేసినా.. దివ్య దీటుగా స్పందించి ఆ ప్రయత్నాలను అడ్డుకుంది. పోటీగా సాగుతూ వెళ్లిన ఈ గేమ్ చివరికి డ్రాగా ముగిసింది. ర్యాపిడ్ ఫార్మాట్లో జరిగే టైబ్రేక్ పోరు 15-15 నిమిషాల చొప్పున రెండు గేమ్‌లుగా జరుగుతుంది. ఈ రెండు గేమ్‌లలో ఫలితం తేలకపోతే 10-10 నిమిషాల చొప్పున మరో రెండు గేమ్‌లు ఆడతారు. అయినా ఫలితం లేకపోతే 5-5 నిమిషాల గేమ్‌లలో తలపడతారు. మళ్లీ డ్రానే ఎదురైతే 3-3 నిమిషాల చొప్పున ఫలితం తేలే వరకు ఆడుతూనే ఉంటారు. ఈ టోర్నీలో చైనా అమ్మాయి టాన్ జాంగ్‌యి మూడో స్థానాన్ని దక్కించుకుంది. ఆమె 1.5-0.5తో తన దేశానికే చెందిన టింగ్‌జి లీపై విజయం సాధించింది. ఈ పోరులో తొలి గేమ్‌ను డ్రా చేసుకున్న జాంగ్‌యి.. రెండో గేమ్‌లో 55 ఎత్తుల్లో నెగ్గింది.

అంకితకు రజతం



రైన్- రుర్, ఎస్సెన్ (జర్మనీ): ప్రపంచ యూనివర్సిటీ క్రీడల్లో భారత స్టీపుల్‌ఛేజర్ అంకిత దయాని మెరిసింది. ఆదివారం ఆమె రజత పతకం సాధించింది. మహిళల 3000 మీటర్ల స్టీపుల్‌ఛేజ్‌లో తన వ్యక్తిగత అత్యుత్తమ టైమింగ్ 9 నిమిషాల 31.99 సెకన్లతో అంకిత ద్వితీయ స్థానం సాధించింది. మహిళల 20 కిలోమీటర్ల టీమ్ రేస్ వాక్‌లో మునిత ప్రజాపతి, మాన్సి నేగి, సెజల్ సింగ్‌లతో కూడిన భారత జట్టు కాంస్య పతకం కైవసం చేసుకుంది. పురుషుల 4×100 మీ రిలేలో భారత్‌కు కాంస్యం లభించింది. లాలు ప్రసాద్ భోయ్, అనిమేష్ కుజుర్, మణికంఠ హోబ్లిధర్, మృత్యం జయరామ్‌లతో కూడిన భారత బృందం 38.89 సెకన్ల టైమింగ్‌తో మూడో స్థానం సాధించింది. మహిళల 4×400 మీ పరుగులో భారత జట్టు సీజన్ అత్యుత్తమ టైమింగ్ (3 నిమిషాల 35.08 సెకన్లు) నమోదు చేసినా.. పతకం సాధించలేకపోయింది. ఈ పోటీల్లో భారత్ 2 స్వర్ణాలు, 5 రజతాలు, 5 కాంస్యాలు సాధించింది.

ఒకేసారి 1000 మ్యాచ్‌లు..

భారత హాకీ వందేళ్లు పూర్తయిన సందర్భంగా ప్రణాళిక



మహాబలిపురం: భారత హాకీ వందేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా దేశవ్యాప్తంగా ఒకేసారి 1000 మ్యాచ్‌లు నిర్వహించాలని హాకీ ఇండియా నిర్ణయించింది. అంతే కాక ఆటను దిగువ స్థాయి నుంచి బలోపేతం చేయాలని సంకల్పించింది. ఇందులో భాగంగా జాతీయ టోర్నీలకు ఇచ్చే నిధులను పెంచింది. సీనియర్ పురుషులు, మహిళల జాతీయ ఛాంపియన్‌షిప్ నిర్వహణకు రూ.70 లక్షల చొప్పున కేటాయించింది. జూనియర్ ఛాంపియన్‌షిప్‌లకు రూ.30 లక్షల చొప్పున ఇవ్వనుంది. జిల్లా స్థాయి టోర్నీల కోసం ప్రతి రాష్ట్ర సంఘాలకు రూ.25 లక్షల చొప్పున సాయం అందించనుంది. హాకీ వందేళ్ల సంబరాన్ని పురస్కరించుకుని నవంబర్ 7న వేడుక చేయాలని నిశ్చయించింది. ఈ సందర్భంగా దేశవ్యాప్తంగా పురుషులు, మహిళల విభాగాల్లో రికార్డు స్థాయిలో ఒకేసారి 1000 మ్యాచ్‌లను నిర్వహించబోతోంది. ఇందులో 36 వేలమంది క్రీడాకారులు పాల్గొనే అవకాశం ఉంది. "భారత హాకీ వందేళ్లు పూర్తి చేసుకుంటున్న సందర్భంగా ఈ ఆటలో మన ఘన కీర్తిని తలుచుకుంటూనే.. రాబోయే తరాలకు బాటలు వేయాలని నిర్ణయించుకున్నాం. దేశవ్యాప్తంగా ఒకేరోజు 1000 మ్యాచ్‌లను నిర్వహిస్తున్నాం. యువ తరానికి ఆర్థికంగా అండగా నిలవబోతున్నాం" అని హాకీ ఇండియా అధ్యక్షుడు దిలీప్ టిర్కీ తెలిపాడు.

గిల్ మనసులో కుల్‌దీప్!



మాంచెస్టర్: భారత తుది జట్టు ఎంపిక నిర్ణయం కెప్టెన్ శుభ్‌మన్ గిల్‌ది కాకపోవచ్చని దిగ్గజ క్రికెటర్ సునీల్ గావస్కర్ అభిప్రాయపడ్డాడు. తుది జట్టు ఎంపిక పూర్తిగా కెప్టెన్‌పై ఆధారపడి ఉండాలని.. అందులో చీఫ్ కోచ్ సహా మరెవరి ప్రమేయం ఉండకూడదని గావస్కర్ అన్నాడు. "మైదానంలో ఆడేది కెప్టెన్ జట్టు. శార్దూల్ కావచ్చు లేదా కుల్‌దీప్ కావచ్చు..ఫలానా తాను కోరుకోలేదని కెప్టెన్ బయటికి చెప్పలేడు. బహుశా శార్దూల్‌కు బదులు కుల్‌దీప్ జట్టులో ఉండాలని గిల్ ఆశించి ఉంటాడు. అతడిని కెప్టెన్ జట్టులోకి తీసుకోవాల్సింది. గిల్, అతడి కెప్టెన్సీ గురించే జనాలు మాట్లాడుకుంటారు. కాబట్టి తుది జట్టు ఎంపిక నిర్ణయం పూర్తిగా కెప్టెన్‌దే అయ్యుండాలి. అంతర్గత విషయాలు బయటకు రాకపోవచ్చు. కానీ అన్నింటికీ కెప్టెన్ బాధ్యత వహిస్తాడు. 11 మంది ఆటగాళ్లను నడిపించాల్సింది అతడే" అని గావస్కర్ తెలిపాడు.

జిడి.. మొదలెట్టింది



సింగపూర్: ప్రపంచ స్విమ్మింగ్ ఛాంపియన్‌షిప్‌లో చైనాకు చెందిన 12 ఏళ్ల యు జిడి అదరగొట్టింది. ఆదివారం ప్రారంభమైన ప్రతిష్టాత్మక టోర్నీలో యు జిడి చక్కటి ప్రదర్శనతో ఆకట్టుకుంది. మహిళల 200 మీటర్ల వ్యక్తిగత మెడ్లేలో యు జిడి సెమీఫైనల్లోకి దూసుకెళ్లింది. 2 నిమిషాల 11 సెకన్లలో రేసును ముగించింది. సెమీస్‌కు అర్హత సాధించిన 16 మంది టైమింగ్‌తో పోల్చుకుంటే యు జిడి 15వ స్థానంలో నిలిచింది. కెరీర్‌లో తొలిసారిగా ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లో బరిలో దిగిన చైనా అమ్మాయి ఈ సీజన్‌లో తన అత్యుత్తమం 2 నిమిషాల 10.63 సెకన్ల టైమింగ్‌ను అందుకోలేకపోయింది. 400 మీ వ్యక్తిగత మెడ్లే, 200 మీ బటర్‌ఫ్లైలో కూడా యు జిడి తన అదృష్టాన్ని పరీక్షించుకోనుంది. ప్రపంచ అక్వాటిక్స్ నిబంధనల ప్రకారం 14 ఏళ్లు పైబడిన వారే పోటీలకు అర్హులు. అయితే స్విమ్మర్ల టైమింగ్ అర్హత ప్రమాణాల్ని మించి ఉంటే 14 ఏళ్ల లోపు వారికి కూడా అనుమతి ఉంది.

ఆర్యన్, లిఖిత్‌లకు నిరాశ: ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లో భారత స్విమ్మర్లు ఆర్యన్ నెహ్రా, ఎస్.పి.లిఖిత్‌లకు నిరాశ ఎదురైంది. పురుషుల 400 మీ ఫ్రీస్టైల్ హీట్స్‌లో 4 నిమిషాల 0.39 సెకన్ల టైమింగ్‌తో ఆర్యన్ ఏడో స్థానంలో నిలిచాడు. మొత్తంగా 37వ స్థానం సాధించిన ఆర్యన్‌కు ఫైనల్ బెర్తు దక్కలేదు. తొలి 8 స్థానాల్లో నిలిచిన క్రీడాకారులు ఫైనల్‌కు అర్హత సాధించారు. పురుషుల 100 మీ బ్రెస్ట్‌స్ట్రోక్‌లో 1 నిమిషం 1.99 సెకన్లతో లిఖిత్ 40వ స్థానంలో నిలిచాడు. మొదటి 16 స్థానాల్లో నిలిచిన స్విమర్లు సెమీఫైనల్‌కు అర్హత సాధించారు.

సౌత్‌జోన్‌కు తిలక్ సారథ్యం

బెంగళూరు: ఆగస్టు 28న ఆరంభమయ్యే దులీప్ ట్రోఫీ ఫస్ట్‌క్లాస్ టోర్నీలో పాల్గొనే సౌత్‌జోన్ జట్టుకు తిలక్ వర్మ సారథ్యం వహించనున్నాడు. మంచి ఫామ్‌లో ఉన్న తిలక్.. ఇటీవల కౌంటీల్లో హాంప్‌షైర్‌కు ఆడి సత్తా చాటాడు. నాలుగు ఇన్నింగ్స్‌ల్లో రెండు సెంచరీలు చేశాడు. సౌత్‌జోన్ జట్టులో హైదరాబాద్ ఆటగాళ్లు తన్మయ్ అగర్వాల్, తనయ్ త్యాగరాజన్.. ఆంధ్ర కుర్రాడు రికీభుయ్ ఉన్నారు. ఆరు జట్ల మధ్య జరిగే దులీప్ ట్రోఫీని ఈసారి జోనల్ ఫార్మాట్లో నిర్వహిస్తున్నారు.

సుదర్శన్‌పై ఒత్తిడి పెంచారు: పాంటింగ్

మాంచెస్టర్: సాయి సుదర్శన్ వంటి కుర్రాళ్లపై భారత కెప్టెన్ శుభ్‌మన్ గిల్, కోచ్ గౌతమ్ గంభీర్ అనవసర ఒత్తిడి పెంచారని ఆస్ట్రేలియా మాజీ కెప్టెన్ రికీ పాంటింగ్ విమర్శించాడు. సుదర్శన్‌కు వరుసగా అవకాశాలు ఇవ్వకపోవడాన్ని అతడు తప్పు పట్టాడు. తొలి టెస్టులో విఫలమైన సుదర్శన్.. తర్వాతి రెండు టెస్టులకు బెంచ్‌కే పరిమితమయ్యాడు. మళ్లీ నాలుగో టెస్టులో ఆడాడు. "కుర్రాళ్లపై అనసవర ఒత్తిడి పెంచుతున్నారు. తమకు మరో అవకాశం వస్తుందా రాదా అని వాళ్లు ఆలోచించాల్సిన పరిస్థితి మంచిది కాదు. తొలి టెస్టులో సుదర్శన్‌ను ఆడించి, మళ్లీ వద్దనుకుని.. తిరిగి నాలుగో టెస్టుకు తీసుకోవడం ఆశ్చర్యం కలిగించింది" అని పాంటింగ్ అన్నాడు. "కుర్రాళ్లకు కోచ్, కెప్టెన్ మద్దతుగా ఉండాలి. 'ఈ మ్యాచ్‌కు నిన్ను తీసుకుంటున్నాం. ముందు జరగబోయే మ్యాచ్‌ల్లో కూడా తీసుకుని నువ్వెలా ఆడతావో చూస్తాం' అన్న భరోసా కల్పించాలి" అని పాంటింగ్ వివరించాడు.



ఆసీస్ జైత్రయాత్ర

బాసెటెర్ (సెయింట్ కిట్స్): వెస్టిండీస్‌తో టీ20 సిరీస్‌లో ఆస్ట్రేలియా జైత్రయాత్ర కొనసాగుతోంది. ఆతిథ్య విండీస్‌కు వరుసగా నాలుగో మ్యాచ్‌లోనూ ఆసీస్ షాకిచ్చింది. 3 వికెట్ల తేడాతో విండీస్‌ను ఓడించి, అయిదు మ్యాచ్‌ల సిరీస్‌లో 4-0తో ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. షెర్ఫానీ రూథర్‌ఫర్డ్ (31; 15 బంతుల్లో 4×4, 2×6), రొమారియో షెఫర్డ్ (28; 18 బంతుల్లో 4×4, 1×6), జేసన్ హోల్డర్ (26; 16 బంతుల్లో 4×4, 1×6) సత్తా చాటడంతో మొదట విండీస్ 20 ఓవర్లలో 9 వికెట్లకు 205 పరుగులు సాధించింది. ఆసీస్ బౌలర్లలో ఆరోన్ హార్డీ (2/24), జేవియర్ బార్ట్‌లెట్ (2/39), సీన్ అబాట్ (2/61), ఆడమ్ జంపా (3/54) సఫలమయ్యారు. అనంతరం ఆసీస్ మరో నాలుగు బంతులు మిగిలివుండగానే 7 వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించింది. 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' గ్లెన్ మ్యాక్స్‌వెల్ (47; 18 బంతుల్లో 1×4, 6×6), జోష్ ఇంగ్లిస్ (51; 30 బంతుల్లో 10×4, 1×6), కామెరూన్ గ్రీన్ (55 నాటౌట్; 35 బంతుల్లో 3×4, 3×6) చెలరేగి ఆసీస్‌ను గెలిపించారు. మంగళవారం చివరి టీ20 జరగనుంది.

అరెరె... నీరైపోయిందే!



వెంకటేశం తన ద్విచక్ర వాహనానికి ట్యాంకు నిండా పెట్రోలు నింపారు. రాత్రి ఇంటి ముందే పార్కింగ్ చేశారు. తెల్లారిందాకా ఒకటే వర్షం.. పొద్దున్నే మార్కెట్‌కు వెళ్దామని బండి తీస్తే.. ఎంతకూ స్టార్ట్ కావడం లేదు. ఏమిటా అని చూస్తే పెట్రోల్ ట్యాంక్‌లోకి నీరొచ్చింది. బంకు వాళ్లు మోసం చేశారంటూ వెళ్లి గొడవకు దిగారు.

ద్విచక్రవాహనం ఆరుబయట పెట్టడం వల్ల ట్యాంకులోకి నీటిచెమ్మ దిగిందని.. అందులోని ఇథనాల్ అంతా నీరైపోయిందని తెలిసింది.

ఇది వెంకటేశం ఒక్కరికే కాదు.. మనలో చాలా మందికి అప్పుడప్పుడూ ఎదురయ్యే అనుభవమే. పెట్రోలు ట్యాంకులో నీరు చూసి బంకు వాళ్లు మోసం చేశారని ఆందోళనపడిపోతాం. కానీ సమస్య మన దగ్గర కూడా తలెత్తే అవకాశం ఉంది. వర్షాకాలంలో ఇలాంటి సమస్యలు ఎక్కువగా వస్తుంటాయి. సాధారణంగా మనం పోయించుకునే పెట్రోల్‌లో 20 శాతం వరకు ఇథనాల్ కలుపుతారు. ఈ మిశ్రమంలోకి చుక్క నీరు దిగినా ఇథనాల్ అంతా నీరైపోతుంది. బండి మొరాయిస్తుంది.

- 2014 సంవత్సరం నుంచి పెట్రోల్, ఇథనాల్ మిశ్రమ ప్రక్రియ మొదలైంది. తొలి సంవత్సరం కేవలం 1.5 శాతమే ఇథనాల్‌ను కలిపేవారు. కేంద్ర ప్రభుత్వ బయో ఫ్యూయల్ పాలసీలో భాగంగా 2025 నాటికి ఆ శాతం 20కి పెరిగింది. ఇలా చేయడం వల్ల ఆయా వాహనాల నుంచి ఉత్పత్తయ్యే కర్బన ఉద్గారాలు గణనీయంగా తగ్గుతాయి.
- ఇథనాల్ వాడకంతో ఇంధన దిగుమతులు తగ్గుతాయి. విదేశీ మారక ద్రవ్యం పెద్ద ఎత్తున ఆదా అవుతుంది. ఈ విధంగా దశాబ్దకాలంలో రూ.1.13లక్షల కోట్లు ఆదా అయినట్లు కేంద్ర ప్రభుత్వ గణాంకాలు వెల్లడిస్తున్నాయి. ఇథనాల్ ధర కూడా తక్కువే. లీటరు రూ.57.97 చొప్పున కేంద్రం నిర్ణయించింది.
- చెరకు, మొక్కజొన్న, పాడైపోయిన, మిగులు ఆహార ఉత్పత్తుల నుంచి ఇథనాల్ తయారు చేస్తారు. ఇది జీవ ఇంధనం. మనదేశంలో తయారయ్యే ఇథనాల్‌లో 42.3% మొక్కజొన్న నుంచి, 37.7% చెరకు నుంచి తయారు చేస్తున్నారు.
- అయితే ఇందులో ఓ సమస్య ఉంది. ఈ మిశ్రమంలో చుక్క నీరు పడ్డా ఇథనాల్ అంతా నీరుగా మారుతుంది. అది ట్యాంకు అడుగుభాగానికి చేరుతుంది. దీన్ని వాడిన వాహనాలు మధ్యలో మొరాయిస్తాయి. అలా జరగకుండా కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలి.

బంకుల్లో ఇలా..

- పెట్రోల్ బంక్ ట్యాంకుల్లో అండర్‌గ్రౌండ్ ట్యాంకు ఫైబర్ కోటింగ్‌తో ఉండాలి. అప్పుడు వీటిలోకి వర్షపు నీరు లీకయ్యే అవకాశం ఉండదు. ప్రస్తుతం ఐరన్ ట్యాంక్‌లు ఉపయోగిస్తున్నారు.
- ఆయిల్ కంపెనీల్లోని ఔట్‌లెట్లలో పెట్రోల్, ఇథనాల్ మిశ్రమం సరిగా జరగాలి.
- బంకులోని పెట్రోల్ ఎలా ఉందన్న విషయాన్ని యాజమాన్యాలు తరచూ చెక్ చేస్తూ ఉండాలి.
- ప్రస్తుతం బంకుల్లో ట్యాంకు అడుగున నీరు ఎంత పరిమాణంలో ఉందో తెలుసుకునేందుకు సాంకేతిక సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయి. ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ ఉండాలి.
- పెట్రోల్ నాణ్యతను పంపు వద్ద కూడా సరి చూసుకోవాలి. పెట్రోల్ కొట్టించుకునే ముందు బాటిల్‌లో కొంత ఇంధనాన్ని నింపి చూపించమని వాహనదారులు కోరాలి.

మనమేం చేయాలంటే?



- వాహనాలను ఆరుబయట నిలిపే ముందు వాటర్ ప్రూఫ్ కవరు తప్పనిసరిగా వాడాలి.
- ఫ్యూయల్ ట్యాంక్ క్యాప్ సరిగ్గా ఉందో లేదో ఒకటికి రెండు సార్లు తనిఖీచేయాలి.
- వాహనాన్ని వాష్ చేశాక, ఫ్యూయల్ ట్యాంక్ వద్ద నీరు లేకుండా చూడాలి.

- ఈనాడు, అమరావతి, హైదరాబాద్

సలాం దొర



అక్షరాల 76 ఏళ్ల వయసులో.. రాష్ట్రస్థాయి పవర్‌లిఫ్టింగ్ పోటీల్లో పాల్గొన్నారు అనకాపల్లి జిల్లా నర్సీపట్నానికి చెందిన పరవాడ రామలక్ష్మణదొర. ఎస్‌బీఐలో పనిచేసి ఉద్యోగ విరమణ పొందిన ఆయన.. గతంలో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రన్నింగ్, లాంగ్ జంప్, ట్రిపుల్‌జంప్, హైజంప్, పవర్ లిఫ్టింగ్ పోటీల్లో 180కి పైగా పతకాలు సాధించారు. ఈ నెల 3న ఆయన భార్య దుర్గాదేవి మృతిచెందారు. భార్య మరణాన్ని మర్చిపోవడానికే గుంటూరు జిల్లా రేవేంద్రపాడులో జరుగుతున్న ఈ పోటీలకు వచ్చానని దొర చెప్పారు. అంత బాధలోనూ డెడ్‌లిఫ్ట్‌లో 85 కిలోలు, బెంచ్‌ప్రెస్‌లో 40 కిలోలు, స్క్వాట్స్‌లో 50 కిలోల బరువు ఎత్తారు.

- న్యూస్‌టుడే, దుగ్గిరాల

సంకల్పమే 'దారి' చూపింది!

వరిమడుగు లక్ష్మీనారాయణ.. పుట్టుకతో అంధుడు. పదో తరగతి చదివే సమయంలో టైప్-1 మధుమేహం బారినపడ్డారు. ఈ కష్టాలన్నీ అధిగమించి పీజీ వరకు చదివి హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నారు. ఆదివారం సిద్దిపేట శివారు రంగనాయకసాగర్ కట్టపై సిద్దిపేట రన్నర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన హాఫ్ మారథాన్-3 (21 కి.మీ.)లో పాల్గొని స్నేహితుడు గోపాల్ సహకారంతో 2 గంటల 48 నిమిషాల వ్యవధిలో లక్ష్యాన్ని చేరారు.



"మాది అనంతపురం జిల్లా గుత్తి మండలం గాజులపల్లి. ఏడో తరగతి వరకు బ్రెయిలీ లిపిలో చదివా. ఇంటర్ వరకు ఆర్‌డీటీ (రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్టు) సహకారంతో విద్యాభ్యాసం సాగించా. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో డిగ్రీ, పీజీ పూర్తి చేశా. 2020లో ఐటీ ఉద్యోగంలో చేరా. చిన్నతనం నుంచే దీర్ఘకాలిక వ్యాధితో సతమతమవుతున్న నేను దానిపై పోరాటం కొనసాగించాలని నిర్ణయించుకున్నా. స్వీట్ సోల్స్ సొసైటీ ఫర్ టైప్-1 డయాబెటిస్ సంస్థ అధ్యక్షుడిగా వ్యవహరిస్తూ.. చిన్న వయసులోనే ఆ వ్యాధి బారినపడిన వారు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పిస్తున్నా. దాతల సహకారంతో ఔషధాలు అందేలా చూస్తున్నా. ఈ సేవలకు గుర్తింపుగా గతేడాది లిస్బన్‌లో ఇస్పాడ్ (ఇంటర్నేషనల్ సొసైటీ ఫర్ పీడియాట్రిక్ అండ్ అడాల్సెన్స్ డయాబెటిస్) సంస్థ హీరో పురస్కారాన్ని ప్రదానం చేసింది. వ్యాధిపై అవగాహన కల్పించడం సహా బాధితులకు సహకారం (ఫండ్ రైజింగ్) అందించాలనే లక్ష్యంతో.. మూడేళ్ల కిందట పరుగు సాధన ప్రారంభించా. ఇప్పటివరకు మారథాన్ (42 కి.మీ.)లో రెండుసార్లు, హాఫ్ మారథాన్ (21 కి.మీ.)లో 15సార్లకు పైగా పాల్గొన్నా" అని వివరించారు. - న్యూస్‌టుడే, సిద్దిపేట, సిద్దిపేట టౌన్

ఔరా సొర..

రెండు వందల కేజీల బరువున్న సొర చేప ఇది. ఆదివారం సాయంత్రం విశాఖపట్నం చేపల జెట్టీలో మత్స్యకారులు విక్రయించగా ఓ కంపెనీ ప్రతినిధులు కొనుగోలు చేశారు. తర్వాత ఇలా రిక్షాలో శీతల గిడ్డంగికి తరలించారు. దీని ధర దాదాపు రూ.40 వేల వరకు ఉంటుందని సమాచారం. - ఈనాడు, విశాఖపట్నం





కర్నల్ రణవీర్ సింగ్ జంవాల్ బృంద సభ్యులు

బ్రహ్మపుత్రలో వెయ్యి కిలోమీటర్ల రాఫ్టింగ్



కవితను అభినందిస్తున్న గవర్నర్ నజీర్

బ్రహ్మపుత్రలో రాఫ్టింగ్.. అదీ వెయ్యి కిలోమీటర్లకు పైగా అంటే మాటలు కాదు. ఈ సాహసయాత్రను విజయవంతంగా పూర్తిచేసిన ఏకైక మహిళగా శ్రీకాకుళం జిల్లా మెట్టూరుకు చెందిన మేజర్ కవిత నిలిచారు. కర్నల్ రణవీర్ సింగ్ జంవాల్ సారథ్యంలోని 12 మంది సభ్యుల బృందం ఈ ఏడాది జనవరి 14న అరుణాచల్ ప్రదేశ్‌లోని జెల్లింగ్ నుంచి బ్రహ్మపుత్రలో రాఫ్టింగ్ చేపట్టి 28 రోజుల్లో 1,040 కి.మీ పూర్తి చేసింది. ఆ బృందంలో కవిత సభ్యురాలు. శనివారం ఆమె తన కుటుంబ సభ్యులతో కలిసి గవర్నర్ అబ్దుల్ నజీర్‌ను కలిశారు. అసమాన ధైర్య సాహసాలు ప్రదర్శించిన కవిత నేటి యువతకు స్ఫూర్తిదాయకమని గవర్నర్ నజీర్ ప్రశంసించారు. - ఈనాడు, అమరావతి

నోటిఫికేషన్ల కంటే ఇవే ముఖ్యం



ఫోన్ చేతిలోకి తీసుకొని అనవసర నోటిఫికేషన్లను తెరిచి చూడటానికి ముందు ప్రతిరోజు మీకు మీరు నాలుగు ప్రశ్నలు వేసుకోండి. ✦ నేను ఈరోజు తగినంత సమయం నిద్రించానా? ✦ సరిపడా నీరు తాగానా? ✦ కనీస వ్యాయామం చేశానా? ✦ అవసరమైనంత ప్రొటీన్ తిన్నానా? ..ఫోన్‌లో వచ్చిన నోటిఫికేషన్ల కంటే ఈ పనులు మీ శ్రేయస్సుకు చాలా అవసరమని గుర్తించండి.

- మైఖేల్ మొరెలి, ఫిట్‌నెస్ కోచ్

సర్కారు వారి 'సేంద్రియ' మార్కెట్



ఖమ్మంలో ఏడాది క్రితం సేంద్రియ రైతుల అవగాహన సదస్సు నిర్వహించారు. ఇందులో సేంద్రియ ఉత్పత్తుల విక్రయానికి ఆరు స్టాళ్లు ఏర్పాటు చేయగా.. హాజరైన వారు ఎగబడి కొనుగోలు చేశారు. ఈ ఆదరణ నేపథ్యంలో.. నగరంలోని సమీకృత కూరగాయల మార్కెట్‌లో ఖాళీగా ఉన్న నాన్‌వెజ్ ప్రాంగణాన్ని మంత్రి తుమ్మల సూచనతో సేంద్రియ మార్కెట్‌కు కేటాయించారు. ఈ ఉత్పత్తుల నిర్ధారణ, విక్రయాలకు జిల్లా స్థాయి కమిటీనీ ఏర్పాటు చేశారు. ఈ కమిటీ గుర్తించిన సేంద్రియ రైతులతో సమీకృత మార్కెట్‌లో ప్రతి రెండో శనివారం, ఆదివారం (నెలలో రెండ్రోజులు) మేళాలు నిర్వహించారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లోని జిల్లాల రైతులు సహజంగా పండించిన తమ ఉత్పత్తులను తీసుకొచ్చి విక్రయించేవారు. స్పందన బాగుండటంతో రెండు వారాల నుంచి రోజూ క్రయవిక్రయాలు సాగేలా మార్పుచేశారు. 26 స్టాళ్లు ఉండగా.. ఖమ్మం జిల్లా రైతులకు 13 కేటాయించారు. ప్రతి రెండో శనివారం, ఆదివారం తెలుగు రాష్ట్రాల నుంచి వచ్చినవారు మిగతా స్టాళ్లలో తమ ఉత్పత్తులు విక్రయిస్తున్నారు. ఆకుకూరలు, వివిధ రకాల బియ్యం, ముడి బియ్యం, అపరాలు, చిరుధాన్యాలు, గానుగ నూనెలు, కార్బైడ్ రహిత పండ్లు, తేనె, రసాయనాలు లేకుండా పండించిన పదార్థాలతో తయారైన పచ్చళ్లు, కారంపొడులు, కుంకుమ, పసుపు, పాలు, పాల ఉత్పత్తులు, అరకు కాఫీ, తేనె తదితర గిరిజన ఉత్పత్తులను అమ్ముతున్నారు. 'ప్రైవేటు సేంద్రియ మార్కెట్లు ఎన్నో ఉన్నాయి. ప్రభుత్వ సహకారంతో ఖమ్మంలోనే ఈ మార్కెట్ ఏర్పాటైంది. ఆదరణ పెరుగుతోంది' అని సేంద్రియ రైతు సంఘం బాధ్యుడు వెంకటేశ్వరరావు తెలిపారు. 'జిల్లాస్థాయి కమిటీ క్షేత్ర సందర్శనలతో గుర్తించిన సేంద్రియ రైతులే ఇక్కడ స్టాళ్లు ఏర్పాటు చేశారు' అని ఖమ్మం జిల్లా ఉద్యాన, పట్టుపరిశ్రమ అధికారి ఎంవీ మధుసూదన్ తెలిపారు.

- ఈనాడు, ఖమ్మం; న్యూస్‌టుడే, ఖమ్మం వ్యవసాయం

మందులు కొనండి.. కానీ!

జలుబు, దగ్గు, జ్వరం నుంచి.. దీర్ఘకాలిక వ్యాధుల వరకు.. రోగం వచ్చిందంటే.. మందే మార్గం..!



మరి మనం వెళ్లే మెడికల్ షాపు సరైనదేనా?

అందులో నిబంధనలన్నీ సరిగా పాటిస్తున్నారా?

ఔషధాలు కొనేటప్పుడు ఏ జాగ్రత్తలు తీసుకోవాలి?

1. ప్రతి మెడికల్ షాప్ ఔషధ నియంత్రణ విభాగం (డీసీఏ) వద్ద తప్పనిసరిగా లైసెన్స్ పొందాలి. అందులో ఫార్మాసిస్టు పేరు ఉండాలి. అమ్మేవారికి డిప్లొమా, బీఫార్మసీ, ఎంఫార్మసీల్లో ఏదో ఒక అర్హత తప్పనిసరి. ఆ లైసెన్స్‌ను వినియోగదారులకు కనిపించేలా గోడ మీద ప్రదర్శించాలి.
2. మీరు వెళ్లిన ఔషధ దుకాణానికి లైసెన్స్ ఉందా లేదా అని వెబ్‌సైట్‌లో చూసుకునే వీలు కూడా ఉంది. ఈ దుకాణాల జాబితాను 'డ్రగ్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్' వెబ్‌సైట్‌లో 'థర్డ్ పార్టీ వెరిఫికేషన్' పేరుతో పొందుపరిచారు. అందులోకి వెళ్లి దుకాణం పేరు, ప్రాంతం టైప్ చేస్తే దాని వివరాలన్నీ కనిపిస్తాయి.
3. ప్రిస్క్రిప్షన్ లేకుండా యాంటీబయాటిక్స్ కొనుగోలు చేయొద్దు. దుకాణదారుడు అవసరానికి మించి యాంటీబయాటిక్స్ ఇస్తే తీవ్ర దుష్ప్రభావాలు ఉంటాయి. వైద్యుడి చీటీ లేకుండా 'ఓవర్ ది కౌంటర్ డ్రగ్స్' అంటే పారాసిటమల్, డైజీన్ వంటి కొన్ని మాత్రమే కొనుగోలు చేయొచ్చు.
4. మాత్రలు, టానిక్‌లు కొనుగోలు చేసేప్పుడు వాటిపై ఎక్స్‌పైరీ తేదీ తప్పనిసరిగా చూడాలి. బ్యాచ్ నంబర్ ఉండాలి. ఔషధాల ధరలు వెబ్‌సైట్ ద్వారా కూడా తెలుసుకోవచ్చు. నేషనల్ ఫార్మాస్యూటికల్ ప్రైసింగ్ అథారిటీ సుమారు 300 అత్యవసర ఔషధాల జాబితాను 'ఫార్మా సహీ దామ్' అనే వెబ్‌సైట్‌లో పెట్టింది. ఇందులో ధరలను నిర్ణయించి పెట్టారు. సరిచూసుకోవచ్చు.
5. ఔషధాల దుకాణదారులు ఏవైనా ఉల్లంఘనలకు పాల్పడుతున్నట్టు మీ దృష్టికి వస్తే.. 1800-599-6969 కి కాల్ చేయొచ్చు. అన్ని పనిదినాల్లో ఉదయం 10.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు అందుబాటులో ఉంటుంది. లేదా 'డీసీఏ' ఎక్స్ హ్యాండిల్ ద్వారా కూడా ఫిర్యాదుచేయొచ్చు.
6. మార్కెట్‌లో ఏదైనా ఔషధం కొరత ఉంటే అధికారులకు కాల్ చేసి చెబితే అవి అందుబాటులోకి వచ్చేలా చర్యలు తీసుకుంటారు.

ఏవైనా మందులు శరీరానికి పడకపోతే కూడా అధికారులకు తెలియజేయొచ్చు. అది నకిలీదా? ప్రమాణాలకు అనుగుణంగా లేదా? అనే విషయాలను అధికారులు దర్యాప్తు చేస్తారు. - ఈనాడు, హైదరాబాద్

ఈ చెవుల మేక.. పాడి గేదె లెక్క



బారెడు చెవులతో ప్రత్యేకంగా ఉన్న ఈ మేకను చార్మినార్ సమీపంలోని గుల్జార్‌హౌస్ వద్ద స్థానికుడు ఖదీర్ పెంచుతున్నారు. దీనిని ప్రత్యేకంగా పాల కోసం పెంచుతున్నట్లు తెలిపారు. సాధారణ మేకలు లీటరు వరకు మాత్రమే పాలు ఇస్తాయని.. ఈ మేక 2.5 లీటర్ల వరకు ఇస్తుందని మహబూబ్‌నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల జంతుశాస్త్ర సహాయ ఆచార్యుడు డా.బక్షి రవీందర్ వివరించారు. ఇవి పాకిస్థాన్‌లోని సింధు ప్రాంతంలో ఎక్కువగా కనిపిస్తాయని తెలిపారు. "సాధారణ మేక చెవులు 3-4 సెంటీమీటర్లు ఉంటే.. ఈ మేక చెవులు 15 సెంటీమీటర్ల పైనే ఉంటాయి. ఇవి బరువు సైతం ఎక్కువే పెరుగుతాయి. దీని చర్మం మెరుస్తూ.. కాఫీ రంగులో ఉంటుంది. పొడవుగా ఉన్న దీని చెవులు శరీరంలోని వేడిని బయటకు పంపడంలో ఉపయోగపడతాయి" అని వివరించారు. - ఈనాడు, హైదరాబాద్

అడవంతా అత్తారిల్లే



హోంస్టేగా తీర్చిదిద్దనున్న వెదురు బొంగులతో చేసిన ఇల్లు

చుట్టూ పచ్చని అందాల నడుమ ఎత్తయిన వెదురింటిలో నివాసముంటే ఎంత హాయో కదా? పూరిపాకలు, మట్టితో కట్టిన గుడిసెలు, పెంకుటింటిలో సేదతీరితే భలేగా ఉంటుంది కదా? ఈ ఆనందాన్ని పర్యాటకులకు సొంతం చేసేందుకు వీటినే హోంస్టేలుగా మలుస్తున్నారు. ఇందుకోసం అల్లూరి సీతారామరాజు జిల్లాలోని అనంతగిరి, అరకువ్యాలీ, పాడేరు, చింతపల్లి, జి.మాడుగుల, మారేడుమిల్లి, రంపచోడవరం, డుంబ్రిగూడ ప్రాంతాలను ఎంపిక చేశారు. గిరిజనుల జీవనశైలి దెబ్బతినకుండా వారు ఉంటున్న గుడిసెలు, పెంకుటిళ్లను అభివృద్ధి చేసి ఇవ్వనున్నారు. ఇప్పటికే 865 మంది గిరిజనులు తమ ఇళ్లలోని ఒకటి, రెండు గదుల్ని హోంస్టేలుగా మార్చేందుకు ముందుకొచ్చారు. వాటిల్లో పర్యాటకుల ఆతిథ్యానికి అనువుగా ఉండే గృహాలను అధికారులు పరిశీలించారు. ప్రస్తుతం అరకు వ్యాలీలో 15, డుంబ్రిగూడలో 18 ఇళ్లను గుర్తించారు. వాటిని హోంస్టేలుగా మార్చి పర్యాటక సీజన్ ప్రారంభమయ్యే నవంబరు నాటికి అందుబాటులోకి తీసుకురానున్నారు.

హోంస్టేలుగా ఎంపిక చేసిన గదుల అభివృద్ధికి కేంద్రం గ్రాంటు రూపంలో నిధులు మంజూరు చేస్తోంది. సిల్వర్ కార్డు కింద ఒక గది ఉంటే రూ.3 లక్షలు, గోల్డ్ కార్డు కింద రెండు గదులు ఉంటే రూ.5 లక్షల చొప్పున ఇస్తారు. ఈ మొత్తాన్ని గిరిజనులు తిరిగి చెల్లించాల్సిన అవసరం లేదు. ఇంతకంటే ఎక్కువ నిధులు అవసరమైతే డ్వాక్రా నుంచి రుణం అందిస్తారు.

హోంస్టేలు సింగిల్ రూం, డబుల్ రూంలుగా ఉండనున్నాయి. గది, మంచం, ఏసీ/కూలర్, అటాచ్డ్ బాత్‌రూం, గీజర్, తాగునీరు ఏర్పాటు చేస్తారు. గది ఆకర్షణీయంగా ఉండటానికి గిరిజన సంప్రదాయం ఉట్టిపడే ఫొటో ఫ్రేమ్స్, డిజైన్లు ఉంటాయి. గిరిజన సంప్రదాయ వంటలు ఇష్టపడే వారికి అంబలి, సామలు, ఇతర చిరుధాన్యాలతో టిఫిన్, భోజన వసతి కల్పిస్తారు. బహిరంగ మార్కెట్‌తో పోలిస్తే వీటి అద్దెలు కూడా తక్కువగా ఉండనున్నాయి.

-ఈనాడు, అమరావతి

ఆ గ్రామంలో 60 ఏళ్లు దాటిన వ్యక్తే లేరు!



ఈటీవీ భారత్: ఒడిశాలోని బలంగీర్ జిల్లా సెల్మాపాలి గ్రామంలో 60 ఏళ్లు దాటిన వ్యక్తి ఒక్కరు కూడా లేరు. ఆ వయసు మీద పడేసరికి అందరూ మూత్రపిండాల వైఫల్యంతో ప్రాణాలు విడుస్తున్నారు. గత రెండు నెలల్లో ఇలా అయిదుగురు మృత్యుఒడికి చేరారు. దాదాపు 300 జనాభా ఉన్న సెల్మాపాలిలో ప్రతి కుటుంబంలోనూ ఒక కిడ్నీ రోగి ఉన్నారు. మారుమూల ఉన్న తమ గ్రామంలో సరైన వైద్య సదుపాయాలు లేకపోవడం, రోగ నిర్ధారణ ఆలస్యం కావడం ఈ పరిస్థితికి ప్రధాన కారణాలని గ్రామస్థులు అంటున్నారు. కుటుంబ పెద్దలు మంచం పట్టడంతో మిగతావారు ఆర్థికంగా తీవ్రమైన ఇబ్బందులు పడుతున్నారు. వైద్య బృందాలు చాలాసార్లు గ్రామాన్ని సందర్శించి రక్త నమూనాలను సేకరించాయి. ఈ పరీక్షల ఫలితాలను మాత్రం తమకు వెల్లడించలేదని గ్రామస్థులు చెబుతున్నారు. వీరంతా తాగునీటికి గొట్టపు బావులపైనే ఆధారపడుతున్నారు. ఆ నీరు కలుషితమై ఉండవచ్చని వైద్యులు అనుమానిస్తున్నారు.

శిలలే.. పచ్చని అలలయ్యాయా..



వనపర్తి సమీపంలోని తిరుమలయ్య గుట్ట పరిసరాలివి. గుట్టపై వెలసిన తిరుమలనాథుడి ఆలయ దర్శనానికి వచ్చే భక్తులకు, ప్రకృతి ప్రేమికులకు ఆహ్లాదాన్ని పంచుతున్నాయి. ఇక్కడి నుంచి 15 కి.మీ. దూరంలోని పాన్‌గల్ ఖిల్లా (దుర్గం), పెబ్బేరు సమీపంలోని కృష్ణా నది పరీవాహక ప్రాంతం కనువిందు చేస్తున్నాయి.

- న్యూస్‌టుడే, వనపర్తి పట్టణం

'చిలకల'గూడ స్టేషన్ ఖాళీ లేదా..



ఒక్క గూటిలో తలదాచుకొనేందుకు నాలుగు రామచిలుకలు పోటీపడి ఎగురుకుంటూ వస్తున్నట్లున్న ఈ దృశ్యం ఆదివారం హైదరాబాద్ శివారు కుంట్లూరులో కనిపించింది. మోడువారిన ఈ తాటి చెట్టుకు రంధ్రాలు పెట్టి రామచిలుకలు, గోరింకలు, గుడ్లగూబలు ఆవాసంగా మార్చుకున్నాయి.

- ఈనాడు, హైదరాబాద్



నమ్మండి ఇది వంతెనేనండి

కాకినాడ జిల్లా ఏలేశ్వరం- అప్పనపాలెం మధ్యలో ఏలేరు నదిపై ఉన్న వంతెన ఇది. ఏలేశ్వరం నుంచి సమీప 10 గ్రామాలకు వెళ్లాలంటే ఈ వంతెనే ఆధారం. 2020లో వచ్చిన వరదలకు పాక్షికంగా దెబ్బతిన్నా అప్పటి ప్రభుత్వం పట్టించుకోలేదు. గత ఏడాది వచ్చిన వరదలకు పూర్తిగా శిథిలమైంది. దీంతో ఆయా గ్రామాలకు చెందిన 15 వేల మంది 15 కి.మీ. చుట్టుతిరిగి ప్రయాణించాల్సిన పరిస్థితి. కొందరు మాత్రం అలా వెళ్లలేక ప్రమాదకరంగా ఉన్న వంతెనపైనే రాకపోకలు సాగిస్తున్నారు. కొత్త వారధి నిర్మాణానికి రూ.17 కోట్లతో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించారు. - ఈనాడు, కాకినాడ

సింహాళ నేలపై తెలుగు నెలవు

- భాష మనుగడ, జాతి అస్తిత్వంపై ఆరాటం
- ఇక్కడివారి అండ కోరుతున్న శ్రీలంకలోని జిప్సీలు, అహికుంటకులు

ఈనాడు - హైదరాబాద్

శ్రీలంకలోనూ తెలుగువారున్నట్లు కొన్నేళ్ల క్రితం తెలిసినప్పుడు మనవాళ్లు అక్కడికి వెళ్లి ఆరా తీయగా... ఆసక్తికర విషయాలు తెలిశాయి. వారు మాట్లాడేది తెలుగే అయినా మాతృభాషలో రాయడం, చదవడం రాదు. ఇదిలాగే కొనసాగితే భవిష్యత్తు తరం మాట్లాడటం కూడా మరచిపోయే ప్రమాదముందని వారు ఆందోళన చెందుతున్నారు. తెలుగు అస్తిత్వాన్ని కాపాడుకునేందుకు సంఘంగా ఏర్పడ్డారు. జిప్సీలు, అహికుంటక పేర్లతో తమను పిలవడం ఇష్టం లేదని... తెలుగు జాతిగానే గుర్తించాలని కోరుతున్నారు. అందుకోసం తెలుగువారందరి మద్దతు ఆశిస్తున్నారు. సంఘం పెద్దలు ఇద్దరు ఆంధ్రప్రదేశ్, తెలంగాణలలో ఇటీవల పర్యటించారు. తెలుగు జాతి ట్రస్టు, తెలుగు నెరవు ట్రస్టు ఆహ్వానం మేరకు హైదరాబాద్‌లో ఇటీవల ఏర్పాటు చేసిన ఆత్మీయ సమావేశానికి ఆల్ సిలోన్ తెలుగు ఆర్టిస్ట్స్ కల్చరల్ అసోసియేషన్ అధ్యక్షుడు కందసామిగె రామసామి అనువత్తు, కార్యదర్శి ధర్మదాసగె నిమల్ హాజరయ్యారు. తమ అంతరంగాన్ని పంచుకున్నారు.

తొలుత చిన్న సమూహాలుగా..

శ్రీలంకలో తెలుగు మాట్లాడేవారు ఏడు గ్రామాల పరిధిలో సుమారు 4 వేల మంది ఉంటారని అక్కడి ప్రభుత్వ లెక్కలు చెబుతున్నాయి. ఈ సంఖ్య ఇంకా ఎక్కువే అని అక్కడి తెలుగువారు చెబుతున్నారు. వారు తొలుత వేర్వేరు ప్రాంతాల్లో చిన్న సమూహాలుగా ఉండేవారు. సంచార జీవనం సాగించేవారు. అందుకే జిప్సీలుగా పిలుస్తున్నారు. బతుకుతెరువు కోసం పాములను, కోతులను ఆడించేవారిని అహికుంటక పేరుతో పిలుస్తున్నారు. శ్రీలంక ప్రభుత్వం భూములు కేటాయించడంతో కొందరు ఇళ్లు నిర్మించుకుని... వ్యవసాయం చేసుకుంటూ జీవిస్తున్నారు. తెలుగు మాట్లాడేవారు ఈస్టర్న్ ప్రావిన్సులోని అక్రైయపత్తు, ఆలిగంబె తిరుక్కోవిల్, నార్త్ సెంట్రల్‌లో తబుత్తెగమ, కాలవెవ ప్రాంతాల్లో ఉన్నారు.



వారిదే అచ్చతెలుగు!

మన తెలుగుకు, శ్రీలంకలోని అహికుంటకులు మాట్లాడే భాషకు వ్యత్యాసం కనిపిస్తోంది. మన తెలుగుపై సంస్కృతం, ఉర్దూ, పర్షియన్, అరబిక్, ఆంగ్ల భాషల ప్రభావం ఉంది. శ్రీలంకలో నివసిస్తున్న జిప్సీలపై ఈ ప్రభావం లేదని.. వారు మాట్లాడేదే అచ్చతెలుగు అని సుబ్బారెడ్డి తెలిపారు. "మనం అక్షరాలు అంటే.. వారు అక్కురాలు అంటారు. తెలుగులో ద్విత్వాక్షర పదాలే ఉంటాయి. ఏ అక్షరానికి ఆ ఒత్తే ఉంటుంది. శ్రీలంకవాసులు అలాగే పలుకుతున్నారు" అని ఆయన వివరించారు.

చదువుతో మార్పు: అనువత్తు



తెలుగువారి జనాభా 15 వేల వరకు ఉండగా, ఎక్కువ మంది వ్యవసాయం చేస్తున్నారు. వందలోపు కుటుంబాలు పాములు, కోతులు ఆడిస్తూ పొట్టపోసుకుంటున్నాయి. ఇతరులు కూలి పని, ఇతర వృత్తులు చేసుకుంటున్నారు. చదువు మా జీవితాల్లో కొంత మార్పు తెచ్చింది. విద్యాభ్యాసం పూర్తైన వారిలో కొందరు పోలీసు ఉద్యోగాల్లో ఉన్నారు. మరికొందరు వైద్యవృత్తిలో ఉన్నారు.

ఎప్పుడు వెళ్లారు?

తెలుగువారు శ్రీలంకకు ఎప్పుడు వలస వెళ్లారనేదానిపై భిన్నాభిప్రాయాలున్నాయి. రామేశ్వరం నుంచి పడవల్లో పలువురు తమిళులు వ్యాపారం కోసం, తోటల్లో కార్మికులుగా పనిచేసేందుకు తరలివెళ్లారని.. . వారితోపాటు తెలుగువారు వెళ్లారని తెలుగు నెరవు ట్రస్టీ అడపాల సుబ్బారెడ్డి, శ్రీలంకలోని యూనివర్సిటీ ఆఫ్ కెలానియా అసిస్టెంట్ డైరెక్టర్ గంగ రజినీ దిస్సనాయక పేర్కొంటున్నారు. అహికుంటకులు అక్కడే పుట్టి పెరిగారని సుబ్బారెడ్డి పేర్కొన్నారు. 'శ్రీలంకలోని తెలుగువారు అనాదిగా జిప్సీలుగా ఉండటం వల్ల వారిని సింహళీయులు గుర్తించడం లేదు. ఎవరైనా మరణించినా అంతిమ సంస్కారాలకు ఇబ్బందులు కలుగుతున్నాయి. ఈ నేపథ్యంలో క్రమంగా బౌద్ధం లేదా క్రైస్తవంలోకి మారిపోతున్నారు' అని తెలుగు జాతి ట్రస్ట్ ప్రతినిధి అనూరాధ తెలిపారు. శ్రీలంకలోని పాఠశాలల్లో సింహళ, ఆంగ్ల మాధ్యమాల్లోనే విద్య నేర్పుతారు. మాతృభాషను ఎలా కాపాడుకోవాలన్నదే అక్కడి తెలుగు పెద్దల ఆందోళన. ముందు తరానికి తెలుగు రాయడం, చదవడం నేర్పేందుకు తెలుగు బడి వంటి వాటి ఏర్పాటుకు తెలుగువారందరి మద్దతు అవసరమని నిమల్ చెబుతున్నారు.


నిమల్

ఎన్నడూ అధికారం వెంట పడలేదు

- అప్పట్లో సీఎం పదవి ఇవ్వకున్నా, పార్టీ కోసం పనిచేశా
- ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే



విజయపుర, న్యూస్‌టుడే: తాను ఎన్నడూ అధికారం కోసం వెంపర్లాడలేదని ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే స్పష్టం చేశారు. కర్ణాటకలో కాంగ్రెస్‌ను అధికారంలోకి తీసుకొచ్చేందుకు తాను శ్రమించినా, పార్టీ అధిష్ఠానం ముఖ్యమంత్రి బాధ్యతలను ఎస్.ఎం.కృష్ణకు అప్పగించిందని గుర్తుచేసుకున్నారు. ముఖ్యమంత్రి స్థానం దక్కకపోగా, తన సేవలన్నీ వృథా అయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. అప్పటికీ నిరాశకు గురికాకుండా పార్టీ శ్రేయస్సు కోసం శ్రమించడంతోనే తనకు ఏఐసీసీ అధ్యక్ష బాధ్యతలను అప్పగించారని పేర్కొన్నారు. కర్ణాటకలోని బేలిమఠంలో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో ఖర్గే మాట్లాడారు. బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుని స్థాయి నుంచి ఏఐసీసీ అధ్యక్ష పదవి వరకు దేనికీ తాను ప్రయత్నించలేదని, పార్టీయే అవకాశాలిచ్చిందని తెలిపారు.

ధన్‌ఖడ్ ఎందుకు రాజీనామా చేశారో తెలియదు

ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్ ఎందుకు రాజీనామా చేశారో తనకు తెలియదని ఖర్గే అన్నారు. "జగదీప్ మొదటి నుంచి కేంద్ర ప్రభుత్వానికి మద్దతుగా ఉన్నారు. నేను రాజ్యసభలో మాట్లాడేందుకు ఆయన అవకాశమివ్వలేదు. రైతులు, పేదలు, అంతర్జాతీయ సమస్యలు, విదేశాంగ విధానంపై విపక్షాలు మాట్లాడితే, వారి స్వరం వినిపించకుండా చేసేవారు" అని గుర్తుచేశారు. కర్ణాటక పీసీసీ అధ్యక్ష పదవి మార్పుపై ప్రశ్నించగా.. "ఆ విషయాలన్నీ ఇప్పుడు చెప్పలేం. తర్వాత మాట్లాడతాను" అని అన్నారు. ప్రస్తుతం డీకే శివకుమార్ ఉప ముఖ్యమంత్రితో పాటు కేపీసీసీ అధ్యక్షుడిగా ఉన్నారు. ఆయన ఒక పదవిలోనే కొనసాగేలా చూడాలని పార్టీ అధ్యక్ష స్థానంపై కన్నేసిన కొందరు నేతలు అధిష్ఠానాన్ని కోరుతున్నారు.

ఆరు జిల్లాల్లో సీనరేజ్ వసూళ్లకు టెండర్లు

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలోని ఆరు ఉమ్మడి జిల్లాల పరిధిలో సీనరేజ్ వసూళ్లకు గుత్తేదారుల ఎంపిక కోసం గనులశాఖ టెండర్లు ఆహ్వానించింది. ఉమ్మడి విశాఖపట్నం, పశ్చిమ గోదావరి, కృష్ణా, ప్రకాశం, శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు, కర్నూలు జిల్లాల్లో గుత్తేదారులను ఎంపిక చేయనున్నారు. ప్రస్తుతం ఏడు ఉమ్మడి జిల్లాల్లో సీనరేజ్ గుత్తేదారులు ఉన్నారు.



ఆ జ్ఞానానికి సముచిత విలువివ్వండి

మీరు ఆరోగ్య పరిరక్షణకు సంబంధించి వందలకొద్దీ పుస్తకాలు చదివి ఉండొచ్చు. ఎందరో నిపుణులను సామాజిక మాధ్యమాల్లో అనుసరిస్తుండొచ్చు. ఉత్పాదకత పెంపుపై వేల వీడియోలు చూసుండొచ్చు. నిజ జీవితంలో వర్తింపజేసుకున్నప్పుడే ఆ జ్ఞానానికి మీరు సముచిత విలువ ఇచ్చినట్లవుతుంది. లేకపోతే కేవలం మేధోపరమైన వినోదం పొందుతున్నట్లు లెక్క!

\- సుమిత్ శర్మ, వైద్యుడు

రెవెన్యూ అధికారులపై అభియోగాల నమోదు

- 'పోలవరం' ముంపు బాధితుల తరలింపులో నిధుల దుర్వినియోగంపై చర్యలు

ఈనాడు, అమరావతి: ప్రభుత్వ నిధులను దుర్వినియోగం చేసిన కేసులో నాటి పశ్చిమ గోదావరి జిల్లా జంగారెడ్డిగూడెం రెవెన్యూ డివిజనల్ ఆఫీసర్, ప్రస్తుతం బాపట్లలో డిప్యూటీ కలెక్టర్ (కేఆర్ఆర్‌సీ)గా పనిచేస్తున్న ఎస్.లవన్నపై అభియోగాలు నమోదుచేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. ఇదే వ్యవహారంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ హోదాలో ఏలూరు ఎస్సీ కార్పొరేషన్‌లో ఈడీగా పనిచేస్తున్న నాటి పోలవరం మండల తహసీల్దారు ముక్కంటిపై కూడా అభియోగాలు నమోదు చేస్తూ రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయలక్ష్మి తాజాగా ఉత్తర్వులిచ్చారు. జంగారెడ్డిగూడెం ఆర్డీఓగా 2015 ఫిబ్రవరి 9 నుంచి 2017 ఫిబ్రవరి 2 వరకు లవన్న వ్యవహరించారు. పోలవరం ప్రాజెక్టు ముంపు గ్రామాల వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించే క్రమంలో వాహనాలు, ఇతర అవసరాలకు ఖర్చుపెట్టినట్లు దొంగ బిల్లులు సమర్పించారు. ఇందులో నాటి పోలవరం మండల తహసీల్దారు మేరు ముక్కంటి కూడా భాగస్వాములయ్యారు. సుమారు రూ.84.95 లక్షల మేర ప్రభుత్వ నిధులు దుర్వినియోగమైనట్లు ఏలూరు రేంజి ఏసీబీ అధికారులు ప్రభుత్వానికి నివేదిక సమర్పించారు. దీనికి అనుగుణంగా శాఖాపరమైన చర్యలు మొదలయ్యాయి. ముంపు ప్రాంతాల బాధితుల తరలింపు సందర్భంగా తప్పుడు బిల్లులు సమర్పించినట్లు విచారణలో ముక్కంటి అంగీకరించారు. ఇరువురిపై అభియోగాలు నమోదయ్యాయి.

✦ మరోవైపు ఆరోపణలు, ఫిర్యాదులపై పది రోజుల్లోగా రాతపూర్వకంగా వివరణ ఇవ్వాలని లవన్నను ఆదేశిస్తూ జయలక్ష్మి ఉత్తర్వులు జారీ చేశారు.

సిట్ విచారణకు హాజరైన ధర్మస్థల ఆలయ విశ్రాంత ఉద్యోగి

మంగళూరు, న్యూస్‌టుడే: ధర్మస్థల ఆలయ పరిసర ప్రాంతాల్లో వందల మృతదేహాలను పూడ్చి పెట్టానని ప్రకటించుకున్న విశ్రాంత గ్రూపు డీ ఉద్యోగి సిట్ అధికారుల విచారణకు హాజరయ్యారు. మంగళూరులోని మల్లికట్టె కార్యాలయానికి న్యాయవాదితో కలిసి వచ్చిన ఆయన.. ఎవరూ గుర్తుపట్టకుండా ఉండేందుకు నల్లముసుగు ధరించారు. విచారణ అనంతరం న్యాయవాదితో కలిసి వెళ్లిపోయారు. ఆదివారం నాటి విచారణకు ప్రణబ్ మొహంతీ నేతృత్వం వహించారు. జితేంద్ర దయామ, ఇతర అధికారులు విశ్రాంత ఉద్యోగిని పలు ప్రశ్నలు అడిగారు. ఖననం విషయాన్ని ముందుగా పోలీసుల దృష్టికి తీసుకురాని ఆ విశ్రాంత ఉద్యోగిపైనా కేసు నమోదు చేశారు. మృతదేహాలను ఖననం చేసినట్లు చెబుతున్న చోటుకు సోమవారం ఆయన్ను తీసుకెళ్లే అవకాశం ఉంది.


సబ్జెక్టు నిపుణులతో మాట్లాడుతున్న మధుమూర్తి

నూతన కోర్సులతో ఉత్తమ భవిష్యత్తు

ఉన్నత విద్యామండలి ఛైర్మన్ ఆచార్య మధుమూర్తి

ఎ.ఎన్.యు, న్యూస్‌టుడే: డిగ్రీ కళాశాలల్లో ఈ ఏడాది నుంచి ప్రారంభమయ్యే నూతన కోర్సులు విద్యార్థుల భవిష్యత్తుకు బలమైన పునాది వేస్తాయని ఉన్నత విద్యామండలి ఛైర్మన్ ఆచార్య మధుమూర్తి పేర్కొన్నారు. డిగ్రీ కోర్సుల రూపకల్పనపై వివిధ సబ్జెక్టుల నిపుణులు ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం(ఏఎన్‌యూలో)లో మూడు రోజులుగా చేసిన అధ్యయనం ఆదివారం ముగిసింది. ఇందులో ప్రభుత్వ, ప్రైవేటు విశ్వవిద్యాలయాలకు చెందిన సబ్జెక్టు నిపుణులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆచార్య మధుమూర్తి మాట్లాడుతూ.. ఈ విద్యా సంవత్సరం నుంచి అన్ని డిగ్రీ కోర్సుల్లో కృత్రిమ మేధ, క్వాంటమ్ కంప్యూటింగ్‌కు సంబంధించిన సబ్జెక్టులు ప్రవేశపెడుతున్నట్లు తెలిపారు. ఏఐని అన్ని కోర్సుల విద్యార్థులు కచ్చితంగా చదవాల్సిందేనని స్పష్టంచేశారు.

EENADU Vol: 51, Issue: 349 Printed and Published by M Nageswara Rao on behalf of Ushodaya Publications, a division of Ushodaya Enterprises Pvt Ltd. Printed and Published at Ushodaya Publications, Eenadu Press, Survey No. 239/3, 240/3B & 240/4, Gudavalli Village, Vijayawada Rural Mandal, NTR District - 521 104, Andhra Pradesh. Editor: M Nageswara Rao. Phones: 0866-2494900, 2862111. Regd. No. VJ/013/2024-26. RNI No.32238/1978. Air Surcharge Extra. Mumbai, Kolkata, Goa. Re. 1.00, Portblair Rs. 10.00. Founder Ramoji Rao



గుండెపై విమానం మోత!

ఆకాశమార్గంలో సుదూర ప్రాంతాలకు రెక్కలు చాచి శరవేగంతో చేరుకునేందుకు మానవులు కనిపెట్టిన అద్భుత సాధనాలు.. విమానాలు! వీటివల్ల దూరాభారాలు తగ్గిపోయాయి. దేశాల మధ్య పౌర, వాణిజ్య సంబంధాలు మెరుగయ్యాయి. అయితే ఈ భారీ లోహవిహంగాల నుంచి వెలువడే కర్ణకఠోర ధ్వనులు.. ఎయిర్‌పోర్టులకు సమీపంలో నివసించేవారికి చుక్కలు చూపిస్తున్నాయి. వీటివల్ల వారి చెవులకు చిల్లులు పడటంతోపాటు గుండె ఆరోగ్యంపైనా ప్రభావం పడుతున్నట్లు తాజా పరిశోధన హెచ్చరిస్తోంది.

రైళ్లు, రోడ్డుపై నడిచే వాహనాలతో పోలిస్తే విమానాల శబ్దాలు తీవ్ర చికాకు కలిగిస్తాయి. లోహవిహంగాల ధ్వనులు పెద్దగా ఉండటమే కాకుండా.. ఆకస్మికంగా పిడుగుపడినట్లు విరుచుకుపడటం వంటి కారణాల వల్ల వాటికి అలవాటుపడటం ఒక పట్టాన సాధ్యం కాదు. వాటి తాకిడికి ఎక్కువగా గురయ్యేవారికి అధికరక్తపోటు, ఊబకాయం ముప్పు ఉంటుందని ఇప్పటికే వెల్లడైంది. అయితే విమాన ధ్వనులకు.. గుండె నిర్మాణం, పనితీరులో వైరుధ్యాలకు మధ్య చాలా దగ్గర సంబంధం ఉన్నట్లు లండన్ యూనివర్సిటీ కాలేజీ శాస్త్రవేత్తల తాజా పరిశోధన తేల్చింది.

పరిశోధనలో భాగంగా.. ఇంగ్లండ్‌లోని నాలుగు ప్రధాన విమానాశ్రయాలకు దగ్గర్లో ఉంటున్న 3,835 మంది గుండెలకు సంబంధించిన సవివర ఇమేజింగ్ డేటాను శాస్త్రవేత్తలు విశ్లేషించారు. అందులోనూ విమాన ధ్వనులను ఎక్కువగా ఎదుర్కొంటున్న వారి గుండె పనితీరును.. ఆ తాకిడి తక్కువగా ఉన్న ప్రాంతంలో నివసించే వారితో పోల్చి చూశారు.

గట్టిపడుతున్న గుండె కండరాలు..

● నిర్దేశిత పరిమితిని మించి విమాన ధ్వనులు వెలువడే ప్రాంతాల్లోని వారి గుండె కండరాలు గట్టిగా, మందంగా తయారవుతున్నట్లు శాస్త్రవేత్తల పరిశీలనలో వెల్లడైంది. దీనివల్ల అవి అంత సులువుగా సంకోచ, వ్యాకోచాలకు లోనుకావడంలేదు. ఫలితంగా శరీరమంతటికి రక్తాన్ని సమర్థంగా పంప్ చేయడంలేదు.

● గుండెకు సంబంధించిన ఈ లోపాల వల్ల గుండె పోటు, ప్రాణాంతక స్థాయిలో గుండె లయలో వైరుధ్యాలు, పక్షవాతం ముప్పు 2-4 రెట్లు పెరుగుతాయని.. విమాన ధ్వనులకు లోనుకాని వారిపై విడిగా విశ్లేషణ జరిపినప్పుడు వెల్లడైందని శాస్త్రవేత్తలు తెలిపారు.

● ముఖ్యంగా రాత్రివేళల్లో తీవ్రస్థాయి విమాన ధ్వనులకు గురయ్యే వారికి ఈ ముప్పు అధికంగా ఉన్నట్లు తేలింది. భీకర శబ్దాల వల్ల బాధితులకు నాణ్యమైన నిద్రలేకపోవడమే ఇందుకు కారణం.

● విమాన ధ్వనులు అధికంగా వెలువడే ప్రాంతం నుంచి వైదొలిగినవారితో పోలిస్తే.. ఇంకా అక్కడే ఉంటున్నవారి గుండె ఆరోగ్యం దెబ్బతినే ప్రమాదం 10-20 శాతం అధికంగా ఉన్నట్లు కూడా తేలింది.

ఒత్తిడి మితిమీరి..

నిద్రపై ప్రభావం చూపడంతోపాటు మన చుట్టుపక్కల నుంచి వెలువడే ధ్వనులు.. శరీరంలో ఒత్తిడి ప్రతిస్పందనలను కలగజేయవచ్చు. దీనివల్ల సింపథటిక్ నాడీ వ్యవస్థ మితిమీరి క్రియాశీలమవుతుంది. సాధారణంగా ఇది.. ప్రమాద సమయంలో మనల్ని అప్రమత్తంగా ఉంచే నాడుల నెట్‌వర్క్‌ను నియంత్రిస్తుంది. ఇది ఎక్కువగా క్రియాశీలం కావడం వల్ల రక్తపోటు పెరుగుతుంది. రక్తనాళాలు కుంచించుకుపోవడం, వ్యాకోచించడం వంటివి జరుగుతాయి. జీర్ణక్రియ కూడా నెమ్మదిస్తుంది. రణగొణ ధ్వనుల వల్ల ఒత్తిడి హార్మోన్.. కార్టిసాల్ కూడా విడుదలయ్యే అవకాశం ఉంది. ఫలితంగా ఆకలి పెరిగి, ఊబకాయానికి దారితీయవచ్చు.



విమానాలకు ఎందుకంత సడి?

విమాన ఆకృతి (ఎయిర్‌ఫ్రేమ్): గాల్లో కదులుతున్న విమానం.. రాపిడి, టర్బులెన్స్ కలిగిస్తుంది. దీనివల్ల ధ్వని తరంగాలు వెలువడతాయి. లోహవిహంగ వేగాన్ని బట్టి రాపిడి, టర్బులెన్స్ తీవ్రత ఉంటుంది. విమానాలు ల్యాండ్ అయ్యేటప్పుడు చక్రాలు విచ్చుకుంటాయి. దీనికితోడు విమాన రెక్కల అంచుల్లో ఉండే ఫ్లాప్స్ కూడా వంపునకు గురవుతాయి. వీటివల్ల నిరోధకత పెరిగి, తీవ్ర ధ్వనులు వెలువడతాయి.

ఇంజిన్: విమాన ఇంజిన్‌లోని కదిలే భాగాలతో శబ్దాలు వెలువడుతుంటాయి. ఇంజిన్ నుంచి వేగంగా వెలువడే వేడి వాయువులు.. వెలుపలి గాలిని తాకినప్పుడు కర్ణకఠోర శబ్దాలు వస్తుంటాయి.

అడ్డుకట్టకు ప్రయత్నాలు

విమానయాన ధ్వనిని తగ్గించడానికి సాంకేతిక పురోగతి దోహదపడుతోంది.

● పాత టర్బోజెట్ ఇంజిన్లతో పోలిస్తే ఆధునిక హై-బైపాస్ టర్బోఫ్యాన్ ఇంజిన్లు తక్కువ శబ్దాన్ని వెలువరిస్తాయి. ఇవి ఇంజిన్ నుంచి వెలువడే వేడిగాలులకు, వెలుపలి గాలికి మధ్య.. ఒక మోస్తరు వేగంతో కదిలే శీతల గాలులను ప్రవేశపెడతాయి. దీనివల్ల ధ్వని తీవ్రత తగ్గుతుంది.

● విమానాల తయారీకి వాడుతున్న కొన్ని రకాల ఆధునిక పదార్థాలు కూడా ధ్వనులకు కళ్లెం వేస్తున్నాయి.

● విద్యుత్ విమానాలు వస్తే ఈ సమస్య బాగా తగ్గుతుంది.

వీటితో పౌరులకు ఉపశమనం..

● విమానాశ్రయాలకు సమీపంలోని ఇళ్లకు సౌండ్ ప్రూఫింగ్, ఇన్సులేషన్ చేయించాలి. కొన్ని దేశాల్లో ప్రభుత్వాలే ఇందుకు నిధులిస్తున్నాయి. ● కొన్నిచోట్ల రాత్రివేళల్లో విమానాల రాకపోకలపై ఆంక్షలు విధిస్తున్నాయి. ● తక్కువ ఎత్తులో ఇళ్లపై ఎగిరే పరిస్థితిని నివారించడానికి ప్రత్యేక ప్రయాణ మార్గాన్ని ఎంపికచేయాలి.

- ఈనాడు ప్రత్యేక విభాగం

విమాన ధ్వనుల వల్ల పక్షుల కమ్యూనికేషన్‌కు అవరోధం ఏర్పడుతుంది. వాటి సంయోగం, వలసలపైనా ప్రభావం పడుతుంది.

సాగరాలపై ప్రయాణించేటప్పుడు విమానాల నుంచి వెలువడే 'లో ఫ్రీక్వెన్సీ' ధ్వనులు సముద్రజీవులకు ఇబ్బందికరం.

శబ్దాలకు తాళలేక విమానాశ్రయాలకు సమీపంలోని ప్రాంతాలను జంతువులు వీడి వెళ్లిపోవచ్చు. ఫలితంగా స్థానిక జీవావరణ వ్యవస్థపై ప్రభావం పడుతుంది.



బనారస్ స్విమ్మింగ్ సిస్టర్స్!

ఈటీవీ భారత్: ఆడపిల్లలను చాలా కుటుంబాల్లో నేటికీ చిన్నచూపు చూస్తుంటారు. యూపీలోని వారణాసికి చెందిన ఓ సాదాసీదా కుటుంబంలో ఆరుగురు ఆడపిల్లలు పుట్టినా తల్లిదండ్రులు భారమని అనుకోలేదు. అడుగడుగునా చదువుల్లో, క్రీడల్లోనూ వారిని వెన్నుతట్టి ప్రోత్సహించారు. పటేల్ సిస్టర్స్‌గా పేరు పొందిన వీరు ఈత పోటీల్లో జాతీయస్థాయిలో రాణించారు. అందరూ బనారస్ జలకన్యలుగా పిలిచే ఈ అక్కాచెల్లెళ్లలో ముగ్గురు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించారు. తండ్రి అజిత్ పటేల్ పెళ్లి వేడుకలకు విద్యుత్తు సామగ్రి సరఫరా చేస్తుంటారు. భార్య పేరు లక్ష్మీ పటేల్. ఈ దంపతులకు ఏకంగా ఆరుగురు ఆడపిల్లలు పుట్టడంతో బంధువులు ఎగతాళి చేసేవారు. అయినా అవేం పట్టించుకోకుండా పిల్లలను ప్రోత్సహించిన వీరి సంకల్పం సిద్ధించి కుమార్తెలు ముస్కాన్, నాన్సీలకు క్రీడల కోటాలో పోలీసు ఉద్యోగాలు లభించాయి. మూడో కుమార్తె ఖుషీకి వారణాసిలోనే స్విమ్మింగ్ కోచ్‌గా ప్రభుత్వ ఉద్యోగం వచ్చింది. అక్కల స్ఫూర్తితో రియా, అనన్య, వృద్ధి సైతం ముందుకు సాగుతున్నారు. తల్లిదండ్రులు అండగా నిలబడితే అమ్మాయిలు ఏదైనా సాధించగలరని అజిత్ పటేల్, లక్ష్మీ దంపతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

పేదరికాన్ని జయించి యూజీసీ-నెట్ ఉత్తీర్ణులైన బఠిండా అక్కాచెల్లెళ్లు

బఠిండా: తల్లి దినకూలీ, తండ్రి గురుద్వారాలో పవిత్రగ్రంథ పఠనకర్త (గ్రంథీ). ఈ దంపతుల ముగ్గురు కుమార్తెలు పేదరికాన్ని జయించి యూజీసీ-నెట్‌లో ఉత్తీర్ణత సాధించారు. పంజాబ్‌లో అత్యల్ప అక్షరాస్యత ఉన్న మానసా జిల్లాలోని బుఢ్‌లాడా పట్టణానికి చెందిన సోదరీమణులు రింపీ కౌర్ (28), హర్‌దీప్ కౌర్ (23), బియాంత్ కౌర్ (26) ఈ ఘనత సాధించడం విశేషం. ఈ ముగ్గురూ కుటుంబానికి ఆర్థికంగా చేయూతను ఇచ్చేందుకు స్థానిక ప్రయివేటు స్కూలులో పనిచేస్తూ యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషను నిర్వహించిన జాతీయ అర్హత పరీక్షలో వేర్వేరు సబ్జెక్టుల్లో ఉత్తీర్ణులయ్యారు. దీంతో అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులకు దరఖాస్తు చేసుకునేందుకు వీరు అర్హులవుతారు. "మా అక్క కంప్యూటర్ సైన్సు ప్రొఫెసర్ కావాలని కోరుకుంటోంది. చెల్లెలు హర్‌దీప్ కౌర్, నేను జేఆర్ఎఫ్ (జూనియర్ రీసెర్చ్ ఫెలోషిప్) కోసం శ్రమిస్తున్నాం. తప్పకుండా ఇది కూడా సాధిస్తాం" అని బియాంత్ కౌర్ తెలిపింది. "అంతా వాళ్ల కష్టం, కఠోరమైన దీక్ష. నా ముగ్గురు కుమార్తెలు నేను గర్వపడేలా చేశారు" అంటూ తండ్రి బిక్కర్ సింగ్ హర్షం వ్యక్తం చేశారు.

గాజాలో 38 మంది మృతి

- ఆహారకేంద్రం వద్దకు వెళ్తున్న వారిపై ఇజ్రాయెల్ దాడులు

డెయిర్ అల్-బలా: గాజాలో తాజాగా జరిగిన దాడుల్లో 38 మంది పాలస్తీనియన్లు మృతి చెందారు. గాజా మధ్య ప్రాంతంలో ఆహార కేంద్రం వద్దకు వెళ్తున్న వారిపై జరిగిన దాడిలో 13 మంది మృతి చెందారని, 101 మంది గాయపడ్డారని నుసేరత్‌లోని అవ్‌దా ఆసుపత్రివర్గాలు వెల్లడించాయి. వాయవ్య గాజాలో జరిగిన దాడుల్లో 10 మంది మృతి చెందారు. 50 మంది గాయపడ్డారు. ఖాన్ యూనిస్‌లోని ఆస్దా ప్రాంతంలో జరిగిన మరో దాడిలో 9 మంది మరణించారు. గాజా సిటీలో జరిగిన దాడిలో నలుగురు మృతి చెందారు. డెయిర్ అల్-బలాలోని డీశాలినేషన్ ప్లాంటువద్ద ఓ టెంటుపై జరిగిన దాడిలో ముగ్గురు మృతి చెందారు. మరోవైపు గాజాలో ఇద్దరు తమ సైనికులు మరణించారని ఇజ్రాయెల్ వెల్లడించింది. దీంతో ఇప్పటివరకూ మొత్తం 898 మంది చనిపోయారని తెలిపింది.

గాజాకు వస్తున్న నౌక అడ్డగింత

గాజా ప్రజల కోసం సహాయక సామగ్రిని తీసుకుని వస్తున్న సామాజిక కార్యకర్తలు, జర్నలిస్టులతో కూడిన నౌకను ఇజ్రాయెల్ అడ్డుకుంది. 21 మందిని నిర్బంధించింది. హండాలా అనే ఆ నౌకలో చిన్న పిల్లల ఆహారం, ఔషధాలున్నాయి. గాజాకు 40 నాటికల్ మైళ్ల దూరంలో ఈ నౌకను ఇజ్రాయెల్ అడ్డుకుంది.

రోజుకు 69 ట్రక్కులు

మానవతా సాయం ఆంక్షలను ఇజ్రాయెల్ స్వల్పంగా సడలించిన మే నెల నుంచి ఇప్పటిదాకా 4,500 ట్రక్కులు గాజాలోకి వచ్చాయి. ప్రస్తుతం రోజుకు 69 ట్రక్కుల్లో ఆహారం, సహాయ సామగ్రి వస్తున్నాయి. వాస్తవానికి రోజుకు 500 నుంచి 600 ట్రక్కుల సాయం అవసరమని ఐక్యరాజ్య సమితి అంచనా వేసింది. అయితే ప్రస్తుతం వస్తున్న ట్రక్కులనూ ఆకలితో ఉన్న జనంతోపాటు గ్యాంగులు దోచుకుంటున్నాయి.

రూ.300 కోట్ల అక్రమ లావాదేవీలు!

- 'నకిలీ ఎంబసీ' హర్షవర్ధన్ జైన్ లీలలు

ఈటీవీ భారత్: నకిలీ రాయబార కార్యాలయం కేసులో ఉత్తర్‌ప్రదేశ్ పోలీసులు కీలక విషయాలను గుర్తించినట్లు తెలుస్తోంది. నిందితుడు హర్షవర్ధన్ జైన్ రూ.300 కోట్ల ఆర్థిక కుంభకోణంలో భాగస్వామిగా ఉన్నట్లు దర్యాప్తు అధికారులు అనుమానిస్తున్నారు. విదేశాల్లో ఇతడికి పదుల సంఖ్యలో బ్యాంకు ఖాతాలు ఉన్నట్లు గుర్తించారు. గత పదేళ్లలో 162 సార్లు విదేశీ పర్యటనలకు వెళ్లినట్లు కనుగొన్నారు. గాజియాబాద్‌లో ఇతడు ఎనిమిదేళ్ల క్రితమే నకిలీ రాయబార కార్యాలయాన్ని ఏర్పాటుచేసినట్లు పోలీసులు గుర్తించారు. ప్రస్తుతం సిట్ అదుపులో ఉన్న హర్షవర్ధన్ గురించి దర్యాప్తు అధికారులు కీలక విషయాలను వెలికితీసినట్లు జాతీయ మీడియా పేర్కొంది. వివాదాస్పద స్వామీజీ చంద్రస్వామితో



హర్షవర్ధన్ దిగిన ఫొటోలను సిట్ అధికారులు నకిలీ రాయబార కార్యాలయంలో గుర్తించారు. చంద్రస్వామి ద్వారా సౌదీ ఆయుధ డీలరు అద్నాన్ ఖషోగ్గి, స్విట్జర్లాండ్‌లో ఆర్థిక మోసాలకు పాల్పడిన అలీ సయ్యద్‌లతో హర్షవర్ధన్ పరిచయం పెంచుకున్నారని సిట్ వెల్లడించింది. అలీ సయ్యద్.. హర్షవర్ధన్ జైన్‌తో 25 షెల్ కంపెనీలను తెరిపించి మనీ లాండరింగ్‌కు పాల్పడినట్లు తెలిపింది. కంపెనీలకు రుణాలను ఇప్పిస్తామని చెప్పి అలీ సయ్యద్ స్విట్జర్లాండ్‌లో రూ.300 కోట్ల వరకు వసూలుచేసి పారిపోయి 2022లో లండన్‌లో పోలీసులకు చిక్కాడు. ఆ కుంభకోణంలో హర్షవర్ధన్ జైన్ పాత్ర కూడా ఉన్నట్లు సిట్ అధికారులు అనుమానిస్తున్నారు.

63 జిల్లాల్లోని 50%పైగా పిల్లల్లో ఎదుగుదల లోపం

- 13 రాష్ట్రాలు, యూటీల్లో గుర్తింపు
- యూపీలోనే 34 జిల్లాలు

దిల్లీ: దేశవ్యాప్తంగా 63 జిల్లాల్లోని 50శాతంపైగా పిల్లల్లో ఎదుగుదల లోపం ఉన్నట్లు తేలింది. 13 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో ఉన్న ఈ జిల్లాల్లో అత్యధికంగా 34 జిల్లాలు ఒక్క ఉత్తర్ ప్రదేశ్‌లోనే ఉన్నాయి. అంగన్‌వాడీల్లో నమోదు చేసుకున్న పిల్లలను సర్వే చేయగా ఈ విషయం బయటపడింది. ఇటీవల పార్లమెంటుకు ఈ వివరాలను కేంద్రం సమర్పించింది. 30% నుంచి 40% పిల్లల్లో ఎదుగుదల లోపం ఉన్న జిల్లాలు 199గా తేలింది. పిల్లలకు సుదీర్ఘ కాలంపాటు సరైన పోషకాహారం అందకపోతే వారిలో ఎదుగుదల లోపం కనిపిస్తుంది. కేంద్ర మహిళా, శిశు సంక్షేమశాఖ పోషణ్ ట్రాకర్ జూన్-2025 నివేదిక ప్రకారం..

✦ మహారాష్ట్రలోని నందూర్బార్ జిల్లాలో అత్యధికంగా 68.12 శాతం పిల్లల్లో ఎదుగుదల లోపం ఉంది.

✦ 66.27 శాతంతో తరువాతి స్థానంలో ఝార్ఖండ్‌లోని పశ్చిమ సింగ్‌భమ్ జిల్లా ఉంది.

✦ 59.48 శాతంతో ఉత్తర్ ప్రదేశ్‌లోని చిత్రకూట్ జిల్లా ఉంది.

✦ 58.20 శాతంతో మధ్యప్రదేశ్‌లోని శివ్‌పురి జిల్లా ఉంది.

✦ 54.76 శాతంతో అస్సాంలోని బొంగైగావ్ జిల్లా ఉంది.


✦ ఉత్తర్ ప్రదేశ్‌లోని 34 జిల్లాల్లో 50శాతం కంటే ఎక్కువ మంది చిన్నారుల్లో ఎదుగుదల లోపం కనిపించింది. ఆ తర్వాతి స్థానాల్లో మధ్యప్రదేశ్, ఝార్ఖండ్, బిహార్, అస్సాం ఉన్నాయి.

✦ ఆరేళ్లలోపు వయసున్న 8.19 కోట్ల మంది చిన్నారుల్లో 35.19 శాతం మందిలో ఎదుగుదల లోపం ఉన్నట్లు తేలిందని కేంద్ర మహిళా, శిశు సంక్షేమ శాఖ వెల్లడించింది. వీరిలో 16.5 శాతం మంది బరువు తక్కువగా ఉన్నట్లు తేలింది.

✦ ఐదేళ్లలోపు చిన్నారులను తీసుకుంటే 37.07శాతం మందిలో ఎదుగుదల లోపం కనిపించింది.

ఆ రైతు వార్షికాదాయం రూ.3!

సత్నా: మధ్యప్రదేశ్‌లోని సత్నా జిల్లా కోఠీ మండలానికి చెందిన రామ్‌స్వరూప్ అనే రైతు వార్షికాదాయం కేవలం మూడు రూపాయలు! స్వయానా రెవెన్యూ అధికారులు ఈ మేరకు జులై 22న ఆదాయ ధ్రువపత్రం జారీ చేశారు. ఈ ధ్రువపత్రం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. దేశంలో అత్యంత పేద వ్యక్తి ఈ రైతేనని పోస్టులు వెల్లువెత్తాయి. పొరపాటును గుర్తించిన అధికారులు.. క్లరికల్ లోపం వల్ల అచ్చు తప్పు జరిగిందంటూ రామ్‌స్వరూప్‌కు వెంటనే కొత్త సర్టిఫికెటు ఇచ్చారు. ఇందులో వార్షికాదాయం రూ.30 వేలుగా పేర్కొన్నారు. పొరపాటున ఆదాయం తప్పుగా పడిందని, దాన్ని సరిచేశామని పాత ధ్రువపత్రంపై సంతకం చేసిన తహసీల్దారు సౌరభ్ ద్వివేదీ వివరణ ఇచ్చారు. ముఖ్యమంత్రి మోహన్ యాదవ్ పాలనలో దేశంలోనే అత్యంత పేద వ్యక్తిని కనుగొన్నట్లు ఈ వ్యవహారంపై మధ్యప్రదేశ్ కాంగ్రెస్ పార్టీ 'ఎక్స్' ద్వారా మండిపడింది.



ఈ వేసవిలో 7 వేల వడదెబ్బ కేసులు

- 14 మంది మృత్యువాత: ఎన్‌సీడీసీ

దిల్లీ: ఈ వేసవిలో దేశవ్యాప్తంగా 7,192 వడదెబ్బల కేసులు నమోదు కాగా 14 మంది చనిపోయినట్లు నేషనల్ సెంటర్ ఫర్ డిసీజ్ కంట్రోల్ (ఎన్‌సీడీసీ) వెల్లడించింది. వీటిల్లో సగం కంటే ఎక్కువ కేసులు ఆంధ్రప్రదేశ్‌లోనే నమోదయ్యాయని పేర్కొంది. ఈ రాష్ట్రంలో 4,055 మంది వడదెబ్బకు గురికాగా రాజస్థాన్‌లో 373, ఒడిశాలో 350, తెలంగాణలో 348, మధ్యప్రదేశ్‌లో 297 మంది వడదెబ్బ బారిన పడ్డారు. స.హ.చట్టం కింద ఓ వార్తా సంస్థ అడిగిన ప్రశ్నకు మార్చి 1 నుంచి జూన్ 24 మధ్య నమోదైన వడదెబ్బ కేసులు, మరణాల గురించి ఎన్‌సీడీసీ వివరాలను ప్రకటించింది. వాటి ప్రకారం.. మొత్తం 7,192 వడదెబ్బ కేసులు నమోదుకాగా మేలో గరిష్ఠంగా 2,962 మంది వడదెబ్బ బారిన పడ్డారు. ముగ్గురు మరణించారు. ఏప్రిల్‌లో 2,140 కేసులు, ఆరు మరణాలు చోటుచేసుకున్నాయి. అత్యధిక కేసులు నమోదైన కొన్ని రాష్ట్రాలు వడదెబ్బ కారణంగా ఎటువంటి మరణాలనూ గుర్తించలేదు. మహారాష్ట్ర, ఉత్తరాఖండ్ రాష్ట్రాలు గరిష్ఠంగా చెరో మూడు మరణాలను నమోదు చేశాయి. తెలంగాణ, ఒడిశా, ఝార్ఖండ్, తమిళనాడు, ఉత్తర్‌ప్రదేశ్, పశ్చిమబెంగాల్ రాష్ట్రాల్లో ఒక్కో వ్యక్తి మరణించారు.

వాస్తవానికి దూరంగా గణాంకాలు: నిపుణులు

ఎన్‌సీడీసీ గణాంకాలు దేశంలో సమాచార సేకరణ వ్యవస్థలోని లోపాలకు అద్దం పడుతున్నాయని నిపుణులు చెబుతున్నారు. వాస్తవ సమస్యను గణాంకాలు ప్రతిబింబించడం లేదని, వడదెబ్బ సమస్య దేశంలో ఇంకా తీవ్రంగా ఉందని పేర్కొన్నారు. మరోవైపు.. ఎన్‌సీడీసీ ప్రకారం.. 2015-22 మధ్య కాలంలో 3,182 మంది వడదెబ్బ కారణంగా చనిపోగా.. జాతీయ నేర గణాంక సంస్థ (ఎన్‌సీఆర్‌బీ) ప్రకారం ఆ సంఖ్య 8,171గా, వాతావరణ విభాగం (ఐఎండీ) ప్రకారం 3,436గా ఉండటం గమనార్హం.

మొండిగోడలు, చెత్తకుప్పలు నాడు.. 'ఉద్యాన' విద్యా కుసుమాలు నేడు!

ఈటీవీ భారత్: బిహార్‌లోని గయా జిల్లా సూర్యపుర గ్రామ మిడిల్ స్కూలు ప్రాంగణంలో ఒకప్పుడు ఎటుచూసినా మొండిగోడలు, చెత్తకుప్పలు కనిపించేవి. దాదాపు 600 ఇళ్లు ఉన్న సూర్యపురలో సాయంత్రమైతే అసాంఘిక కార్యకలాపాలకు పాఠశాల అడ్డాగా మారేది. ఇప్పుడు రంగురంగుల భవనాలు, పచ్చని చెట్లతో ఉద్యానవనాన్ని తలపిస్తోంది. ఈ పాఠశాలకు ప్రిన్సిపల్‌గా వచ్చిన బైజ్నాథ్ కుమార్ కృషితో అయిదేళ్లలో పూర్తి పరివర్తన సాధ్యమైంది. ఇందుకోసం ఆయన సొంతంగా రూ.2 లక్షలు ఖర్చు పెట్టారు. పాఠశాలను శుభ్రపరచి, మరమ్మతు చేసే బాధ్యతను ఉపాధ్యాయులు తీసుకున్నారు. క్రమంగా గ్రామస్థులు, పంచాయతీ ప్రతినిధులు కూడా ఇందులో భాగమయ్యారు. 324 మంది విద్యార్థులు చదువుతున్న ఈ పాఠశాల చుట్టూ ప్రహరీగోడ నిర్మించారు. మొక్కల సంరక్షణ బాధ్యతను విద్యార్థులకు అప్పగించారు. గతంలో పాఠశాలకు రావాలంటే ఆసక్తి ఉండేది కాదని, ఇప్పుడు తామంతా ప్రతిరోజూ వస్తున్నట్లు ఏడో తరగతి విద్యార్థిని కుమారి తెలిపింది.





జర్మనీలో పట్టాలు తప్పిన రైలు

- పలువురు ప్రయాణికులకు గాయాలు

బెర్లిన్: నైరుతి జర్మనీలో ఓ ప్యాసింజర్ రైలు పట్టాలు తప్పింది. ఈ ప్రమాదంలో పలువురు ప్రయాణికులు గాయపడినట్లు స్థానిక వార్తా సంస్థ డీపీఏ తెలిపింది. మ్యూనిక్‌కు 136 కిలోమీటర్ల దూరంలో ఉన్న బిబెరాచ్ జిల్లాలో ఆదివారం ఈ ప్రమాదం చోటుచేసుకుంది. అయితే.. ఎంత మంది గాయపడ్డారనే దానిపై స్పష్టత లేదని పోలీసులు వెల్లడించారు. ప్రమాదంపై పూర్తి వివరాలు తెలియాల్సి ఉందని పేర్కొన్నారు.

మహిళా పథకంలో పురుషులకు లబ్ధి

- మహారాష్ట్రలో వెలుగులోకి...



ముంబయి: మహిళల అభ్యున్నతి కోసం మహారాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకొచ్చిన 'లడ్కీ బహిన్ యోజన' పథకం అక్రమాలకు నెలవైంది. దీని ద్వారా ఏకంగా 14,298 మంది పురుషులు అక్రమంగా లబ్ధి పొందుతున్నారు. తాజా సర్వేలో ఈ విషయం వెల్లడైంది. పథకం ప్రారంభమైనప్పటి నుంచి రూ.21.44 కోట్ల నగదు వీరి ఖాతాల్లోకి బదిలీ అయినట్లు మహిళ, శిశు అభివృద్ధి శాఖ నిర్వహించిన ఆడిట్‌లో తేలింది. 2024 అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు.. భాజపా నేతృత్వంలోని మహాయుతి కూటమి ప్రభుత్వం 'లడ్కీ బహిన్ యోజన' పథకం తీసుకొచ్చింది. వార్షిక ఆదాయం రూ.2.5 లక్షల కంటే తక్కువ ఉన్న 21 -65 ఏళ్ల మధ్య మహిళలకు నెలకు రూ.1,500 ఇవ్వాలని నిర్ణయించింది. అందుకు తగ్గట్లుగా అధికారులు కార్యాచరణ మొదలు పెట్టారు. అయితే, కొందరు పురుషులు ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ పద్ధతిని తప్పుదోవ పట్టించి, మహిళలుగా తమ పేర్లను నమోదు చేసుకున్నారు. పథకం ప్రారంభమైన 10 నెలలకు గానీ, అధికారులు ఈ విషయాన్ని గుర్తించలేకపోవడం గమనార్హం. పేద మహిళలకు ఆర్థికంగా చేయూతనిచ్చేందుకే ఈ పథకాన్ని తీసుకొచ్చామని, పురుషులు లబ్ధిదారులుగా చేరడం సరికాదని ఉప ముఖ్యమంత్రి అజిత్ పవార్ అన్నారు. ఆ మొత్తాన్ని వారి నుంచి తిరిగి వసూలు చేస్తామని, అందుకు సహకరించకపోతే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

చైనాలోని బౌద్ధారామం పీఠాధిపతిపై అక్రమ సంబంధాల ఆరోపణలు

బీజింగ్: చైనాలోని ప్రపంచ ప్రసిద్ధి గాంచిన షావోలిన్ బౌద్ధారామం తాజాగా వార్తల్లో నిలిచింది. మార్షల్ ఆర్ట్స్‌కు ప్రసిద్ధి చెందిన ఈ ఆలయ అధిపతి షి యోంగ్‌క్సిన్‌పై.. నిధుల దుర్వినియోగానికి పాల్పడటంతోపాటు అనేక మంది మహిళలతో ఆయన అక్రమ సంబంధాలు పెట్టుకున్నట్లు తీవ్ర ఆరోపణలు వచ్చాయి. ఆయన బౌద్ధ నియమాలను ఉల్లంఘించారని, ఈ వ్యవహారంపై దర్యాప్తు మొదలుపెట్టినట్లు ఆలయ వర్గాలు వెల్లడించాయి. హెనాన్ ప్రావిన్సులో షావోలిన్ ఆలయం ఉంది.

అబ్దుల్ కలాంకు మోదీ నివాళి

దిల్లీ: మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలాం వర్ధంతి సందర్భంగా ప్రధాని మోదీ ఆదివారం ఆయనకు నివాళులర్పించారు. 'కలాం స్ఫూర్తిదాయక దార్శనికుడు, అద్భుతమైన శాస్త్రవేత్త, గురువు, గొప్ప దేశభక్తుడు. అభివృద్ధి చెందిన బలమైన భారతాన్ని నిర్మించడంలో కలాం ఆలోచనలు యువతను ప్రేరేపిస్తాయి' అని గుర్తు చేసుకున్నారు.

★ సెంట్రల్ రిజర్వు పోలీస్ ఫోర్స్‌కు (సీఆర్‌పీఎఫ్) రైజింగ్ డే సందర్భంగా మోదీ శుభాకాంక్షలు తెలిపారు. 'ఈ దళం భద్రతా విభాగంలో.. ముఖ్యంగా అంతర్గత భద్రతకు సంబంధించి ఎదురైన సవాళ్లలో కీలక పాత్ర పోషిస్తోంది' అని 'ఎక్స్'లో పేర్కొన్నారు.

కన్నబిడ్డల్నే చంపి తిన్న మానవుడు!

- స్పెయిన్ శాస్త్రవేత్తల పరిశోధనల్లో వెల్లడి

ఇంటర్నెట్‌డెస్క్: కొన్ని లక్షల సంవత్సరాల క్రితం మానవుడు తన పిల్లల్ని నరికి చంపి ఆహారంగా తీసుకునేవాడని తేలింది. స్పెయిన్ పురాతత్వ శాస్త్రవేత్తలు జరిపిన పరిశోధనల్లో ఈ విషయం వెల్లడైంది. సుమారు 8.5 లక్షల సంవత్సరాల నాటి ఆనవాళ్లపై పరిశోధనలు చేపట్టిన శాస్త్రవేత్తలు ఈ మేరకు ఈ విషయంపై ఓ నిర్ధారణకొచ్చారు. స్పెయిన్‌లోని గ్రాన్ డొలినా ప్రాంతంలో తవ్వకాలు జరిపిన పరిశోధకులకు రెండు నుంచి నాలుగేళ్ల మధ్య వయసున్న ఓ చిన్నారి మెడ ఎముక లభ్యమైంది. దానిపై పరిశోధనలు చేపట్టగా.. పదునైన వస్తువుతో తల నరికినట్లు తేలింది. ఇదే తరహా మరిన్ని గుర్తులను కనుగొన్న కెటలాన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హ్యూమన్ పేలేఎకోలజీ అండ్ సోషల్ ఎవల్యూషన్ (ఐపీహెచ్‌ఈఎస్) శాస్త్రవేత్తలు ప్రధానంగా తక్కువ వయసు ఉన్న వారినే ఇలా నరికి చంపినట్లు గుర్తించారు. అంతేకాకుండా ఈ తరహా ఘటనలు హోమో యాంటెసెసర్స్ కాలంలో చోటు చేసుకున్నట్లు పరిశోధకులు తేల్చారు.



వీళ్లు నియాండర్తల్స్, హోమో సెపియన్లకు పూర్వీకులు. వెన్నుపూసను, తలను విడదీసేందుకు పదునైన వస్తువుతో నరికినట్లు స్పష్టమైన కోతలను శాస్త్రవేత్తలు గుర్తించారు. పిల్లల్ని కూడా ఇతర జంతువుల మాదిరిగానే చంపేవారని చెప్పేందుకు ఇదే ప్రత్యక్ష నిదర్శనమని పరిశోధనకు నాయకత్వం వహించిన పాల్‌మిరా సలడై వెల్లడించారు. మన పూర్వీకులు ఎలా జీవించేవారు? వారి జీవన విధానమేంటి? లక్షల ఏళ్ల క్రితం.. చనిపోయిన వారిని ఏం చేసేవారు? తదితర విషయాలను కనుగొనేందుకు పురాతత్వశాస్త్రవేత్తలు ప్రపంచ వ్యాప్తంగా ఇప్పటికీ పరిశోధనలు సాగిస్తూనే ఉన్నారు.

సొరంగం తవ్వి ఇంధనం లూటీకి యత్నం

- హిందూస్థాన్ ఆయిల్ రాకెట్ ముఠా గుట్టు రట్టు

ఈటీవీ భారత్: సొరంగం తవ్వి ఏకంగా ఇంధనాన్ని లూటీ చేసేందుకు యత్నించిందో ముఠా. అయితే పోలీసులు ఈ ముఠా గుట్టు రట్టు చేశారు. ఈ సంఘటన హరియాణాలో వెలుగుచూసింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నార్నౌంద్ సబ్‌డివిజన్‌లోని లోహారి రాఘో గ్రామంలో అర్జున్ అనే వ్యక్తి ఎకరం భూమిని లీజుకు తీసుకున్నాడు. లీజు కాగితంలో ఆ స్థలాన్ని బ్లాక్ ఫ్యాక్టరీ తయారీ కోసమని పేర్కొన్నాడు. ఆ స్థలం హిందుస్థాన్ పెట్రోలియం పైప్‌లైన్‌కు 100 అడుగుల దూరంలో ఉంది. పథకం ప్రకారం నిందితులు ఆ స్థలంలో సొరంగాన్ని ఏర్పాటు చేసుకొని దాని ద్వారా హెచ్‌పీసీఎల్ పైప్‌లైన్‌ను చేరాలని భావించారు. అనుకున్నట్లుగానే ఆ ప్రాంతంలో భారీ తవ్వకాలను చేపట్టారు. రాజస్థాన్ పోలీసులు ఓ కేసులో చమురు దొంగను అరెస్టు చేసి విచారిస్తుండగా అసలు విషయం బయటపడింది. లోహారి గ్రామంలో హెచ్‌పీసీఎల్ పైప్‌లైన్ కింద రహస్యంగా తవ్వకాలు జరుగుతున్నట్లు అతడు తెలిపాడు. దీంతో రాజస్థాన్‌కు చెందిన డీఎస్పీ శివ్ భరద్వాజ్ నేతృత్వంలో నార్నౌంద్ పోలీసులు దాడులు నిర్వహించారు. ఘటనా స్థలంలో లోతైన తవ్వకాన్ని గుర్తించినట్లు నార్నౌంద్ పోలీస్ స్టేషన్ ఇన్‌ఛార్జ్ బల్వాన్ సింగ్ పేర్కొన్నారు. ఆ ప్రాంతంలో తనిఖీలు నిర్వహించిన అనంతరం ఆ ప్రాంగణాన్ని సీజ్ చేశామని తెలిపారు. ఈ విషయంపై కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించామని పేర్కొన్నారు. పరారీలో ఉన్న నిందితులను పట్టుకోవడం కోసం సమీపంలోని సీసీపుటేజీలను పరిశీలిస్తున్నామని తెలిపారు.



డ్రగ్ పార్టీపై పోలీసుల దాడి.. ఏడుగురి అరెస్టు

- వారిలో ఏక్‌నాథ్ ఖడ్సే అల్లుడు

పుణె: డ్రగ్ పార్టీపై దాడులు జరిపిన పుణె పోలీసులు ఏడుగురిని అరెస్టు చేశారు. ఆదివారం తెల్లవారుజామున ఓ అపార్టుమెంటుపై దాడిచేసి మాదక ద్రవ్యాలు, హుక్కా సామగ్రి, మద్యాన్ని సీజ్ చేశారు. అరెస్టయిన వారిలో మహారాష్ట్ర మాజీ మంత్రి ఏక్‌నాథ్ ఖడ్సే అల్లుడు ప్రాంజల్ ఖేవాల్కర్ ఉన్నట్లు పోలీసులు వెల్లడించారు. నిందితుల్ని కోర్టులో హాజరు పరచగా మంగళవారం వరకు పోలీసు కస్టడీకి అప్పగిస్తూ తీర్పు వెలువడింది. పోలీసుల దాడులు రాజకీయ ప్రేరేపితమై ఉండొచ్చని, దీనిపై విచారణ జరిపించాలని ఖడ్సే కోరారు. ఆయన కుమార్తె, ప్రాంజల్ సతీమణి రోహిణీ ఖడ్సే ప్రస్తుతం ఎన్సీపీ (ఎస్పీ) మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలిగా ఉన్నారు. పోలీసుల దాడుల్లో 2.7 గ్రాముల కొకైన్‌లాంటి పదార్థం, 70 గ్రాముల గంజాయిలాంటి పదార్థం లభ్యమైందని పోలీసులు తెలిపారు. ప్రాథమికంగా చూస్తే ఆ ప్రదేశంలో నేరం జరిగినట్లు కనబడుతోందని, పూర్తి సమాచారం రావాల్సి ఉందని ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడణవీస్ పేర్కొన్నారు.

ఈనాడు సినిమా

హిందీలో ఈమధ్యే విడుదలైన 'సైయారా' సంచలనాల్ని సృష్టిస్తోంది. బాక్సాఫీస్ దగ్గర వసూళ్ల వర్షమే కురుస్తోంది. అలాగని ఇదేమీ అగ్ర తారలు నటించిన సినిమా కాదు. ఓ కొత్త జంట పరిచయ చిత్రం. అందులో ఆ ఇద్దరి మధ్య కెమిస్ట్రీ సృష్టించిన మాయాజాలమే ఈ విజయం అని తేల్చాయి ట్రేడ్ వర్గాలు. ప్రధాన జంట మధ్య కెమిస్ట్రీ పండితే ఫలితం ఎలా ఉంటుందో ఇదివరకు ఎన్నో సినిమాలు రుజువు చేశాయి. కొత్తగా ఆ జాబితాలో 'సైయారా' చేరింది. ఇలా తెలుగులోనూ ఇప్పుడు కొన్ని జంటలు ఊరిస్తున్నాయి. 'ఈ జోడీ మధ్య కెమిస్ట్రీ ఎలా ఉంటుందో చూడాల'నే ప్రత్యేకమైన ఆసక్తిని రేకెత్తిస్తున్నాయి.

కెమిస్ట్రీ కుదిరితే విక్టరీయే!


భాగ్యశ్రీ బోర్సే


రామ్

ఆన్‌స్క్రీన్ కెమిస్ట్రీ... సినిమావాళ్ల పట్ల ఇదొక మిస్టరీనే. ఎలా పండుతుందో, ఎప్పుడు పండుతుందో అంత సులభంగా అంతుచిక్కదు. ప్రతి దర్శకుడూ తన హీరోహీరోయిన్ల మధ్య మంచి కెమిస్ట్రీ పండేలా తెరపై చూపించాలనే ప్రయత్నిస్తాడు. అందుకు తగ్గట్టుగానే సన్నివేశాల్ని రాసుకుంటాడు. కానీ అది అన్నిసార్లూ సాధ్యం కాదు. ఇదొక మాయాజాలం అంతే. కొన్ని సినిమాలకి అలా కుదురుతుంది. రొమాంటిక్ సన్నివేశాలతోనే కెమిస్ట్రీ పండుతుందనుకుంటే అది పొరపాటే అంటారు సినీ పండితులు. నాయకానాయికలు తెరపై కనిపించే విధానం నుంచి పుట్టొచ్చు, చూపులు... సంభాషణల నుంచి పుట్టొచ్చు, సంగీతం, భావోద్వేగాల నుంచీ పండొచ్చు. ప్రేమకథా చిత్రాలే ఎక్కువగా కెమిస్ట్రీపై ఆధారపడుతుంటాయి. తెరపైన కనిపించిన జంట మధ్య మంచి కెమిస్ట్రీ పండిందంటే ఆ ప్రేమకథ సగం విజయం సాధించినట్టే అనేది ఓ లెక్క. మిగతా సగం విజయావకాశాల్ని ఆయా కథల్లోని భావోద్వేగాల లోతులు ప్రభావం చేస్తుంటాయి.

ఎప్పట్నుంచో...

ఎన్టీఆర్ - సావిత్రి, ఏఎన్నార్ - వాణిశ్రీ మొదలు కొని ఈమధ్య నాగచైతన్య - సమంత, విజయ్ దేవరకొండ - రష్మిక వరకూ చాలా జంటలే ఆన్ స్క్రీన్ కెమిస్ట్రీతో అలరించాయి, విజయాల్ని అందుకున్నాయి. ప్రభాస్ - అనుష్క, రామ్‌చరణ్ - కాజల్, అల్లు అర్జున్ - పూజ హెగ్డే... ఇలా భలే జోడీ అనిపించుకున్న నాయకానాయికలు చాలామందే ఉన్నారు. అలాగని వాళ్లు నటించే ప్రతి సినిమాలోనూ కెమిస్ట్రీ ఉంటుందని కాదు, ఉండాలని కాదు. ఆయా కథలు, నేపథ్యాలే కెమిస్ట్రీని ప్రభావితం చేస్తుంటాయి. ప్రేమకథలకు పెట్టింది పేరైన నాగచైతన్య ఎవరితో జోడీ కట్టినా, కెమిస్ట్రీ ఎలా పండిందని చూస్తుంటాం. 'లవ్‌స్టోరి'తో అలరించిన నాగచైతన్య, సాయిపల్లవి 'తండేల్'తోనూ మరోసారి మాయ చేశారు. నాగచైతన్య తన కొత్త సినిమా కోసం మీనాక్షి చౌదరితో జోడీ కట్టారు. కార్తీక్ దండు దర్శకత్వంలో రూపొందుతున్న ఆ సినిమా ప్రస్తుతం సెట్స్‌పై ఉంది. తొలిసారి కలిసి నటిస్తున్న ఈ జంట ఎలా ఉంటుందన్నది ఇప్పుడు అందరిలోనూ ఆసక్తిని రేకెత్తిస్తోంది. విజయ్ దేవరకొండ - భాగ్యశ్రీ బోర్సే జోడీ త్వరలోనే 'కింగ్డమ్'తో సందడి చేయబోతోంది. వీళ్లు తెరపై ఎలా కనిపించనున్నారో ఇప్పటికే విడుదలైన పాటలు, ప్రచార చిత్రాలు చాటి చెబుతున్నాయి. గౌతమ్ తిన్ననూరి దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ చిత్రం ఈ నెల 31న ప్రేక్షకుల ముందుకొస్తోంది.


మృణాల్ ఠాకూర్


అడివి శేష్

రామ్ తాలూకా..

ఎప్పటికప్పుడు కొత్త జోడీలు తెరపై మెరుస్తుంటాయి. విడుదలకు ముందే అవి ప్రేక్షకుల్లో ప్రత్యేకమైన అంచనాల్ని పెంచుతుంటాయి. అలాంటి జోడీలు ఈ ఏడాది చాలానే ఉన్నాయి. 'ఆంధ్ర కింగ్ తాలూకా'తో సందడి చేయనున్నారు రామ్ పోతినేని - భాగ్యశ్రీ బోర్సే. ఓ ప్రేమకథతో మహేశ్‌బాబు.పి ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. ఇటీవలే ఓ పాటని విడుదల చేశారు. అందులో రామ్ - భాగ్యశ్రీ కనిపించిన తీరు సినిమాపై అంచనాల్ని పెంచింది. చాలా రోజుల తర్వాత చాలా కొత్తగా కనిపించిన జోడీగా ఈ ఇద్దరూ అందరి దృష్టిని ఆకర్షించారు. ఇద్దరమ్మాయిలతో ప్రేమాయణంగా 'తెలుసు కదా' తెరకెక్కుతున్న సంగతి తెలిసిందే. ఇందులో సిద్ధు జొన్నలగడ్డ సరసన రాశీ ఖన్నా, శ్రీనిధి శెట్టి నటిస్తున్నారు. ఈ కథా నేపథ్యం, నాయకానాయికల జోడీ కెమిస్ట్రీ విషయంలో ప్రత్యేకమైన అంచనాల్ని రేకెత్తిస్తున్నాయి. 'డెకాయిట్'లో అడివి శేష్ - మృణాల్ ఠాకూర్ జంటగా నటిస్తున్నారు. అడివి శేష్ సినిమాల్లో నాయకానాయికల మధ్య సన్నివేశాలు ఆకట్టుకునేలా ఉంటాయి. 'సంబరాల ఏటిగట్టు' సినిమాలో సాయిదుర్గా తేజ్ - ఐశ్వర్య లక్ష్మి జంటగా నటిస్తున్నారు. 'మిరాయ్'తో తేజ సజ్జా - రితికానాయక్ కలిసి వైబ్ ఉంది... అంటూ ఊరిస్తున్నారు. మరి ఏ జోడీ ఏ స్థాయిలో మురిపిస్తుందో చూడాలి.


నాగ చైతన్య


మీనాక్షి చౌదరి


సిద్ధు జొన్నలగడ్డ


శ్రీనిధి శెట్టి


రాశీ ఖన్నా

రష్మిక మైసా ప్రారంభం


రష్మిక

నాయికా ప్రధానమైన కథలకు కేరాఫ్‌గా మారిపోతున్నారు రష్మిక. 'ది గర్ల్ ఫ్రెండ్' తర్వాత ఆమె ప్రధాన పాత్రధారిగా తెరకెక్కుతున్న మరో నాయికా ప్రధానమైన చిత్రం 'మైసా'. రవీంద్ర పుల్లె దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. అన్‌ఫార్ములా ఫిల్మ్స్ సంస్థ భారీ బడ్జెట్‌తో ఈ చిత్రాన్ని రూపొందిస్తోంది. ఆదివారం హైదరాబాద్‌లో పూజా కార్యక్రమాలతో ప్రారంభమైందీ చిత్రం. ముహూర్తపు సన్నివేశానికి ప్రముఖ నిర్మాత డి.సురేశ్ బాబు క్లాప్‌నివ్వగా, దర్శకుడు రవికిరణ్ కోలా కెమెరా స్విచ్ఛాన్ చేశారు. దర్శకుడు హను రాఘవపూడి గౌరవ దర్శకత్వం వహించడంతోపాటు, చిత్రబృందానికి స్క్రిప్ట్‌ని అందజేశారు. గోండు తెగల నేపథ్యంలో, ఎమోషనల్ యాక్షన్ థ్రిల్లర్‌గా ఈ చిత్రం రూపొందుతోందని, రష్మిక ఇదివరకెప్పుడూ చూడని ఓ గాఢమైన పాత్రలో కనిపిస్తుందని స్పష్టం చేశాయి సినీ వర్గాలు. సోమవారం నుంచే రెగ్యులర్ చిత్రీకరణని ప్రారంభిస్తున్నారు. ఈ చిత్రానికి ఛాయాగ్రహణం: శ్రేయాస్ పి.కృష్ణ, యాక్షన్: ఆండీ లాంగ్.


ధనుష్, నిత్యామేనన్

నా ఆనందానివి నువ్వు


"నువ్వు నా భాగస్వామి అయితే.. ఆ గుడిసె గుడిలా మారుతుంద"ని అంటూ తన ప్రియుణ్ని పొగడ్తలతో ముంచెత్తుతుంది నిత్యామేనన్. ఇదంతా ఆమె నటిస్తున్న 'ఇడ్లీ కడై' (ఇడ్లీ కొట్టు) చిత్రం కోసమే. తమిళ హీరో ధనుష్ నటిస్తూ.. దర్శకత్వం వహిస్తున్న చిత్రమిది. తాజాగా ఈ సినిమా నుంచి మొదటి సింగిల్‌ను ఇన్‌స్టా వేదికగా విడుదల చేసింది చిత్రబృందం. 'ఎన్న సుగం..' అంటూ మొదలైన ఈ పాటలో నిత్య, ధనుష్‌ల ప్రేమ కబుర్లు ప్రేక్షకుల్ని ఆకట్టుకుంటున్నాయి. జీవీ ప్రకాశ్ సంగీతమందించిన ఈ గీతాన్ని శ్వేతామోహన్‌తో కలిసి ధనుష్ స్వయంగా ఆలపించారు. 'నువ్వే నా ఆనందానివి..' అంటూ గ్రామీణ నేపథ్యంలో సాగుతోందీ పాట. ప్రకాశ్ రాజ్, శాలినీ పాండే, సముద్రఖని తదితరులు నటిస్తున్న ఈ సినిమా అక్టోబరు 1న విడుదల కానుంది. డాన్ పిక్చర్స్ నిర్మిస్తోంది.

'కామాఖ్య' షురూ


సమైరా, అభినయ కృష్ణ

సమైరా, సముద్రఖని, అభిరామి ప్రధాన పాత్రధారులుగా... అభినయ కృష్ణ దర్శకత్వంలో తెరకెక్కుతున్న చిత్రం 'కామాఖ్య'. మై ఫిల్మ్ ప్రొడక్షన్స్ పతాకంపై వడ్డేపల్లి శ్రీ వాణీనాథ్, యశ్వంత్‌రాజ్ నిర్మిస్తున్నారు. ఈ చిత్రం ఆదివారం హైదరాబాద్‌లో ప్రారంభమైంది. మాజీ ఎంపీ మధుయాష్కీ గౌడ్ ముఖ్య అతిథిగా హాజరై, ముహూర్తపు సన్నివేశానికి క్లాపనిచ్చారు. మిస్టీరియస్ థ్రిల్లర్ అంశాలతో, శక్తిమంతమైన కథతో రూపొందుతున్న ఈ చిత్రం ప్రతి ఒక్కరినీ మెప్పిస్తుందని చిత్రవర్గాలు తెలిపాయి. ఆనంద్, శరణ్య ప్రదీప్, వైష్ణవ్, ధనరాజ్, రాఘవ, ఐశ్వర్య తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: గ్యాని, కూర్పు: వరప్రసాద్, కళ: భూపతి యాదగిరి.

సైఫ్‌తో నటించడానికి ఎదురుచూస్తున్నా!


అక్షయ్ కుమార్


సైఫ్ అలీఖాన్


జయాపజయాలతో సంబంధం లేకుండా వరుస సినిమాలతో ప్రేక్షకుల్ని అలరిస్తుంటారు బాలీవుడ్ కథానాయకుడు అక్షయ్ కుమార్. ప్రస్తుతం 'భూత్ బంగ్లా'తో బిజీగా ఉన్న ఆయన.. సైఫ్ అలీఖాన్‌తో కలిసి ఓ సినిమా చేస్తున్న సంగతి తెలిసిందే. మలయాళ హిట్ చిత్రం 'ఒప్పం'కి రీమేక్‌గా దీన్ని ప్రియదర్శన్ తెరకెక్కిస్తున్నారు. తాజాగా ఈ సినిమా చిత్రీకరణను వచ్చే నెల నుంచి మొదలు పెట్టడానికి సన్నాహాలు చేస్తున్నారట. "ఇందులో కలరిపయట్టులో నిపుణుడై.. దృష్టి లోపం ఉన్న పాత్రలో సైఫ్, హంతకుడిగా అక్షయ్ కనిపించనున్నారు. ఇప్పటికే వీరిద్దరూ.. తమ పాత్రలకు సంబంధించిన కసరత్తులను మొదలు పెట్టారు. ఆగస్టు 2న షూటింగ్‌ను ప్రారంభించనున్నార"ని అక్షయ్ సన్నిహిత వర్గాలు తెలిపాయి. ఈ చిత్రానికి 'హైవాన్' అనే పేరు పరిశీలనలో ఉన్నట్లు సమాచారం. ఈ సందర్భంగా ఇటీవలే ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న అక్షయ్.. సైఫ్‌తో కలిసి పనిచేయడం గురించి మాట్లాడుతూ.. "ప్రియదర్శన్‌తో మళ్లీ పనిచేయడం సంతోషంగా ఉంది. మరో ముఖ్యమైన విషయమేంటంటే.. చాలా కాలం తర్వాత సైఫ్‌తో మళ్లీ జోడీ కట్టడం. అతనితో కలిసి నటించడానికి ఆసక్తిగా ఎదురుచూస్తున్నా" అని అన్నారు.

వరుణ్‌సందేశ్ 'వన్ వే టికెట్'


వరుణ్‌సందేశ్, ఖుష్బూ

వరుణ్‌సందేశ్ కథానాయకుడిగా 'వన్ వే టికెట్' పేరుతో ఓ చిత్రం తెరకెక్కుతోంది. ఖుష్బూ చౌదరి కథానాయిక. ఎ.పళనిస్వామి దర్శకత్వం వహిస్తున్నారు. శ్రీ పద్మ ఫిల్మ్స్‌తో కలిసి రంగస్థలం మూవీ మేకర్స్ పతాకంపై జొరిగె శ్రీనివాసరావు నిర్మిస్తున్నారు. ఈ చిత్రం ఆదివారం హైదరాబాద్‌లో పూజా కార్యక్రమాలతో ప్రారంభమైంది. ముహూర్తపు సన్నివేశానికి నిర్మాత సి.కల్యాణ్ క్లాప్‌నివ్వగా, త్రినాథరావు నక్కిన కెమెరా స్విచ్ఛాన్ చేశారు. హర్షిత్‌రెడ్డి స్క్రిప్ట్‌ని అందజేశారు. టి.ఎస్.రావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కథానాయకుడు వరుణ్‌సందేశ్ మాట్లాడుతూ "కొత్త రకమైన కథ, పాత్రలతో రూపొందుతున్న చిత్రమిది. దర్శకుడు ఈ కథని చెప్పిన విధానం ఎంతగానో నచ్చింది. మంచి నటులు, సాంకేతిక బృందం తోడైంది. త్వరలోనే చిత్రీకరణను ప్రారంభిస్తాం" అన్నారు. దర్శకుడు మాట్లాడుతూ "క్రైమ్ థ్రిల్లర్‌గా... ఓ బలమైన స్క్రిప్ట్‌తో రూపొందనున్న చిత్రమిది" అన్నారు. నిర్మాత మాట్లాడుతూ "వరుణ్ సందేశ్‌కి తగ్గ కథతోనే ఈ చిత్రం రూపొందుతోంది. థ్రిల్లింగ్‌గా సాగే కథ, కథనాలతో పళని ఈ సినిమాని తెరకెక్కిస్తార"న్నారు. "వరుణ్‌సందేశ్‌కి ఓ మంచి హిట్ పడాలన్నది నా కల. ఈ చిత్రం పెద్ద విజయం సాధిస్తుందని నమ్ముతున్నా" అన్నారు త్రినాథరావు నక్కిన. మనోజ్ నందం, సుధాకర్, రామ్ తిరుపతి తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: సాయికార్తీక్, ఛాయాగ్రహణం: శ్రీనివాస్ బెజుగమ్.

సైకలాజికల్ థ్రిల్లర్‌లో కుంచాకో..


'ఒరు దురూహ సాహచర్యతిల్'

'ఆఫీసర్ ఆన్ డ్యూటీ'తో ఈ ఏడాది మంచి విజయాన్ని తన ఖాతాలో వేసుకున్నారు మలయాళ విలక్షణ నటుడు కుంచాకో బోబన్. ఇందులో పోలీసు అధికారిగా నిందితుల్ని పరుగులు పెట్టించిన ఆయన.. ఇప్పుడు ప్రేక్షకుల్ని కడుపుబ్బా నవ్వించడానికి సిద్ధమయ్యారు. ఆయన ప్రధాన పాత్రలో నటిస్తున్న చిత్రం 'ఒరు దురూహ సాహచర్యతిల్'. దిలీశ్ పోతన్, సజిన్ గోపు, చిదంబరం తదితరులు కీలక పాత్రలు పోషించారు. రతీశ్ బాలకృష్ణన్ దర్శకత్వం వహిస్తున్నారు. తాజాగా ఈ సినిమా ఫస్ట్‌లుక్‌ను... ఇన్‌స్టా వేదికగా విడుదల చేసింది చిత్రబృందం. సైకలాజికల్ కామెడీ థ్రిల్లర్‌గా దీన్ని తీర్చిదిద్దుతున్నట్లు తెలిపాయి సినీ వర్గాలు. త్వరలో విడుదల తేదీని వెల్లడించనున్నారు.

దీపికకు మరో అరుదైన గౌరవం


దీపికా పదుకొణె

వైవిధ్యమైన కథలతో ప్రేక్షకుల్ని మెప్పిస్తూ ఉంటుంది బాలీవుడ్ అందాల తార దీపికా పదుకొణె. ఇటీవలే ఆమె 'హాలీవుడ్ వాక్ ఆఫ్ ఫేమ్ స్టార్ 2026'కు ఎంపికైన సంగతి తెలిసిందే. ఇప్పుడామె మరో అరుదైన గౌరవాన్ని దక్కించుకుంది. తాజాగా దీపిక.. ప్రముఖ మ్యాగజైన్ 'ది షిఫ్ట్' ప్రకటించిన ప్రభావవంతమైన మహిళల జాబితాలో నిలిచింది. క్రియాశీలత, సృజనాత్మకత, నాయకత్వం.. తదితర అంశాలను పరిగణనలోకి తీసుకొని రూపొందించిన ఈ జాబితాలో బాలీవుడ్ దర్శకురాలు జోయా అక్తర్, హాలీవుడ్ నటీమణులు ఏంజెలినా జోలీ, సెలీనా గోమెజ్ తదితరులున్నారు. ఈ సందర్భంగా ఈ విషయాన్ని ఇన్‌స్టా వేదికగా పంచుకుంటూ తనకు ఎంతో గర్వంగా ఉందని ఓ పోస్ట్ పెట్టింది దీపిక. ప్రస్తుతం ఆమె.. అగ్రహీరో అల్లు అర్జున్-అట్లీ కలయికలో రూపొందుతున్న సినిమాలో నటిస్తోంది.

టీసీఎస్‌లో 12,000 ఉద్యోగాల కోత!

మొత్తం సిబ్బందిలో 2 శాతానికి సమానం



దిల్లీ: దేశంలో అగ్రగామి ఐటీ సేవల సంస్థ టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్) భారీగా ఉద్యోగాల కోతకు సిద్ధమైంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2025-26)లో 12,261 మంది ఉద్యోగులను అంతర్జాతీయంగా తొలగించడానికి సన్నాహాలు చేస్తున్నట్లు టీసీఎస్ సీఈఓ కె.కృతివాసన్ వెల్లడించారు. ప్రస్తుత ఆర్థిక అనిశ్చితులు, కృత్రిమ మేధ (ఏఐ) టెక్నాలజీ మార్పుల కారణంగానే ఈ తొలగింపులు చేయాల్సి వస్తున్నట్లు తెలిపారు. భవిష్యత్తు కోసం సిద్ధమయ్యే ప్రయాణంలో సంస్థ ఉంది. ఇందుకోసం సిబ్బందికి నూతన సాంకేతికతల్లో శిక్షణ ఇస్తున్నాం. ప్రత్యామ్నాయం కల్పించలేని పరిస్థితుల్లో కొంత మందిని తొలగించాలని నిర్ణయించాం. 6,13,069 మంది ఉద్యోగుల్లో వీరు 2 శాతానికి సమానం. మధ్య, సీనియర్ స్థాయి మేనేజర్లపై ఈ ప్రభావం అధికంగా ఉండే అవకాశం ఉందని ఒక అధికార ప్రకటనలో టీసీఎస్ పేర్కొంది.

ఈ నిర్ణయానికి కారణాలివీ

భారత ఐటీ సేవల రంగం 283 బి.డాలర్ల (దాదాపు రూ.25 లక్షల కోట్ల) ఆదాయ స్థాయికి చేరింది. మన దేశంలోని అతిపెద్ద ఐటీ సేవల కంపెనీల్లో టీసీఎస్ అగ్రస్థానంలో ఉంది. ఈ విభాగంలో కంపెనీలే ఎక్కువ సంఖ్యలో ఉద్యోగులు ఉన్నారు. ప్రస్తుతం ప్రపంచ ఆర్థిక అనిశ్చితులు, ఏఐ టెక్నాలజీ ఎదురవుతున్న అవాంతరాలతో ఐటీ సంస్థలకు వ్యాపార గిరాకీపై ప్రతికూల ప్రభావం పడుతోంది. కృత్రిమ మేధ కారణంగా ఐటీ సేవల రంగంలో కంపెనీల వ్యాపార తీరే మారుతోంది. ప్రాజెక్టుల ధర విషయంలో క్లయింట్లు 20-30% తగ్గింపును డిమాండ్ చేస్తుండటం ఇందుకు నేపథ్యంగా చూడొచ్చు. ఈ పరిస్థితుల్లో లాభాల మార్జిన్లు కాపాడుకోవడం కోసం, టీసీఎస్ ఉద్యోగుల సంఖ్య తగ్గించుకోవాలని నిర్ణయించింది. జూన్ త్రైమాసికం చివరకు టీసీఎస్ ఉద్యోగుల సంఖ్య 6,13,069గా ఉంది. తాజాగా దాదాపు 12,200 మందిని తొలగించాలని నిర్ణయించారు. ఉద్యోగులను స్థిరంగా ఉంచే టీసీఎస్ కూడా ఈ కఠిన నిర్ణయం తీసుకోవడంతో.. పరిశ్రమలో ఇదే తరహా ధోరణి పెరగొచ్చని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.

కఠిన నిర్ణయాల్లో ఒకటి: కృతివాసన్

బలమైన టీసీఎస్‌ను నిర్మించే ప్రక్రియలో భాగంగా, తాము తీసుకున్న కఠిన నిర్ణయాల్లో ఉద్యోగుల తొలగింపు నిర్ణయం ఒకటని టీసీఎస్ సీఈఓ కృతివాసన్ వెల్లడించారు. 'ఏఐ వంటి కొత్త సాంకేతికత ఫలితంగా పెనుమార్పులను గుర్తించాం. భవిష్యత్తుకు సిద్ధంగా ఉండాలంటే మరింత చురుగ్గా వ్యవహరించాలి. ఇందుకోసం ఏఐను వినియోగిస్తున్నాం.. ఉద్యోగుల నైపుణ్యాలను మదింపు చేస్తున్నాం. ఉద్యోగుల తొలగింపు కారణంగా ప్రాజెక్టులపై ఎటువంటి ప్రభావం ఉండదు. ఇది చాలా కఠిన సమయం' అని పేర్కొన్నారు. తొలగించే ఉద్యోగులకు గుర్తింపు ప్రయోజనాలు, ఔట్‌ప్లేస్‌మెంట్ సేవలు, పొడిగించిన బీమా కవరేజీ ఇస్తామని కంపెనీ తెలిపింది.

● 'ఏడాదిలో కనీసం 225 రోజుల పాటు ప్రాజెక్టుల్లో ఉండాలని, బెంచ్‌పై ఉండే రోజుల సంఖ్య గరిష్ఠంగా 35 రోజులు మాత్రమే' అంటూ బెంచ్ విధానాన్ని టీసీఎస్ సవరించింది. దీనిని సవాల్ చేస్తూ పలువురు టీసీఎస్ ఉద్యోగులు కోర్టును ఆశ్రయించిన కొన్ని రోజుల్లోనే.. ఉద్యోగుల తొలగింపు ప్రకటన వెలువడటం గమనార్హం.

● ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్-జూన్ త్రైమాసికంలో అగ్రగామి ఆరు ఐటీ కంపెనీల నియామకాలు ఏడాది క్రితంతో పోలిస్తే 72% తగ్గాయి. గత మూడు నెలల్లో ఈ కంపెనీలన్నీ కలిపి 3,847 మందిని నియమించుకున్నాయి. ఏడాది క్రితం ఈ సంఖ్య 13,935గా ఉంది.

రూ.7,300 కోట్ల సమీకరణకు 14 ఐపీఓలు

దిల్లీ: ఈ వారం ఐపీఓ మార్కెట్ కళకళలాడనుంది. 14 పబ్లిక్ ఇష్యూలు దలాల్ స్ట్రీట్‌ను పలకరించనున్నాయి. ఇందులో 5 ఐపీఓలు ప్రధాన (మెయిన్‌బోర్డ్) విభాగం నుంచి కాగా, మిగిలినవి ఎస్ఎంఈ విభాగం నుంచి ఉన్నాయి. మెయిన్ బోర్డ్ కంపెనీలే రూ.7,008 కోట్లు సమీకరించనుండగా, మొత్తం 14 ఐపీఓల మొత్తం రూ.7,300 కోట్లకు చేరనుంది. ఇంకో 12 కంపెనీల షేర్లు స్టాక్‌ఎక్స్ఛేంజీల్లో నమోదు కానున్నాయి.

ఎస్ఎంఈ విభాగంలో..

ఈ విభాగంలో 9 పబ్లిక్ ఇష్యూలు రాబోతున్నాయి. ఉమియా మొబైల్ రూ.24.88 కోట్లు, రెపోనో రూ.26.68 కోట్లు సమీకరించబోతున్నాయి. ఈ నెల 28న ఈ ఇష్యూలు ప్రారంభమవుతాయి. 29న ప్రారంభమయ్యే కేటెక్స్ ఫ్యాబ్రిక్స్ ఇష్యూ రూ.69.81 కోట్లు సేకరించనుంది. ఈ నెల 30న టేక్యాన్ నెట్‌వర్క్స్ (రూ.20.5 కోట్లు), మెహుల్ కలర్స్ (రూ.21.66 కోట్లు), బీడీ ఇండస్ట్రీస్ (రూ.45.36 కోట్లు) ఐపీఓలు ప్రారంభం కానున్నాయి. రెనోల్ పాలీకెమ్ (రూ.25.77 కోట్లు), క్యాష్ యువర్ డ్రైవ్ మార్కెటింగ్ (రూ.60.79 కోట్లు) ఇష్యూలు ఈ నెల 31న, ఫ్లైస్‌బీస్ ఏవియేషన్ ఐపీఓ ఆగస్టు 1న శ్రీకారం చుడతాయి.

●బ్రిగేడ్ హోటల్ వెంచర్స్, శాంతి గోల్డ్ ఇంటర్నేషనల్ ఇష్యూలు ఈ నెల 28, 29 తేదీల్లో ముగియనున్నాయి. ఎస్ఎంఈ విభాగంలో ఈ నెల 25న ప్రారంభమైన పటేల్ కెమ్ స్పెషాలిటీస్, శ్రీ రెఫ్రిజిరేషన్స్, సెల్లోరాప్ ఇండస్ట్రీస్ పబ్లిక్ ఇష్యూలు 29న ముగియనున్నాయి.



ఐపీఓ ప్రధాన విభాగంలో..

కంపెనీ	ధరల శ్రేణి (రూ.)	ఇష్యూ తేదీలు	పరిమాణం (రూ.కోట్లలో)
లక్ష్మి ఇండియా ఫైనాన్స్	150-158	29-31	254.00
ఆదిత్య ఇన్ఫోటెక్	640-675	29-31	1,300.00
ఎన్ఎస్‌డీఎల్	760-800	30-1	4,011.60
శ్రీ లోటస్ డెవలపర్స్	140-150	30-1	792.00
ఎం అండ్ బీ ఇంజినీరింగ్	366-385	30-1	650.00

స్టాక్ ఎక్స్ఛేంజీల్లో నమోదు కాబోతున్న షేర్లు

ప్రధాన విభాగం నుంచి ఇండిక్యూబ్ స్పేసెస్, జీఎన్‌జీ ఎలక్ట్రానిక్స్ షేర్లు ఈ నెల 30న; బ్రిగేడ్ హోటల్ వెంచర్స్ ఈనెల 31న, శాంతి గోల్డ్ ఇంటర్నేషనల్ షేరు ఆగస్టు 1న స్టాక్ ఎక్స్ఛేంజీల్లో నమోదవుతాయి.

● ఎస్ఎంఈ విభాగం నుంచి సావీ ఇన్‌ఫ్రా అండ్ లాజిస్టిక్స్, స్వస్తిక కాస్టల్ షేర్లు ఈ నెల 28న, మోనార్క్ సర్వేయర్స్ అండ్ ఇంజినీరింగ్ కన్సల్టెంట్స్ 29న, టీఎస్‌సీ ఇండియా 30న నమోదు కానున్నాయి. పటేల్ కెమ్ స్పెషాలిటీస్, శ్రీ రెఫ్రిజిరేషన్స్, సెల్లోరాప్ ఇండస్ట్రీస్ షేర్లు ఆగస్టు 1న నమోదు కాబోతున్నాయి.



దేశ ఆర్థిక వ్యవస్థ వృద్ధికి సవాళ్లు లేవు

● 2025-26లో 6.5 శాతానికి పైగా పెరగొచ్చు

● ఆర్‌బీఐ ద్రవ్య పరపతి కమిటీ సభ్యులు నగేశ్ కుమార్



దిల్లీ: మన దేశ ఆర్థిక వ్యవస్థ ఈ ఆర్థిక సంవత్సరం (2025-26)లో బలంగా రాణిస్తోందని.. 6.5% వృద్ధిరేటును సాధించడంలో ఎలాంటి సవాళ్లు కనిపించడం లేదని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) ద్రవ్య పరపతి విధాన కమిటీ (ఎంపీసీ) సభ్యులు నగేశ్ కుమార్ వెల్లడించారు. ప్రపంచంలోని మిగిలిన ఆర్థిక వ్యవస్థలతో పోలిస్తే మన ఆర్థిక వ్యవస్థ చాలా ప్రకాశవంతంగా కనిపిస్తోందని తెలిపారు. అంతర్జాతీయ ఆర్థిక వ్యవస్థల్లో మూడో వంతుకు పైగా రుణ సంక్షోభంలో ఉన్నాయన్నారు. పారిశ్రామిక ఆర్థిక వ్యవస్థలు చాలా ఒత్తిడిని ఎదుర్కొంటున్నాయని, అధిక ద్రవ్యోల్బణంతో ఆర్థిక వృద్ధి నెమ్మదిస్తోందని వివరించారు. మన ఆర్థిక వ్యవస్థ దేశీయ వినియోగం, దేశీయ పెట్టుబడులపై ఎక్కువగా ఆధారపడటంతో పాటు ఎగుమతులపై తక్కువగా ఆధారపడటం వల్ల.. ప్రస్తుత పరిస్థితుల్లో మన ఆర్థిక వ్యవస్థకు ఇబ్బందులు లేవని పేర్కొన్నారు. ప్రస్తుత - వచ్చే ఆర్థిక సంవత్సరాల్లో దేశ వృద్ధి రేటు 6.5 శాతానికి పైగా నమోదవుతుందని అంచనా వేశారు.

ద్రవ్యోల్బణం ఒక్కటే కొలమానం కాదు

ఆర్‌బీఐ సమీక్షలో తీసుకున్న ద్రవ్య పరపతి విధాన నిర్ణయాలతో రిటైల్ ద్రవ్యోల్బణం ఆర్‌బీఐ లక్ష్యిత స్థాయి (2-6 శాతం)లో దిగువ స్థాయికి (జూన్‌లో 2.1 శాతం) చేరిందని నగేశ్ గుర్తు చేశారు. ఈ ఏడాది ఇప్పటికే 100 బేసిస్ పాయింట్ల రెపో రేటును తగ్గించిన ఆర్‌బీఐ, ద్రవ్యోల్బణం ఆధారంగా మరోసారి రేట్ల కోతకు దిగే అవకాశం ఉందా అని అడిగితే.. కేవలం ద్రవ్యోల్బణ గణాంకాల ఆధారంగానే రేట్ల కోతకు దిగబోమని.. వివిధ స్థూల గణాంకాలు కూడా పరిశీలిస్తామన్నారు. ఒక నెలలో ద్రవ్యోల్బణం 2 శాతం దరిదాపుల్లోకి రాగానే సరిపోదని, అక్కడే అది స్థిరంగా కొనసాగాల్సిన అవసరం ఉందన్నారు. ఆగస్టు 4-6 తేదీల్లో ఆర్‌బీఐ ఎంపీసీ ద్వైమాసిక పరపతి విధాన సమీక్షా సమావేశం జరగబోతోంది. నిర్ణయాలను 6న ప్రకటిస్తారు.

చరిత్రాత్మక కనిష్ఠానికి పొదుపు ఖాతా వడ్డీ రేట్లు

ఆర్‌బీఐ బులెటిన్



ముంబయి: పొదుపు ఖాతాల్లోని నగదు నిల్వలపై కొన్నిబ్యాంకులు అందిస్తున్న వడ్డీ రేట్లు చరిత్రాత్మక కనిష్ఠానికి తగ్గాయని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) బులెటిన్ వెల్లడించింది. ఈ ఖాతాలకు డిపాజిట్ రేటును బ్యాంకులు సొంతంగా నిర్ణయించుకోవచ్చని ఆర్‌బీఐ 2011 అక్టోబరులో ప్రకటించింది. అప్పట్లో 4% వద్ద ఉన్న ఈ వడ్డీ రేటును చాలా బ్యాంకులు ఇప్పుడు 2.5 శాతానికి కుదించాయి. ఎస్‌బీఐతో పాటు బ్యాంక్ ఆఫ్ బరోడా, పంజాబ్ నేషనల్ బ్యాంక్, ప్రైవేటు రంగంలోని హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఐసీఐసీఐ బ్యాంక్, కోటక్ బ్యాంక్‌లు పొదుపు ఖాతాల్లోని నిల్వలపై వడ్డీ రేటును 2.5 శాతంగా అందిస్తున్నాయి. ఇదిలా ఉంటే, చిన్నమొత్తాల పొదుపు ఖాతాల వడ్డీ రేట్లను ప్రభుత్వం ప్రస్తుత జులై-సెప్టెంబరు త్రైమాసికంలో 4% వద్ద మార్పు లేకుండా ఉంచింది.

వీఐపీ ఇండస్ట్రీస్‌లో 32% వాటా కొనుగోలుకు సీసీఐ అనుమతి కోరిన మల్టిపుల్స్ కన్సార్షియం

దిల్లీ: లగేజీ, ట్రావెల్ యాక్సెసరీస్‌ను తయారు చేసే వీఐపీ ఇండస్ట్రీస్‌లో 32% వాటా కొనుగోలు చేయడానికి కాంపిటీషన్ కమిషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) అనుమతిని మల్టిపుల్స్ ఈక్విటీ నేతృత్వంలోని కన్సార్షియం కోరింది. తమ కంపెనీలో 32% వరకు వాటాను వీఐపీ ఇండస్ట్రీస్ ప్రమోటర్లు దిలీప్ పిరమాల్, ఆయన కుటుంబం కలిసి మల్టిపుల్స్ ఈక్విటీకి విక్రయించనున్నట్లు గత వారం ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ లావాదేవీ కోసం సీసీఐ అనుమతిని మల్టిపుల్స్ కన్సార్షియం కోరింది.

ప్రాధాన్య రంగ రుణాలను విక్రయిస్తాం

కెనరా బ్యాంక్ ఎండీ కె.సత్యనారాయణ రాజు



దిల్లీ: ప్రస్తుత త్రైమాసికంలో అదనంగా ఉన్న ప్రాధాన్య రంగ రుణాలను విక్రయించడానికి సన్నాహాలు చేస్తున్నట్లు కెనరా బ్యాంక్ ఎండీ కె.సత్యనారాయణ రాజు వెల్లడించారు. వడ్డీ రేట్ల కోత నేపథ్యంలో, మార్జిన్లపై పడిన భారాన్ని ఈ రుణాల విక్రయం తగ్గిస్తుందని తెలిపారు. జూన్‌తో ముగిసిన త్రైమాసికంలో ప్రాధాన్య రంగ రుణాలను విక్రయించడం ద్వారా కమీషన్ రూపంలో బ్యాంక్ రూ.1,248 కోట్లు ఆర్జించింది. మొత్తం ప్రాధాన్య రుణాలు 45.63 శాతంగా ఉన్నాయని, నిబంధనల ప్రకారం ఇవి మొత్తం రుణాల్లో 40 శాతంగా ఉండాలని సత్యనారాయణ రాజు స్పష్టం చేశారు. ప్రస్తుత త్రైమాసికంలో ప్రాధాన్య రుణాల విక్రయం ద్వారా లబ్ధి పొందనున్నట్లు వివరించారు.

● **వడ్డీ రేట్ల తగ్గింపుపై..:** ఈ ఏడాదిలో ఇప్పటివరకు రిజర్వ్ బ్యాంక్ కీలక రెపో రేటును 100 బేసిస్ పాయింట్ల మేర తగ్గించింది. ద్రవ్యోల్బణం 3 శాతం దరిదాపుల్లోకి చేరడంతో, మరో సారి రేట్ల కోత ఉండొచ్చన్న అంచనాలు ఉన్నాయి. ఈ పరిస్థితుల్లో నికర వడ్డీ మార్జిన్ అంచనా అయిన 2.75 శాతాన్ని సాధించడం కష్టతరంగా మారిందని సత్యనారాయణ రాజు పేర్కొన్నారు. ఆగస్టు లేదా అక్టోబరు సమీక్షల్లో రేట్ల కోత ఉండొచ్చని, ఇందుకోసం వేచిచూడాలన్నారు. దీంతో ప్రస్తుత త్రైమాసికంలో ఒత్తిడి నెలకొందని, మూడు - నాలుగు త్రైమాసికాల్లో కొంత మెరుగుదల రావొచ్చని అభిప్రాయపడ్డారు. ఈ ఏడాదిలో రెండు అనుబంధ సంస్థల్లో వాటా విక్రయంతో బ్యాంకుకు కొంత సౌలభ్యం లభిస్తుందన్నారు. ప్రస్తుత త్రైమాసికంలో ఒక అనుబంధ సంస్థను స్టాక్‌ఎక్స్ఛేంజీల్లో నమోదు చేస్తామని.. వచ్చే త్రైమాసికంలో మరొకటి రావొచ్చని, నియంత్రణ సంస్థల అనుమతిపై ఇది ఆధారపడి ఉంటుందని తెలిపారు.

● అసెట్ మేనేజ్‌మెంట్ సంయుక్త సంస్థ కెనరా రొబెకో ఏఎంసీలో ఉన్న మొత్తం 13% వాటాను ఐపీఓలో విక్రయించడానికి కెనరా బ్యాంక్ సిద్ధమవుతోంది. జీవిత బీమా సంయుక్త సంస్థ కెనరా హెచ్ఎస్‌బీసీ లైఫ్ ఇన్సూరెన్స్ కంపెనీలో 14.5% వాటాను బ్యాంక్ విక్రయించనుంది.

రెపోనో లిమిటెడ్ ఐపీఓ ధరల శ్రేణి రూ.91-96

దిల్లీ: ముంబయి కేంద్రంగా గోదాములు, లిక్విడ్ టెర్మినల్ సొల్యూషన్లు అందించే సంస్థ రెపోనో లిమిటెడ్.. రూ.26.6 కోట్ల తొలి పబ్లిక్ ఆఫర్ (ఐపీఓ) సోమవారం (ఈనెల 28న) ప్రారంభమై, ఈనెల 30న ముగియనుంది. ఇందుకు ధరల శ్రేణి రూ.91-96గా నిర్ణయించారు. ఈ ఇష్యూలో 27.79 లక్షల తాజా ఈక్విటీ షేర్లను సంస్థ విక్రయించనుంది. ఇష్యూ ద్వారా సమీకరించిన నిధులను ఫోర్క్ లిఫ్ట్ ట్రక్కుల కొనుగోలు సహా నిర్వహణ సామర్థ్యాలను పెంచడానికి, సాధారణ కార్పొరేట్ అవసరాల కోసం వినియోగించనున్నారు. సంస్థ 2024-25లో రూ.51.11 కోట్ల ఆదాయంపై రూ.5.15 కోట్ల నికర లాభాన్ని ఆర్జించింది.

కోడి గుడ్లు

28న ఫారం వద్ద రైతు అమ్మకం ధరలు (నెక్) (100కు రూపాయలలో)

హైదరాబాద్	425	గోదావరి	455
వరంగల్	427	విశాఖపట్నం	465
విజయవాడ	475	చిత్తూరు	483

పసిడిలో లాభాల స్వీకరణ


కమొడిటీస్ ఈ వారం

పసిడి




పసిడి ఆగస్టు కాంట్రాక్టు ఈవారం రూ.99,659 కంటే పైన కదలాడితే మరింతగా పెరిగే అవకాశం ఉంటుంది. ఈ స్థాయిని అధిగమిస్తే రూ.1,01,512; రూ.1,02,470 వరకు రాణించొచ్చు. ఒకవేళ రూ.96,848 కంటే దిగువన చలిస్తే రూ.95,890; రూ.94,037 వరకు దిద్దుబాటు అవుతుందని భావించొచ్చు. అంతర్జాతీయ వాణిజ్య ఒప్పందాలపై ఆశావాదం బలపడటంతో, సురక్షిత పెట్టుబడి సాధనంగా భావించే పసిడి నుంచి మదుపర్లు లాభాలు స్వీకరిస్తున్నారు. అమెరికా ఫెడ్ వడ్డీరేట్లను మార్చకపోవచ్చనే అభిప్రాయమూ ఉంది. సోమవారం కనుక 98,180పైన ముగిస్తే సానుకూల ధోరణి, రూ.97,660 దిగువన ముగిస్తే ప్రతికూల ధోరణిలో చలించొచ్చు.

వెండి



వెండి సెప్టెంబరు కాంట్రాక్టు కిందకు వస్తే రూ.1,11,459 వద్ద మద్దతు పొందొచ్చు. ఈ స్థాయిని కోల్పోతే రూ.1,09,866కు దిగివచ్చే అవకాశం ఉంటుంది. ఒకవేళ సానుకూల ధోరణిలో చలిస్తే రూ.1,15,643 వద్ద నిరోధం ఎదురయ్యే అవకాశం ఉంటుంది. ఈ స్థాయిని అధిగమిస్తే రూ.1,19,827 వరకు పెరగొచ్చు.

ప్రాథమిక లోహాలు




● రాగి ఆగస్టు కాంట్రాక్టు రూ.891.85 కంటే దిగువకు రాకుంటే సానుకూల ధోరణికి ఆస్కారం ఉంటుంది. అందువల్ల ఈ స్థాయి వద్ద స్టాప్‌లాస్ పెట్టుకుని, లాంగ్ పొజిషన్లు తీసుకోవచ్చు. ఒకవేళ రూ.887.45 కంటే కిందకు వస్తే రూ.879.75 వరకు దిగిరావొచ్చు. ● సీసం ఆగస్టు కాంట్రాక్టుకు రూ.180.60 వద్ద మద్దతు లభించొచ్చు. దీన్ని కోల్పోతే రూ.179.50; రూ.178.70 వరకు దిగి రావొచ్చు. ఒకవేళ సానుకూలంగా కదిలితే రూ.182.50 వద్ద నిరోధం ఎదురుకావొచ్చు. దీన్ని అధిగమిస్తే రూ.183.30; రూ.184.40 వరకు రాణించొచ్చు. ● జింక్ ఆగస్టు కాంట్రాక్టు రూ.265.25 కంటే దిగువన చలిస్తే షార్ట్ సెల్ పొజిషన్ల వైపు మొగ్గు చూపడం మంచిది. ● అల్యూమినియం ఆగస్టు కాంట్రాక్టుకు రూ.252.85 వద్ద మద్దతు లభించొచ్చు. ఇది కోల్పోతే రూ.251.50; రూ.249.50 వరకు దిగి రావొచ్చు.

ఇంధన రంగం



● ముడి చమురు ఆగస్టు కాంట్రాక్టు రూ.5,799 కంటే దిగువన ట్రేడ్‌కాకుంటే రూ.6,035; రూ.6,188 వరకు పెరిగే అవకాశం ఉంటుంది. ఒకవేళ రూ.5,551 కంటే దిగువన చలిస్తే రూ.5,453; రూ.5,302 వరకు క్షీణించొచ్చు. ● సహజవాయువు ఆగస్టు కాంట్రాక్టు రూ.260.25 కంటే కిందకు వస్తే రూ.247.45 వరకు దిద్దుబాటు కావొచ్చు.

వ్యవసాయ ఉత్పత్తులు



● పసుపు ఆగస్టు కాంట్రాక్టు సానుకూల ధోరణిలో చలిస్తే రూ.14,687 వద్ద నిరోధం ఎదురుకావచ్చు. ఈ స్థాయిని మించితే రూ.15,111; రూ.15,249 వరకు పెరిగే అవకాశం ఉంటుంది. ● పత్తి క్యాండీ ఆగస్టు కాంట్రాక్టు రూ.56,826 కంటే పైకి వెళితే రూ.58,023; రూ.59,546 వరకు పెరగొచ్చు. ప్రతికూల ధోరణిలో చలిస్తే రూ.54,106 వద్ద మద్దతు లభించొచ్చు.

– ఆర్ఎల్‌పీ కమొడిటీ అండ్ డెరివేటివ్స్

గతవారం కదలికలు ఇలా

కమొడిటీ	ప్రారంభం	ముగింపు	వృద్ధి
	(రూ.లలో)		(శాతంలో)
పసిడి (ఆగస్టు)	98,210	97,806	-0.41
వెండి (సెప్టెంబరు)	1,13,071	1,13,052	-0.02
రాగి (ఆగస్టు)	901.00	896.30	-0.52
సీసం (ఆగస్టు)	181.00	181.70	0.39
జింక్ (ఆగస్టు)	265.80	267.85	0.77
అల్యూమినియం (ఆగస్టు)	245.10	254.20	3.71
ముడి చమురు (ఆగస్టు)	5,806	5,648	-2.75
సహజ వాయువు (ఆగస్టు)	298.00	273.40	-8.26
పసుపు (ఆగస్టు)	14,570	14,326	-2.10
పత్తి క్యాండీ (ఆగస్టు)	55,800	55,630	-0.30

మరిన్ని నష్టాలకు అవకాశం!

● భారత్-అమెరికా ఒప్పందంపై అనిశ్చితి నేపథ్యం ● కార్పొరేట్ ఫలితాలు నిరుత్సాహకరంగా ఉండడమూ కారణమే ● ఫార్మాలోనే కాస్త సానుకూలతలు ● విశ్లేషకుల అంచనాలు

స్టాక్ మార్కెట్ ఈ వారం



స్టాక్ మార్కెట్ ప్రామాణిక సూచీలు ఈవారం మరింత నష్టపోవచ్చని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. భారత్-అమెరికా వాణిజ్య ఒప్పందం ఆగస్టు 1లోగా కుదురుతుందా లేదా అన్న విషయంపై అనిశ్చితి ఇందుకు నేపథ్యం. కార్పొరేట్ కంపెనీల జూన్ త్రైమాసిక ఫలితాలు నిరుత్సాహకరంగా ఉండడం వల్ల, బేరిష్ సెంటిమెంటు కనిపిస్తోందంటున్నారు. నిఫ్టీ-50 సూచీ 24,800 కంటే దిగువకు వస్తే 24,450 పాయింట్ల స్థాయికి నష్టపోవచ్చని సాంకేతిక నిపుణులు అంటున్నారు. పారిశ్రామికోత్పత్తి, తయారీ పీఎంఐ గణాంకాలు ఆగస్టు 1న విడుదల కానున్నాయి. వడ్డీరేట్లపై అమెరికా ఫెడరల్ రిజర్వ్ నిర్ణయం, విదేశీ మదుపర్ల ధోరణి, ముడిచమురు ధరల కదలికలు ప్రభావం చూపనున్నాయి. వివిధ రంగాలపై విశ్లేషకులు ఏమంటున్నారంటే..

● పలు బ్యాంకుల ఫలితాలు బలహీనంగా నమోదు కావడంతో **బ్యాంకింగ్** షేర్లపై ఒత్తిడి కొనసాగొచ్చు. నిఫ్టీ బ్యాంక్ తన 50 రోజుల చలన సగటు అయిన 56300 పాయింట్ల దిగువకు వస్తే, 56000-55,000 స్థాయిలకు చేరొచ్చు. ఇండస్ఇండ్ బ్యాంక్ (28న), బ్యాంక్ ఆఫ్ ఇండియా (29) ఫలితాలు వెలువడనున్నాయి.

● **ఐటీ** కంపెనీల షేర్లు మార్కెట్‌తో పాటే బలహీనంగా ట్రేడవవచ్చు. యాజమాన్యాల వ్యాఖ్యలు అప్రమత్తతను సూచిస్తుండడం, మిశ్రమ ఫలితాలు, అనిశ్చిత వాణిజ్య పరిస్థితులు ఇందుకు కారణం. అమెజాన్, యాపిల్, మెటా, మైక్రోసాఫ్ట్ త్రైమాసిక ఫలితాలనూ గమనించాలి.

● ఉక్కు ధరల బలహీనతల కారణంగా **లోహ** కంపెనీల షేర్లు బేరిష్ ధోరణిలో కనిపిస్తున్నాయి. యాంటీ డంపింగ్ సుంకం గడువు పూర్తి కావొస్తున్నందున, ఉక్కు సంస్థలు ధరలపై ఆందోళన చెందుతున్నాయి. రాగిపై ఆగస్టు 1 నుంచి అమల్లోకి వచ్చే 50% సుంకం అంశాన్ని పరిశీలించాలి.

● పట్టణ మార్కెట్లో స్తబ్దత, వర్షాల వల్ల కొనుగోళ్లు ఆలస్యమవుతున్నందున **వాహన** షేర్లు పెద్దగా లాభాలు అందుకోకపోవచ్చు. 30న హ్యుందాయ్ మోటార్స్, 31న ఐషర్ మోటార్స్, టీవీఎస్ మోటార్, మారుతీ సుజుకీ ఇండియా, మహీంద్రా ఫలితాలున్నాయి.

● ఎంపిక చేసిన **యంత్రపరికరాల** షేర్లలో కదలికలు ఉండొచ్చు. ఫలితాల నేపథ్యంలో ఎల్ అండ్ టీ (మంగళ), భారత్ ఎలక్ట్రానిక్స్ (సోమ) వెలుగులోకి రావొచ్చు. సీజీ పవర్‌ను రూ.765 లక్ష్యిత ధరతో కొనుగోలు చేయొచ్చని ఓ బ్రోకరేజీ చెబుతోంది.

● **ఔషధ** కంపెనీల షేర్లు సానుకూల ధోరణిని కనబరచవచ్చు. భారత్-బ్రిటన్ స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందంతో మదుపర్ల నుంచి ఆసక్తి కనిపిస్తోంది. నిఫ్టీ ఫార్మా బలంగా ఉండనుంది. అయితే ఆగస్టు 1న అమెరికా టారిఫ్ అమల్లోకి వస్తే, తాత్కాలిక బలహీనతలు కనిపించొచ్చు.

● జూన్ త్రైమాసికంలో కొన్ని ప్రధాన కంపెనీల నిర్వహణ బలహీనంగా ఉండడంతో **సిమెంటు** కంపెనీల షేర్లు సమీప కాలంలో నష్టపోవచ్చు. దీర్ఘకాలానికి మాత్రం ఈ రంగం బులిష్‌గానే కనిపిస్తోంది.

● **చమురు-గ్యాస్** షేర్లు నష్టపోవచ్చు. మార్కెట్లో బలహీనతలు ఇందుకు నేపథ్యం. రెండు వారాల పాటు ఎంపిక చేసిన స్క్రిప్‌లలో కదలికలు కనిపించొచ్చు. ఈ వారం గెయిల్(28), అదానీ టోటల్ గ్యాస్(28), ఇంద్రప్రస్థ గ్యాస్ (30న) ఫలితాలున్నాయి.

● **టెలికాం** కంపెనీల షేర్లు స్వల్పకాలంలో స్థిరీకరణకు లోనుకావొచ్చు. కొద్ది కాలంగా ఉన్న బలహీనతలు ఈ షేర్లపైనా కనిపించొచ్చు. భారతీ ఎయిర్‌టెల్ రూ.1900-1950 మధ్య, వొడాఫోన్ ఐడియా రూ.7-8 మధ్య కదలాడొచ్చు.

● **ఎఫ్ఎంసీజీ** కంపెనీల షేర్లు ఫలితాలను బట్టి కదలాడొచ్చు. 29న వరుణ్ బేవరేజెస్, 31న డాబర్ ఇండియా, ఇమామీ, రాడికో ఖైతాన్, హిందుస్థాన్ యునిలీవర్, ఆగస్టు 1న ఐటీసీ ఫలితాలు ఉన్నాయి. వినియోగ గిరాకీ మెరుగవుతుందన్న అంచనాల మధ్య విశ్లేషకులు ఈ రంగంపై స్వల్పకాలానికి సానుకూలంగా ఉన్నారు.

వాహన	ప్రస్తుత ధర	నిరోధం	మద్దతు
అశోక్ లేలాండ్	121.95	126.50	119.40
బజాజ్ ఆటో	8075.50	8368.80	7897.80
ఐషర్ మోటార్స్	5433.00	5536.00	5321.00
హీరో మోటోకార్ప్	4230.70	4334.60	4143.00
ఎం అండ్ ఎం	3246.40	3284.80	3194.80
మారుతీ	12404.00	12639.30	12239.30
టాటా మోటార్స్	687.40	709.30	673.80
టీవీఎస్ మోటార్	2774.40	2838.90	2696.50

ఎఫ్ఎంసీజీ	ప్రస్తుత ధర	నిరోధం	మద్దతు
బ్రిటానియా ఇండస్ట్రీస్	5594.00	5748.70	5492.70
కోల్గేట్ పామోలివ్	2215.90	2279.70	2180.10
డాబర్ ఇండియా	511.35	516.90	505.60
ఇమామీ	575.20	583.80	566.80
హిందుస్థాన్ యునిలీవర్	2415.40	2439.70	2393.30
ఐటీసీ	409.40	411.60	406.60
మారికో	693.95	713.10	682.00

యంత్రపరికరాలు	ప్రస్తుత ధర	నిరోధం	మద్దతు
భెల్	240.15	255.00	232.00
సీజీ పవర్	662.55	704.40	639.10
ఎల్ అండ్ టీ	3,442.90	3,492.00	3,412.80
సీమెన్స్	3,038.20	3,165.90	2,966.30
థెర్మాక్స్	3,739.00	3,899.10	3,640.70

ఔషధ	ప్రస్తుత ధర	నిరోధం	మద్దతు
అరబిందో ఫార్మా	1122.80	1143.90	1096.50
బయోకాన్	394.15	402.90	387.80
సిప్లా	1532.50	1603.10	1433.70
డాక్టర్ రెడ్డీస్	1277.90	1303.20	1248.60
గ్లెన్‌మార్క్ ఫార్మా	2145.30	2181.90	2113.70
లుపిన్	1951.00	1980.40	1910.20

బ్యాంకింగ్	ప్రస్తుత ధర	నిరోధం	మద్దతు
హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్	2004.60	2022.20	1990.20
ఐసీఐసీఐ బ్యాంక్	1477.10	1510.00	1457.20
ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్	70.70	73.30	69.20
ఇండస్ఇండ్ బ్యాంక్	823.70	858.20	804.20
కోటక్‌మహీంద్రా బ్యాంక్	2124.60	2162.50	2099.30
పీఎన్‌బీ	108.41	112.60	106.00
ఎస్‌బీఐ	806.55	824.10	796.70

లోహ	ప్రస్తుత ధర	నిరోధం	మద్దతు
హిందాల్కో	693.45	704.30	682.60
హిందుస్థాన్ జింక్	439.20	449.80	432.10
ఎన్ఎండీసీ	71.65	73.60	70.30
సెయిల్	130.67	138.10	126.40
టాటా స్టీల్	161.43	164.60	159.50
వేదాంతా	443.55	454.00	437.30

చమురు	ప్రస్తుత ధర	నిరోధం	మద్దతు
రిలయన్స్ ఇండస్ట్రీస్	1391.70	1409.20	1375.40
బీపీసీఎల్	332.90	345.50	324.80
హెచ్‌పీసీఎల్	421.80	440.30	410.90
ఐఓసీఎల్	146.96	153.60	143.30
ఓఎన్‌జీసీ	240.29	247.00	235.90
ఆయిల్ ఇండియా	434.75	455.90	422.50

ఐటీ	ప్రస్తుత ధర	నిరోధం	మద్దతు
హెచ్‌సీఎల్ టెక్	1,490.10	1,521.90	1,470.70
ఇన్ఫోసిస్	1,515.70	1,563.70	1,487.30
పర్సిస్టెంట్ సిస్టమ్స్	5,150.50	5,302.50	5,040.50
టీసీఎస్	3,135.80	3,170.70	3,108.10
టెక్ మహీంద్రా	1,461.90	1,518.60	1,427.40
విప్రో	259.20	265.10	253.10

సిమెంటు	ప్రస్తుత ధర	నిరోధం	మద్దతు
ఏసీసీ	1847.70	1925.60	1806.00
అంబుజా సిమెంట్స్	613.10	623.70	603.70
ఇండియా సిమెంట్స్	359.10	368.90	347.80
శ్రీ సిమెంట్	30950.00	32130.00	30180.00
అల్ట్రాటెక్ సిమెంట్	12250.00	12414.70	12110.70

టెలికాం	ప్రస్తుత ధర	నిరోధం	మద్దతు
భారతీ ఎయిర్‌టెల్	1,937.90	1966.20	1910.80
ఎమ్‌టీఎన్ఎల్	47.57	49.90	46.10
టాటా కమ్యూనికేషన్స్	1728.80	1762.50	1685.70
వొడాఫోన్ ఐడియా	7.20	7.50	7.00

స్పెషల్ డీఈడీ పక్కరాష్ట్రంలో చేస్తే?

స్పెషల్ డీఈడీ చేయాలనుంది. నేను తెలంగాణకు చెందినవా డిని. ఆంధ్రప్రదేశ్‌లో ఈ కోర్సు చేస్తే తెలంగాణలో చెల్లుతుందా? దీంతో ఉద్యోగావకాశాలు ఎలా ఉంటాయి? - ఎం.శ్రీకాంత్

■ డిప్లొమా ఇన్ ఎడ్యుకేషన్ (డీఈడీ) రెండు సంవత్సరాల ఉపాధ్యాయ శిక్షణ ప్రోగ్రాం. దీనికి ఎన్‌సీటీఈ గుర్తింపు తప్పనిసరి. ప్రాథమిక పాఠశాలల్లో టీచర్‌గా పనిచేయాలనుకునేవారికి ఈ డిప్లొమా తప్పనిసరి. రెండేళ్ల స్పెషల్ డీఈడీ పూర్తిచేసినవారు దివ్యాంగులకు ప్రాథమిక విద్యను బోధిస్తారు. ఈ డిప్లొమాను అందించే సంస్థకు రిహ్యాబిలిటేషన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (ఆర్‌సీఐ) గుర్తింపు కచ్చితంగా ఉండాలి.

మీరు ఆంధ్రప్రదేశ్‌లో కానీ, మరే రాష్ట్రంలో కానీ ఆర్‌సీఐ గుర్తింపు ఉన్న విద్యా సంస్థ నుంచి డీఈడీ చేస్తేనే తెలంగాణ రాష్ట్రంలో ఉపాధ్యాయ ఉద్యోగాలకు అర్హులవుతారు. డీఈడీ పూర్తిచేసే తేదీ నాటికి ముందు ఏడు సంవత్సరాల్లో ఎక్కువ సంవత్సరాలు ఏ రాష్ట్రంలో చదివారు/ నివసించారు అనే అంశం మీ స్థానికతను నిర్ణయిస్తుంది. ఉదాహరణకు మీరు 2027లో డీఈడీ పూర్తిచేస్తారనుకొంటే 2020- 2027 మధ్య నాలుగు సంవత్సరాలకంటే ఎక్కువ కాలం మీరు తెలంగాణ రాష్ట్రంలో చదివి/ నివసించివుంటే తెలంగాణ రాష్ట్రానికి లోకల్ అవుతారు. డీఈడీ పూర్తిచేసి, టెట్‌లో ఉత్తీర్ణత సాధిస్తే డీఎస్సీకి అర్హత సాధిస్తారు. స్పెషల్ ఎడ్యుకేషన్ డీఈడీ చేసినవారు స్పెషల్ స్కూళ్లతో పాటు సాధారణ స్కూళ్లలోనూ పరిమిత సంఖ్యలో ఉపాధ్యాయులుగా పనిచేసే అవకాశం ఉంది. వీటితో పాటు హోమ్ ట్యూటర్లుగా, స్పీచ్ థెరపిస్టులు, కౌన్సెలర్లు, కంటెంట్ రైటర్లు, ఎడ్యుటెక్ కన్సల్టెంట్లుగా పనిచేయవచ్చు. స్పెషల్ ఎడ్యుకేషన్‌లో శిక్షణ పొందినవారికి పాఠశాలలతో పాటు స్వచ్ఛంద సేవా సంస్థల్లో, కౌన్సెలింగ్ కేంద్రాల్లో, పబ్లిషింగ్ సంస్థల్లో ఉద్యోగావకాశాలు లభిస్తాయి.



– ప్రొ. బెల్లంకొండ రాజశేఖర్, కెరియర్ కౌన్సెలర్

వాయుసేనలో.. వీరులవుతారా!

భారతీయ వాయుసేన 'అగ్నిపథ్' పథకంలో భాగంగా 'అగ్నివీర్ వాయు' పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తోంది. మహిళలూ అర్హులే. ఇంటర్మీడియట్, ఒకేషనల్, డిప్లొమా కోర్సులతో పోటీ పడొచ్చు. పరీక్ష, ఫిజికల్, మెడికల్ టెస్టులతో నియామకాలుంటాయి.



ఎంపికైనవారు నాలుగేళ్లు సేవలందిస్తారు. ఈ వ్యవధికిగానూ వేతనం, ఆర్థిక ప్రోత్సాహకాలు, సర్టిఫికెట్లు అందుకుంటారు. వీరిలో 25 శాతం మందిని శాశ్వత ఉద్యోగానికి అవకాశమిస్తారు. మిగిలినవారు ప్రైవేటు, కార్పొరేట్ సంస్థల్లో ఉద్యోగాలు పొందడం కష్టమేమీ కాదు.

వాయుసేనలో ప్రాథమిక స్థాయి ఉద్యోగాల కోసం అగ్నివీర్ వాయు దారిచూపుతుంది. దాదాపు ఏటా రెండు సార్లు ప్రకటన వెలువడుతుంది. ప్రస్తుత నోటిఫికేషన్ 02/2026 ఇన్‌టేక్‌కు చెందింది. ఇందులో సైన్స్, నాన్ సైన్స్ విభాగాల్లో పోస్టులున్నాయి. సైన్స్ విభాగంలో దరఖాస్తు చేసుకున్నవారు నాన్ సైన్స్ ఖాళీలకూ పోటీ పడొచ్చు. ఇందుకు ప్రత్యేక పరీక్ష నిర్వహిస్తారు. మూడు దశల్లో నిర్వహించే వివిధ పరీక్షలతో నియామకాలుంటాయి.

ఫేజ్-1

ఆన్‌లైన్‌లో పరీక్ష నిర్వహిస్తారు. ఆబ్జెక్టివ్ ప్రశ్నలు ఇంగ్లిష్, హిందీ మాధ్యమాల్లో అడుగుతారు. సైన్స్ సబ్జెక్టులకు పరీక్ష వ్యవధి ఒక గంట. ఇంగ్లిష్, మ్యాథ్స్, ఫిజిక్స్‌ల నుంచి ప్రశ్నలు వస్తాయి. నాన్ సైన్స్ పరీక్ష వ్యవధి 45 నిమిషాలు. ఇంగ్లిష్, రీజనింగ్ అండ్ జనరల్ అవేర్‌నెస్ అంశాల్లో ప్రశ్నలుంటాయి. సైన్స్, నాన్ సైన్స్ రెండిటికీ దరఖాస్తు చేసుకున్నవారికి పరీక్ష 85 నిమిషాలు. ఇంగ్లిష్, మ్యాథ్స్, ఫిజిక్స్, రీజనింగ్, జనరల్ అవేర్‌నెస్ నుంచి ప్రశ్నలు వస్తాయి. అన్ని పరీక్షల్లోనూ ప్రతి ప్రశ్నకు ఒక మార్కు. తప్పు సమాధానానికి పావు మార్కు తగ్గిస్తారు. అన్ని ప్రశ్నపత్రాల్లోనూ ఇంగ్లిష్, మ్యాథ్స్, ఫిజిక్స్ ప్రశ్నలు సీబీఎస్ఈ 10+2 సిలబస్ నుంచే వస్తాయి. ఎంచుకున్న పరీక్ష ప్రకారం ఇంగ్లిష్ 20, ఫిజిక్స్ 25, మ్యాథ్స్ 25, రీజనింగ్ అండ్ జనరల్ అవేర్‌నెస్ 30 ప్రశ్నలు ఉంటాయి.

విజయానికి..

▼ అగ్నివీర్‌వాయు వెబ్‌సైట్‌లో సబ్జెక్టుల వారీ సిలబస్ వివరాలు శ్రద్ధగా గమనించాలి. అందులోనే మాదిరి ప్రశ్నలూ, మాక్ టెస్టూ అందుబాటులో ఉంచారు. వీటన్నిటినీ సమగ్రంగా పరిశీలిస్తే.. పరీక్ష స్వరూపం, ప్రశ్నల తీరు, చదవాల్సిన అంశాలు, వాటి స్థాయి తెలుస్తుంది.

▼ ఇంగ్లిష్, ఫిజిక్స్, మ్యాథ్స్‌ల్లో ప్రశ్నలు ఇంటర్మీడియట్ స్థాయిలోనే ఉంటాయి. అందువల్ల ఈ సబ్జెక్టుల పాఠ్య పుస్తకాలు బాగా చదువుకోవాలి.

▼ రీజనింగ్ ప్రశ్నలకు హైస్కూల్ మాథ్స్ పుస్తకాల్లోని జనరల్ అంశాలు బాగా చదివితే సరిపోతుంది.

▼ జనరల్ అవేర్‌నెస్ కోసం హైస్కూల్ సైన్స్, సోషల్ పుస్తకాల్లోని ముఖ్యాంశాలతోపాటు వర్తమాన సంఘటనలను అనుసరించాలి. ఇటీవలి కాలంలో రక్షణ విభాగంలో చోటుచేసుకున్న కీలక పరిణామాలకు ప్రాధాన్యమివ్వాలి. క్రీడలు, అవార్డులు, విజేతలు, పుస్తకాలు, రచయితలు, నియామకాలు, ఎన్నికలు... తాజా వార్తలపై దృష్టి సారిస్తే సరైన జవాబులు గుర్తించవచ్చు.

▼ పాఠ్యపుస్తకాలు బాగా చదివి, వీలైనన్ని మాదిరి ప్రశ్నలు సాధన చేసినవారు పరీక్షను సులువుగా ఎదుర్కోగలరు.

ఫేజ్-2

ఫేజ్-1 ప్రతిభావంతులకే ఫేజ్-2లో అవకాశం ఉంటుంది. ఎంపికైనవారు నిర్దేశిత సెలక్షన్ కేంద్రాలకు ప్రవేశపత్రాలతోపాటు అవసరమైన సర్టిఫికెట్లు, వాటి నకళ్లు, ఫొటోలు, సామగ్రిని తీసుకెళ్లాలి. ఫిజికల్ ఫిట్‌నెస్ పరీక్షల్లో భాగంగా 1.6 కి.మీ. దూరాన్ని పురుషులు 7, మహిళలు 8 నిమిషాల్లో చేరుకోవాలి. అలాగే పురుషులు ఒక్కోటీ నిమిషం వ్యవధిలో.. 10 పుష్‌అప్స్, 10 సిట్‌అప్స్, 20 స్క్వాట్స్ పూర్తిచేయాలి. మహిళలు 90 సెకన్లలో 10 సిట్‌అప్స్, నిమిషంలో 15 స్క్వాట్స్ చేయగలగాలి. వీటన్నింటిలోనూ అర్హత సాధించినవారికి అడాప్టబిలిటీ టెస్టు 1, 2 నిర్వహిస్తారు. వీటిద్వారా అభ్యర్థి వాయుసేన ఉద్యోగం, వాతావరణానికి అలవాటు పడగలడా లేదా పరిశీలిస్తారు. ఇందులో అర్హులకు ఫేజ్-3కి పంపుతారు.

ఫేజ్-3

వైద్య పరీక్షలు నిర్వహించి, ఏ సమస్యలూ లేనివారికి శిక్షణకు ఎంపిక చేస్తారు. అనంతరం ఉద్యోగంలోకి తీసుకుంటారు.

ప్రోత్సాహకాలు

అగ్నివీర్ వాయులో అవకాశం వచ్చినవారికి తొలి ఏడాది ప్రతి నెలా రూ. 30,000 చెల్లిస్తారు. రెండో సంవత్సరం నెలకు రూ. 33,000 వేతనం ఉంటుంది. మూడో ఏడాది రూ.36,500 అందుతుంది. నాలుగో సంవత్సరం రూ.40,000 ప్రతి నెలా పొందుతారు. ప్రతి నెలా అందుకునే మొత్తంలో 30 శాతం కార్పస్ ఫండ్‌కి జమ చేస్తారు. నాలుగేళ్ల వ్యవధికి సేవానిధిలో రూ.5.02 లక్షలు అగ్నివీరుని నుంచి జమవుతుంది. అంతే మొత్తాన్ని ప్రభుత్వమూ జత చేస్తుంది. రెండూ కలిపి రూ.10.04 లక్షలవుతాయి. దీనికి వడ్డీని కలిపి, అగ్నివీర్‌వాయుకి అందిస్తారు. నాలుగేళ్ల సేవలకుగానూ పనిచేసిన విభాగాన్ని అనుసరించి అగ్నివీర్‌వాయు స్కిల్ సర్టిఫికెట్ ఇస్తారు.

శాశ్వత ఉద్యోగంలోకి...

నాలుగేళ్ల వ్యవధి పూర్తిచేసుకున్న అగ్నివీర్‌వాయు ఒక్కో బ్యాచ్ నుంచి గరిష్ఠంగా 25 శాతం మందిని ఎయిర్‌ఫోర్స్‌లో శాశ్వత ఉద్యోగానికి ఎంపికచేస్తారు. ఇందుకోసం నాలుగేళ్ల వ్యవధిలో చూపిన ప్రతిభ, సంస్థ అవసరాలు ప్రామాణికంగా తీసుకుంటారు. నాలుగేళ్ల విధులు అనంతరం శాశ్వత ఉద్యోగంలో అవకాశం రానివారికి సెల్ఫ్ ఎంప్లాయిమెంట్/ ఆంత్రప్రెన్యూర్‌షిప్ నిమిత్తం బ్యాంకుల నుంచి రుణాలు మంజూరయ్యేలా ఏర్పాట్లు చేస్తారు. పలు సంస్థలు నియామకాల్లో వీరికి ప్రాధాన్యమిస్తామని ఇప్పటికే ప్రకటించాయి.

అర్హతలు, గడువు

సైన్స్ విభాగానికి: మ్యాథ్స్, ఫిజిక్స్, ఇంగ్లిష్ సబ్జెక్టులతో ఇంటర్‌లో 50 శాతం మార్కులు సాధించాలి. లేదా నిర్దేశిత బ్రాంచీల్లో మూడేళ్ల డిప్లొమా కోర్సు 50 శాతం మార్కులతో పూర్తిచేయాలి. లేదా ఫిజిక్స్, మ్యాథ్స్ సబ్జెక్టులతో రెండేళ్ల వొకేషనల్ కోర్సులో 50 శాతం మార్కులు పొందాలి.

నాన్ సైన్స్ పోస్టులకు: ఏదైనా గ్రూపుతో ఇంటర్‌లో 50 శాతం మార్కులు పొందాలి. లేదా 50 శాతం మార్కులతో రెండేళ్ల ఒకేషనల్ కోర్సు.

సైన్స్, నాన్ సైన్స్ రెండు రకాల పోస్టులకూ.. పది/ ఇంటర్/ఒకేషనల్/ డిప్లొమా ఇంగ్లిష్‌లో 50 శాతం మార్కులు తప్పనిసరి.

ఎత్తు: 152 సెం.మీ. ఉండాలి. ఎత్తుకు తగ్గ బరువు అవసరం. ఊపిరి పీల్చినప్పుడు, వదిలినప్పుడు 5 సెం.మీ. వ్యత్యాసం తప్పనిసరి. **వయసు:** 02.07.2005 - 02.01.2009 మధ్య జన్మించాలి.
ఆన్‌లైన్ దరఖాస్తు గడువు: 31.07.2025
పరీక్ష ఫీజు: రూ.550+ జీఎస్‌టీ **ఆన్‌లైన్ పరీక్షలు:** 25.09.2025 నుంచి **వెబ్‌సైట్:** *https://agnipathvayu.cdac.in/AV/*

పాఠ్యాంశాలు గుర్తుంచుకునేదెలా?



పాఠ్యాంశాలను బాగా చదివినప్పటికీ పరీక్షల సమయంలో ఒక్కోసారి సరిగా గుర్తుకు రావు. ఈ సమస్య విద్యార్థులకు సాధారణం. ఇలా జరగకూడదంటే.. ఐదు అంచెల పరిష్కారం ఉంది.

1 పాఠ్యాంశాన్ని చురుగ్గా చదవాలి.

2 చదివేటప్పుడే ముఖ్యమైన పాయింట్లతో నోట్స్ రాసుకోవాలి.

3 తర్వాత ఆ చాప్టర్ సారాంశాన్ని సొంత మాటల్లో చెప్పాలి.

4 ఆ విషయాన్ని ఎలా అన్వయించాలో (అప్లికేషన్) గ్రహించాలి.

5 వదిలేయకుండా క్రమం తప్పకుండా పునశ్చరణ (రివిజన్) చేయాలి.

ఇంటర్న్‌షిప్స్

వర్క్ ఫ్రమ్ హోమ్

మెషిన్ లెర్నింగ్

సంస్థ: దేశ్ ఏఐ ల్యాబ్స్
నైపుణ్యాలు: డేటా స్ట్రక్చర్స్, లినక్స్, ఎన్ఎల్‌పీ, పైతాన్ స్టైపెండ్: రూ.5,000
☛ *https://shorturl.at/PSe4w*

బిజినెస్ ప్లానర్

సంస్థ: మెటిక్యులస్ బిజినెస్ సొల్యూషన్స్ ప్రై.లి. నైపుణ్యాలు: ఎంఎస్ ఆఫీస్, పవర్ పాయింట్, వర్డ్, రిపోర్ట్ రైటింగ్, రిసెర్చ్ అండ్ అనలిటిక్స్ స్టైపెండ్: రూ.2,000- 2,500
☛ *https://shorturl.at/3AGBn*

ఆపరేషన్స్

సంస్థ: క్రియేటివ్ బన్‌యాన్
నైపుణ్యాలు: ఇంగ్లిష్, గూగుల్ డాక్స్, షీట్స్, స్లైడ్స్, మేనేజ్‌మెంట్, మల్టీ టాస్కింగ్
స్టైపెండ్: రూ.5,000- 8,000
☛ *https://shorturl.at/VyoM7*

కంటెంట్ అండ్ సోషల్‌మీడియా మార్కెటింగ్

సంస్థ: వెరిఫైడ్ రియల్‌ఎస్టేట్
నైపుణ్యాలు: ఇంగ్లిష్, సోషల్‌మీడియా మార్కెటింగ్ స్టైపెండ్: రూ.7,500- 10,000
☛ *https://shorturl.at/MYta2*

సోషల్‌మీడియా మార్కెటింగ్

సంస్థ: సెట్‌గో కిచెన్స్ అండ్ కన్సల్టింగ్ ప్రై.లి.
నైపుణ్యాలు: డిజిటల్, ఇన్‌స్టాగ్రామ్, సోషల్‌మీడియా మార్కెటింగ్
స్టైపెండ్: రూ.1,000- 1,200
☛ *https://shorturl.at/9VVHO*

హెచ్‌ఆర్ జనరలిస్ట్

సంస్థ: నెక్స్ట్ జాబ్ నైపుణ్యాలు: ఎఫెక్టివ్ కమ్యూనికేషన్, ఇంగ్లిష్, లింక్‌డిన్ మార్కెటింగ్, టైమ్ మేనేజ్‌మెంట్ స్టైపెండ్: రూ.2,000
☛ *https://shorturl.at/1ffIW*

అడ్మిన్– జనరల్ మేనేజ్‌మెంట్

సంస్థ: హౌస్ ఆఫ్ కోటన్ ప్రై.లి.
నైపుణ్యాలు: ఇంగ్లిష్ స్టైపెండ్: రూ.2,000
☛ *https://shorturl.at/gL4uz*

క్యాంపెయిన్ అండ్ లీడ్ ఆపరేషన్స్

సంస్థ: శంకర్ గ్రూప్ నైపుణ్యాలు: క్లయింట్ రిలేషన్‌షిప్ మేనేజ్‌మెంట్, డిజిటల్ మార్కెటింగ్, లీడర్‌షిప్, లీడ్ జనరేషన్, మార్కెటింగ్ క్యాంపెయిన్స్, పర్ఫార్మెన్స్ మానిటరింగ్, రిపోర్ట్ జనరేషన్ స్టైపెండ్: రూ.3,000
☛ *https://shorturl.at/XVAxC*

వీటికి దరఖాస్తు గడువు: ఆగస్టు 22

ఐటీ హెచ్‌ఆర్, అడ్మిన్ అండ్ కోఆర్డినేటర్

సంస్థ: టెల్లిస్ టెక్నాలజీస్ ప్రై.లి.
నైపుణ్యాలు: సీఎస్ఎస్, హెచ్‌టీఎంఎల్, హెచ్‌ఆర్, జావాస్క్రిప్ట్, టైమ్ మేనేజ్‌మెంట్
స్టైపెండ్: రూ.5,000- 8,000
☛ *https://shorturl.at/mxU1d*

మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్

సంస్థ: టీమర్స్ నైపుణ్యాలు: మార్కెటింగ్
స్టైపెండ్: రూ.1,000- 1,500
☛ *https://shorturl.at/G5C2k*

కస్టమర్ సర్వీస్/సపోర్ట్

సంస్థ: కార్ట్అండ్‌బై డాట్ ఇన్
నైపుణ్యాలు: ఇంగ్లిష్, హిందీ, ఎంఎస్ ఎక్సెల్, ఎంఎస్ ఆఫీస్ స్టైపెండ్: రూ.5,000- 6,000
☛ *https://shorturl.at/GimPu*


గేమ్ డెవలప్‌మెంట్

సంస్థ: ఫెర్మి ఇంటరాక్టివ్ ఎల్ఎల్‌పీ
నైపుణ్యాలు: బ్లెండర్ త్రీడీ, యూనిటీ ఇంజిన్
స్టైపెండ్: రూ.5,000
☛ *https://shorturl.at/1ohp0*

వీటికి దరఖాస్తు గడువు: ఆగస్టు 15

తిరుపతి ఐఐటీలో కొత్త కోర్సు

అడ్వాన్స్‌డ్ ఎనర్జీ స్టోరేజ్ టెక్నాలజీకి ప్రపంచవ్యాప్తంగా అత్యధిక డిమాండ్ ఉంది. దీనిపై ఎంటెక్ కోర్సును తిరుపతి ఐఐటీ కొత్తగా ప్రవేశపెట్టింది.



శిలాజ ఇంధనాలపై ఆధారపడటం తగ్గించుకోవడానికి భారత్ నెట్ జీరో-2070పై దృష్టి సారించింది. ఈ నేపథ్యంలో స్థిరమైన పరిష్కారం కోసం చర్యలు చేపట్టింది. ఎలక్ట్రో కెమిస్ట్రీ, పవర్ సిస్టమ్స్, ఎనర్జీ ఎకనామిక్స్‌లో వివిధ నైపుణ్యాల కలిగిన నిపుణులతోనే ఇది సాధ్యమవుతుంది. దీన్ని దృష్టిలో ఉంచుకుని ఐఐటీ ఈ కోర్సును అందుబాటులోకి తీసుకొచ్చింది. సాయంత్రం, వారాంతపు తరగతులుంటాయి.

బ్యాటరీ వ్యవస్థలు, ఎలక్ట్రికల్ వాహనాలు, విద్యుత్తు సంస్థలు, స్మార్ట్‌గ్రిడ్‌లు, థర్మల్ మేనేజ్‌మెంట్, పునరుత్పాదకశక్తి, సౌర, పవన శక్తి నిల్వల నైపుణ్యాలను పెంపొందించేందుకు ఈ కోర్సు ఉపయోగపడుతుందని ఐఐటీ డైరెక్టర్ ప్రొఫెసర్ కె.ఎన్. సత్యనారాయణ తెలిపారు.


ఎవరు అర్హులు: నాలుగేళ్ల ఇంజినీరింగ్, సైన్స్ బ్యాచిలర్స్ డిగ్రీ/మాస్టర్స్ ఇన్ సైన్స్. కనీసం రెండేళ్ల పారిశ్రామిక అనుభవం ఉన్నవారు. ఎనర్జీ పరిశ్రమలు, బ్యాటరీ టెక్నాలజీలు, ఎలక్ట్రిక్ వెహికల్స్ రంగం, పవర్ జనరేషన్, రెన్యూవబుల్ ఎనర్జీ, పవర్ సిస్టమ్స్, మెటీరియల్స్ అండ్ కెమికల్ ప్రాసెసింగ్‌లలో పనిచేసే ప్రొఫెషనల్స్ దరఖాస్తు చేయవచ్చు.

కోర్సు వ్యవధి: రెండేళ్లు
కరిక్యులమ్: 4 కోర్ కోర్సులు, 5 ఎలెక్టివ్స్, 2 ల్యాబ్స్, ప్రాజెక్టు.
దరఖాస్తు గడువు: ఆగస్టు 04
ఆన్‌లైన్ ఇంటర్వ్యూలు: ఆగస్టు 11
ఫలితాల ప్రకటన: ఆగస్టు 14
కోర్సు ప్రారంభం: సెప్టెంబర్ 01
వెబ్‌సైట్: *https://cdo.iittp.ac.in*

– న్యూస్‌టుడే, ఏర్పేడు, తిరుపతి జిల్లా

ప్రోగ్రామింగ్ భాషల తీరు?

రైల్వే, బ్యాంకింగ్, స్టాఫ్ సెలక్షన్ కమిషన్ (ఎస్ఎస్‌సీ), ఇతర పోటీ పరీక్షల్లో 'కంప్యూటర్ ఆప్టిట్యూడ్' ఉంటుంది. ఈ విభాగంలో అధిక మార్కులు సాధించాలంటే ఏ మెలకువలు పాటించాలో చూద్దాం.



కంప్యూటర్ ప్రోగ్రామ్‌లను రూపొందించడానికి ఉపయోగించే సూచనలు, వాక్య నిర్మాణాల సమూహాన్ని ప్రోగ్రామింగ్ భాషలంటారు. ముఖ్యమైన ప్రోగ్రామింగ్ భాషలకు ఉదాహరణలైన సి, పైతాన్, జావా, సి++, జావా స్క్రిప్ట్, రూబీల గురించి గుర్తుంచుకోవాలి. ప్రతి భాషకూ దాని సొంత బలాలూ, బలహీనతలూ ఉంటాయి. ఇవి వివిధ రకాల ప్రాజెక్టులకు అనుకూలంగా ఉంటాయి.

ప్రోగ్రామింగ్ భాషల ముఖ్య లక్షణాలు గ్రహించాలి.

▲ **సింటాక్స్:** ప్రోగ్రామింగ్ భాషలో కోడ్ రాయడానికి ఉపయోగించే నిర్దిష్ట నియమాలు, నిర్మాణం.

▲ **డేటా రకాలు:** ప్రోగ్రామ్‌లో నిల్వ చేయగల విలువల రకం, సంఖ్యలు, స్ట్రింగ్‌లు, బూలియన్‌లు.

▲ **వేరియబుల్స్:** విలువలను నిల్వ చేయగల పేరున్న మెమరీ స్థానాలు.

▲ **ఆపరేటర్లు:** కూడిక, తీసివేత, పోలిక లాంటి విలువలపై ఆపరేషన్లను నిర్వహించడానికి ఉపయోగించే చిహ్నాలు.

మూడు రకాలు

ప్రోగ్రామింగ్ భాషల్లో ముఖ్యమైన మూడు రకాల మెషిన్ లాంగ్వేజ్‌లను వివరంగా తెలుసుకోవాలి.

1. **మెషిన్ లాంగ్వేజ్:** బైనరీ కోడ్స్ అయిన 0, 1లను ఉపయోగించి రాసిన సూచనలు మెషిన్ కోడ్. క్రమపద్ధతిలో ఏర్పాటైన ఈ ఇన్‌స్ట్రక్షన్లను 'మెషిన్ లాంగ్వేజ్'/ 'లో-లెవెల్ లాంగ్వేజ్' అంటారు.

2. **అసెంబ్లీ లాంగ్వేజ్:** కంప్యూటర్లు మెషిన్ లాంగ్వేజ్‌ను మాత్రమే అర్థం చేసుకోగలుగుతాయి. అందుకని అసెంబ్లీ లాంగ్వేజ్ ప్రోగ్రాంను అసెంబ్లర్ అనే ప్రోగ్రాం ద్వారా మెషిన్ లాంగ్వేజ్ ప్రోగ్రాంగా మార్చుకోవాలి.

3. **హైలెవెల్ లాంగ్వేజ్:** ఇవి లో-లెవెల్ లాంగ్వేజీల కంటే మరింత యూజర్ ఫ్రెండ్లీగా, అందరూ సులభంగా అర్థం చేసుకోవడానికి వీలుగా ఉంటాయి. ఈ భాషల ప్రధాన లక్ష్యం ప్రోగ్రామింగ్‌ను సులభతరం చేయడం, తక్కువ దోష రహితంగా చేయడం. ఈ భాషల అభివృద్ధి గురించి అభ్యర్థులు క్రమ పద్ధతిలో గుర్తుంచుకోవాలి.

గత పరీక్షల్లో ఇచ్చిన ఒక ప్రశ్నను చూద్దాం:

జావా, పైతాన్, పీహెచ్‌పీ, సీ ప్లస్ ప్లస్.. వీటికి ఉదాహరణలు:
ఎ) హైలెవెల్ లాంగ్వేజెస్
బి) మీడియం లెవెల్ లాంగ్వేజెస్
సి) గ్రాఫిక్ ఆర్ట్స్ లాంగ్వేజెస్
డి) లో-లెవెల్ లాంగ్వేజెస్
జవాబు: ఎ

ఎంఎస్ ఆఫీస్

అప్లికేషన్ సాఫ్ట్‌వేర్ అయిన మైక్రోసాఫ్ట్ ఆఫీస్ (ఎంఎస్ ఆఫీస్) గురించి చూద్దాం.

వివిధ అప్లికేషన్లతో ఉండే ఎంఎస్ ఆఫీస్ మొదటి సూట్ 1988లో ప్రారంభమయింది. అప్పటి నుంచి వివిధ వెర్షన్లను మైక్రోసాఫ్ట్ విడుదల చేసింది. ఎంఎస్ ఆఫీస్ ప్రారంభించిన అప్లికేషన్లలో ఎంఎస్ వర్డ్, ఎంఎస్ ఎక్సెల్, ఎంఎస్ పవర్ పాయింట్, ఎంఎస్ యాక్సెస్, ఎంఎస్ అవుట్ లుక్, ఎంఎస్ వన్ నోట్, ఎంఎస్ పబ్లిషర్ ముఖ్యమైనవి.

విండోస్ ఓఎస్‌లో మీరు *Delete* కీని ఉపయోగించి ఏదైనా డ్రైవ్ నుంచి ఒక అంశం తొలగించినప్పుడు లేదా కేవలం రైట్–క్లిక్ చేసి *Delete* ఎంపికను ఎంచుకోవడం ద్వారా కూడా, ఆ అంశం ఎక్కడికి తరలిపోతుంది?
ఎ) కంట్రోల్ పానెల్
బి) టాస్క్ బార్
సి) రీసైకిల్ బిన్
డి) స్టార్ట్ మెనూ
జవాబు : సి



డా. చెన్నంశెట్టి రమేష్

నోటీస్ బోర్డు

ప్రవేశాలు

కామన్ అడ్మిషన్ టెస్ట్ 2025

దేశంలోని ప్రతిష్ఠాత్మక ఐఐఎంలూ, ఇతర ప్రముఖ సంస్థల్లోని మేనేజ్‌మెంట్ కోర్సుల్లో ప్రవేశానికి జాతీయస్థాయి ప్రవేశ పరీక్ష క్యాట్ 2025 ప్రకటన వెలువడింది.
◗ పోస్ట్ గ్రాడ్యుయేట్ ప్రోగ్రామ్‌లు (*PG/MBA*)
◗ ఫెలో/డాక్టరేట్ ప్రోగ్రామ్‌లు (*Ph.D*)
◗ ఇతర మేనేజ్‌మెంట్ కోర్సులు
దరఖాస్తు ఫీజు: ఎస్సీ/ఎస్టీ/పీడబ్ల్యూబీడీలకు రూ.1,300; ఇతరులకు రూ.2,600.
ఆన్‌లైన్ దరఖాస్తులు ప్రారంభం: 01.08.2025
రిజిస్ట్రేషన్ ముగింపు తేదీ: 13.09.2025
పరీక్ష తేదీ: 30.11.2025.
ఫలితాలు: 2026 జనవరి మొదటి వారం
వెబ్‌సైట్: *https://iimcat.ac.in*

ఉద్యోగాలు

సిడ్బిలో కన్సల్టెంట్ క్రెడిట్ అనలిస్టులు

స్మాల్ ఇండస్ట్రీస్ డెవలప్‌మెంట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(సిడ్బి) ఒప్పంద ప్రాతిపదికన 41 కన్సల్టెంట్ క్రెడిట్ అనలిస్ట్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
అర్హత: పోస్టులను అనుసరించి సీఏ, డిగ్రీతో పాటు పని అనుభవం.
వయసు: 2025 జూన్ 30వ తేదీ నాటికి 28 ఏళ్లు మించకూడదు. **వేతనం:** సంవత్సరానికి రూ.12,00,000.
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: 05.08.2025
ఎంపిక: ఇంటర్వ్యూతో.
వెబ్‌సైట్: *https://www.sidbi.in/en/*

ఐబీలో సెక్యూరిటీ అసిస్టెంట్/ ఎగ్జిక్యూటివ్‌లు

భారత ప్రభుత్వ హోం మంత్రిత్వశాఖకు చెందిన ఇంటెలిజెన్స్ బ్యూరో (ఐబీ) లో 4,987 సెక్యూరిటీ అసిస్టెంట్/ఎగ్జిక్యూటివ్ పోస్టులకు ఆన్‌లైన్ దరఖాస్తులు ఆహ్వానిస్తోంది. (జనరల్: 2,471; ఈడబ్ల్యూఎస్: 501; ఓబీసీ: 1015; ఎస్సీ: 574; ఎస్టీ: 426)
అర్హత: టెన్త్ లేదా తత్సమానం. దరఖాస్తు చేసిన రాష్ట్రానికి సంబంధించిన డొమిసైల్ (నివాస ధ్రువీకరణ పత్రం) సర్టిఫికెట్ తప్పనిసరి. సంబంధిత రాష్ట్రం/ప్రాంత భాష చదవడం, రాయడం, మాట్లాడడం వచ్చి ఉండాలి. ఇంటెలిజెన్స్ పనిలో ఫీల్డ్ అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యం.
వయసు: 17.08.2025 నాటికి 18 - 27 సంవత్సరాల మధ్య ఉండాలి. ఎస్సీ/ ఎస్టీలకు ఐదేళ్లు; ఓబీసీలకు మూడేళ్ల సడలింపు ఉంటుంది.
వేతన శ్రేణి: రూ.21,700- రూ.69,100 + కేంద్ర ప్రభుత్వ అలవెన్సులు.
ఎంపిక: టైర్-*I*: ఆన్‌లైన్ ఆబ్జెక్టివ్ టెస్ట్, 100 మార్కులకు.
టైర్–II: భాషానువాదం డిస్క్రిప్టివ్ టెస్ట్ (50 మార్కులు, క్వాలిఫైయింగ్), పరీక్ష వ్యవధి గంట.
టైర్–III: ఇంటర్వ్యూ/వ్యక్తిత్వ పరీక్ష (పర్సనాలిటీ టెస్ట్) (50 మార్కులు).
తుది ఎంపిక: టైర్-*I* & టైర్-*III* మార్కులు, డాక్యుమెంట్ వెరిఫికేషన్, మెడికల్, క్యారెక్టర్ వెరిఫికేషన్‌తో.
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: 17.08.2025.
దరఖాస్తు ఫీజు: యూఆర్/ ఓబీసీ/ ఈడబ్ల్యూఎస్ **పురుషులు:** రూ.650 (పరీక్ష ఫీజు రూ100 + ప్రాసెసింగ్ రూ.550);
ఎస్సీ/ఎస్టీ/మహిళలు/మాజీ సైనికులకు రూ.550 (ప్రాసెసింగ్ ఫీజు మాత్రమే).
వెబ్‌సైట్: *https://www.mha.gov.in/en*

ఎస్ఆర్ఎఫ్‌టీఐ-కోల్‌కతాలో..

కోల్‌కతాలోని సత్యజిత్ రే ఫిల్మ్ అండ్ టెలివిజన్ ఇన్‌స్టిట్యూట్ వివిధ విభాగాల్లో 7 పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
◗ ప్రొఫెసర్ (ఎడిటింగ్): 01
◗ అసిస్టెంట్ ప్రొఫెసర్ (సౌండ్ రికార్డింగ్ అండ్ డిజైన్): 01 ◗ యానిమేటర్: 01 ◗ పర్సనల్ అసిస్టెంట్: 01 ◗ కెమెరా అసిస్టెంట్: 01
◗ ప్రొజెక్షన్ అసిస్టెంట్: 01
◗ లైటింగ్ అసిస్టెంట్: 01
అర్హత: పోస్టును అనుసరించి పదో తరగతి, డిగ్రీ, పీజీ డిప్లొమాతో పాటు పని అనుభవం.
వయసు: ప్రొఫెసర్‌కు 52 ఏళ్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్‌కు 37 ఏళ్లు, యానిమేటర్, పర్సనల్ అసిస్టెంట్‌కు 32 ఏళ్లు, కెమెరా అసిస్టెంట్, ప్రాజెక్ట్ అసిస్టెంట్, లైటింగ్ అసిస్టెంట్‌కు 27 ఏళ్లు మించకూడదు.
వేతన శ్రేణి: నెలకు ప్రొఫెసర్‌కు రూ.78,000 - రూ.2,09,200, అసిస్టెంట్ ప్రొఫెసర్‌కు రూ.56,100 - రూ.1,77,500, యానిమేటర్‌కు రూ.44,900 - రూ.1,42,400, పర్సనల్ అసిస్టెంట్‌కు రూ.35,400 - రూ.1,12,400, కెమెరామెన్‌కు రూ.25,500 - రూ.81,100, ప్రొజెక్షన్, లైటింగ్ అసిస్టెంట్‌కు రూ.19,900 - రూ.63,200.
దరఖాస్తు ఫీజు: జనరల్, ఓబీసీ, ఈడబ్ల్యూఎస్‌కు రూ.1200, ఎస్సీ, ఎస్టీ, పీడబ్ల్యూబీడీలకు ఫీజు ఉండదు.
ఎంపిక: రాత పరీక్ష, ట్రేడ్ టెస్ట్, ఇంటర్వ్యూలతో
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: 25.08.2025.
వెబ్‌సైట్: *https://srfti.ac.in/vacancy/*

సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో ..

ఉత్తర్‌ప్రదేశ్‌లోని డియోరియా జిల్లా యూనిట్ అయిన సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఒప్పంద ప్రాతిపదికన 6 పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
◗ ఫ్యాకల్టీ: 01 ◗ ఆఫీస్ అసిస్టెంట్: 02 ◗ అటెండర్: 01 ◗ వాచ్‌మెన్/గార్డెనర్: 01
◗ ఎఫ్ఎల్‌సీసీ: 01
అర్హత: పోస్టును అనుసరించి డిగ్రీ, బీఏ, బీకామ్, బీఎస్సీ, బీఎస్‌డబ్ల్యూ, పీజీ, ఎంఏ, ఎంఎస్‌డబ్ల్యూ, టీఎస్, 7వ తరగతితో పాటు పని అనుభవం. **వయసు:** 18 - 65 ఏళ్ల మధ్య. **వేతనం:** నెలకు ఫ్యాకల్టీ పోస్టులకు రూ.20,000, ఆఫీస్ అసిస్టెంట్‌కు రూ.12,000, అటెండర్‌కు రూ.8000, ఎఫ్ఎల్‌సీసీకి రూ.15,000. **చిరునామా:** రీజనల్ హెడ్, సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, రీజినల్ ఆఫీస్, 1వ అంతస్తు, నగర్ పాలికా ఎదురుగా, డియోరియా, ఉత్తర్ ప్రదేశ్-274001.
ఎంపిక: ఇంటర్వ్యూతో.
ఆఫ్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: 05.08.2025.
వెబ్‌సైట్: *https://central-bankofindia.co.in/en/recruitments*


వాక్ఇన్

టీచింగ్ పోస్టులు

హైదరాబాద్‌లోని ఎన్‌జీఆర్ఐ హైస్కూల్ తాత్కాలిక ప్రాతిపదికన టీచర్ పోస్టుల భర్తీకి ఇంటర్వ్యూలు నిర్వహిస్తోంది.
◗ ఇంగ్లిష్ టీచర్: 01 ◗ కంప్యూటర్ టీచర్: 01 ◗ ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్: 01 ◗ ఎంటీఎస్: 01 **అర్హత:** పోస్టును అనుసరించి ఇంటర్మీడియట్, డిగ్రీ, బీఈడీ, బీపీఈడీతో పాటు పని అనుభవం. **వయసు:** 31.07.2025 నాటికి 30 నుంచి 35 ఏళ్లు మించకూడదు. **వేతనం:** నెలకు టీచర్ పోస్టులకు రూ.12,000, ఎంటీఎస్ పోస్టులకు రూ.8,000. **ఎంపిక:** ఇంటర్వ్యూతో. **ఇంటర్వ్యూ తేదీ:** 31.07.2025 **వేదిక:** ఎన్‌జీఆర్ఐ హైస్కూల్, నేషనల్ జియోగ్రాఫికల్ రిసెర్చ్ ఇన్‌స్టిట్యూట్, ఉప్పల్ రోడ్, హైదరాబాద్, తెలంగాణ-500007. **వెబ్‌సైట్:** *https://ngrischool.in/recruitment/*

కరెంట్ అఫైర్స్

◆ ఏ రాష్ట్రంలోని లెపరాడా జిల్లాలో ఇటీవల యుథాలియా మలక్కానా అనే సరికొత్త సీతాకోక చిలుక జాతిని అధికారికంగా గుర్తించారు? **జ:** అరుణాచల్ ప్రదేశ్



◆ 'ఒరిజినల్ సిన్: ప్రెసిడెంట్ బైడెన్స్ డిక్లైన్, ఇట్స్ కవర్–అప్, అండ్ హిజ్ డిజాస్ట్రస్ ఛాయిస్ టు రన్ ఎగైన్' అనే పుస్తకాన్ని ఇటీవల ఎవరు సంయుక్తంగా రచించారు? **జ:** జేక్ ట్యాపర్, అలెక్స్ థాంప్సన్

మాదిరి ప్రశ్నలు

◆ అంతర్జాతీయ జీవ వైవిధ్య దినోత్సవాన్ని ఏటా ఏ రోజున నిర్వహిస్తారు?
జ: మే 22 (ప్రారంభంలో డిసెంబరు 29న ఈ దినోత్సవాన్ని నిర్వహించేవారు. 2000లో ఐక్యరాజ్యసమితి సాధారణ సభ ఈ దినోత్సవాన్ని మే 22కు మార్చింది. 'హార్మనీ విత్ నేచర్ అండ్ సస్టైనబుల్ డెవలప్‌మెంట్' అనే థీమ్‌తో ఈ ఏడాది దినోత్సవాన్ని నిర్వహించారు.)

◆ భారత్‌లో సివిల్ సర్వెంట్స్ కోసం ప్ర ముఖ డిజిటల్ లెర్నింగ్ పోర్టల్ అయిన IGOT కర్మయోగి ప్లాట్‌ఫామ్‌లో నమోదైన సిబ్బంది సంఖ్య ఇటీవల ఎంత మొత్తాన్ని దాటింది? **జ:** ఒక కోటి

మరింత సమాచారం

◆ 'ది డైరీ ఆఫ్ ఎ క్రికెటర్స్ వైఫ్' అనే పుస్తకాన్ని ఇటీవల ఎవరు రచించారు?
జ: పూజా పూజారా (భారత క్రికెటర్ చతేశ్వర్ పూజారా భార్య అయిన ఈమె నమిత కళతో కలిసి ఈ పుస్తకం రచించారు.)

జనరల్ స్టడీస్ – ఆంధ్రప్రదేశ్ ఆర్థికవ్యవస్థ

సేద్యమే సమగ్ర ప్రగతి సాధనం!

ఆంధ్రప్రదేశ్‌లో వ్యవసాయ రంగ ప్రాధాన్యం

దేశంలో వ్యవసాయ ప్రధాన రాష్ట్రాల్లో ఆంధ్రప్రదేశ్ ఒకటి. ఆహార పంటలతో పాటు పశుపోషణ, పౌల్ట్రీ వంటి అనుబంధ రంగాల్లోనూ సత్తా చాటుతోంది. ఇటీవలి కాలంలో ఉద్యాన రంగంలో అగ్రగామిగా అవతరించింది. రాష్ట్ర జనాభాలో అధిక శాతానికి ఉపాధి కల్పిస్తూ ఆర్థిక వ్యవస్థకు ముఖ్య ఆధారంగా ఉన్న వ్యవసాయ రంగం ప్రాధాన్యం, ప్రస్తుత స్థితిగతులపై పోటీ పరీక్షార్థులకు సమగ్ర అవగాహన ఉండాలి. రాష్ట్రంలో వ్యవసాయ రంగ ప్రగతి, పర్యవేక్షణకు ఉన్న సంస్థాగత ఏర్పాట్లు, రైతులు, శ్రామిక వర్గం గణాంకాలతో పాటు సన్‌రైజ్ ఏపీ వంటి బృహత్తర ప్రణాళికలకు అనుగుణంగా రూపొందించిన దీర్ఘకాలిక వ్యూహాలు, ప్రస్తుతం అమలు చేస్తున్న పథకాలు, సాగుకు ఇస్తున్న ప్రోత్సాహకాల గురించి తెలుసుకోవాలి.



ఆంధ్రప్రదేశ్ ఆర్థిక వ్యవస్థకు వ్యవసాయమే జీవనరేఖ. రాష్ట్రం మొత్తం స్థూల రాష్ట్ర ఉత్పత్తిలో వ్యవసాయ రంగం 25 శాతానికి పైగా వాటాను సమకూరుస్తోంది. జనాభాలో 62% మందికి ఉపాధి కల్పిస్తోంది. రాష్ట్రంలో మొత్తం భూ వైశాల్యంలో 45% మేర వ్యవసాయం సాగుతోంది. వ్యవసాయంతో పాటు కోళ్ల పరిశ్రమ, డెయిరీ, మత్స్య పరిశ్రమ వంటి అనుబంధ పరిశ్రమలు అభివృద్ధి చెంది రాష్ట్ర ప్రజలకు ఆదాయాన్ని, ఉపాధిని కల్పిస్తున్నాయి. ఎం.ఎస్.స్వామినాథన్ కమిషన్ ప్రకారం గ్రామీణాభివృద్ధితో పాటుగా పెరుగుతున్న జనాభాకు ఆహారభద్రతను పెంపొందించాలంటే వ్యవసాయ రంగం వార్షిక వృద్ధి 6% పైగా ఉండాలి. రాష్ట్రంలో వ్యవసాయ వృద్ధి రేటు 4% మించితే రాష్ట్ర వృద్ధిరేటు సగటున 8 శాతానికి మించి నమోదవుతోంది. ఎం.ఎస్.స్వామినాథన్ ప్రకారం దేశవ్యాప్తంగా వ్యవసాయంలో 1% వృద్ధి, పరిశ్రమల్లో 0.7% వృద్ధిరేటుకి కారణమవుతోంది. అయితే టెక్నాలజీ పెరగటం, వ్యవసాయేతర సంస్థలు అభివృద్ధి చెందటం, వ్యవసాయ రంగంలో పెట్టుబడి తగ్గటం లాంటి కారణాలతో వ్యవసాయ ఉత్పత్తులు తగ్గుముఖం పట్టాయి. ఈ విధంగా వ్యవసాయ రంగం ఎన్నో ఒడిదొడుకులను ఎదుర్కొంటోంది.

వ్యవసాయ రంగంలో ఆధునిక శిక్షణ ఇవ్వటం కోసం ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ అగ్రికల్చరల్ రిసెర్చ్ ప్రతి జిల్లాలో 'కృషి విజ్ఞాన కేంద్రాలు' ఏర్పాటు చేసింది. రైతులకు తమ గ్రామంలోనే అధునాతన ఉత్పత్తి టెక్నాలజీలు, నాణ్యమైన ఉత్పాదకాలను అందించడానికి ప్రతి గ్రామ సచివాలయంలో ఒకటి చొప్పున 10,778 రైతు సేవా కేంద్రాలను (ఆర్ఎస్‌కే) స్థాపించారు. రాష్ట్ర శ్రామిక శక్తిలో నాలుగింట మూడొంతుల మంది ఇప్పటికీ ప్రత్యక్షంగా వ్యవసాయ రంగంలోనే నిమగ్నమై ఉండటంతో ఆంధ్రప్రదేశ్ ఆర్థిక వ్యవస్థ 'వ్యవసాయ ఆర్థిక వ్యవస్థ'గానే కొనసాగుతోంది. సుస్థిరాభివృద్ధి లక్ష్యాలు (ఎస్‌డీజీ)-2030ను సాధించడంలో భాగంగా ప్రభుత్వం వ్యవసాయ ఉత్పాదకత పెంచే విధంగా స్పష్టమైన ప్రణాళికను రూపొందించింది.

✦ ఆంధ్రప్రదేశ్ 'క్రాప్ కల్టివేటర్స్ రైట్స్ యాక్ట్ - 2019' (సీసీఆర్‌ఏ - 2019) ద్వారా రాష్ట్రంలో కౌలుదారులకు హక్కులు కల్పిస్తున్నారు. రాష్ట్రంలో 5 నుంచి 15% వరకు ఉండే పోస్ట్ హార్వెస్ట్ నష్టాలు తగ్గించడం, స్థానిక పంటల ఫుడ్ ప్రాసెసింగ్ సామర్థ్యాన్ని పెంపొందించే కృషి జరుగుతోంది.

✦ హరిత ఆంధ్రప్రదేశ్ - 2029 నాటికి 50%



పచ్చదనం సాధించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. 'జీరో బడ్జెట్ నేచురల్ ఫార్మింగ్' అనేది ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ సమగ్ర, దీర్ఘకాలిక వ్యవసాయ కార్యక్రమం. "ఏదైనా వేచి ఉండవచ్చు కానీ వ్యవసాయం వేచి ఉండకూడదు" అని దేశ మొదటి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ పేర్కొన్నారు. రైతులకు నాణ్యమైన వ్యవసాయ ఉత్పాదకాలు లభించే విధంగా చేయడానికి విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు తదితర వ్యవసాయ ఉత్పాదకాలను పరీక్షించడానికి టెస్టింగ్ ల్యాబ్‌లను రాష్ట్రంలో ఏర్పాటు చేశారు. ప్రస్తుతం పండ్ల ఉత్పత్తిలో ఆంధ్రప్రదేశ్ 15.6% వాటాతో దేశంలోనే మొదటిస్థానంలో నిలవడంతో పాటు 'ఫ్రూట్ బౌల్ ఆఫ్ సౌత్ ఇండియా'గా అవతరించింది. ఆయిల్‌పామ్, బొప్పాయి, నిమ్మ, కొకోవా, టమాటా, మిర్చి ఉత్పత్తిలో మొదటిస్థానంలో; జీడిపప్పు, మామిడి, పసుపు, బత్తాయి ఉత్పత్తిలో రెండో స్థానంలో ఉంది. పట్టు ఉత్పత్తిలో కర్ణాటక తర్వాతి స్థానంలో నిలిచింది.

✦ 2019 పశుగణన ప్రకారం రాష్ట్ర పశుసంపదలో 46 లక్షల ఆవులు, 62.19 లక్షల గేదెలు, 176.27 లక్షల గొర్రెలు, 52.22 లక్షల మేకలు, 0.92 లక్షల పందులు, 0.07 లక్షల ఇతర పశువులు ఉన్నాయి. మొత్తం పశుసంపద 340.67 లక్షలు. పౌల్ట్రీ సంపదలో 1075.11 లక్షల కోళ్లు ఉన్నాయి. రాష్ట్రానికి డెయిరీ (పాలు) అత్యధిక ఆదాయాన్ని కల్పిస్తోంది. 'సన్‌రైజ్ ఆంధ్రప్రదేశ్ విజన్' ద్వారా 2029 నాటికి ఆంధ్రప్రదేశ్‌ను దేశంలో మొదటి మూడు అగ్రగామి రాష్ట్రాల్లో ఒకటి చేయాలనే లక్ష్యంలో భాగంగా ప్రాథమిక రంగం పరివర్తనకు రాష్ట్రం కట్టుబడి ఉంది.

> "రాష్ట్రంలో వ్యవసాయ వృద్ధి రేటు 4 శాతాన్ని మించితే రాష్ట్ర వృద్ధిరేటు సగటున 8 శాతాన్ని దాటి నమోదవుతోంది."

> "ఎం.ఎస్.స్వామినాథన్ ప్రకారం వ్యవసాయంలో 1% వృద్ధి పరిశ్రమల్లో 0.7% వృద్ధిరేటుకి కారణమవుతోంది."

వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేందుకు వ్యూహాలు



✻ 2025 ఖరీఫ్ సీజన్ నుంచి 'అన్నదాత సుఖీభవ - పీఎం కిసాన్' కింద ఇచ్చే ఆర్థిక సహాయాన్ని రూ.20,000కు పెంచడం (పీఎం కిసాన్ కింద ఇచ్చే రూ.6,000తో కలిపి) ✻ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 10,778 రైతు సేవా కేంద్రాలు, 154 హబ్‌లు, అగ్రి ఇన్‌పుట్ షాపులు, వ్యవసాయ విజ్ఞాన కేంద్రాలను గ్రామ సచివాలయాలతో అనుసంధానించి వ్యవసాయం, అనుబంధ రంగాల కోసం రైతుసేవా కేంద్రాలను బలోపేతం చేయడం. ✻ 'ఈ-క్రాప్' బుకింగ్ ద్వారా రైతుల పంటను నమోదు చేసి దాని ద్వారా నష్టపోయిన రైతులకు పంట బీమా, ఇన్‌పుట్ సబ్సిడీ, సున్నా వడ్డీ పంట రుణాలు లాంటి పథకాలను వర్తింపజేయడం. ✻ వ్యవసాయ కారణాలతో ఆత్మహత్య చేసుకున్న రైతులకు రూ.7 లక్షల ఆర్థిక సహాయం అందించడం. ✻ 100% సబ్సిడీతో వేపపూత పూసిన యూరియాను, నాణ్యమైన విత్తనాలను అందించడం. ✻ కౌలు రైతులకు పంట రుణాలను అందించడానికి 'క్రాప్ కల్టివేటర్ రైట్స్ కార్డ్స్'ను మంజూరు చేయడం. ✻ 'పొలంబడి' ద్వారా రైతులకు సాగు మెలకువలు నేర్పడం, ఆధునాతన పంట పద్ధతులు, శాస్త్రీయ విధానాల ద్వారా పెట్టుబడి తగ్గించుకునే విధంగా చేయడం.

రాష్ట్ర శ్రామిక శక్తి - వృత్తుల వారీ జనాభా (2011 జనాభా లెక్కల ప్రకారం)

మొత్తం జనాభా	495 లక్షలు
మొత్తం శ్రామికులు	230 లక్షలు (100%)
వ్యవసాయదారులు	33.4 లక్షలు (14.47%)
వ్యవసాయ కూలీలు	110.5 లక్షలు (47.8%)
ఇంటి వద్ద ఉపాధి పొందేవారు	6.62 లక్షలు (2.87%)
ఇతర రంగాల్లో ఉపాధి పొందేవారు	80.25 లక్షలు (34.77%)

✦ 2011 సెన్సస్ ప్రకారం రాష్ట్రంలో సుమారు 62% మంది వ్యవసాయ రంగంపై ఆధారపడి ఉపాధి పొందుతున్నారు. (వ్యవసాయ రంగ ఉపాధి = 14.47 + 47.8 = 62.27%)

✦ అత్యధిక శ్రామికుల సంఖ్య ఉన్న జిల్లాలు 1) కర్నూలు 2) ప్రకాశం

రాష్ట్ర వ్యవసాయ రంగంలో ఉపాధులు - జిల్లాల వారీ ర్యాంకులు (2011 జనాభా లెక్కల ప్రకారం)

వర్గం	ఎక్కువ ఉన్న జిల్లా
వ్యవసాయదారులు	అన్నమయ్య
వ్యవసాయ కూలీలు	ప్రకాశం
గృహ శ్రామికులు	సత్యసాయి
ఇతర రంగాలు	విశాఖపట్నం

వృత్తులు - వ్యవసాయ రంగ ఉపాధి (2011 జనాభా లెక్కల ప్రకారం)

మొత్తం జనాభా - 495 లక్షలు (100%)
ప్రధాన శ్రామికులు - 193 లక్షలు (38.96%)
ఉపాంత శ్రామికులు - 37 లక్షలు (7.59%)

✻ ప్రధాన శ్రామికులు అంటే ఒక ఆర్థిక సంవత్సర కాలంలో 183 రోజులకు మించి ఉపాధి పొందేవారు. ఉపాంత శ్రామికులు అంటే ఒక ఆర్థిక సంవత్సర కాలంలో 183 రోజుల కంటే తక్కువ రోజులు ఉపాధి పొందేవారు.

✻ పనిలో పాల్గొనే రేటు = $\frac{\text{ప్రధాన శ్రామికులు + ఉపాంత శ్రామికులు}}{\text{జనాభా}} \times 100$

$= \frac{193 + 37}{495} \times 100 = 46.56\%$

✻ రాష్ట్ర జనాభాలో సుమారు సగటు 1000 మందిలో 465 మంది పనిచేస్తున్నట్లుగా గమనించాలి.

✻ అత్యధిక ప్రధాన శ్రామికులు ఉన్న జిల్లాలు 1) కర్నూలు 2) ప్రకాశం 3) అనంతపురం

✻ అత్యధిక ఉపాంత శ్రామికులు ఉన్న జిల్లాలు 1) కర్నూలు 2) ప్రకాశం 3) పల్నాడు

✻ అత్యధిక పనిలో పాల్గొనే రేటు ఉన్న జిల్లాలు 1) అల్లూరి సీతారామరాజు 2) పల్నాడు 3) మన్యం

మాదిరి ప్రశ్నలు

1. వ్యవసాయ రంగంలోని వారికి శిక్షణ ఇవ్వడానికి 'ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ అగ్రికల్చరల్ రిసెర్చ్' వారు కింది ఏ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు?
   1) రైతు సేవా కేంద్రాలు
   2) కృషి విజ్ఞాన కేంద్రాలు
   3) ఇ - క్రాప్ బుకింగ్ కేంద్రాలు
   4) రైతు భరోసా కేంద్రాలు
2. ఎం.ఎస్.స్వామినాథన్ ప్రకారం వ్యవసాయంలో 1% వృద్ధి, పరిశ్రమల్లో ఎంత శాతం వృద్ధి రేటు నమోదవుతోంది?
   1) 0.5% 2) 0.6% 3) 0.7% 4) 0.8%
3. కౌలుదారులకు పంట రుణాలు ఇవ్వడానికి ఆంధ్రప్రదేశ్ 'క్రాప్ కల్టివేటర్ రైట్స్ యాక్ట్' (సీసీఆర్‌ఏ)ను ఎప్పుడు చేశారు?
   1) 2009 2) 2014 3) 2019 4) 2024

సమాధానాలు 1-2; 2-3; 3-3.



రచయిత
పి.వి.సుబ్బారెడ్డి

సముద్రాలే అతిపెద్ద కార్బన్ శోషకాలు!

జీవ, నిర్జీవ ఘటకాలు పరిసరాలతో సాగించే పరస్పర చర్యల గొలుసే ఆవరణ వ్యవస్థ. అడవులు, గడ్డిభూములు, ఎడారులు, సరస్సులు, నదులు, సముద్రాలు తదితరాలన్నీ వివిధ రకాల ఆవరణ వ్యవస్థలు. ఆహార గొలుసులను సృష్టించి నిరంతర శక్తి ప్రవాహంతో ప్రకృతి సమతౌల్యతను కాపాడే ఈ వ్యవస్థలు, వాటి లక్షణాలు, ముఖ్య భాగాల గురించి పోటీ పరీక్షార్థులు తెలుసుకోవాలి. జీవి, జనాభా, జాతులు, జీవ సముదాయం మొదలైన ప్రాథమిక అంశాల నిర్వచనాలు, జీవుల శక్తి అవసరాలను తీర్చే మూలాలు, పలు మూలకాలు నిక్షిప్తమయ్యే ప్రాంతాలపై స్థూల అవగాహన కలిగి ఉండాలి.




పర్యావరణ అంశాలు

ఆవరణ వ్యవస్థ


1. ఆవరణ వ్యవస్థల క్రమానుగత శ్రేణిలో ఉన్నత స్థితి ఏది?
   1) ఆవరణ వ్యవస్థ 2) బయోస్ఫియర్
   3) బయోమ్స్ 4) లాండ్ స్కేప్
2. ఆవరణ వ్యవస్థలో ఒక జీవి నిర్వర్తించే పాత్రను ఏ విధంగా పిలుస్తారు?
   1) ఆవాసం 2) నిశాచర జీవనం
   3) నిషే 4) అంతఃశ్చర్యలు జరపడం
3. ఎకలాజికల్ పిరమిడ్ అనే భావాన్ని మొదటగా రూపొందించింది?
   1) టాన్స్లే 2) స్మిత్
   3) చార్లెస్ ఎల్టన్ 4) వెబ్‌స్టర్



4. కిందివాటిలో జీవావరణ మనుగడకు కావాల్సిన శక్తి అవసరాలకు మూలం ఏది?
   1) కిరణజన్య సంయోగ క్రియ 2) రసాయనిక శక్తి
   3) ఆకుపచ్చని మొక్కలు 4) సూర్యుడు
5. ఒకదానితో మరొకటి అనుసంధానమై ఉన్న ఒకటి కంటే ఎక్కువ ఆహారపు గొలుసుల సముదాయాన్ని ఏమని పిలుస్తారు?
   1) శక్తి పిరమిడ్‌లు 2) ఆహార శృంఖలం
   3) పోషక వలయం 4) ఆహారపు జాలం
6. జీవావరణంలో నైట్రోజన్ ప్రధానంగా నిల్వ ఉండే ప్రాంతం?
   1) వాతావరణం 2) సముద్రాలు
   3) జీవజాతులు 4) శిలలు
7. జీవావరణంలో సల్ఫర్ ఎక్కువగా నిల్వ ఉండే ప్రాంతం?
   1) వాతావరణం 2) సముద్రాలు
   3) జీవజాతులు 4) శిలలు
8. ఆవరణ వ్యవస్థ అనే పదాన్ని మొదటిసారిగా ఉపయోగించిన శాస్త్రవేత్త?
   1) ఎర్నెస్ట్ హెకెల్ 2) టాన్‌స్లే
   3) ఒడమ్ 4) చార్లెస్ ఎల్టన్



9. కింది ఏ ఆవరణ వ్యవస్థలో అత్యధిక స్థూల ప్రాథమిక ఉత్పాదక రేటు ఉంటుంది?
   1) గడ్డిమైదాన ఆవరణ వ్యవస్థ
   2) మాంగ్రూవ్ ఆవరణ వ్యవస్థ
   3) ఉష్ణమండల వర్షారణ్య ఆవరణ వ్యవస్థ
   4) టండ్రా ఆవరణ వ్యవస్థ
10. ఒకజీవి ఇంకొక జీవిని తినడం ద్వారా, ఆ జీవి మరొక ఆహారంగా వినియోగపడటం వల్ల ఏర్పడే క్రియాశీలక వ్యవస్థ?
    1) ఆహారపు జాలం 2) ఆహారపు వల
    3) ఆహారపు గొలుసు 4) ఎకలాజికల్ పిరమిడ్
11. శాకాహార జీవుల నుంచి ఆహారాన్ని పొందే జీవులను ఏమని పిలుస్తారు?
    1) ప్రాథమిక వినియోగదారులు
    2) ద్వితీయ వినియోగదారులు
    3) తృతీయ వినియోగదారులు
    4) అంతిమ వినియోగదారులు
12. ఆవరణ వ్యవస్థలో జీవులు, పరిసరాలకు మధ్య పోషకాలు చక్రీయంగా బదిలీ అయ్యే విధానాన్ని ఏమని పిలుస్తారు?
    1) భూ-విజ్ఞాన వలయం
    2) భూ-రసాయన వలయం
    3) భూ-జీవ వలయం
    4) జీవ-భూ రసాయన వలయం
13. కిందివాటిలో కార్బన్ చక్రంలో బ్యాక్టీరియా పాత్ర ఏది?
    1) కిరణజన్య సంయోగక్రియ రేటును పెంచడం.
    2) కీమోసింథసిస్ రేటును పెంచడం.
    3) నత్రజని సంబంధిత పదార్థాలను విలీనం చేయడం.
    4) సంక్లిష్ట కర్బన పదార్థాలను విచ్ఛిన్నం చెందించడం.
14. ఏ ఆహారపు గొలుసులోనైనా అత్యధిక సంఖ్యలో ఏ జనాభా ఉంటుంది?
    1) ప్రాథమిక వినియోగదారులు
    2) తృతీయ వినియోగదారులు
    3) ఉత్పత్తిదారులు 4) విచ్ఛిన్నకారులు
15. కిందివాటిలో అతిపెద్ద కార్బన్ శోషకంగా పనిచేసేది?
    1) పంట మొక్కలు 2) సముద్రాలు
    3) ఉష్ణమండల వర్షారణ్యాలు
    4) సమశీతోష్ణ అడవులు
16. ఏ ఆవరణ వ్యవస్థలోనైనా ఆకుపచ్చని మొక్కలు కింద తెలిపిన ఏ విధిపూర్వక స్థాయిని కలిగి ఉంటాయి?
    1) విచ్ఛిన్నకారులు 2) ఉత్పత్తిదారులు
    3) వినియోగదారులు 4) రూపాంతరీకరణులు
17. గడ్డిమైదాన ఆహారపు గొలుసులో నిజమైన క్రమానుగత శ్రేణిని గుర్తించండి.
    1) గడ్డి - కీటకాలు - పక్షులు - పాములు
    2) గడ్డి - పాములు - కీటకాలు - జింకలు
    3) గడ్డి - నక్కలు - జింకలు - ఎద్దులు
    4) బ్యాక్టీరియాలు - గడ్డి - ఎలుకలు - నక్కలు
18. ఒక ఆహారపు గొలుసులోని మొత్తం జీవ ద్రవ్యరాశి రేఖీయంగా చూపించడాన్ని ఏమని పిలుస్తారు?
    1) శక్తి పిరమిడ్‌లు
    2) జీవద్రవ్యరాశి పిరమిడ్‌లు
    3) సంఖ్యా పిరమిడ్‌లు 4) ఏదీకాదు
19. కొలను ఆవరణ వ్యవస్థ శక్తి పిరమిడ్‌లు ఏ ఆకారాల్లో ఉంటాయి?



    1) నిట్టనిలువు పిరమిడ్ 2) తలకిందుల పిరమిడ్
    3) ఏటవాలు పిరమిడ్ ఆకృతి 4) ఏదీకాదు
20. కింది ప్రవచనాలను పరిశీలించి, నిజమైన వాటిని గుర్తించండి.
    ఎ) శక్తి పిరమిడ్‌లన్నీ నిట్టనిలువుగా ఉంటాయి.
    బి) జీవరాశి పిరమిడ్‌లు కొన్ని నిట్టనిలువుగా, కొన్ని తలకిందులుగా ఉంటాయి.
    సి) జీవ ద్రవ్యరాశి పిరమిడ్‌లు కొన్ని నిట్టనిలువుగా, కొన్ని తలకిందులుగా ఉంటాయి.
    డి) శక్తి పిరమిడ్‌లు కొన్ని నిట్టనిలువుగా, కొన్ని తలకిందులుగా ఉంటాయి.
    1) ఎ, బి, సి 2) ఎ, సి, డి
    3) బి, సి, డి 4) ఎ, బి, సి, డి
21. కింది అంశాల్లో సరైనవి ఏవి?
    ఎ) ఆవాసాల అధ్యయన శాస్త్రాన్ని 'ఇకాలజీ' అంటారు.
    బి) జీవులకు, పర్యావరణానికి; పర్యావరణానికి, జీవులకు మధ్య పరస్పర సంబంధ బాంధవ్యాలను అధ్యయనం చేయడమే ఇకాలజీ.
    సి) ఇకాలజీ అనే ఆంగ్ల పదాన్ని మొదటిసారిగా రియిటర్, ఆ తర్వాత ఎర్నెస్ట్ హెకెల్ ఉపయోగించారు.
    1) సి 2) ఎ 3) ఎ, బి, సి 4) ఎ, బి
22. కింది అంశాల్లో సరైనవి ఏవి?
    ఎ) స్వయం జీవావరణ శాస్త్రం: జీవావరణ సమాజాల నిర్మాణం, అభివృద్ధి, విస్తరణను అధ్యయనం చేసే శాస్త్రం.
    బి) సంయుక్త జీవావరణ శాస్త్రం: ఒకే జాతికి చెందిన జీవులకు, వాటి పరిసరాలకు మధ్య ఉన్న సంబంధాన్ని తెలియజేస్తుంది.
    1) ఎ, బి 2) ఎ 3) బి 4) ఏదీకాదు
23. కింది అంశాల్లో సరైనవి ఏవి?
    ఎ) వర్గీకరణ జీవావరణ శాస్త్రం జంతువులను జీవశాస్త్రపరంగా వర్గీకరించి, వాటి ప్రాముఖ్యాన్ని తెలుపుతుంది.
    బి) సిస్టమ్ ఇకాలజీ జీవావరణ వ్యవస్థ నిర్మాణాన్ని, విధులను గణితం, సంఖ్యాశాస్త్రం, దత్తాంశాలతో లేదా కంప్యూటర్ల సహాయంతో అధ్యయనం చేస్తుంది.
    సి) ఉత్పత్తి జీవావరణ శాస్త్రం వివిధ జీవావరణ వ్యవస్థల నుంచి లభ్యమయ్యే ఫలసాయం గురించి తెలియజేస్తుంది.
    డి) అంతరిక్ష జీవావరణ శాస్త్రం.. భూపరిధిని దాటి అంతరిక్షంలో జీవం ఉనికికి అనుకూలంగా ఉండటానికి, మానవుడు దీర్ఘకాలిక అంతరిక్ష గమనం సాగించడానికి తగిన పరిస్థితులను తెలియజేస్తుంది.
    1) సి, డి 2) ఎ 3) ఎ, బి, సి, డి 4) బి, సి
24. జీవావరణంలోని స్థాయులను చిన్నవాటి నుంచి అంత్యదశ వరకు వివరిస్తే వచ్చే క్రమం ఏది?
    1) జీవి - జనాభా - జీవసముదాయం - జీవావరణ వ్యవస్థ - బయోమ్ - జీవావరణం
    2) జీవి - జనాభా - జీవావరణ వ్యవస్థ - బయోమ్ - జీవావరణం - జీవసముదాయం
    3) జీవి - జీవావరణ వ్యవస్థ - జనాభా - జీవసముదాయం - బయోమ్ - జీవావరణం
    4) జీవి - జీవావరణ వ్యవస్థ - జనాభా - బయోమ్ - జీవావరణం - జీవసముదాయం
25. కింది అంశాల్లో సరికానివి ఏవి?
    ఎ) ఒకే జాతికి చెందిన జన్యుపరమైన విషయాలను వినిమయం జరుపుతూ సాధారణంగా ఒకే ప్రాంతానికి పరిమితమై, ఒకే విధమైన జీవన విధానం కలిగి ఉండే జీవుల సమూహాన్ని 'జీవ సముదాయం' అంటారు.
    బి) వేర్వేరు జాతులకు చెందిన వృక్ష, జంతు సమూహాలు ఒక నిర్దిష్ట, సహజ ప్రదేశంలో కలిసిమెలిసి జీవిస్తాయి. ఇలా ఉండే సమూహాలను 'జనాభా' అని చెప్పొచ్చు.
    సి) ఒకే రకమైన పరిస్థితుల్లో, ఒక ప్రాంతంలో నివసించే అనేక జీవసముదాయాలు కలిసి ఏర్పడే సంక్లిష్ట సముదాయం బయోమ్.
    1) ఎ, సి 2) ఎ 3) ఎ, బి, సి 4) ఎ, బి
26. కింది అంశాల్లో సరైనవి ఏవి?
    ఎ) ఏ జాతి పైన ప్రజల దృష్టి కేంద్రీకృతమవుతుందో, ఆ జాతి సంరక్షణకు విరాళాలు ఇచ్చి మద్దతు తెలుపుతారో ఆ జాతినే 'పతాక స్థాయి జాతి' అంటారు.
    బి) ఏ జాతి అయితే ఒక నిర్దిష్ట ఆవరణ వ్యవస్థపై తన సంఖ్యతో సంబంధం లేకుండా అత్యధిక ప్రభావం చూపుతుందో, దాని ఆవాసం మిగతా జీవజాతుల ఆవాసంతో ముడిపడుతుందో దాన్నే 'కీస్టోన్ జాతి' అంటారు.
    సి) ఏ జీవజాతి అయితే ఒక నిర్దిష్ట భౌగోళిక ప్రాంతానికి మాత్రమే పరిమితం అవుతుందో దాన్ని ప్రాధాన్యం ఉన్న జాతి అంటారు.
    1) ఎ, సి 2) బి, సి 3) ఎ, బి, సి 4) ఎ, బి
27. కిందివాటిని జతపరచండి.

స్థానిక జాతులు	ప్రాంతాలు
1) ఆసియా సింహం	ఎ) దచిగం నేషనల్ పార్కు
2) కశ్మీర్ స్టాగ్	బి) గిర్ ఫారెస్ట్ నేషనల్ పార్కు
3) సింహం తోక మకాక్	సి) పశ్చిమ కనుమలు
4) సంగై జింక	డి) కైబుల్ లామ్‌జావో నేషనల్ పార్కు

    1) 1-ఎ, 2-డి, 3-సి, 4-బి 2) 1-ఎ, 2-సి, 3-బి, 4-డి
    3) 1-డి, 2-బి, 3-సి, 4-ఎ 4) 1-బి, 2-ఎ, 3-సి, 4-డి
28. కింది అంశాల్లో సరైనవి ఏవి?
    ఎ) ఒక జాతికి సంబంధించి ప్రత్యేక సంరక్షణ చర్యలను చేపట్టడం ద్వారా దాని ఆవాసాలను పంచుకునే ఇతర జాతులకు కూడా రక్షణ అందుతుంది. వీటినే 'గొడుగు జాతులు' అంటారు.
    బి) వీటికి సంరక్షణ కల్పించినప్పుడు ఒక నిర్దిష్ట పర్యావరణ వ్యవస్థలోని అనేక ఇతర జాతులు, వాటి ఆవాసాలకు కూడా రక్షణ లభిస్తుంది.
    సి) గొడుగు జాతుల ఉదాహరణలో తోడేళ్లు, పులులు, ఎలుగుబంట్లు లాంటి పెద్ద మాంసాహారులున్నాయి. వాటి ఆవాసాలను పరిరక్షించడం ద్వారా పర్యావరణ వ్యవస్థలోని అనేక ఇతర జీవులకు కూడా ప్రయోజనం చేకూరుతుంది.
    1) ఎ, బి, సి 2) ఎ
    3) ఎ, సి 4) ఎ, బి

సమాధానాలు

1-2, 2-3, 3-3, 4-4, 5-4, 6-1, 7-4, 8-2, 9-3, 10-3, 11-2, 12-4, 13-4, 14-3, 15-2, 16-2, 17-1, 18-2, 19-2, 20-1, 21-3, 22-4, 23-3, 24-1, 25-4, 26-4, 27-4, 28-1.

ఈనాడు ప్రతిభ

■ e-mail: pratibhadesk@eenadu.net

20

సోమవారం జులై 28, 2025

కాలం - వేగం - దూరం

ముఖ్యాంశాలు:

- దూరం = కాలం × వేగం
- కాలం = $\frac{\text{దూరం}}{\text{వేగం}}$; వేగం = $\frac{\text{దూరం}}{\text{కాలం}}$
- కాలం స్థిరంగా ఉంటే ప్రయాణించిన దూరాల నిష్పత్తి, వేగాల నిష్పత్తి సమానంగా ఉంటాయి.
- దూరం స్థిరంగా ఉంటే కాలం, వేగం విలోమానుపాతంలో ఉంటాయి. $S \propto \frac{1}{T}$
- వేగం స్థిరంగా ఉంటే దూరాల నిష్పత్తి, కాలాల నిష్పత్తి సమానంగా ఉంటాయి.
- రెండు రైళ్లు (కార్లు లేదా మనుషులు) ఒకే దిశలో ప్రయాణిస్తే, వాటి సాపేక్షవేగం = వాటి వేగాల భేదం.
- రెండు రైళ్లు (కార్లు లేదా మనుషులు) ఎదురెదురు దిశలో ప్రయాణిస్తే, వాటి సాపేక్ష వేగం = వాటి వేగాల మొత్తం



వంతెన దాటేందుకు ఆ రైలుకు పట్టే సమయం?

ఏపీపీఎస్సీ పరీక్షల ప్రత్యేకం

అరిథ్‌మెటిక్

మాదిరి ప్రశ్నలు

1. ఒక ఎక్స్‌ప్రెస్ రైలు 120 కి.మీ./గం. సగటు వేగంతో ప్రతి 70 కి.మీ.లకు 2 నిమిషాల చొప్పున స్టేషన్లలో ఆగుతూ వెళ్తోంది. అయితే ఆ రైలు బయలుదేరిన స్టేషన్ నుంచి 840 కి.మీ.ల దూరంలోని చివరి స్టేషన్‌కు ఎంత కాలంలో చేరుకుంటుంది?

1) 6 గం. 22 ని. 2) 6 గం. 24 ని.
3) 7 గం. 22 ని. 4) 7 గం. 24 ని.

సాధన: 840 కి.మీ. ప్రయాణించడానికి పట్టిన కాలం

$= \frac{\text{దూరం}}{\text{వేగం}} \Rightarrow \frac{840}{120} \Rightarrow 7$ గంటలు.

స్టేషన్ల సంఖ్య $= \frac{840}{70} = 12$

స్టేషన్లలో ఆగిన కాలం $= (12 - 1) \times 2 = 22$ ని.

ప్రశ్నలో కోరిన మొత్తం కాలం = 7 గం. 22 ని.

సమాధానం: 3

2. ఒక వ్యక్తి గంటకు $7\frac{3}{4}$ కి.మీ.ల వేగంతో ప్రయాణించడానికి బదులు, 11 కి.మీ./గం. వేగంతో ప్రయాణిస్తే అసలు దూరం కంటే 26 కి.మీ. ఎక్కువ ప్రయాణించాడు. అయితే అతడు ప్రయాణించాల్సిన అసలు దూరమెంత? (కి.మీ.లలో)

1) 62 2) 58 3) 60 4) 65

సాధన: వేగాల నిష్పత్తి $= 7\frac{3}{4} : 11 = 31 : 44$

కాలం స్థిరం, కాబట్టి దూరాల నిష్పత్తి = 31 : 44

(44 – 31) = 13 భాగాల విలువ = 26 కి.మీ.

అసలు దూరం 31 భాగాల విలువ $= 26 \times \frac{31}{13} = 62$ కి.మీ.

సమాధానం: 1

3. P, Q అనే రెండు రైళ్లు వరుసగా A నుంచి Bకి, B నుంచి A కి ఒకే సమయంలో బయలుదేరాయి. ఒకదానినొకటి కలుసుకున్న తర్వాత P రైలు Bని చేరడానికి 8 గం. 20 ని., Q రైలు Aను చేరడానికి 3 గం. 45 ని. పట్టింది. P రైలు గంటకు $39\sqrt{20}$ కి.మీ. వేగంతో ప్రయాణిస్తే, Q రైలు వేగమెంత? (కి.మీ./గం.లలో)

1) $120\sqrt{20}$ 2) 245 3) $117\sqrt{20}$ 4) 260

సాధన: $t_1 = 8$ గం. 20 ని. $= 8 \times \frac{20}{60} = \frac{25}{3}$ గం.

$t_2 = 3$ గం. 45 ని. $= 3 \times \frac{45}{60} = \frac{15}{4}$ గంట.

$S_1 = 39\sqrt{20}$ కి.మీ./గం; $S_2 = ?$

$\frac{S_1}{S_2} = \sqrt{\frac{t_2}{t_1}} \Rightarrow \frac{39\sqrt{20}}{S_2} = \sqrt{\frac{15}{4} \times \frac{3}{25}} = \frac{3}{\sqrt{20}}$

$S_2 = 13 \times 20 = 260$ కి.మీ./గం.

సమాధానం: 4

4. 120 మీ., 105 మీ. పొడవైన రెండు రైళ్లు వరుసగా 39 కి.మీ./గం., 54 కి.మీ./గం. వేగంతో ఒకదానికొకటి సమాంతరంగా ప్రయాణిస్తే, అవి ఒకదానినొకటి దాటి వెళ్లేందుకు పట్టే సమయం ఎంత?

1) 1 గం. 12 సె. 2) 54 సె. 3) 1 గం. 2 సె. 4) 53 సె.

సాధన: $L_1 = 120$ మీ.; $L_2 = 105$ మీ.

$\Rightarrow L_1 + L_2 = 120 + 105 = 225$ మీ.

$S_1 = 39$ కి.మీ./గం.; $S_2 = 54$ కి.మీ./గం.

$S_2 - S_1 = 54 - 39 = 15$ కి.మీ./గం.

$= 15 \times \frac{5}{18}$ మీ./సె. $\Rightarrow \frac{25}{6}$ మీ./సె.

దత్తాంశం ప్రకారం, సమయం $= \frac{L_1 + L_2}{S_2 - S_1} = \frac{225}{\frac{25}{6}}$

$= 225 \times \frac{6}{25} = 54$ సెకన్లు

సమాధానం: 2

5. ఒక కార్ డ్రైవర్ 225 కి.మీ. దూరాన్ని 50 కి.మీ./గం. సగటు వేగంతో ప్రయాణించాడు. తిరుగు ప్రయాణంలో అంతే దూరాన్ని 30 కి.మీ./గం. వేగంతో ప్రయాణిస్తే, మొత్తం దూరానికి కారు సగటు వేగం ఎంత?

1) 40 కి.మీ./గం. 2) 47 కి.మీ./గం.
3) $37\frac{1}{2}$ కి.మీ./గం. 4) $35\frac{1}{2}$ కి.మీ./గం.

సాధన: కారు సగటు వేగం

$= \frac{2 \times 50 \times 30}{50 + 30} = 37\frac{1}{2}$ కి.మీ./గం.

సమాధానం: 3

6. రెండు రైళ్లు ఎదురెదురుగా, వరుసగా ముస్సోరి, దిల్లీ నుంచి 80 కి.మీ./గం., 65 కి.మీ./గం. వేగంతో బయలుదేరాయి. అవి రెండూ ఒకదానికొకటి కలిసినప్పుడు, వాటిలో ఒక రైలు 30 కి.మీ. ఎక్కువగా ప్రయాణించింది. అయితే ముస్సోరి, దిల్లీ మధ్య దూరమెంత? (కి.మీ.లలో)

1) 225 2) 290 3) 390 4) 250

సాధన: d = 30 కి.మీ.; $S_1 = 80$ కి.మీ./గం;

$S_2 = 65$ కి.మీ./గం.

దూరం $= \frac{d(S_1 + S_2)}{S_1 - S_2}$

$= \frac{30(80 + 65)}{80 - 65}$

$= \frac{30(145)}{15} = 290$ కి.మీ.

సమాధానం: 2

7. ఒక రైలు ఒక స్తంభాన్ని, 450 మీ. పొడవైన వంతెనను వరుసగా 23, 38 సెకన్లలో దాటింది. 180 మీ. పొడవైన వంతెనను దాటేందుకు ఆ రైలుకు పట్టే సమయం ఎంత?

1) 29 సె. 2) 32 సె.
3) 28 సె. 4) 30 సె.

సాధన: రైలు 450 మీ. దూరం ప్రయాణించడానికి పట్టే సమయం = (38 – 23) = 15 సె.

రైలు వేగం $= \frac{450}{15} = 30$ మీ./సె.

రైలు పొడవు $= 30 \times 23$

$= 690$ మీ.

180 మీ. పొడవైన వంతెనను దాటడానికి పట్టే సమయం

$= \frac{\text{దూరం}}{\text{వేగం}}$

$\Rightarrow \frac{690 + 180}{30} = 29$ సె.

సమాధానం: 1



రచయిత
డా. వంగల శ్రీనివాస్
అసిస్టెంట్ ప్రొఫెసర్

724 Word of the Day

Endure

Telugu meaning: భరించు, తట్టుకొను

English meaning: The word endure (ఎండ్యూర్) is a verb that describes the ability to suffer through something difficult or to continue existing despite hardships.

Synonyms: Tolerate, Withstand

Antonyms: Surrender, Give up

Usage: **1.** They had to endure extreme weather conditions during the expedition.

2. She endured years of hardship with remarkable courage and strength.

కరెంట్ అఫైర్స్



ఇందిరాగాంధీ జాతీయ సార్వత్రిక విశ్వవిద్యాలయం (ఇగ్నో) మొదటి మహిళా ఉపకులపతిగా ఉమా కాంజీలాల్ 2025, జులై 25న నియమితులయ్యారు. ఇగ్నో స్థాపించిన దాదాపు నాలుగు దశాబ్దాల తర్వాత తొలిసారి ఒక మహిళ ఆ పదవి చేపట్టారు. సార్వత్రిక, దూరవిద్య విభాగంలో 36 సంవత్సరాలకు పైగా ఆమెకు అనుభవం ఉంది.

✦ 2021 మార్చి నుంచి జులై 2024 మధ్య ఆమె యూనివర్సిటీలో ప్రో వైస్ ఛాన్స్‌లర్‌గా పనిచేశారు.



బ్రిటన్ నుంచి 2025, జులై 25న మాలే చేరుకున్న భారత ప్రధాని మోదీ మాల్దీవుల అధ్యక్షుడు మొహమ్మద్ ముయిజ్జుతో ద్వైపాక్షిక చర్చలు జరిపారు. వాణిజ్య, రక్షణ, మౌలిక సదుపాయాల రంగాల్లో పరస్పర సహకారంపై ఇద్దరూ చర్చించారు. ఈ పర్యటనలో భాగంగా మాల్దీవులకు రూ.4,850 కోట్ల రుణాన్ని మోదీ ప్రకటించారు.



స్వచ్ఛమైన, ఆరోగ్యకరమైన, సమగ్రమైన పర్యావరణం మానవ హక్కు అని అంతర్జాతీయ న్యాయస్థానం 2025, జులై 23న తీర్పు వెలువరించింది. భూగోళాన్ని వాతావరణ మార్పుల నుంచి పరిరక్షించేందుకు చర్యలు చేపట్టని దేశాలు అంతర్జాతీయ చట్టాన్ని ఉల్లంఘించినట్టేనని కోర్టు స్పష్టం చేసింది. పెరిగిపోతున్న భూతాపం నేపథ్యంలో వాతావరణ మార్పుల కారణంగా తాము చేయని తప్పిదానికి బలై నష్టపోతున్న దేశాలు అందుకు నష్టపరిహారం పొందడానికి అర్హత కలిగివున్నాయని కూడా అంతర్జాతీయ కోర్టు పేర్కొంది.

జాతీయ మానవ హక్కుల కమిషన్ (ఎన్‌హెచ్‌ఆర్‌సీ) ఇన్వెస్టిగేషన్ డైరెక్టర్ జనరల్‌గా సీనియర్ ఐపీఎస్ అధికారి ఆనంద్ స్వరూప్ నియమితులయ్యారు. ఉత్తర్‌ప్రదేశ్ కేడర్‌కు చెందిన స్వరూప్ 1992 బ్యాచ్‌కు చెందిన ఐపీఎస్ అధికారి.

మరిన్ని కరెంట్ అఫైర్స్ కోసం క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

ప్రపంచ ప్రకృతి పరిరక్షణ దినోత్సవం

జులై 28 చరిత్రలో ఈనాడు

పర్యావరణాన్ని, సహజ వనరులను కాపాడుకోవాల్సిన ఆవశ్యకత గురించి ప్రజల్లో అవగాహన కల్పించే లక్ష్యంతో ఏటా జులై 28న 'ప్రపంచ ప్రకృతి పరిరక్షణ దినోత్సవం'గా (World Nature Conservation Day) నిర్వహిస్తారు.

మానవుడికి అవసరమైన వస్తు, సేవల ఉత్పత్తికి ఉపయోగపడే పదార్థాలు, శక్తి లాంటి వాటిని సహజ వనరుల రూపంలో ప్రకృతి అందిస్తోంది. వీటిలో పునరుద్ధరించగలిగేవి, పునరుద్ధరించడానికి వీలులేనివి అని రెండు రకాలు ఉంటాయి. వీటిని అతిగా ఉపయోగించడం వల్ల పర్యావరణ సమతౌల్యం దెబ్బతిని, జీవవైవిధ్యానికి ముప్పు వాటిల్లుతుంది. సహజ సంపదను సరైన రీతిలో ఉపయోగిస్తూ, భవిష్యత్తు తరాల వారికి వీటిని అందించాల్సిన ప్రాధాన్యత గురించి ప్రజలకు తెలియజేయడం ఈ రోజు ముఖ్య ఉద్దేశం.

- గాలి, నీరు, నేల, అడవులు మొదలైనవన్నీ ప్రకృతిలో భాగం. నానాటికీ పెరుగుతున్న జనాభా, అవసరాల వల్ల ప్రకృతి నుంచి లభ్యమయ్యే వనరులను మానవుడు అతిగా వినియోగించడమో లేదా నాశనం చేయడమో చేస్తున్నాడు. ఇది భూగోళం వినాశనానికి దారితీస్తుంది. వీటిని పరిరక్షించేందుకు భారత్ అనేక ప్రకృతి పరిరక్షణ కార్యక్రమాలు చేపడుతోంది. వాటిని పరిశీలిస్తే..
- భారత రాజ్యాంగంలోని ఆదేశిక సూత్రాల్లో ఉన్న ఆర్టికల్ 48A ప్రకారం దేశంలో ఉన్న అటవీ, వన్యప్రాణి సంపదను సంరక్షిస్తూ దేశ పర్యావరణాన్ని కాపాడాలనే నియమానికి అనుగుణంగా భారతదేశంలో ప్రకృతి వనరులను పరిరక్షిస్తున్నారు.
- 2014లో 745 రక్షిత ప్రాంతాలు ఉండగా, 2024 నాటికి ఆ సంఖ్య 1022కి చేరింది. ఇవి భారత భౌగోళిక విస్తీర్ణంలో 5.43% ఉన్నాయి.
- 2014లో 59గా ఉన్న రామ్‌సర్ సైట్ల సంఖ్య 2025, జూన్ నాటికి 91కి చేరుకున్నాయి.



- ఇండియా స్టేట్ ఆఫ్ ఫారెస్ట్ 2023 నివేదిక ప్రకారం.. భారతదేశ ఫారెస్ట్, ట్రీ కవర్ 8,27,357 చదరపు కిలోమీటర్లుగా ఉంది. ఇది భారత భౌగోళిక విస్తీర్ణంలో 25.17%. 2021తో పోల్చితే ఇది 1445 చ.కి.మీ. పెరిగింది.


చారిత్రక నేపథ్యం:

'మానవ పర్యావరణం' అనే అంశంపై ఐక్యరాజ్య సమితి పర్యావరణ కార్యక్రమం (యూఎన్‌ఈపీ) 1972 జూన్ 5న స్టాక్‌హోంలో ఓ సమావేశాన్ని నిర్వహించింది. దీనిలో పర్యావరణ పరిరక్షణకు చేపట్టాల్సిన చర్యలు, ప్రకృతి వనరుల వినియోగంపై అనుసరించాల్సిన వ్యూహాల గురించి చర్చించారు. ప్రకృతి రక్షణ - అవసరంపై అందరూ ఆలోచించేలా ఏటా జులై 28న 'ప్రపంచ ప్రకృతి పరిరక్షణ దినోత్సవాన్ని' జరుపుకోవాలని సమావేశంలో తీర్మానించారు.

జనరల్ స్టడీస్ - భారతదేశ చరిత్ర

క్విట్ ఇండియా ఉద్యమం

రెండో ప్రపంచ యుద్ధంలో భారతీయుల సహాయం కోరుతూ బ్రిటిష్ ప్రభుత్వం ఆగస్టు ప్రతిపాదన, క్రిప్స్ రాయబారం జరిపింది. తమ ముఖ్య ప్రతిపాదన అయిన స్వపరిపాలన అంశాన్ని బ్రిటిష్ వారు ప్రస్తావించకపోవడంతో భారతీయులు అసంతృప్తికి లోనయ్యారు. మరోవైపు యుద్ధంలో బర్మాను గెలిచిన అక్షరాజ్య కూటమి భారత్‌లోకి ప్రవేశించేందుకు సిద్ధమైంది. దాన్ని నిలువరించాలంటే ఆంగ్లేయులు దేశాన్ని విడిచి వెళ్లిపోవడమే పరిష్కారమని గాంధీజీ విశ్వసించారు. దీనిలో భాగంగానే క్విట్ ఇండియా ఉద్యమానికి ఆయన పిలుపునిచ్చారు.



భారత స్వాతంత్ర్యోద్యమంలో మహోన్నతమైంది, బ్రిటిష్ వారిని ముప్పుతిప్పలు పెట్టిన ఉద్యమంగా క్విట్ ఇండియా ఉద్యమం చరిత్రకెక్కింది.

- అక్ష రాజ్య కూటమిలోని జర్మనీ, ఇటలీ, జపాన్; మిత్ర రాజ్యాల కూటమిలోని బ్రిటన్, అమెరికా, ఫ్రాన్స్, రష్యాలు రెండో ప్రపంచ యుద్ధంలో పాల్గొన్నాయి.

ఉద్యమ తీవ్రత

బొంబాయి గోవాలియాటాంక్ వద్ద ప్రజాసభ కోసం పోగైన ప్రజలకు, అధికార యంత్రాంగం మధ్య ఘర్షణలు జరిగాయి. ఈ పరిణామాలే అహ్మదాబాద్, పూనా, ఉత్తర, తూర్పు భారతదేశంలోని ఇతర పట్టణాల్లోనూ చోటుచేసుకున్నాయి.

నాయకుల నిర్బంధాలు

బ్రిటిష్ ప్రభుత్వం ఉద్యమాన్ని నీరుగార్చాలని అనేక కుటిల ప్రయత్నాలు చేసింది. ఉద్యమంలోని కీలక నాయకులందరినీ అరెస్టు చేయాలని భావించింది. ఈ క్రమంలోనే ఆంగ్లేయుల సేనలు ప్రజలపై విరుచుకుపడ్డాయి.

ప్రభుత్వ చర్యలు – ప్రజల తిరుగుబాటు, పోటీ ప్రభుత్వాలు, వైఫల్యానికి కారణాలు మొదలైన అంశాలతో సహా పూర్తి సమాచారం 'ఈనాడు ఈప్రతిభ' వెబ్‌సైట్‌లో ఈ-బుక్ రూపంలో 'జనరల్ స్టడీస్ ఈ-బుక్స్' కోర్సులో అందుబాటులో ఉంది. మరిన్ని వివరాలకు క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

Latest Updates

Nursing Officer Posts

All India Institute of Medical Sciences (AIIMS), New Delhi, invites online applications for the Nursing Officer Recruitment Common Eligibility Test (NORCET)-9 to recruit Nursing Officers for AIIMS New Delhi and other AIIMS. The total number of posts is 3500. The application fee is Rs.3000. Eligible candidates can apply online before 11 August 2025.

Manager Posts

Bank of Baroda, Gujarat, is inviting applications for the Manager, Senior Manager, and Fire Safety Officer posts in various departments. The total no. of posts is 41. The application fee is Rs.850. The last date for online applications is 12 August 2025.

Admissions in Ambedkar Open University

Ambedkar Open University, Hyderabad, has released a notification for admissions in UG and PG courses for the academic year 2025-26. Eligible candidates can apply online before 13 August 2025.

Did You Apply..?

Today (July 28) is the last date for the following jobs

- RRB Technician Grade-I & III - 6238 posts.
- Manager posts in NMDC Hyderabad. ***Eligibility:*** Degree.
- Scientist Jobs in ARCI. ***Eligibility:*** BE, BTech, MTech, MSc, PhD.

For more information and other notifications - scan QR code

One Word Substitution

SSC Exams

English

Directions (Qs. 1 - 25): *Choose the correct one-word substitution of the given phrase/sentence.*

1. One who is new to a subject or activity
A) Novice B) Amateur
C) Veteran D) Scholar

2. A medicine that induces sleep
A) Tonic B) Sedative
C) Stimulant D) Narcotic

3. An animal that feeds on plants only
A) Omnivore B) Herbivore
C) Carnivore D) Scavenger

4. An act of intentionally setting fire to property
A) Vandalism B) Robbery
C) Arson D) Looting

5. One who abstains from all alcoholic drinks
A) Teetotaler B) Abstainer
C) Vegan D) Recluse

6. A figure of speech where contradictory terms appear together
A) Simile B) Oxymoron
C) Allegory D) Metaphor

7. A short and amusing story about a real incident or person
A) Novel B) Allegory
C) Anecdote D) Fable

8. One who walks in sleep
A) Somnambulist B) Insomniac
C) Hypochondriac D) Philanthropist

9. A place where birds are kept
A) Apiary B) Sanctuary
C) Aquarium D) Aviary

10. One who believes that nothing can be known about God
A) Theist B) Atheist
C) Agnostic D) Pessimist

11. A handwriting that cannot be read
A) Inaudible B) Illicit
C) Ineligible D) Illegible

12. A person who withdraws from the world to live in solitude
A) Recluse B) Refugee
C) Hermit D) Monk

13. One who pretends to be what he is not
A) Patriot B) Hypocrite
C) Martyr D) Critic

14. A speech made without preparation
A) Dialogue B) Debate
C) Seminar D) Extempore



15. One who can do anything for money
A) Mercenary B) Miser
C) Philatelist D) Cynic

16. The act of killing one's own brother
A) Patricide B) Homicide
C) Fratricide D) Regicide

17. A speech in praise of someone, especially after their death
A) Ode B) Eulogy
C) Ballad D) Elegy

18. A person who does not believe in any religion
A) Pagan B) Rationalist
C) Heretic D) Secularist

19. A person who is excessively concerned with minor details and rules
A) Mentor B) Cynic
C) Pedant D) Stoic

20. Government by the wealthy
A) Democracy B) Bureaucracy
C) Oligarchy D) Plutocracy

21. A person who believes that everything is predetermined by fate
A) Optimist B) Fatalist
C) Idealist D) Realist

22. A person who writes with both hands
A) Ambivert B) Ambidextrous
C) Amphibian D) Artisan

23. One who loves and studies books
A) Pedant B) Librarian
C) Scholar D) Bibliophile

24. A speech made to oneself
A) Dialogue B) Monologue
C) Soliloquy D) Sermon

25. One who always looks at the bright side of life
A) Optimist
B) Realist C) Fatalist
D) Cynic

Scan the QR code for Key

Writer: P. Manoj Kumar, Subject Expert